భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

ఏప్రిల్ 1970

సంపుటము : 47 : సంచిక : 4:

విడిప్రతి వెల ఒక రూపాయి



ఇంగ్లీషు తేదీల ప్రకారం
11—4—70

తెలుగు తిథుల ప్రకారము చైత్ర శుద్ధ ద్వాదశి
18—4—70

శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి 32—వ పుణ్యవర్ధంతి

శివములు తత్వముల్ పరవశించిన వేళ, అనర్ఘ ధర్మముల్
శివములకు చేతలై పరిమళించిన వేళ, రసాత్మ భావముల్
శివములు గీతికల్ మధుర శీధువు లందినవేళ తెల్గునన్
ప్రవరము శ్రీవ తేజము శుభాకృతి వెల్గిన వెల్గు వెల్గులై.

విషయానుక్రమణిక

ఏప్రిల్ 1970

ప్రేమాభిరామము

శ్రీ మిరియాల రామకృష్ణ

అధర బంధుర సుధా మధుర మంత్రముల
ముగ్ధుల జేయగల యే వధూటి యామె?
నిజభుజాంతర ఝషధ్వజ మర్మరముల
తెమ్మెరమీది కెత్తు నే వరుడతండు?
ఏ శిఖావళ పింఛ హేలా శిరోరుహ
స్రస్త నందన పారిజాత మామె?
సుమశిలీముఖ ముఖోత్సుక చంచరీక
శింజిని మీటుకొనెడి నే స్నిగ్ధుడతడు?

ఐందవామృతగేహ దేహళిని దాటి
వసుధపై డిగ్గి రే వధూవరులు వీరు?
వీరి నిట్టూర్పు కెరటమై విరిసి రాగ
విరిసె రాగమ్ము మానస వేణువీథి!

ఓ మదనా! ఒకించుక యాహా! అటులాగుము! ఆగుమయ్యా! పం
చామర వజ్రబాణయుత మాయత కార్ముక మంచితోద్ధతో
ద్దామ గుణారవంబుగల దర్పము నీయది! యౌవనంపు టా
రామములోని యింద్రియమరందములా భవదీయభోజ్యముల్!

చూపులమీద సిగ్గులను చుట్టెడు పాలిపనీ? ఎటూ! యెటూ!
ఈ పడుచుందనంపు టసహిష్ణువు విష్ణుతనూజు చేతిలో
లోపలిగుట్టువై యిమిడి ఖ్యాతగ నీతని జేసినావు! వా
యూవరి జోడు వీడు—విరహాకుల్ జ్వరతంతు నితాంత బంధితుల్.

ఆగుమహో! మనస్సుషిరమా! ఎవరూదిరి నిన్ను నాకలో
కాగమనానిలోర్ధ్వసురయావతమా? శరదిందు బింబ రం

భా గళగద్గదధ్వనులు పైకొను యామినులా ? రమాకుమా
రాగమగంధవాహధునులా ! వికసించిన నాదు కోర్కెలా ?

మాసిన జీవితంపు తెలుమార్చి నవోదయమిచ్చువాడు, ఈ
హాసుధఁజిల్కువాడు, దరహాసమువాడు, సుఖాగ్ని గుప్పిటన్
బోసి హసించువాడు, పువుబోణుల గుండెల గుట్టుమట్టు లం
దాసలు రేపువాడు మనసా ! కనిపించెనె యెన్నడేనియున్.

నవ్వేడు కోర్కెవాడు, మధనమ్ము మనమ్ములఁజేయువాడు, క్రొం
బువ్వుల మీది పిచ్చితనమున్ విడజాలనివాడు, మేని రూ
పవ్వల పారబోసికొని యాత్మగ మాత్రమె నిల్చు నవ్యయుం
డెవ్వడు వాడు ? పంచశరు డింద్రియదీపములార ! కంటిరా !

ఓ సఖ ! ఓ సఖా ! సుఖమయూరశిఖాగతవాత మందొ, ఆ
శా సరసీరుహంబు వెదజల్లు పరీమళవీథులందొ, వాం
ఛాసరఘాగళంబు విడి పాగెడి తీయదనాల వాగులం
దో సఖ ! ఓ సఖా ! నడతువో ! పరువెత్తెదొ ! తేలిపోదువో !

ఆమని ముద్దవెన్నెలనొ, అంబుద చేల సమీర చంచలా
కోమల రేఖనో, లతల కొప్పుల జారిన పుష్పలేఖనో,
యామవతీకపోలముల నంటు తుషారమనో పరీమళ
స్వామిని మాధురీమయుని నిన్గని సంతటనైతినో సఖా !

పావడ కాగడావలె నివాళియొసంగ హారం గెసంగు వ్రీ
డావతి యీమె యా 'రతి' ! పటంబులు షాపటబొట్టు క్రమము
క్తావళి మేఖలామణులు హంసక కంకణ కర్ణికాదులున్
పూవులె పూవులే పువులె పూవులె ! పూవులె పుష్పలాంఛనా !

అమ్మలు తేనె చిమ్మటయు, నల్లెగ నల్లిన త్రాడు తేనెలన్
గమ్మగ జుట్టి ఝుంకృతులు గానము సేయుటయున్, నవేతుంచా


ప్రే మా భి రా మ ము

పమ్మ్మ రసార్ద్ర మాటయు సుపర్వులు నీకు నివాళినీయ ప
ద్మమ్ముల పల్లెరమ్ముల సుధారుచిదీపము తెచ్చిరో సఖా !

నీలగళుండు మౌళిపయి నిల్పిన చిన్నితురాయి, బాల గో
పాలుడు వ్రేలిపై నిలిపి పాడిన పిల్లనగ్రోవిపాట, స్వ
ర్గాలయ లాసికా కబరి కాంచిత గంధఫలీ సుగంధ, మీ
గాలి చలించుచున్నటుల కన్పడఁజేయగదే రమాత్మజా !

ఆమని త్రాడుగా, పువ్వులయందము కవ్వముగా, మనోరథ
స్వామివి నీవు పీఠికగ, భావసముద్రము నెల్ల త్రచ్చి, ఆ
ప్రేమసుధారసంబు వెలివెట్టి, 'తమస్సుల' విశ్వమోహినీ
కాములఁజేసి, పోయి మిటు కాంతుల కిన్నులు జుఱ్ఱి త్రావగన్

ఆమని లేని కానమెది, అగ్ని రహింపని యజ్ఞమేది, ఏ
సీమయు లేని సింధువెది, శీర్షము లేని శరీరమేది, సౌ
దామని లేని మేఘమెది, తారక లేని నిశీథమేది, ఆ
ప్రేమము లేని కామమును రేపగ రాదు ! దొరా ! పరాకుగా !



వీరేశలింగం పంతులుగారి లేఖలు

డా. అక్కిరాజు రమాపతిరావు

పంథొమ్మిదివందల యాభైమూడోసంవత్సరంలో రాజమహేంద్రవరాన్ని అఖండగౌతమి నానా బీభత్సంపాలు చేసింది. అప్పుడు వీరేశలింగంపంతులు పేరిట అక్కడున్న పాఠశాల పూర్తిగా జలమయమైంది. ఈ పాఠశాల పిఠాపురం మహారాజాగారి భూరివిరాళంతో నిర్మింపబడ్డా, రాజావారికి వీరేశలింగంపంతులుగారిపట్లవున్న ఘనగౌరవానికిగుర్తుగా, వీరేశలింగాస్తికోన్నతపాఠశాలగా వెలిసింది. ఆ జలప్రళయం సంభవించినప్పుడు, ఆ పాఠశాలలో భద్రపరుపబడిన పంతులుగారి తాలూకు, వ్రాతప్రతులూ, వారు సేకరించిన గ్రంథాలూ, వ్యక్తిగతమైన ఉత్తరాలూ, అటూ ఇటూ చెదరిపోయినయ్. ఆ కాలంలో దేశం నలుమూలలనుండీ, సాంఘికసారస్వతాదిరంగాలలో మహనీయులైన వారందరూ పంతులుగారితో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతూవుండే వారనటానికి వారి స్వీయచరిత్రమే నిదర్శనం. ఇక తెలుగుదేశంలో ప్రముఖ రచయితలూ, సంస్కర్తలూ, వారితో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతూవుండేవారనటం స్పష్టమే. ఆ రోజుల్లో యావదాంధ్రదేశాన్నీ, తన సంఘసంస్కారకృషితో, సారస్వతకృషితో, ప్రభావితంచేసిన మహనీయుడు వీరేశలింగంపంతులు. గిడుగు రామమూర్తి పంతులు సాగించిన వ్యవహారికోద్యమానికికూడా చివరిరోజుల్లో వీరేశలింగంపంతులు ప్రోత్సాహమిచ్చారంటే, సంస్కారదృష్టి ఆయన కెంత ప్రధానమో అవగతమవుతున్నది. తమ చిన్నతనంలో వీరేశలింగం పంతులుగారి గ్రంథాలన్నీ కొని తాము చదివి, తమ తల్లిగారికి చదవమని ఇస్తూవుండేవారని, శ్రీ గిడుగు సీతాపతిగారు తమ తండ్రిగారినిగూర్చి వ్రాశారు. అట్లానే కట్టమంచి రామలింగారెడ్డిగారు, తమ పుస్తకాల నన్నిటినీ తెప్పించుకున్నట్లుగా పంతులుగారి డైరీలో వున్నది. మహాదేవగోవిందరానడే, ఈశ్వరచంద్రవిద్యాసాగర్, హేమచంద్రసర్కార్, భారతరత్న కార్వే, సీతానాథతత్త్వభూషణ్, మొదలైన ప్రముఖులందరూ, పంతులుగారితో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపేవారని, పంతులుగారి స్వీయచరిత్రద్వారానే తెలుస్తున్నది.

ఇక తెలుగుదేశంలో పూండ్ల రామకృష్ణయ్య, కొక్కొండ వేంకటరత్నంపంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, ధర్మవరం కృష్ణమాచార్యులు, వంగూరి సుబ్బారావు, మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి, మొదలగువారందరికీ పంతులుగారితో ఉత్తరప్రత్యుత్తరా లున్నట్లు సాక్ష్యాధారాలున్నాయి. పై చెప్పిన గోదావరివరదల వలన ఆ ఉత్తరాలేమిన్నీ మనకు నేడు లభ్యం కావు. అవన్నీ ఆ వీరేశలింగాస్తికోన్నతపాఠశాలలో భద్రపరచబడివుండగా, ఆ వరదల సందర్భంగా, రూపరిపోయివుండటమో, లేదా అప్పుడు చెదరిపోయి తరువాత రూపరివుండటమో జరిగివుంటుంది. పంతులుగారి డైరీలూ, వ్రాతప్రతులు కూడా, ఆ విధంగానే చెదరిపోయినవి.

పంతులుగారు పంథొమ్మిదివందల పందొమ్మిదవ సంవత్సరం మే 27 వ తేదిన పరమపదించారు. ఈ ఏభై పైచిలుకు సంవత్సరాలలోనే తెలుగుదేశంలో పంతులుగారిని చాలామంది మరచిపోతున్నారు. ఆ కాలంలో అంటరానితనం, నిర్బంధవైధవ్యం, వృద్ధవివాహాలు, మొదలైన దురాచారాలను నిరసించి, వాని నిర్మూలనానికి తీవ్రంగా పోరాడిన వ్యక్తి వీరేశలింగం. అంతేకాకుండా, నేడు సాహిత్యం

బహుముఖప్రక్రియలతో విలసిల్లటానికి కూడా పంతులుగారానాడుచేసిన కృషి ప్రాతిపదికమని చెప్పాలి. పత్రికలను స్థాపించి, పత్రికా నిర్వహణను, వ్యాస రచనను, ప్రాచుర్యం వహింపచేయటం; నవల, నాటకం, వ్యాసం, స్వీయచరిత్రకు స్థితినీ, ప్రాచుర్యాన్నీ కలిగించటం, వీరేశలింగంచేసిన కృషికి దృష్టాంతాలు.

ఆ కాలంలో వీరేశలింగంపంతులు గొప్పవిప్లవ కారుడు. అమితమైన సంచలనాన్ని కలిగించిన వాడు. విగతభర్తృకలకు వివాహాలుచేసే మహోద్యమానికి నాయకత్వం వహించి, తన పట్టుదలను సాధించినవాడు. అగతికలైన బాలిక లెందరో ఆయనకు తమ కష్టనిష్ఠూరములనుగూర్చి ఉత్తరాలు వ్రాసేవారట. అట్టివారికి ధైర్యంచెప్పి, ప్రోత్సాహమిచ్చి, వివాహాలు చేశారు. అప్పుడు అభినందన లేఖలు వచ్చేవి. అట్టి అభినందన లేఖల్లో దేశం నలుమూలల్లోని మహనీయులు వ్రాసినవి వుండేవి. ఈశ్వరచంద్రవిద్యాసాగరుల అభినందనలు పంతులుగారి స్వీయచరిత్రంలో చూడవచ్చును. ఇటు వంటి లేఖలన్నీ చూడాలంటే మనకు ప్రాప్తంకాక పోయింది. వారు పోయి యాభై సంవత్సరాలన్నా కాకముందే, ఇట్టి స్థితి ప్రాప్తించింది. పంతులు గారికి చిన్నతనాన్నే భర్తను పోగొట్టుకొని ఇక్కట్లకు లోనైన ఆ బాలికలు వ్రాసిన ఉత్తరాలెట్లా వుండేవో, నాటి సాంఘికపరిస్థితులూ, సంసార పరిస్థితులూ ఎట్లా వుండేవో, యధార్థ స్థితిని మనం తెలిసికొనే అవకాశం కలిగేది. కాని ఇప్పుడా ఉత్తరాలేవీ లభించవు. ఇక మహదేవ గోవిందరానడే, టంగుటూరి ప్రకాశంపంతులు వ్రాసిన ఉత్తరాలూ లభించవు.

కాని పంతులుగారు తాము ఇతరులకు వ్రాసిన ఉత్తరాలుమాత్రం, కొన్ని లభించాయి; లభిస్తున్నాయి. 1937 వ సంవత్సరంలో శ్రీ అడవి శంకరరావుగారు, భారతిలోనే ఇరవైపైన వొకటో రెండో లేఖలను ప్రకటించారు, రాజమహేంద్ర వరంలో, తమతో కలిసి, ఆయానంస్థలలో, ఉద్యోగాలలో పనిచేసిన ప్రేమాస్పదులైన వ్యక్తులకు, పంతులుగారు, తాము కార్యాంతరవ్యగ్రులై ఇతర ప్రాంతాలకు వెళ్లివుండి అప్పటనుండి వారికి వ్రాసిన ఉత్తరాలను శ్రీ శంకరరావుగారు సంపాదించి ప్రకటించారు. పంతులుగారి జీవిత చరమాధ్యాయానికి సంబంధించిన విశేషాలూ, కార్యతత్పరత్వమూ యీ లేఖలలో చూడవచ్చును. శ్రీ రాయసం వేంకటశివుడుగారు, తమ ఆత్మచరిత్రం వ్రాసుకున్నారు. వీరు పంతులుగారితో కొన్నాళ్లు కలిసి పనిచేసిన వ్యక్తి. వీరి ఆత్మచరిత్రానికి అనుబంధంగా, వీరేశలింగంపంతులుగారు తమకు వ్రాసిన ఉత్తరాలను పదింటిదాకా ప్రచురించారు. ఇంతకు తప్ప వీరేశలింగంపంతులుగారు ఆ కాలంలో తమ అనుచరులకు, అభిమానులకు, ఇతర ప్రముఖ వ్యక్తులకు వ్రాసిన ఉత్తరాలుకానీ, ఇతరులు పంతులుగారికి వ్రాసిన ఉత్తరాలుకానీ ఎక్కడా ప్రచురితం కాలేదు.

వీరేశలింగంపంతులుగారి సంపూర్ణ వ్యక్తిత్వానికి సంబంధించి సమగ్రమైన అధ్యయనంచేసే పనిలో, పంతులుగారిని వ్యక్తిగతంగా ఎరిగివున్న పెద్దలను, వారితో కలిసి పనిచేసినవారిని, లేదా వారిని గూర్చి వివరాలు చెప్పగలవారినీ, రాజమహేంద్రవరంలోనూ, ఆ పరిసరప్రాంతాలలోనూ కొందరిని నేను దర్శించాను. నరసాపురంలో స్వర్గీయ వంగూరి సుబ్బారావుపంతులుగారి కొమారులు నరసింహారావు గారివద్ద పంతులుగారు సుబ్బారావుగారికి వ్రాసిన ఉత్తరాలకు నకళ్లు వ్రాసుకున్నాను. సుమారు ఇరవై ఉత్తరాలు లభించాయి. ఈ జాబులన్నిటా, కవుల చరిత్రకు సంబంధించిన వివరాలున్నాయి. ఆయాకవుల స్థలకాల నిర్ణయాదులకు సంబంధించిన సాధక, బాధకాలను, గ్రంథస్థ శాసనస్థ లేక ఇతర ఆధారాలకు సంబంధించి, వివరాలు కావాలని వీరేశలింగంగారు, సుబ్బారావుగారికి వ్రాసినవి. నన్నెచోడ, నాచనసోమనాథులకు సంబంధించిన కాల

నిర్ణయ సమీక్షలే యీ ఉత్తరాలలో ఎక్కువ భాగం చోటుచేసుకున్నాయి. పాతపత్రికలలోనుండి కొన్ని వివరాలు సేకరింపవలసినదిగాకూడా పంతులు గారు యీ లేఖల్లో వ్రాశారు. తమ కవుల చరిత్రం, పునస్సంశోధితంచేసి సమగ్రంగా ప్రకటించే కార్యక్రమంలో పంతులుగారు యీ ఉత్తరాలు వ్రాశారు. అప్పటికే వారి వయస్సు బాగా మళ్లింది. వేసవికాలపుఎండలకు తట్టుకొన లేక బెంగుళూరులో వుంటూవుండేవారు, ప్రతి వత్సరమూ కొన్నాళ్లు. ఈ ఉత్తరాలలో చాలా భాగం బెంగుళూరునుండి వ్రాయబడినవే వున్నవి. 1917 వ సంవత్సర ప్రాంతంలో పావులూరి మల్లన, నాచన సోమన, నన్నెచోడుడు మొదలైన కవికాలాదులకు సంబంధించిన కొత్త సాక్ష్యాధారా లను సంపాదించి, కవులచరిత్రను ద్వితీయముద్రణను గవించారు. మొదటిభాగం ప్రకటించారు. రెండవ భాగం ప్రకటిస్తూ శ్రీ కృష్ణదేవరాయలవారి చరిత్రమును రచిస్తూ 1919 లో స్వర్గస్థు లైనారు. ఇవికాక గుంటూరులో పాలపర్తి నరసింహంగారివద్ద ఐదు ఉత్తరాలు పంతులుగారు వ్రాసినవి సంపాదించి నకళ్లు వ్రాసుకున్నాను. రాజమహేంద్రవరంలో వితంతుపాఠశాలకు సంబంధిం చిన వివరాలూ, ఆ పాఠశాలలో పాలపర్తి నరసింహం గారిని ఉపాధ్యాయులుగా నియమిస్తూ వీరేశలింగం పంతులుగారు పంపిన నియామకపత్రమూ మొద లైనవి వున్నాయి.

ఇవన్నీ పంతులుగారు వ్యక్తులకు వ్రాసినవి. ఇవికాక పత్రికలకు వ్రాసిన లేఖలు కొన్ని వున్నాయి. కొక్కొండ వేంకటరత్నం పంతులుగారికీ, వీరేశ లింగం పంతులుగారికీ, స్త్రీవిద్యావిషయకమైన వాదోపవాదాలు పత్రికాముఖంగా ఆ రోజుల్లో సంభవించాయి. ఇవి లేఖారూపంగా వున్నాయి. ఆ రోజుల్లో ఆంధ్రభాషా సంజీవని, పురుషార్థప్రదా యిని, వివేకవర్ధని, సకలవిద్యాభివర్ధని మొద లైన పత్రికలు ప్రాముఖ్యం వహించివుండేవి. పురుషార్థప్రదాయినిలో విద్యావిషయకమైన వాదోప వాదాలలో వీరేశలింగం పంతులుగారు రెండు మూడు లేఖలు ప్రకటించివున్నారు. తమ శుద్ధాంధ్రోత్తర రామాయణం, రసికజనరంజనం, ప్రచురణార్థం పంపుతూ వ్రాసిన లేఖను గూడా పురుషార్థ ప్రదాయిని ప్రచురించింది. ఇక సంధి (వ్యాకరణం) విషయమై పురుషార్థప్రదాయినిలో, వీరేశలింగం పంతులుగారికీ, పరవస్తు వేంకటరంగాచార్లవారికి (వీరు సర్వతంత్ర స్వతంత్ర, మహామహోపాధ్యాయ పరవస్తు వేంకటరంగాచార్లయ్యవారు కారు. వేరొకరు. గుంటూరు నార్మల్ స్కూలులో తెలుగు పండితులుగా వుండేవారు) కొన్ని వాద వివాదాలు నడిచాయి. వేంకటరంగాచార్లవారు వీరేశలింగం పంతులుగారి సంధి విషయమైన ప్రతిపాదనలను తప్పుపట్టి, గోదావరివిద్యాప్రబోధికలో ఒక వ్యాసాన్ని ప్రచురపరచగా, (ఆ పత్రిక తరువాత ఆగిపోవటంవలన) వీరేశలింగంగారు, సమాధానంగా పురుషార్థప్రదాయినిలో వొక లేఖను ప్రచురించ టమూ, దానిపై వేంకటరంగాచార్లగారి ప్రతి సమాధానం, మళ్లా వీరేశలింగంగారి విమర్శ ప్రక టించబడ్డాయి. వీరేశలింగంగారివి మూడు లేఖలు పురుషార్థప్రదాయినిలో (1872) ప్రచురించ బడ్డాయి. అప్పటికి వీరేశలింగం పంతులుగారికి వయస్సు ఇరవైనాలుగు సంవత్సరాలే. అయితే ఈ లేఖలమూలంగ పంతులుగారి వాదపటిమా, పాండి త్యమూ, విశదమైనాయి. ఇంచుమించుగా సంస్కృతాంధ్రలక్షణగ్రంథా లన్నిటినుంచీ పంతులుగారు, తమ వాదాని కుపబలకమైన సాక్ష్యాధారాలనుచూపి, తమ వ్యాకరణ పాండిత్యాన్ని కూడా ప్రదర్శించారు.

ఇవికాక, పత్రికలలో ప్రచురింపబడిన లేఖ లలో పంతులుగారివి ఇంకా రెండున్నాయి. అముద్రిత గ్రంథ చింతామణిలో 1901 వ సంవత్సరం జనవరి నెలలో పంతులుగారి లేఖలు ప్రచురించ బడ్డాయి. 'సూర్యాలోక'మన్న పత్రికలో వీరేశలింగం పంతులుగారి శాకుంతలానువాదాని, వేదంవారి అను

వాదంతో పోలుస్తూ, ఎవరో విమర్శను వెలయింపగా వుండ్ల రామకృష్ణయ్యగారు, దానిని వీరేశలింగం పంతులుగారి దృష్టికి తీసికొనివస్తూ, పంతులుగారి అభిప్రాయాన్ని కోరినట్లూ, దానికి ప్రతిగా పంతులుగారు వారికి రెండు లేఖలను వ్రాసినట్లూ, ఆ లేఖలను పత్రికాముఖంగా ప్రచుర పరచవలసిన అగత్యం లేదని వీరేశలింగంగారు, అభిప్రాయపడినా, వుండ్ల రామకృష్ణయ్యగారు తమ అముద్రితగ్రంథ చింతామణిలో వానిని ప్రచురించినట్లున్నూ, ఆ లేఖలను చదివితే స్పష్టపడుతుంది. ఈ లేఖలలో వీరేశలింగం పంతులుగారి అనువాద ప్రౌఢి ఎట్టిదో విశదం కాగలదు. 'పురః ప్రతిహతం శైలే, స్రోతస్స్రోతోవహం యథా' అన్న సందర్భంలోనూ 'స్త్రీణామశిక్షిత పటుత్వ మమానుషేషు...' అన్న శ్లోక విషయకంగానూ, పంతులుగారుచేసిన అనువాదం, బాగాలేదని ఎవరో 'కా. వా.' గారు (వీరేశలింగంగారి లేఖలో పేర్కొన్నట్లు) సూర్యాలోకంలో విమర్శించారు. అటు తరువాత, వేదంవారి అనువాదంతో పోలుస్తూ, రెండవ శ్లోకం వీరేశలింగం గారికి సరిగా బోధపడలేదని ఆక్షేపించారు. దానికి ప్రతిగా వీరేశలింగం పంతులుగారు తమ వాదంలోని ప్రాశస్త్యాన్ని చక్కగా నిరూపించుకొన్నారు వీరేశలింగం పంతులుగారికి పూర్వం, శాకుంతలానువాదం, ఇంకొక్కటి ప్రచురించబడలేదు. పరవస్తువారు, అసమగ్రంగా వదిలేశారు. కనుక శాకుంతలాన్ని ప్రప్రథమంగా అనువదించిన కీర్తి పంతులుగారిదే. పంతులుగా రప్పటికి ఆంగ్లంలోని శాకుంతలానువాదాలను కూడా ఎత్తిచూపుతూ తమ భావమే, అనువాదపద్ధతే సరైనవంటూ వ్రాశారు. విలియమ్ జోన్సు, మానియర్ విలియమ్స్‌ల అనువాదాలను ఉదాహరించటం, పంతులుగారి సంస్కృత పాండిత్యానికి అపకర్ష ఎంతమాత్రమూకాదు. అనువదించటంలో ఎవరు ఏ మార్గాన్ని అనుసరించారని చూపటమే వారి ధ్యేయమైవుండవచ్చును. తమ వాదాన్ని ముగిస్తూ 'వివాదపడుట నా కిష్టము లేదు. నేను సర్వజ్ఞుడనుగాను. నా కెన్నో తప్పులున్నవి. తప్పులు చూపినవారికి వందనములొనర్చుచు నవకాశమున్నప్పుడు నా తప్పులను సంస్కరించుకొనెదను. ఇందులో వ్రాయబడిన యే యంశములను బ్రకటన నిమిత్తము నేను వ్రాయలేదు. దీని నాంతరంగిక లేఖగా బరిగణింపుడు. నా వెనుకటి యుత్తరములోని యంశములను సైతము బ్రకటించుట నా కిష్టములేదు. మీ యిష్టము వచ్చినట్లు చేయవచ్చును. చిత్తగింపుడు.

చెన్నపురి	ఇట్లు విన్నవించి
పరశువాకము	నమస్కరించు హితుడు
21-10-1900	**కందుకూరి వీరేశలింగం.**

అని పంతులుగారు, తమ వినయాన్నీ గొప్పతనాన్నీ చూపుకున్నారు.

వీరేశలింగం పంతులుగారికి ఆ కాలంలో మహామహులైన అన్యరాష్ట్రీయులు ఈశ్వరచంద్ర విద్యాసాగర్, మహాదేవగోవిందరానడే, కార్వేవంటివారలు వ్రాసినలేఖలూ, వారికి పంతులుగారు వ్రాసినలేఖలూ, మనకు లభించివున్నట్లయితే, ఆ మహానుభావుని మహోజ్జ్వలమూర్తి, మరింత విశదమైవుండేది మనకు. ప్రకాశం పంతులుగారు లండన్‌లో చదువుకునే రోజుల్లో, తమకూ వీరేశలింగంగారికీ ఉత్తరప్రత్యుత్తరా లుండేవని వ్రాసుకున్నారు. ఆ లేఖలన్నీ మనకు లభించకపోవటం దురదృష్టం. అన్నిటికన్నా ముఖ్యమైనది; లేతవయస్సునే విగతభర్తృకలైన ముద్దరాండ్రు తమ కష్టనిష్ఠూరాలను, దయనీయ గాథలనూ, పంతులుగారికి వ్రాస్తూ వారి సహాయాన్ని అర్థించటాలూ, పంతులుగారు వారికి తన ఇంటనే ఆశ్రయం కల్పించి, కన్నబిడ్డల్లా ఆదరించటమూ, వారి స్వీయచరిత్రద్వారా తెలియవచ్చును. అయితే ఆ ఉత్తరాలు మనకు లభించివుంటే నాటి సాంఘికవ్యవస్థ అగతికుల దీనాలాపాలూ శోక కరుణారసభరితమైన కావ్యంగా మనం చదువుకునేవాళ్లము.

ఇటీవల పూజ్యులు శ్రీ గిడుగు వేంకట సీతాపతిగారు తమవద్ద వీరేశలింగంగారి లేఖ లున్నవని దయతో నా కనుగ్రహించారు. ఆ లేఖలను శ్రీమతి కొమ్మూరి పద్మావతీదేవిగారు, ప్రచురణార్థం సీతాపతిగారికి పంపినట్టివి. ఇదివరలో ఎక్కడా ప్రచురింపబడనట్టివి. ఈ లేఖలలో వొక లేఖను పంతులుగారు తమ ఇంట చేరిన, దత్త పుత్రికపై ఎట్టి వాత్సల్యాదరాతిశయాలూ ప్రకటించేవారో తెలుసుకొనటానికి వీలుగా ఉదాహరిస్తున్నాను.

Madras· **28/10/02**

శ్రీమతి సౌభాగ్యవతి మా ప్రియ పుత్రిక చిరంజీవిని .... కందుకూరి వీరేశలింగము చిరాయువులుగాను, పుత్ర పుత్రికాభి వృద్ధిగనూ దీవించి వ్రాసిన యుత్తరము.

అమ్మాయీ నీవు ప్రీతిపూర్వకముగా వ్రాసిన యుత్తరమును జదివి మిక్కిలి సంతోషించినాను. మీ రుభయులును సుఖముగాను సంతోషముగాను ఉన్నారని తలచెదను. నీకు చిన్నతనములో సంసారము మీద బడినది గనుక, బుద్ధిమంతురాలవై, భర్త యెడల వినయవిధేయతలు గలదానివై, యందరితోను మైత్రిగలదానవై, యోగ్యముగా బ్రవర్తించి కీర్తి తేవలెను. తల్లిదండ్రుల నెడబాయవలసి వచ్చినందుకు చింతింపకుము. మీ క్షేమసమాచారము నప్పుడప్పుడు వినగోరెదను. ఇట్లు నీ పితృసముడు.

క॥ వీరేశలింగము

వీరేశలింగం పంతులుగారికి సంతానములేదు. కాని ఆధునికాంధ్రదేశమే ఆయన సంతానం.

పంతులుగారి పై ఉత్తరంవలన, వారి జీవితంలోని సార్థ్యక్యత తేటతెల్లమవుతున్నది. ఇలాంటి ఉత్తరాలు, ఇంకా చాలా సేకరించటానికి అవకాశం వున్నట్లయితే బావుండేది. కాని ఆంధ్రుల అలసత్వంవలన, దురదృష్టంవలన అట్టిది చేకూరలేదు. పంతులుగారు 1919 వ సంవత్సరం మే 27 వ తేదిన స్వర్గస్తులైనారు.

ఏదైనా సాంఘికంగానూ, సారస్వతవిషయకంగానూ, పంతులుగారు యీ దేశానికి చేసిన సేవ శాశ్వతమైనది.

ఓడలు - బళ్ళు

తమిళ మూలం :

శ్రీ కా. నా. సుబ్రహ్మణ్యం

అనువాదం :

శ్రీ బి. వి. సింగరాచార్య
శ్రీ పి. సభాపతి

9

[మార్చినెల సంచిక తరువాయి]

ఆమన్నాడూ, ఆ తర్వాత వరుసగా రెండు రోజులూ రఘుకి స్పృహలేదు. జ్వరంతో గజగజవణుకుతూ మధ్యమధ్య ఎగిరిపడుతున్నాడు. విపరీతమైన జ్వరం — సంధించిందనికూడా చెప్పొచ్చు. స్పృహవచ్చి కాస్త తెప్పరిల్లినప్పుడల్లా ఎవరేమి చెప్పినా వినిపించుకోటంలేదు. నోటికొచ్చినట్టు ప్రేలడంకూడా మానలేదు.

నేను డాక్టర్‌ని వెంటబెట్టుకువచ్చాను. ఆయన ఏవో మందులు రాసిచ్చాడు; ఇంజక్షన్ చేశాడు. రెండుమూడురోజులు గడవందే ఏ సంగతీ తేల్చిచెప్పటానికి వీల్లేదని వెళ్ళిపోయాడు. మెదడుకి హఠాత్తుగా ఏదో షాక్ తగిలినందువల్ల జ్వరం వచ్చిందని, దేహస్వస్థత కుదిరింతర్వాత మనస్సు కుదటపడటానికి ఎన్నోరోజులు పట్టవచ్చుననీ డాక్టర్ అన్నాడు. ఆ షాక్ ప్రభావం జీవితం పొడగునా ఉండినా ఉండవచ్చుననికూడా అన్నాడు. ఆ మాట నన్ను భయపెట్టటానికే అంటున్నాడనుకున్నాను. నాకు భయంగా నేఉంది

అన్నింటికీ మూలకారుకుణ్ణి నేనే అనే సంగతి గుర్తుకొచ్చేసరికి నాకు దుఃఖం ముంచుకొచ్చింది. నా అంతరాత్మలో అంకురించిన ఈ భావం నన్ను దారుణంగా క్రుంగదీస్తూంది. నామీద నేనే నేరం మోపుకున్నాను. ఆ రోజు సదాశివ మమ్మేలియార్‌ని అకస్మాత్తుగా కలుసుకోవటం, ఏదో థావస్తువు దొరుకుతూందన్న ఆశతో ఆయన్ని బార్‌రూమ్‌కి తీసుకువెళ్ళటం, — ఆ కథా క్రమమంతా జ్ఞాపకంతెచ్చుకుని బాధపడ్డాను. రఘూ నాతో చెప్పటానికి ఇష్టపడక రహస్యంగా కాపాడుతూవస్తూన్న ఆ మమ్మేలియార్ల కథారహస్యం ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. ఈ కుతూహలంవల్లనేకదా నేనారోజు మమ్మేలియార్ వెంటబడి స్టేషన్‌దాకా నడచివెళ్ళాను. నేనే స్వయంగా ఆయన్ని పిలిచాను. కాకపోయినా, ఆయన పిలిచినవెంటనే వెళ్ళటానికి సమ్మతించాను. మేము అలా నడచివెళ్ళటం విధివశాత్తు ఆయన చివరి 'వాక్'గా పరిణమించింది. నాతో బార్‌రూమ్‌కి వెళ్ళటం—అదే ఆయన చివరిసారిగా బార్‌రూమ్‌కి వెళ్ళటం.

ఇలా జరుగుతుందని నేను అనుకోలేదుగద! అసలు ఇలా జరగవచ్చుని నేను ఊహించనైనా ఊహించలేనే!

విధి ఎవరిమీద నిందారోపణ చేసినాసరే; ఆ నింద నామీద మోపదనే తీర్మానించుకున్నాను.

సదాశివమమ్మేలియార్ మరణానికి, రఘూపట్ల ప్రాణాంతకంగా దాపరించిన ఈ జ్వరానికి కారణం ఫలానావ్యక్తి అని—ఒకడిమీద నేరం మోపా

అంటే, ఏ దుర్విధిమీదనో దైవంమీదనో నేరం మోపాలిగాని, ఇతర్రత ఎవరిమీదా నేరం మోపడానికి వీల్లేదనే అనిపిస్తూంది.

మళ్లీ అప్పుడప్పుడు 'ఇన్నిచిక్కులూ తెచ్చిపెట్టింది నువ్వేగా?' అంటూ నా అంతరాత్మ పొడుస్తూంది. అలాంటి సందర్భాల్లో విధి, దైవం— అనే నేరస్తులు ఎక్కడికెళ్లి దాక్కుంటారో! తెలియదు.

మొత్తానికి రఘు స్వస్థతపొంది మామూలుగా లేచితిరగగలడుఅనే ఆశ కలగటానికి మూడు రోజులు పట్టింది. ఇంతకీ ఆ ఆశ కలగటానికి కారణం ఆ తంజావూరు డాక్టర్‌కాదు. ఆ మూడు రోజులూ నాకు మూడుయుగాలుగా గడచినయ్యనటం అతిశయోక్తికాదు.

ఆ మూడురోజులూ నేననుభవించిన యమయాతన వర్ణించరానిది. సరే, ఆ సంగతి ఇంక వదిలివేయటమే మంచిది! రఘూదగ్గిర కూచుని వాడనుభవిస్తూన్న యాతన కళ్ళారాచూస్తూ వాడి మూలుగులు వింటున్నానే, ఈ రోగిష్ఠి వాతావరణమే చాలు; భూలోకనరకం! ఆ మూడురోజులూ నాకు కలిగిన అనుభవాలూ, ఇతరులకెవరికయినా ఏ సందర్భంలోనైనా కలిగిఉంటయ్యాఅనే సందేహమూ నాలోని ప్రధానోద్వేగాల్ని రెచ్చగొడుతూ నేను ఎన్నడూ తలపెట్టిఎరుగని తత్త్వచింతనలోకి దించాయి నన్ను.

ఆ మూడురోజుల్లో—ఒకటి, రెండుసార్లు మాత్రం అంబిఅయ్యర్‌హోటల్‌కి వెళ్లగలిగాను. అలా వెళ్లిన ఒకటిరెండుసార్లూ, నేను ఆ హోటల్ కుర్రవాడితో మమ్మేలియార్ల సంగతి మాట్లాడలేదు. వాడు స్వయంగా మాట్లాడబోయినా గప్‌చిప్‌గా బయటికి వచ్చేశాను.

నా బాల్యస్నేహితుడు రఘూ పిల్లలకేసి సాదరంగా చూసేవాణ్ణి. వాళ్లు బిడియపడుతూ రఘూదగ్గిరికివచ్చి నిలబడి 'నాన్నా!'అని హీన స్వరంలో ఒక్కసారి పిలిచి, ఆ తర్వాత అక్కణ్ణించి పారిపోయేవాళ్లు. 'నాన్నగారి జ్వరం రేపు నయమవుతుందా మామయ్యా?' అని రఘూ కొడుకు అడిగినప్పుడల్లా, ఏం సమాధానం చెప్పాలో తెలియక తికమకపడేవాణ్ణి. దాంతో నా కళ్లు అశ్రుపూరితాలయ్యేవి.

రాత్రింబగళ్లు నిద్రలేదు నాకు. రవంత సేపు కునుకుతీద్దామన్నా కన్ను మూతపడేదికాదు. రోగిదగ్గిర కూచుని నిముషానికొకసారి ఏదైనా ఆహారం తీసుకోగలడేమో కనిపెడుతూండటం; చలిజ్వరం ఎక్కువై త్రుళ్లిపడినప్పుడల్లా చుట్టూ దుప్పట్లుకప్పి గట్టిగా అణచిపట్టటం; అలసటతో ఒక్కనిమిషం నిద్రపోతే మధ్యమధ్య ఊపిరాడుతూందాఅని జాగ్రత్తగా పరీక్షించటం; డాక్టర్ సాధించబోయే అద్భుతవిజయాన్నిగూర్చి బెదురుతూ ఎదురుచూడటం; ఆయన చెప్పినట్టు గంటగంటకీ రోగిచేత మందులు త్రాగించటం,—ఇలా రోజంతా గడిచిపోయేది. క్షణం తీరికఉండేదికాదు.

మూడోరోజు డాక్టర్ నన్ను తీవ్రంగా మందలించాడు. 'ఆయనకి ఉపచారాలు చేసిచేసి నువ్వు మంచాన పడేటట్టున్నావ్. జాగ్రత్త!' అని హెచ్చరించాడు.

డాక్టర్‌కి సూటిగా సమాధానం చెప్పలేకపోయాను. నాక్కూడా జ్వరంవచ్చేస్తేనే నయమనిపించింది; సంధికూడా పుడితే ఇంకా నయమనిపించింది; స్పృహతప్పితే మరీ నయమేమో! నిద్రలేక ఎర్రబడ్డకళ్లతో డాక్టర్‌కేసి తదేకంగా చూస్తూ, 'వాడు బ్రతుకుతాడా డాక్టర్? చెప్పండి!' అన్నాను.

డాక్టర్‌కి కోపం వచ్చినట్టుంది. 'ఏమిటయ్యా, అన్నీ తెలిసినవాడివి నువ్వూ ఏమీతెలియని పసివాడిలా మాట్లాడుతున్నావ్? ఇలాంటి కేసుల్లో నిశ్చయంగా ఎలా చెప్పటం? ఇదంతా నా చేతుల్లో ఉందా?' ఇప్పుడప్పుడే ఏమీచెప్పలేం. డాక్టర్‌గా

చేయగల్గిన ప్రయత్నాలన్నీ చేస్తాను.........సరే, ఇహ నేవెళ్ళిరానా?' అని కోపంగా ఆ రోజు విజిటింగ్ ఫీజుకూడా అడక్కుండానే వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నంపూటకి రఘూ పరిస్థితి కాస్త నయమే ననిపించింది. జ్వరంకూడా తగ్గిందని అనుకున్నాను.

ఆ రోజు సాయంత్రం సదాశివమమ్మేలియార్ తమ్ముడు, వాళ్ళ పెద్దన్న త్యాగరాజ మమ్మేలియార్ కొడుకులు, ఆ ఇద్దరు కుర్రవాళ్ళనీ వెంట బెట్టుకుని రోగిని పరామర్శించిపోవాలని వచ్చాడు

'ఈ రోజు రఘూ పరిస్థితి ఎలా ఉంది?' అని ప్రశ్నించాడు సదాశివమమ్మేలియార్ తమ్ముడు.

'ఈ రోజు కొంచెం నయమేనండి,' అని నిర్లిప్తంగా, నెమ్మదిగా జవాబుచెప్పాను. నా మనస్సులో మమ్మేలియార్లంటే అమితమైన కోపం పుట్టుకొచ్చింది.

'సదాశివంఅంటే రఘూకి పంచప్రాణాలు... రఘూ కళ్ళెదుటే సదాశివం సంగతి ఇలా జరగటం...పాపం......!' సానుభూతితో, విధిని నిందిస్తున్నట్టు అని ఊరుకున్నాడు.

'ఈ చిన్నాన్నకికూడా రఘూఅంటే ఎంతో ఇష్టం,' అన్నాడు ఆ కుర్రవాళ్ళలో ఒకడు.

'ఏమో, అంతా సవ్యంగా జరగాలి. లోకంలో రఘూలాంటి మనిషి దొరకటం దుర్లభం; లక్ష మందిలో ఎక్కడో ఒకళ్ళిద్దరు కనిపించటంకూడా దుర్లభమే!' అని నావద్ద సెలవుతీసుకుని వెళ్ళిపోయారు మమ్మేలియార్లు.

ఆ తర్వాత కొంచెం స్పృహవచ్చినట్టుంది రఘూకి. ఆ రాత్రి—అర్ధరాత్రివేళ—నిర్విరామంగా, ఎడతెగకుండా ఏవేవో కలవరిస్తున్నాడు. స్పృహ లేకుండా ఊరికే కలవరిస్తూన్న అపస్మారకపు మాటలు మతీసుతీ లేకుండా కలగాపులగంగా ఉన్నప్పటికీ—ఆ మమ్మేలియార్లకీ రఘూకి మధ్యఉన్న కథారహస్యం కేవలం ఈ తరంనాటిదేకాదు అన్న నిజం కాస్త బైటపడింది. ఇంకా వేరే కొన్ని విషయాలుకూడా హఠాత్తుగా నాకు స్ఫురించాయి.

ఇహమీద రఘూకి ప్రాణభయంలేదు అన్న నమ్మకం కుదిరాక నా మనస్సు కాస్త కుదటబడ్డది. కాని, ఆ మమ్మేలియార్లనిగూర్చి తెలుసుకోవాలన్న కుతూహలంమాత్రం మళ్ళీ నాలో తీవ్ర రూపం దాల్చింది.

10

మృత్యువు చేతుల్లోంచి బ్రతికిబైటపడ్డ రఘూ సదాశివమమ్మేలియార్నిగురించి తప్పితే మరో విషయం ఆలోచించే అస్కారం లేదనిపించింది. ఒంటిమీద తెలివిఉండగా చివరిసారి తను చూసిన సదాశివమమ్మేలియార్ తాలూకు ఘోరమైన దుర్మరణ దృశ్యం తప్ప తక్కిన దృశ్యాలు ఏవీ వాడికి జ్ఞాపకం ఉండవని తీర్మానించుకున్నాను. ఈ విధంగా మనశ్శాంతికి భంగకరమైన ఒక విషయాన్నిగూర్చి పదేపదే ఆలోచిస్తూండటమూలాన రఘూ తన శరీరాన్ని, మనస్సునీ పాడుచేసుకుని నానాఅవస్థలూ పడుతూండటం గమనిస్తున్నకొద్దీ నాకెంతో బాధగాఉంది. రఘూ ఇప్పుడున్న పరిస్థితిదృష్ట్యా వాడికి స్పృహరాక పూర్వంఉన్న పరిస్థితే నయమనిపించింది. అనిపించక తప్పదు.

రోడ్డువెంబడి ఊరేగుతున్న ఒక అపరిచిత శవం వెంటబడి శ్మశానందాకావెళ్ళి ఆ అర్ధరాత్రి వేళ చన్నీళ్ళలో మునిగి ఏదో మహాప్రాయశ్చిత్తం చేసుకున్న వ్యక్తిలాగా తన హృదయంలో చెలరేగిన అశాంతిని కప్పిపుచ్చటానికి తన మనస్సాక్షికే తెలియనీయకుండా కప్పిపుచ్చటానికి రఘూపడ్డ తంటాలన్నీ వ్యర్థమయినయి. ఇంకా పూర్తిగా ఒంటిమీదకి తెలివిరాని పరిస్థితిలో రఘూ మనస్సు ఒక్కసారి మేలుకుంది. మేల్కొని చాకులాగా చురుగ్గా పనిచేయడం మొదలుపెట్టింది.

మగతనిద్రలో మధ్యమధ్య మెలకువవచ్చేది

రఘూకి. మేల్కొన్నప్పుడల్లా, 'సదాశివం! నన్ను క్షమించు!'అని గట్టిగా, దీనంగా అరిచేవాడు.

మళ్ళీ మౌనంలోకి, నిద్రలోకి, ఒళ్ళు తెలియని పరిస్థితిలోకి క్రుంగిపోయేవాడు. గంటా రెండుగంటల తర్వాత మళ్ళీ మేలుకొని కోపోద్రేకంతో గట్టిగా అరిచేవాడు. 'పోవే ఫో! బయటికి నడు! ఫో! నా ఇంటికేసి తిరిగి వచ్చావంటే ఏంచేస్తానో తెలుసా........? ఆ సదాశివంగాడితోనే పారిపో! నా కంటికి కనిపించకుండా ఫో!'

'మళ్ళా నా కంటికగ్గనిపించావంటే గొంతు పిసికి చంపేస్తాను. తెలుసా...? ఇదిగో ఈ రెండు చేతుల్తో నీ గొంతుపిసికి చంపేస్తాను,'అని బిగ్గరగా అరిచేవాడు.

'మా నాన్నగారు ఎన్నడో చేసిన పాపానికి నేను ప్రాయశ్చిత్తం చేసుకోవాలా? ఆయన చేసిన పాపానికి నేను బలికావాలా?' అని మధ్యమధ్య ఏడ్చేవాడు.

'నిజం తెలుసుకోవాలంటే ఎవరికీ అంత సులభంగా తెలియటంలేదే? ఎంచేత? పొంచిపొంచి చాటుమాటుగా నిజాన్ని కనుగొనవలసిందేనా? అలా దొంగచాటుగా కనిపెట్టినా ఫలితం దక్కదే ఏమిటి ఈ పరిస్థితి?'అని ప్రశ్నించాడు రఘు.

'నిజాన్ని కనుగొన్న ఉత్తరక్షణం మనకు ఫలితం దక్కడంలేదు. ఎంచేత?'అని ప్రశ్నించాడు రఘూ. నన్నే నిలేసి అడిగినట్టుంది ఆ ప్రశ్న. ఏది నిజం? ఏది నిజంకాదు?—తేల్చి చెప్పడానికి నేనెవర్ని? అసలు నేనే ఆ సంగతి తెలుసుకోలేక పోతున్నానే! ఇహ రఘూకి ఏవిధంగా సమాధానం చెప్పగలను? నేను జవాబుచెప్పకుండా మౌనంగా ఉండిపోయాను. ఉండకతప్పదు మరి.

వాడి ప్రశ్న లన్నింటికీ, ఆ భగవంతుడే సమాధానం చెప్పాలి. ఈ రఘూ—మమ్మేలియార్ల వ్యవహారం నా ఓరిమిని ఒకపాలు హెచ్చుగానే ఈ జగుకులోంచి బైటపడి ఎప్పుడు మా ఊరు వెళ్ళిపోదామా అని పించింది. బాల్యస్నేహితుడి ఇంట్లో కులాసాగా కొంతకాలం గడపాలనుకుని నేను తంజావూరుకి బయలుదేరిరావటం తెలివితక్కువపనేఅని స్పష్టంగా తేలిపోయింది.

ఈ మమ్మేలియార్లనిగూర్చిన రహస్యం ఏమిటో? ఆ సంగతి పూర్తిగా కనుక్కుంటేనే మంచిదని, కేవలం అకారణమైన నిరాధారమైన కోరిక ఒకటి నాలో అంకురించి తతిమ్మా విషయాలనిమించి చింపిరిదయ్యంలా తల విరబోసుకుని గల్లంతుచేస్తూంది. ఈ కోరిక ఇలాగే నాలో మిగిలి ఉండటం సబబుకాదు; ఒప్పుకుంటాను. కాని, వ్యవహారం ఇంతదూరం వచ్చాక తీరా వివరాలన్నీ తెలుసుకోకుండా వదలివేయటం సాధ్యమా? తెలుసుకోవాలనే అభిలాషని చంపుకోవటం సాధ్యమా?

ఉన్నట్టుండి, హఠాత్తుగా రఘూ లేచి కూచుని నల్లమందు సేవించినట్టు మాటలు తడబడుతూ అన్నాడు: 'సదాశివం నన్ను క్షమించు! నువ్వు తప్పుచేశావనుకుని నీకూ నా భార్యకూ తీరని అపచారం చేశాను. ఈ పాపాన్ని ఎలా నిర్మూలించగలనో తెలియదు......' హృదయం ద్రవించిపోయేలా దీనాతిదీనంగా సదాశివమమ్మేలియార్ తన ఎదుట నిలబడిఉన్నట్టూ, క్షమించమని అతనితో మొరబెట్టుకుంటూన్నట్టూ వాపోయాడు రఘూ.

మరునాడు—సదాశివమమ్మేలియార్ రైలు కిందపడి చనిపోయిన ఏడోనాడు—రఘూ దేహస్థితి కొంచెం నయమనిపించింది.

కలవరింతలు, పలవరింతలు పిచ్చిప్రేలాపన ముందురోజురాత్రినుంచి తగ్గిందని చెప్పాలి.

పొద్దున్నే రెండోసారి ఓవల్‌టిన్ తాగాడు రఘు.

రెండు తలగడలు ఒకదానిమీదఒకటి పేర్చి వాటిమీద ఆనుకుని కూచున్నాడు. గ్లాసులో మందు పోసి ఇచ్చాను. ముఖం చిట్లించుకోకుండా మందు తాగాడు!

మందు తాగింతర్వాత, 'ఇంకా ఆశ పెట్టు కున్నావే! నువ్వు నిజంగా మొండివాడివే!' అన్నాడు.

ఇంకోగ్లాసు ఓవల్‌టిన్ కావాలని స్వయంగా అడిగాడు. ఓవల్‌టిన్ కలిపి ఇచ్చాను.

వాడు తాగుతున్నప్పుడు అన్నాను: అదిసరే గాని, అసలు ఆ సంగతి ఏమిటో సరిగా అర్థం కావటంలేదు. ఇంతకీ ఆ మమ్మేల్మరియార్ల్నకీ, నీకూ ఏమిటి సంబంధం? నీ జీవితంలో వాళ్ళు ఎలా తారసిల్లారు? వాళ్ళు నిన్ను బాధపెట్టవలసిన కారణం ఏమిటి?......'

ఓవల్‌టిన్ తాగడం మానేసి చేతిలోవున్న గ్లాసుకేసి తదేకంగా చూస్తూ ఆలోచనలో పడి పోయాడు రఘూ.

నేను మళ్ళీ అందుకున్నాను. 'ఏమిటో నాకేమీ అర్థంకావటంలేదు. అంచేత అడుగు తున్నాను. సదా శివమమ్మేల్మరియార్లూ......' ఆ పైన మాట్లాడటం కష్టమనిపించింది.

రఘూ ముఖంనిండా విషాదరేఖలు అలుము కున్నాయి. ఏదో వికారంతో ముఖమంతా జేవు రించింది. కళ్ళు భీకరంగా ప్రకాశవంతంగా వెలిగాయి.

ఎందుకిలా సూటిగా అడిగేశానాఅని బాధ కలిగింది.

రఘూ సగంతాగిన ఓవల్‌టిన్‌గ్లాసు నాచేతి కిచ్చేశాడు. 'చల్లారిపోతుంది. త్వరగా తాగేయ్!' అన్నాను.

'వద్దు, చాలు,' అన్నాడు రఘు. నాకేసి చూస్తూ అలాగే కూచునిపోయాడు. ఆ మమ్మేల్మరి యార్లనిగూర్చి, నోరుకదిపి ఒక్కముక్క మాట్లాడ లేదు

నాకు తెలిసినంతమటుకు రఘూ నాదగ్గర ఏ సంగతీ ఇంతగుట్టుగా, గుప్తంగా దాచివుంచలేదు. ఇకమీద ఆ పాడుమమ్మేల్మరియార్ల ప్రసక్తి రఘూ ఎదుట ఎన్నడూ ఎత్తకూడదని తీర్మానించు కున్నాను.

ఆ రోజు మధ్యాహ్నం మందు తాగాడు. ఒక గ్లాసు గంజి తాగింతర్వాత తనే స్వయంగా చెప్పటం మొదలుపెట్టాడు. 'ఇన్నాళ్ళూ ఆ మమ్మేల్మరి యార్లనిగూర్చి నీతో మనస్సువిప్పి చెప్పలేకపోవటం తప్పే! అప్పుడే నీతో చెప్పిఉండాల్సింది. చెప్ప లేదు. ఈ ఒక్కసంగతి మినహా తక్కిన విషయా లేవీ నీవద్ద దాచలేదునేను. మొట్టమొదటే ఈ సంగతి నీతో చెప్పిఉంటే నాక్కొంత మనశ్శాంతి లభించిఉండేది. పర్యవసానం ఇంతదాకా, ఇంత విప రీతంగా ఉండేదికాదేమో!'

'చెప్పు. నీ మనస్సులో ఉన్నదంతా చెప్పే సేయ్. నీ హృదయభారాన్ని తగ్గించివేసుకోవాలి. అదే మంచిపని,' అని రఘూని మాటల్లోకి దించ టానికి ప్రయత్నించాను. నా కుతూహలంకొద్దీ రఘూని ప్రోత్సాహించాను.

నేనిలా ఆసక్తి కనబరుస్తూండటం వాడికి బాధ కలిగించినట్టుంది. ఏదో చెప్పాలనుకుని మళ్లీ ఊరుకున్నాడు. వాడి ముఖంమీద అదోరకమైన భావం అంకురించి, ముఖంనిండా వ్యాపించటం గమనించాను. కొద్దినిముషాలతర్వాత 'చలేస్తున్న ట్టుంది. కంబళి, దుప్పటి జోడించి నా చుట్టూ కప్పు,' అన్నాడు. కప్పాను. మరి కాస్సేపటికల్లా అదమరచి నిద్రపోయాడు రఘూ!

నాకు నిరాశ కలిగింది. ఆ మాట నిజమే. ఏవో చెప్పబోతూ మధ్యలో ఆపేశాడే! మమ్మేల్మరి యార్లనిగూర్చి ఆలోచించటం విషచర్వణంగా ఉంది రఘూకి. అలాంటప్పుడు మాటిమాటికి ఆ మమ్మేల్మరియార్లనిగూర్చి రఘూని అడిగి, వాడిని హింసించటం భావ్యం కాదనుకున్నాను. వాళ్లని గూర్చి ఆలోచించటమే మానేయాలి; పూర్తిగా మరచిపోవాలి అనుకున్నాను. ఒకవేళ రఘూ స్వయంగా ఆ సంగతి ఎత్తినా, ఇంకోసారి ఎప్పుడైనా

తాపీగా మాట్లాడుకుందాంఅంటూ మాట మార్చే యాలని తీర్మానించుకున్నాను.

సాయంత్రం అయేసరికి మేలుకొని 'చలే స్తుంది,' అన్నాడు రఘు. అని ఓ నిముషం ఊరు కుని 'మా నాన్నగారి సంగతులు ఏవైనా విన్నావా నువ్వు?' అని అడిగాడు.

'నువ్వు చెప్పిందితప్ప నాకేమీ తెలియదు,' అన్నాను.

'ఆయన అందంగా, ఎర్రగా, మన్మథుడులా ఉండేవారుట.........'

రఘూకూడా అందంగా ఉంటాడు. నేను తలూపుతూ వింటున్నాను.

'ఆయన, వెనక కొంతకాలం తంజావూరులో ఉండేవారు...'

రఘూ వాళ్ల నాన్నగురించి మాట్లాడు తున్నప్పుడు నాకు విషయం కొంచెం అర్థం అవటం ఆరంభించింది. రఘూ డొంక తిరుగుడుగా ఆ మమ్మే లియార్ల విషయం చెప్తున్నాడని తెలుసుకోటానికి ఇంతసేపు పట్టింది. 'పిచ్చిపిచ్చిగా మాట్లాడకు. ఇప్పుడా సంగతంతా ఎందుకు? అనవసరం. తీరుబడిగా తర్వాత మాట్లాడుకుందాం.' అన్నాను.

'ఈ సందర్భం దాటిపోతే, నీతో చెప్పడానికి అవకాశం దొరకదు,' అన్నాడు రఘు ఖచ్చితంగా. వాడి మాటల్లో ధ్వనించిన భావం నాకాశ్చర్యం కలిగించింది.

వాడు అంత అస్వస్థ స్థితిలోనూ అసాధారణ మైన బలం పుంజుకుని అతిప్రయత్నంమీద మాట్లాడుతున్నాడని గ్రహించాను. తర్వాత కొంచెం వేళాకోళంగా. ఎగతాళిగా అన్నాను. 'రఘూ! ఇంత లోనే నేను మా ఊరు వెళ్లదలచుకోలేదు. నాకు ఎక్కడా పనిలేదు. నువ్వుకాస్తలేచి తిరగటం మొదలుపెట్టావంటే, నేను స్వయంగా ఓ మంచి సంబంధం కుదిర్చి, చక్కటి పిల్లచేతికి నిన్ను అప్పగించేసి, తర్వాతే వెళ్లాలనుకుంటున్నాను. నీ కోసం కాకపోయినా, నీ పిల్లలకోసం నువ్వు మళ్లీ పెళ్లి చేసుకు తీరాలి.'

'నీకు అంతే తెలుసు,' అని వెటకారంగా నవ్వాడు రఘు. తర్వాత, నెమ్మదిగా కోపంగాని వెటకారంగాని ధ్వనించకుండా మాట్లాడాడు. మామూలుగా ఏదో సాధారణమైన విషయాన్నిగూర్చి చెబుతున్నట్టు అన్నాడు. 'ఒకావిణ్ణి చంపేశాను. ఇప్పుడు రెండోసారి మరో చావుకి బాధ్యుణ్ణయ్యాను నేను. ఇహమీదట...' వాక్యం పూర్తి చేయకుండా, కొంచెం సేపు మౌనంగా ఉండిపోయాడు రఘు.

కాస్సేపయాక 'మిగతా ఆ కాస్త కథకూడా చెప్పేస్తాను విను,' అని-మళ్లీ మొదలుపెట్టాడు. 'నేను తంజావూరు వచ్చిం తర్వాత ఈ మమ్మేలి యార్లతో, మరీ ముఖ్యంగా ఈ సదాశివ మమ్మేలి యార్‌తో నాకు గాఢమైన స్నేహం కుదిరింది. ఆ మమ్మేలియార్ల తల్లితో సంబంధంవున్న డాక్టర్ మా నాన్నగారేనని అప్పటికింకా తెలియదు. ఆ కథ—అంటే మా నాన్నగారి పూర్వ చరిత్ర తెలుసుగాని—ఆ కథకి సంబంధించిన స్త్రీ ఎవరో అంతవరకూ నాకు తెలియదు. ఒకనాడు త్రాగుడు మైకంలో సదాశివమమ్మేలియారే నాతో చెప్పాడు.'

నాకూ తెలియకుండా, కథ వింటూన్న స్వార స్యంలో అడిగాను: 'సదాశివమమ్మేలియార్‌కి......' అని.

'నేను ఆ డాక్టర్ కుమారుణ్ణని సదాశివ మమ్మేలియార్‌కి తెలియదనే ఇప్పటికీ భావి స్తున్నాను. కాని, నాలో అంతర్గతంగా ఒక మూర్ఖ మైనఆగ్రహం, క్రోధం ప్రజ్వరిల్లింది. ఆ సంగతి తెలిసి, అదేపనిగా ఎన్నడో మా నాన్నగారు చేసిన పాపానికి నామీద పగబట్టి కుట్ర పన్ను తున్నాడనిపించింది. ఇలా అనుకోటానికి కారణ మేమీలేదు. అకారణంగా జనించిన కోపానికేకదా గాఢత, పట్టుదల ఎక్కువ?'

ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చాడు రఘూ. ఆయాసంతోతలగడమీద ఒరిగికూచుని, మాట్లాడాడు.

'తీరుబడిగా చెప్పటానికి వ్యవధిలేదు త్వరగా చెప్పి ముగించేస్తాను. చెప్పడం కష్టమే. సహజంగా, సోదరభావంతో సదాశివమ్మొదలియార్ నా భార్యతో మెలగడం నాకామెర్ల కళ్ళకి......ఇంకా అన్నీ వివరంగా చెప్పాలా? నువ్వు సులభంగా అర్థంచేసుకోగలవు. కథలు రాసేవాడివిగద! ఆవిడ నా విషప్రచారపుమాటలు సహించలేక గుండె పగిలి చచ్చిపోయింది.'

ఉలిక్కిపడ్డాను. అదా సంగతి? నేను బొత్తిగా ఎదురుచూడని సంగతి ఇది. 'ఇప్పుడా సంగతంతా ఎందుకు రఘూ? ఇలా ఆలోచిస్తూ బుర్ర పాడు చేసుకోకు. పడుకో......!' అన్నాను.

'ఈ విషయం నన్ను హింసించకుండా ఒక్క క్షణం వదిలిపెట్టేదికాదు, నీతో చెబితే నాక్కొంత మనశ్శాంతి లభిస్తుంది......నా కళ్ళఎదుట ప్రతి రోజూ లోలోన మథనపడుతూ కుమిలి కృశించి కృశించి ప్రాణం వదలింది నా భార్య. ఆమె చనిపోయింతర్వాత సదాశివమ్మొదలియార్‌ని చూసినప్పుడల్లా వాడి తల నరికెయ్యాలనిపించేది. అతని కంటబడకుండా తప్పుకుతిరిగేవాణ్ణి.........తర్వాత నువ్వు వచ్చింతర్వాత జరిగిందంతా.........'

అయాసంతో నిట్టూరుస్తూ పరుపుమీద ఒరిగిపోయాడు రఘూ.

ఆరోజురాత్రి మళ్ళీ స్పృహతప్పింది రఘూకి. మళ్ళీ కలవరించటం మొదలుపెట్టాడు. అర్ధరాత్రి దాటింతర్వాత మళ్ళీ జ్వరం వచ్చింది. తెల్లవారేసరికి జ్వర తీవ్రత ఎక్కువై ఇంచుమించు సంధించినట్టు అనిపించింది. డాక్టర్‌కికూడా ఏమీ పాలుపోలేదు. మందు ఇస్తూ 'ఇహ ప్రయోజనం లేదు' అని చెప్పేశాడు.

వరుసగా మూడు రోజులు స్పృహలేకుండా గడిపాడు రఘు. చనిపోయేముందు చివరికొన్ని క్షణాల్లో కొంచెం తెలివివచ్చింది. తన పిల్లల్ని దగ్గరికి పిలిచి, 'ఇహమీదట నువ్వు చూసుకో' అని వాళ్ళని నాకు అప్పగించేశాడు.

నాకు అత్యంతప్రియమైన 'రఘూ' అన్న పేరు మాసిపోగా, మిగిలిన ఆ శవం వెనకాలే మళ్ళీ ఒకసారి ఊరిబయట ఉత్తరానవున్న నదీతీరందాకా నడచివెళ్ళి తిరిగి వచ్చాను.

నా స్నేహితుడు రఘూఆత్మకి చావులోనో చావులాంటినిర్లిప్తతలోనో శాంతి లభించి ఉండొచ్చు.

వాడు చనిపోయినందుకు విచారం లేదు— బతికివుండగా వాడనుభవించిన యమయాతనని తలచుకుని బాధపడ్డాను.

(అయిపోయింది)



భాష - వ్యాకరణము

డా. బొడ్డుపల్లి పురుషోత్తం

భాష సహజ వ్యవస్థాత్మకమైనది. ఆ వ్యవస్థను వ్యాకరించి, యున్మీలించునది వ్యాకరణము.

ప్రాచీనములగు వేదములు స్వరప్రధానములు. వైదిక సంస్కృతమునందు స్వరమొకవర్ణము. (Phoneme). వేద పరిరక్షణార్థమై ప్రాతిశాఖ్యలు, శిక్షలు, నిరుక్తాదులు వెలసినవి. వైదిక ధ్వని పరిజ్ఞానమును ప్రాతిశాఖ్యలు, శిక్షలు చేకూర్చగా, పదపదాంగ విభాగాదులను నిరుక్తాదులు నిరూపించినవి.

లౌకిక సంస్కృతముతో పాటు, వైదిక సంస్కృతమునకుగూడ పాణిని మహర్షి 'అష్టాధ్యాయి' యను వ్యాకరణమును రచించెను దీనితో భారతదేశమున వ్యాకరణ పరిజ్ఞానము మిన్నుముట్టినది. పాణినికి పూర్వమందు వెలసినవిగా పరిగణింపబడు కాతంత్రాది వ్యాకరణములు, సూర్యోదయమునకు నక్షత్రములవలె మరుగుపడినవి. పదమును ప్రకృతిప్రత్యయముగా విభజించుట, శూన్య విభక్తి (Zero Suffix) మొదలైన విషయముల విజ్ఞానమును లోకమునకు ప్రసాదించిన వాడు పాణినియే. వర్ణనాత్మకవ్యాకరణములలో పరాకోటికెక్కిన దాతని అష్టాధ్యాయి. అత్యంత సమగ్రమగు నీ వ్యాకృతి రచనము; ఇందలి నిశిత సాంకేతిక నైపుణ్యము – ఆధునిక భాషా శాస్త్రజ్ఞుల నాశ్చర్య చకితులను గావించినది. మానవమేధాపరిణతి కీ వ్యాకృతి శాశ్వతమైన నిదర్శనమని, ఇంతవరకు ప్రపంచమున నే భాష కీరీతిగా సమగ్ర వర్ణనాత్మక వ్యాకరణము వెలయలేదని, ఆధునిక భాషా శాస్త్రజ్ఞులకు డనదగిన బ్లూంఫీల్డు అష్టాధ్యాయి నిట్లభినుతించెను :

'This grammar which dates from somewhere round 350 to 250 B C. is one of the greatest monuments of human intelligence. It describes, with the minutest detail, every inflection, derivation, and composition and every syntactic usage of its author's speech. No other language, has been so perfectly described.' (Language—1963. p. 11)

ఈ భారతీయ వ్యాకరణమే ఐరోపీయనుల కనులు తెరిపించినదని; సిద్ధాంతముపైగాక పరిశీలనపై నీ వ్యాకృతి రచింపబడినదని; ఇట్టి రచన నన్వేషించినపిమ్మటనే పాశ్చాత్యదేశముల యందు తులనాత్మకభాషావ్యాకరణము లావిర్భవించుట కవకాశ మేర్పడినదని బ్లూంఫీల్డు ఉద్ఘాటించెను.

ఇట్టి సమగ్రవర్ణనాత్మక వ్యాకరణ మాధునిక భాషాశాస్త్రజ్ఞులను సైతము కించపఱచుచున్నదని గ్లీసన్ పండితు డిట్లుల్లేఖించెను.

'And it should be a source of humility to modern linguists to recognize that the most successful and complete description is very probably still the Sanskrit Grammar of Panini and his associates—antedating modern descriptive linguistics by millenia.' (An Introduction to Descriptive Linguistics—R E. 1966—P. 211.)

భాషావ్యవస్థను చక్కగా ప్రతిబింబించు మణిదర్పణము వర్ణనాత్మక వ్యాకరణమే. తక్కిన వ్యాకరణ రచనములం దనేకప్రమాదము లుప్పతిల్లుట కవకాశము లుండును. ఆధునికభాషా శాస్త్రజ్ఞులు నీ వర్ణనాత్మక పద్ధతినే అవలంబించుచున్నారు. ఇందుల కనేక కారణములున్నవి. ఈ

పద్ధతియందుగల సౌకర్యమునట్లుంచి, వారు పరిశీలించు భాషలు లిపి సారస్వతములు లేనివి. వాని వ్యవహర్తలు అనాగరికులు, ఆటవికులు.

చారిత్రకవ్యాకరణములు లిపి, సారస్వతము శాసనములు ఉన్న భాషలకే విరచించుటకు సాధ్యపడును. కొన్ని సుప్రసిద్ధములగు భాషలకీమధ్యకాలమున నిట్టి చారిత్రకవ్యాకరణములు వెలసినవి. ఇట్టి రచనల గావింపవలయునన్న ఆయా పదముల పరిణామములు స్పష్టముగా తెలియవలయును. అందులకుగల సాంఘిక, రాజకీయ, వైజ్ఞానిక మనస్తత్వశాస్త్రముల పరిజ్ఞాన మవసరము. ఇట్టి సమగ్ర పరిజ్ఞానము సులభసాధ్యముకాదుగదా! అందుచేతనే భాషాశాస్త్రజ్ఞులిట్టి క్లిష్ట సంశయాత్మక సంకటావృతమార్గమును చేపట్టరు.

చారిత్రక వ్యాకరణము ద్వివిధములు : (1) ఏకకాలిక వ్యాకరణము (Synchronic Grammar) (2) అనేక కాలిక వ్యాకరణము (Diachronic Grammar).

ఒక శతాబ్దమందలిగాని, ఒక కవియొక్కగాని భాషను నిరూపించు వ్యాకరణము ఏకకాలిక వ్యాకరణము తెలుగున నిట్టి రచన కావించుటకు తొలత ప్రయత్నించిన వారు డాక్టర్ చిలుకూరి నారాయణ రావుగారు. తమ ఆంధ్ర భాషాచరిత్ర కనుబంధముగా 11 వ శతాబ్ది భాషను వర్ణించుటకు యత్న మొనర్చిరి. ఆ తరువాత శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు శ్రీ గిడుగు సీతాపతిరావుగారు నన్నయ భాషను వివరించుచు కొన్ని వ్యాసములు ప్రకటించిరి. ఆచార్య గంటి జోగి సోమయాజిగారు తమ ఆంధ్రభాషా వికాసమున 'నన్నయనాటి భాష'యను ప్రకరణమును జేర్చిరి ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు తమ 'నన్నయ భారతము'ను సిద్ధాంత గ్రంథమునందు 'నన్నయ భారతమునందలి భాషా విశేషముల'ను శీర్షికను జేర్చిరి. ఇట్టివానిని ఏకకాలిక వ్యాకరణములనవచ్చును. నన్నెచోడుడు, తిక్కన, ఎఱ్ఱాప్రెగ్గడ, శ్రీనాథుడు పోతన మున్నగు ప్రసిద్ధాంధ్ర కవులపై అనేక సిద్ధాంత గ్రంథములు వెలయుచున్నవి. కాని ఆయా కవుల భాషను వివరించు ప్రకరణమునందు మృగ్యమగుటవిచార్యము. ఆయా పరిశోధకుల దృష్టి లోపమున కిది నిదర్శనము. సారస్వత దృష్టి, భాషాదృష్టి యనునవి రెండును పరిశోధకునకు రెండు నేత్రములు. ఇందేది లోపించినను అది సమగ్రావగాహనమునకు లోపమే యగును.

అనేకములగు ఏకకాలికవ్యాకరణముల నేకమొనర్చినచో అది అనేక కాలిక వ్యాకరణమగును. (Diachronic Grammar). ఇట్టి వ్యాకరణాధారము లున్నప్పుడే ఏ భాషకైన సమగ్రమగు చారిత్రక వ్యాకరణ మావిర్భవించుట కవకాశముకల్గును.

భాషల పుట్టుకనుబట్టియు, వ్యాకరణాంశములనుబట్టియు, భాషలను కుటుంబములుగా వర్గీకరించు పద్ధతి (The geneological and morphological classification of languages) ఏర్పడినపిమ్మట కొన్ని తులనాత్మక వ్యాకరణములు వెలసినవి (Comparative Grammars). ఎంతో విస్తృతముగా వ్యాపించిన ఇండోయూరోపియన్‌భాషలకు తులనాత్మక వ్యాకరణ మేర్పడిన యచిరకాలములోనే కాల్డ్వెల్ విరచిత ద్రావిడభాషా తులనాత్మక వ్యాకరణము వెలయగా, తమిళ కర్ణాటాంధ్రాది భాషాధ్యయనమునందు విప్లవము గల్గినది.

తులనాత్మక వ్యాకరణములుకూడ చాలవరకు వర్ణనాత్మకముగనే విరచితములైనవి. ఇట్టి రచనా పద్ధతియే సుకరము, అప్రమాదికమునని భావింపబడెను.

సమగ్రభాషావగాహనమునకు వర్ణనాత్మక వ్యాకరణములే విశేషోపయోగములు. చారిత్రక, తులనాత్మక వ్యాకరణపరిజ్ఞానము కలిగి వర్ణనాత్మక వ్యాకరణములు రచించుట శ్రేయోదాయకము. అట్టి పరిజ్ఞానములేని పక్షమున వ్యాకర్తలు జాగ్రత వహించి ఇది ముందురూపము, ఇది యనంతర

రూపములవి రచింపక, ఆయా ధ్వనులకు పరస్పర వినిమయము కలదు; వీని కివి రూపాంతరము లగునని చిక్కులు పడని రీతిని వర్ణించుటయే మంచిది. వర్ణనాత్మక వ్యాకర్తలు కొందఱు తాము రచించుచున్నది వర్ణనాత్మక వ్యాకరణమని మఱచి యటనట చారిత్రకముగా నిరూపించుచుందురు. ఇది యప్రయత్నముగనే జరిగెనేమో యనిపించును. ఉదాహరణములు కొన్ని పరిశీలింతము. బాలవ్యాకరణము వర్ణనాత్మక వ్యాకరణమే కదా! అందువలననే ఋత్విజుఁడు—ఋత్విక్కు; అంగిరసుఁడు – అంగిరుడు; జగము—జగత్తు మున్నగు ద్వివిధములగు తత్సమ రూపములు సాధింపబడినవి. ఋత్విజుడు, జగము మున్నగు రూపములే తొలుత నన్నయచే ప్రయోగింపబడినవి; ఋత్విక్కు, జగత్తు మున్నగు రూపములు నన్నయానంతర కవులు ప్రయోగించిరని చారిత్రకముగా ఆ వ్యాకృతి నిరూపింపదు. కాని 'కుఱు, చిఱు, కడ, నడు, నిడు శబ్దముల ఢడలకు అచ్చుపరమగుచో ద్విరుక్త టకార మాదేశమగు' నని చెప్పుట చారిత్రకముగా చెప్పినట్లైనది. కుఱు, చిఱు, నడు, నిడు అను శబ్దము లెట్లేర్పడినది ప్రక్రియ మూలమున నిరూపింపకపోవుట వర్ణనాత్మక పద్ధతికి భిన్నమైనదియే యగును.

మఱి 'అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాషనగు' అనుటయు చారిత్రకముగా చెప్పినట్లే. ఏలన గకారయుక్త రూపములనుండి వకారయుక్త రూపము లనంతర కాలమున వేర్పడినవను నర్థము వచ్చును. నన్నయ గకారయుక్త రూపములు వాడెనా? వకార యుక్తములు వాడెనా? ఎప్పటినుండి గకారము వకారమైనది? మున్నగు నాకాంక్ష లుత్పన్నములగును. నన్నయ పగలు, పవలు అను రెండు రూపములు ప్రయోగించెను. ఇరువురు—వాడెనే కాని ఇరుగురు వాడనే లేదు. అందుచే అపదాద్యంబయి, యసంయుక్తములయిన గవ—లు కొన్ని పదములందు మాఱునను వర్ణనాత్మకపద్ధతియే యుక్తియుక్తము.

'బంధువు' అను తత్సమము 'బందువు' అయిన పిమ్మటగదా 'బందుగు' కావలయును. ఇట్టి వింకను ననేక నిదర్శనములు చూపవచ్చును. మొత్తముమీద వర్ణనాత్మకవ్యాకరణములలో ఏవంవిధమగు చారిత్రక నిరూపణము లప్రయత్నముగనే చోటు చేసికొని చిక్కులు కల్పించినవి. అందుచే వ్యాకర్తలు తగు జాగరూకత వహింపవలెను.

అనేకదేశభాషలకు వర్ణనాత్మక వ్యాకరణములే విశేషముగా వెలసినవి. దేశభాషలు ప్రవాహసదృశములు. కాలువలకు కట్టలువేసినట్లు ప్రవాహములకు వేయుట దుస్సాధము. అందుచే వర్ణనాత్మకవ్యాకృతు లెప్పటికప్పుడు భాషాభివృద్ధితో పాటు విస్తృతి చెందవలయును. వర్ణనాత్మక వ్యాకరణములు భాషలున్నస్థితిని వర్ణింపవలయునే గాని 'ఇట్లుండవలయును' అని నిర్ణయించి, ఆదేశింపరాదు. ఇవి 'అసాధువులు', ఇవి 'నిరాకరములు', ఇవి 'గ్రామ్యములు' అను నాదేశాత్మక పద్ధతి (Prescriptive) వర్ణనాత్మక వ్యాకరణములయందు ప్రవేశించుట శోచనీయము. ఇట్టి యాదేశములు భాషాభివృద్ధికి నిరోధకములు. భాషాశాస్త్రజ్ఞు లిట్టి యాదేశాత్మక రచనలను విధ్వంసకములుగను; దుష్ప్రాతినిధ్యము వహించినవిగను ఈసడింతురు. (Many linguists have very decidedly rejected prescriptive grammars as pernicious distortions -Gleason-(p 208-9.)

ఒకప్పుడు సకలవిద్వాంసులలో ప్రప్రథమ గౌరవ పీఠము వైయాకరణులకు లభించినది. (ప్రథమేహి విద్వాంసో వైయాకరణాః॥—అభినవగుప్తుడు). అందులకు కారణ మానాటి వ్యాకర్తలకుగల విశాలదృక్పథము; సమన్వయపటుత్వము మున్నగు ననేక సల్లక్షణములు.

భాషాసమగ్రస్వరూపావగాహనమున కనేకము లగు వ్యాకరణము లవసరమగును. ఒండురెండు వ్యాకరణముల నధ్యయన మొనర్చి భాషాస్వరూపమును గ్రహించితిమనుకొనుట భ్రాంతియేయగును. ఏలన భాష యనునది కేవల మొక వ్యవస్థమాత్రము

కాదు. అది యనేక వ్యవస్థల పరంపర. (Language is not merely a system, but a hierarchy of systems. Gleason—P. 218) అందుచేతనే ఆయావ్యవస్థలను వివరించు తరతమ భేదములతోఁగూడిన వ్యాకరణములు ప్రతిభాషకు (degrees of grammaticalness) కావలయును.

కొన్ని కేవలము 'ప్రవేశపు' వ్యాకరణములు. ఇవి భాషవిషయిక సాధారణాంశములను మాత్రమే పేర్కొనును. ఇంతకన్న విశిష్టాంశముల వివరించునవి యుత్తమవ్యాకరణములు.

భాష వాక్యప్రధానమైనది. వాక్య మనేకములగు నిర్మాణములతో (Constructions) గూడినది. ఈ నిర్మాణములలో ననేకములగు అంతర్నిర్మాణము లుండును. ఇట్టి నిర్మాణరీతులను వివరించుటయే ప్రధాన లక్ష్యముగా వెలసిన వ్యాకరణములను 'వాక్య వివరణ వ్యాకరణము' అనవచ్చును. (Sentence—interpreting grammars). భాషాధ్యయనము నందిట్టి వ్యాకరణము లత్యంతోపయోగములు. నిత్యము మనము మాటాడుకొను వాక్యములే కదా! వీనిని వివరించుట సుకరమేయని బాహ్యదృష్టి కనిపింపవచ్చును. కాని వాక్యములోని నిర్మాణరీతులను గమనించుట చాల క్లిష్టమగు కృత్యము. కావ్యములందలి వాక్యములకన్న శిష్టజన వ్యవహారములందలి వాక్యము లసంఖ్యాకములుగా రచించుకొని అందలి నిర్మాణములను పరిశీలింపవలయును. ప్రతివాక్యమునకుగల పరిసరములను దృష్టిని నిల్పినగాని వాక్యము బోధపడదు. ఇట్టి పరిశీలనాత్మక రచనలే భాషకుగల సజీవశక్తిని నిరూపించును.

ఏ వ్యాకరణముమూలమున వాక్యనిర్మాణశక్తి మనకుగూడునో అట్టి వ్యాకరణమును 'వాక్యనిర్మాణ వ్యాకరణ' మనవగును. (Sentence—producing Grammar). ఇట్టి వ్యాకరణము లన్యభాషావ్యవహార పాటవమును జేకూర్పగలవి. ప్రపంచము సన్నిహితము కావలయునన్న యిట్టి వ్యాకరణము లధికముగా ఈనాటి మానవుడేదో యొకభాషను గ్రహించి మిన్నకుండజాలడు. అవకాశమున్నంతవర కాత డనేక భాషలను కైవశ మొనర్చుకొనవలయును. అందులకు తనకు పరిచయమున్న ఏ రెండు భాషావ్యవస్థలనైనను వేఱుచేసికొనుచు ఆ భాషలను గ్రహింపవచ్చును. ఇట్లుపయుక్తమగు వ్యాకరణమును 'వినిమయ వ్యాకరణము' (Contrastive or transfer Grammar) అనవొప్పును. ఇతఃపూర్వమే పరిచితమైన ఒక భాషావ్యవస్థతో విభేదింపజేసి మఱియొక భాషను గ్రహింపవచ్చును. అందుచే నిట్టి వ్యాకరణమును 'విభేదవ్యాకరణము'నియు పేర్కొనవచ్చును.

ఏవంవిధముగా ఒకానొకభాషలోని పదనిర్మాణము (Word formation), వాక్యనిర్మాణము (Sentence formations) వివరించు వ్యాకరణములే కాక వాక్యాతీతమగు కాకుస్వరాదులను (Tones) వివరించు వ్యాకరణములు నవసరమే యగును. ఇట్టివానిని 'వాక్యాతీత వ్యాకరణములు'గా పరిగణింపవచ్చును. (Supra—sentence Grammars). ఇవియన్నియు వర్ణనాత్మక వ్యాకరణములలోని విభేదములు. ఇట్టి వ్యాకరణము లనేకములను చదివి భాషాసమగ్రసమ్యక్స్వరూపస్వభావావగాహన మొనర్పవలసిన యవసరముండగా, కొందఱు పండితులు తెనుగున 'ప్రౌఢవ్యాకరణమే' యనవసరమని భావించి, అంతయు బాలవ్యాకరణమునందే యున్నదని తృప్తిపడుట విడ్డూర మనిపించును.

సజీవమగు తెలుగు భాషావ్యవస్థ ననుసరించు పై విధములగు ననేకవ్యాకరణములు వివిధభాషలలో వెలసినపుడు, ప్రపంచములోని యనేకదేశములవారు తెనుగుభాషపై విశేషమగు మక్కువను చూపి అహమహమికతో నధ్యయన మొనర్చుట కుద్యమింపగలరు. అపుడు ప్రపంచ పరివ్యాప్తమగుభాషగా తెలుగు విశేషగౌరవమును, ఖ్యాతిని సంపాదించుకొనగలదు. అమ్మ.

నన్నిలా బ్రతకనీయండి

శ్రీ గంధం జోయెల్

నా జీవన ప్రవాహ
స్వేచ్ఛా గమనానికి
ఆనకట్టలు వేయవద్దు!
విశాల విశ్వంలో
పాపాల్ని వదలేసి.
పావురంలా ఎగిరే
నా రెక్కలు విరచి,
నన్ను నేల రాల్చొద్దు!
నన్నిలా బ్రతకనీయండి!

ఆబద్ధాల పై పూతతో
అంభస్సారముల
అందాన్ని క్రొత్త
ఆశగా చూపొద్దు!
మోసాల భయంకర
ఘోషణల స్మృతులకు
బడి ఉండమని
వీటికీ వాటికీ
చిత్ర వధ చేయవద్దు!
నన్నిలా బ్రతకనీయండి!

ఈ ఘోర తమస్సు
పందిళ్ళు నా ముందు
వేసి చూపేదెందుకు?
కాంతికి కళ్ళు మూసు
కొనడం నా తత్వం కాదు
నా మధుర స్వప్నాల
అనుభూతులు

నన్నిలా బ్రతకనీయండి

ప్రణయ సంగీత
నాదాన్ని ఆదిలోనే
త్రెంచి వేయవద్దు!
నన్నిలా బ్రతక నీయండి!

పరస్పర విద్వేష విష
పాత్ర నాకు త్రాగించడం
వృధా ప్రయత్నం
కాక మరేమిటి?
నా ధ్యేయానికి,
జగత్కళ్యాణానికి
మధ్య నిర్మించుకొన్న
వంతెనను కూల్చొద్దు!
తళుక్కున ఝళిపించే
ధర్మం కరవాలానికి
మధువు పూసి నవ్వొద్దు!
నన్నిలా బ్రతకనీయండి!

నా ఆశయ దర్పణాన్ని
కజ్జలంతో నింపడం
వివేక చిహ్నమేనా?
ఆదర్శ పుష్ప వనాన్ని
మదగజాల్లా త్రొక్కి
చిందర వందర చేసి,
పారిపోవడం న్యాయమా
మీ విశ్వాసాల అపరంజి
పంజరంలో నన్ను
బంధించిన కీరముగా
చూచి, సంతోషించడమా?
మీకూ నాకూ నడుమ
నీతి జలపాతా లున్నాయి!

మీరు ఆచరించేదు
శుష్క మిథ్య ప్రబోధాలు
గడియ గడియకూ,
ఎలుగెత్తి చాటొద్దు
నన్నిలా బ్రతక నీయండి!

నాకు తెలుసు...
బ్రతుకు గులాబీ
క్రింద బాధల వాడి ముళ్ళు
ఉన్నాయను నగ్నసత్యం!
ఓర్పు దీపస్తంభం
అడుగున చీకటి
చోటు చేసుకుంటుందని;
అయినా, వినండి!
నావ నాన నన్నిలా
బ్రతక నీయండి!

నవజీవన మార్గాన
తరలి పోనివ్వండి!

మనిషిని, నన్ను మనిషిగా
బ్రతకనిస్తే చాలు!

మనిషిని యాచకునిగా
మార్చకుంటే మేలు!

మంచిని హృదయంలో
పెంచుకుంటే పదివేలు!

అదే నా ఆకాంక్ష!
చిరకాల జీవితవాంఛ!!

మాండలికవృత్తి పదకోశము

శ్రీ నిడుదవోలు వెంకటరావు

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారు పూనుకొన్న మాండలిక వృత్తి పదకోశాల ప్రణాళికలో వెలువడిన కోశాలలో వాస్తు పదకోశం నాల్గవది. అయితే—క్రీ. శ. 1962 లోనే ఈ ప్రణాళిక క్రింద తొలిది వ్యవసాయపదకోశం వెలువడింది. అకాడమీవా పదకోశ కార్యక్రమా న్ననుసరించి—ప్రస్తుత పదకోశం—సంఖ్యలో నాల్గవది అయినా ముద్రితమైనవానిలో రెండవది—వారి కార్యక్రమ మిది

1. వ్యవసాయపదకోశం—ఇది వెలువడినది.

2. చేనేత వృత్తి పదకోశం—; 3. మత్స్య నౌకా నిర్మాణ పదకోశం—ఇవి యింకా వెలువడలేదు.

4. వాస్తుపదకోశం—ఇదే పై కోశం.

5. వడ్రంగి కమ్మర పదకోశం—ఇంకా రాలేదు.

పదకోశాలు—ప్రణాళిక

అకాడమీవారు — సమగ్రాంధ్రనిఘంటు నిర్మాణానికి ఈ పదకోశాలు ప్రకటించడము జరుగుతున్నదన్నసంగతి—ఆంధ్రలోక మీవల తెలిసినదే. ఈ అభిప్రాయంతోనే—అకాడమీవారు—నన్నయ పదకోశము—నన్నెచోడని పదకోశము, శ్రీనాథ పదకోశము (మొదటిభాగము). ప్రకటించారు. తిక్కన పదకోశము అచ్చగుచున్నదని తెలియుచున్నది. అయితే ఇవన్నీ భాషాసాహిత్యాలకు సంబంధించినవి. అకాడమీవారి దృష్టిలో, తెలుగు సాహిత్యానికి సంబంధించిన కావ్యప్రబంధాది వాఙ్మయంతో, వృత్తిపదకోశాలాకు, మాండలికాలకు సంబంధము లేదని కాబోలు ఈ వృత్తిపదకోశాల నిర్మాణానికి, ఒక ప్రత్యేక కార్యక్రమం రూపొందించారు. ఆంధ్ర దేశంలో, ఆయాప్రాంతాలకు—కొంతమందినిపంపి, ఆయావృత్తులు చేసేవారిని కలుసుకొని, వారు నిత్య వ్యవహారంలోవాడే పదాలను, పనిముట్లపేళ్లను సేకరించి, సంపాదకులకు పంపగా, వారు దీనిని ఒక ప్రత్యేక కోశముగా నిర్మించుటయే ఈ ప్రణాళిక.

దీని ననుసరించి, ఈ వృత్తిపదకోశంలో, ఏయేవ్యక్తు లేయే ప్రాంతాలలో ఎవరెవరితో సంప్రతించారో, ఆ విషయాలు, పట్టీలు, నివేదికలు—అన్నీ వివరంగా తెలుపబడిఉన్నవి. ఆ సంగ్రాహకులు—పర్యటించిన ప్రాంతాలలో, పల్లెలు సూచితములైన పటములుకూడా యిందు చేర్చబడి యున్నవి.

సంపాదకులు సేకరించిన ఆరోపాలను—అకారాదిక్రమముగానిచ్చి అర్థాలు తెలిపారు. ఏయే ప్రాంతంలో ఏయేరీతిగా పదాలని వాడుదురో ఆ సూచనకూడా యిచ్చారు. వాస్తుశాస్త్రంలో, 'కలప' ప్రధానమైనదికాబట్టి—చెట్లపేర్లకు వాడుకలోవే కాక, ఇంగ్లీషు పర్యాయపదములు — వృక్షశాస్త్ర సాంకేతికపదములుకూడా యిచ్చియున్నారు. అన్నింటికైనా—ఆయా ఆరోపాలకు చిత్రాలుకూడా యిచ్చారు. ఇది చాలా ప్రశంసనీయమైన విషయం.

తెలుగు సాహిత్యం - శాస్త్రవాఙ్మయం

తెలుగు సాహిత్యంలో, సంగీత, సాహిత్య కళలకు సంబంధించిన పద్యకావ్యాలేకాక, గణిత, వైద్య, జ్యోతిశ్శాస్త్రాలకు సంబంధించిన కావ్యాలూ ఉన్నవి. ఒక్క వైద్యశాస్త్రంలో — పశువైద్య శాస్త్రం — అశ్వశాస్త్రము — వేఱుగా ఉన్నాయి.

ఇవేకాక, వ్యవసాయ శాస్త్రము—వాస్తు శాస్త్రము—కూడా ఉన్నవి. ఆరోగ్యశాస్త్రము మొదలుకొని—అంగళ్లలో పద్దులువేసే బేరేజాలవఱకు సమస్త శాస్త్ర విజ్ఞానము తెలుగు సాహిత్యంలో ఉన్నది.

ఇట్లు ప్రత్యేక శాస్త్రగ్రంథాలు కావ్య రూపంలో ఉండడమేకాక మన కావ్యవాఙ్మయము—శాస్త్ర విజ్ఞానాన్ని సంపూర్ణంగా ప్రతిబింబింప జేసినది. మన సాహిత్యం—ఆంధ్రుల సంస్కృతికి, సాంఘిక వ్యవస్థకు సర్వస్వముల వంటిది. అది రెండు విధాలు.

(1) సాహిత్య ప్రధానములు.

(2) సాంఘిక శాస్త్ర ప్రధానములు.

తెలుగున, కవిత్రయమువారి గ్రంథం—భారతము—రామాయణ భాగవతములు మొదటి వర్గానికి సంబంధించినవి—అవి అనువాదాలు కావడంవల్ల—అందులో జాతీయజీవితం ప్రదర్శింపుట కవకాశములేదు. మన ప్రబంధాలలో చాలా భాగము సాహిత్యప్రధానములైనవే. అవి కవిత్రయ శ్రీనాథ సంప్రదాయాన్ని అనుసరించినవి.

ఇక రెండవ వర్గానికి చెందినవి శివకవుల కృతులు—ఇవి ముఖ్యముగా తెలుగువారి జాతీయ జీవితమును, వృత్తులను, వర్ణించునవి. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర—తెలుగువారి తొలి విజ్ఞాన సర్వస్వము—బసవపురాణమునందు—పెక్కు సాంఘిక విషయములు గలవు. ఇవి పండ్రెండవ శతాబ్దినాటి ఆంధ్ర ప్రజాజీవితము తెలుసుకొనుటకు పెన్నిధులు.

అకాడమీ వారింతవఱకు—పాల్కురికి సోమనాథుని కృతులకు 1. బసవపురాణము 2. పండితారాధ్య చరిత్రము 3. ఇతర కృతులు—వీనికి పదకోశము తయారుచేయించు ప్రణాళికయే తల పెట్టలేదు.

పాల్కురికి సోమనాథుని కృతులకేకాదు—పల్నాటి వీరచరిత్ర—కొఱవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక మున్నగువానికి పదకోశము అవసరము.

వీని యన్నింటికన్న నేడు మనము శృంగార గ్రంథములక్రింత జమవేసి విస్మరించిన రెండు ప్రబంధములున్నవి.

1. కదిరీపతి శుకసప్తతి.[1]

2. అయ్యలరాజు నారాయణామాత్యుని హంసవింశతి [2]

ఈ రెండును వృత్తిపదకోశకారులకు ఎంతో ఉపకరించే కావ్యాలు—భాషోద్ధారకులైన బ్రౌను దొరగారు వీని విశిష్టత నెఱిగియే 'హంస వింశతి'కి పదానుక్రమణిక తయారు చేయించినారు.

తెలుగు ప్రబంధాల్లో పై రెండేకాక, సవరము చిననారాయణకవి కువలయాశ్వ చరిత్ర—పైడిమఱ్ఱి వెంకటకవి చంద్రాంగద చరిత్ర—గణపవరపు వెంకటకవి ప్రబంధరాజవెంకటేశ్వర విజయవిలాసము—మున్నగు వానికి పదకోశా లత్యావశ్యముగా కావలెను—ప్రబంధరాజములో, 108 రకాల వడ్ల పేర్లున్నవి—వేంకటేశ్వరునికి ప్రసాద సందర్భమున కవి యిచ్చియున్నాడు.

తెలుగు సాహిత్యమున 'శాస్త్రవాఙ్మయ మంటూ, ఒకటి ఉన్నదని మనము, గతానుగతికములని, 'కార్బను కాపీ'లని యీసడించి, పరిగణింపని ప్రబంధవాఙ్మయంలో అపారమైన సాంఘిక శాస్త్రవిజ్ఞానము గర్భీకృతమై ఉన్నదని, యింతవఱకు—విశ్వవిద్యాలయములుగాని, సాహిత్య సంస్థలుగాని గ్రహింపలేదు — అసలా గ్రంథాలను గూర్చిన — విమర్శనపూర్వ్యయే—మనకు లేనప్పుడు విషయపరిజ్ఞాన మెలా అలవడుతుంది.

---

1. గ్రంథము లాంధ్రుల సాంఘిక చరిత్రమున కెంతమాత్ర ముపకరింపవని కీ. శే. సురవరము ప్రతాపరెడ్డిగా రాంధ్రుల సాంఘిక చరిత్రలో స్పష్టపఱచినారు.

2. ఈ రెండు నెంత సాంఘికచరిత్ర కుపయుక్తమో—పై చరిత్రయే తెలుపును.

అకాడమీవారు, మాండలిక వృత్తి పదకోశ నిర్మాణానికి అత్యంతావశ్యకములైన—పై గ్రంథాలలో ఒక్కదానినైనా, తామింతవఱకు ప్రకటించిన ముప్పయి కావ్యాలలోను చేర్పలేదు—అవి—ఆ ప్రణాళికలలో లేనేలేవు. వారి 'తొలిపలుకు' చెప్పుచున్నది.

మన నిఘంటువులలోను ఈ పదకోశాలలో చేరిన పదాలున్నవి. బ్రౌనుదొరగారు, తమ నిఘంటువులో — ఈనాడు పై వాస్తుపదకోశంలో యిచ్చిన వృక్షశాస్త్ర సాంకేతికపదాలు (Botanical Names) అన్నింటినీ యిచ్చారు సంపాదకులు. బ్రౌనుదొరగారి పేరైనా స్మరింపక పోవడం—శోచనీయం.

ఈ సమీక్షలో — మన నిఘంటువులనుండి, ప్రాచీన కావ్యాలనుండి, ఈ వాస్తు వృత్తి పదకోశానికి సంబంధించిన పదాలలో కొన్నింటిని మాత్రము ప్రయోగాలు చూపించాను. పైని నే నుదాహరించిన గ్రంథాలకు పదకోశాలు ప్రకటితములైతే—తప్పక—కోశములలో ఉన్న ప్రతి పదానికి కవి ప్రయోగము లభింపగలదని చెప్పగలను.

నేటికిని వ్యవహారంలో 'ఆయా ప్రాంతాలలో సజీవముగా నిల్చియున్న పదాలు—మన ప్రబంధాలలో నెట్లు నిల్చియున్నవో చూడండి.

ప్రజావ్యవహారంలో పదాలు, ఏ రూపంతో మారుతూన్నప్పటికీ కవులు వానిని క్రమమైన సుష్ఠురూపాలకొడనే, కావ్యాలలో ప్రయోగిస్తారు. ఆ హేతువుచేతనే శబ్దస్వరూప నిర్ణయానికి కవి ప్రయోగాలు తెలుగుభాషలో పరమాధారాలుగా నిల్చియున్నవి. పరవస్తు చిన్నయసూరి తన వ్యాకరణమున, వ్యాకరణకార్యములకు కవిప్రయోగములు చూపుట తటస్థించినందుమూలముననే అది ప్రామాణికమైనది. ప్రాచీనకావ్యాలిట్టి శబ్దస్వరూప నిర్ణయానికేకాక నేటి ప్రజావ్యవహారంలో లేకుండా ఒకప్పుడు వాడుకలోఉన్న పదాల తెలివిడికీ ఏవిధముగా తోడ్పడగలవో, ఈ వాస్తుపదకోశంనుండి కొన్నిమాత్రమే నిరూపిస్తున్నాను.

అంకణం:

'పర్యా'. గది-ఆయిదున్నరమూరల పొడుగు నాలుగున్నరమూరల వెడల్పు లోకొలతగల యింటిభాగం.'

'పొలుపొంద నంకణంబులు పెక్కువన్ని';
'గదులు పెక్కుకట్టి' అని అర్థము.
బస. పు. పుట. 64.

గదికేగాక, ఆ కొలతగల భూభాగానికి ఆ పదం వర్తిస్తుంది.

'వంద అంకణాలభూమి అమ్మేరు' అని.

అచ్చుకట్టు:

'కాల్చిన సున్నపురాళ్లను బయటికి లాగడానికి వాడేకొయ్య'—కాని దీనికి వాస్తు సంబంధమైన మరో అర్థమున్నది. 'భూమినున్ని మడిమడిగా గనిమ తీయు' అని దీని అర్థము.

'అది మఱియు మెత్తగా దున్ని యచ్చుకట్టి' వైజ. 1. ౩.

అటుకు

అటక—దీనికి చాలా రూపాంతరాలున్నవి. కాని 'అటుకు' అని కూడా నేటికి వాడుకలో ఉండడము విశేషం.

దీని పూర్వరూపము—అట్టుగ—
''స్వగేహంబు, 'న
ట్టుగ' మీదన్ పసియించి''
కేయూర 3.238

ఇది యతిప్రాస నిర్ధారకము.

అడ్డదూలం:

'పర్యా. సరం. పంచస్తంభాలమీద వేసే అడ్డవాసం.' అని చిత్రం 275.5 లో చూపారు.

కాని రెండుస్తంభాలమీద వేసేదానికి 'అడ్డదూలం' అనేపేరు.

అన్నయ్యగారి ఉయ్యాలపదంలో దీని స్వరూపం కనబడుతుంది.

'ఉదయాస్త శైలంబు లొనర గంబములైన
నుదు మండలము మోచె నుయ్యాలా
అదన నాకాశపద 'మడ్డదూలం'బైన
యఖిలంబునిండె నీ యుయ్యాలా.'

ఇచ్చట ఉదయగిరి – పశ్చిమాద్రి – రెండు స్తంభాలు—ఈస్తంభాలకి— అడ్డదూలం—ఆకాశము. —ఈ అడ్డదూలానికి ఉయ్యాలచేరులు కట్టినట్లుగా అన్నమయ్య చక్కగా పదము కట్టాడు.

'పదిలముగ వేదములు బంగరు చేరులై
పట్టు వెలపై తోచె నుయ్యాలా.'

అణుసు; 'అనుసు'

—7, 8 పుటలలో వేఱువేఱుగా ఆరోపాలు చూపారు. అణుసుకంటే అనుసు—అనే పదం గ్రాంథికమైనది. దీనికి చాలా అర్థాలున్నవి. అయితే వాస్తువుకు సంబంధించిన 'కొమ్ముమీద తొడిగే పొన్ను, తాపీపిడిమీద తేకుచుట్ట...' అని రెండు చూపారు. కాని వీటికేకాక, గడలకు, గదా దండాలకు, కలశాలకు కూడా వేసే కడియాలకు పొన్నులకు కూడా వర్తిస్తుంది.

'అనుసుల కోలలు ననుసుల మొగడ
లనుసుల సందుల జను లొకులములు.'
'అనుసుల కలశము లమరులాగుడములు.'
పండి. పర్వ. పుట 26.

ఈ అనుసులు కేవలము గుండ్రముగానే కాక, మొగ్గలవలె, కలశములవలె ఉండెడివని పైవానివలన తెలుస్తున్నది.

అణుసు 'క్రిందనే– అనుసు' రూపాంతరమని చూపిన—సరిపోవును.

అల్ల నేరడు

'అల్లగిన్ని– అల్లోనేరేడు–' అని 12 వ పుటలోను—' నేరడి. నేరడు, నేరేడి' రూపాలిచ్చి 244 వ పుటలో, 'నేరేడి' క్రింద 12 వ పుటలో యిచ్చిన అర్థ విశేషాలు, వివరణ, తిరిగి యిచ్చారు. రెండు పర్యాయాలు వివరించడం -అనావశ్యకం.

'నేరెడి' క్రిందనే- అల్లోనేరేడు—చూపినట్లైయితే సరియగును. లేక 'అల్లనేరేడు'— (చూ. నేరేడి.) అనవలెను.'

ఈ అల్లోనేరేడు—అన్నది 'రాజజంబువు' అనగా శ్రేష్ఠమైన నేరేడు అనే అర్థంలో నిఘంటుకారు లిచ్చారు. కాని దీని వ్యుత్పత్తిలేదు.

పూర్వం తెలుగు దేశంలో– 'అల్లోనేరేళ్లు' అన్న పల్లవితో జానపదగేయం చాలా ప్రచారంలో ఉండేది. అది శైవసంబంధమైనది. అలం— అంటే హాలాహలం – దాన్ని నేరేడు పండులా కంఠమందు ధరించినవాడు శివుడు.

— 'పండిన నేరేడుపండు భావమున
నుండునే కుత్తుక నొరులకు విషము.'
అని పండి. పురా.శో గలదు.

అలనేరేడు- అల్లనేరేడు– అల్లోనేరేడు–అని వ్యవహారములోనికి వచ్చినది. క్రమంగా, నేరేడుపండుకు సంబంధించిన ఈ పదంమూలాన్ని 'అల్లోనేరెడు' అనేది ఒక పత్యేకమైన నేరేడుచెట్టుగా ప్రజలు భావించడం జరిగింది. పాల్కురికి సోమనాథు డిచ్చిన పై భావాన్ని, శ్రీనాథుడు భీమఖండంలోను (1—46), సంకుసాల నృసింహకవి కవికర్ణరసాయనం లోను (4—26) సరిగా అనువదించారు — తాళ్లపాక అన్నమయ్య శ్రీ వెంకటేశ్వరస్వామిని అల్లోనేరేడుపండు ఆకృతిగలవానిగా వర్ణించారు.[3]

3. 'ఈ పదాన్నిగూర్చి—1955 —జనవరి 'కిన్నెర', సంచికలో జానపద వాఙ్మయము అనే వ్యాసములో చర్చించినాను.

ఆవరణ

పర్యా — స్థలం — ప్రదేశం. — ఆవరణ అనగా, స్థలంచుట్టూ—కంచెగాని, రాళ్ళుగాని, గోడగాని నిలిపిన మధ్యప్రదేశం—ఆవరణనే ఆభరణ మని నెల్లూరిప్రాంతంలో వాడుక — ఈమధ్య 'అభరణాలు' విక్రయించారు.

ఇటిక

ఇట్టిక—రూ. ఇట్టిక శబ్దనిష్పత్తిని తెలుపుతుంది. అది 'ఇష్టిక' శబ్దభవము—యజ్ఞవేదికను కట్టుటకు మొదట యుపయుక్తములైన సామగ్రిలో నొకటి.

'ఇట్టిక సూడినవాఁడో' ఉ.హరి (3—64) అని కవి ప్రయోగమున్నది.

ఇటికసూల

'ఇట్టికబట్టీ—ఇటుకరాళ్లను కాల్చేచోటు'— తమిళమున 'సూల'అనగా ఇటికఆవము లుండే చోటు. మదరాసులో నేడు 'సూళై'అన్న భాగము ఇదే.

ఇండిపి

పర్యా — అందుగు — అని వివరాలిచ్చారు కాని 'ఇందుగు'అని గ్రాంథికరూపం. 'ఇండుగ' అని వాడుక. 'దీని గింజలు వైద్యానికి, ఆకులు పచ్చి యెరువుకు పనికివస్తాయి'అని అర్థవివరణ—కాని యిండుగపిక్క - అనగా గింజ, నీటిలో కలకను తీసేస్తుంది. ఇండుగపిక్కను రాతిమీద నీళ్లతో రాస్తే గంధంవలె జిగటపదార్థం వస్తుంది. దానిని బిందెడునీళ్లలో కలిపితే, నీళ్లలో ఏ నలుసు, మట్టిఉన్నా అడుగున తేఱిపోతుంది. నీళ్లు స్వచ్ఛంగా ఉంటవి. పూర్వం చెఱువులనుండి, కోనేళ్లనుండి త్రాగేనీరు తెచ్చుకొనువారు ఇండుగ విధిగా ఉపయోగించేవారు. నీటిపంపులు వచ్చిన వెనుక— పట్నాలలో లేకపోయినా, చెఱువులే ఆధారంగా ఉన్నచోట—ఇండుగ నేటికి వాడతారు. పుట. 19 లో ఈ 'ఆరోపం క్రింద— "Clearing nut plant" అని ఉండనే ఉన్నది.

ఇసక

ఇదీ సర్వేసర్వత్రా వాడుకరూపమైనా, 'ఇసుక'అనికూడా వాడుక ఉన్నట్లు 22 వ పుటలో సూచితమైంది. కవిప్రయోగాల్లో 'ఇసుము'రూపము కనబడుతున్నది.

'రాలుగుండ్లును నిమ్మ చాల దెప్పించి'
బస. పు. 64

తివిరి యిసుమున తైలంబు దీయవచ్చు—
నీతి. శ.

అయితే ఇసుక పదాన్నే శ్రీనాథ మహాకవి వాడి వ్యాప్తిలోనికి తెచ్చాడు. ఇసుము—ఇసుక అర్థాన్ని కోల్పోయినా — ఇసుమంత—అనే పద బంధంలో ఉన్నది. ఇసుము+అంత—ఇసుమంత— రవంత, స్వల్పము—అని అర్థము. ఇసుకరేణువులు మిక్కిలి చిన్నవి.

ఇరుకు

"కంచెకు వాకిలిగా నాటబడిన రెండు వంపు కర్రల మధ్య దారి" అని చిత్రం కూడా యిచ్చారు. కాని కడప, రాయలసీమ ప్రాంతాలలో ముఖ్యంగా కళింగప్రాంతంలో దీనిని "ఇరుకుమాను" అంటారు. పశువులు, కుక్కలు మొదలైనవి జొరబడకుండా ఉండే ఒక విధమైన ద్వారం. శ. ర. లో "వెలుగు లోపలికిబోవు ద్వారమునందు ఒక్కొక్క మనుష్యుడుగా సంకటపడి పోదగినట్లు నాటిన పంగకల గుంజ లోనగునది." అని కలదు. కళింగ ప్రాంతంలో పంగకు బదులుగా మధ్య నిట్టకొయ్య నిలుపుతారు. దాని ద్వారా ఒక మనిషి వెళ్లడం కష్టమే.

"మంగలము గాలి రో లిఱుకుమాని సందు" అని హంస 4 - 124 లో ఇరుకుమానుకు ప్రయోగమున్నది. ఇఱుకుమాను—బ్రౌను యిచ్చియున్నాడు.

ఈత

"దీని మట్టలు కప్పుకు, పండ్లు తినడానికి, ఎండాకులు చేపల బుట్టల అల్లకం లోను...

పవికి వస్తాయి.'' ఆకులుగల మట్టలు గుడిసెల కప్పులుగా కూడా ఉపయోగిస్తారు. ''ఈతాకుల గుడిసెలోన యినుడదయించెన్'' అన్న పమస్యా పూరణం, ఈ గుడిసెను తెలుపుతుంది.

''పూతి దరి చేల కెల్లను
వేతామెత్తంగ వలయు నెండకుముందే
తాతా! తొంగున్నావా
ఈతాకుల గుడిసెలోన ఇనుడుదయించెన్''

ఉ ప్ప రి

''ఒక కులం''—ఇది మట్టిపని వృత్తిచేత యేర్పడినది. మన్ను త్రవ్వి గోడలు మొదలైనవి పెట్టి బ్రదికేవారికి ఉప్పరలంటారు. ఈ ఉప్పర లుపయోగించే పారకు 'ఉప్పర పార' అని పేరు. ఈ పదమిందు లేదు—

'పారలు, నుప్పర పారలు.....చెక్కుడు పారలు'
వరదరాజ రామాయణము. అయో.

ఉరువులు. బ.

''ఇంటి కట్టుబడిలో వాడే కిటికీలు దర్వాజాలు మొ. న. వాటి మొత్తం''.

ఉరువులు—అంటే తయారైన రాతి కొయ్య రూపాలు.

రూపము శబ్దమే, రూపము—రూపవు—వురువు – ఉరువుగా మారినది. దేవాలయములలో ఉత్స విగ్రహాలకు ఉరువులనిపేర్లు.

అబ్జకన్య యురువేది తేజంబు నుబ్బుము
దక్కి—శ. ర. పుట--95.

ఎ ను ము

''పర్యా. ఇంప గొడ్డు''. ఎనుముకు ఈనాటికి 'ఇంప' అనే రూపం వాడుకలో ఉండడము గమనించదగ్గది. ఇది పూర్వ శాసనాల్లో ప్రయుక్తమై చాలా చర్చలకు కారణమైనది.

ఎ ల క చూ రు

''ఎలక చూరు — ఎలక పరవు''—ఈవిధంగా పదాలు 'ఎలక' ఆరోపము క్రింద చూపారు. వీనిలో దేనికి చిత్రాలులేవు. 'ఎలక' అనేది 'వెనుక' శబ్దం యొక్క అపభ్రంశ రూపం. వెనుక—వెనక—ఎనక—ఎలక. 'ఎలకచూరు' అంటే 'ఇంటి వెనక భాగమందుండే చూరు'అని అర్థం. 'ఇంటికి ముందుండేది' ''ముంజూరు''. ఇట్లే తక్కినవానికి అర్థాలు గ్రహించాలి.

'వెనకకు' 'ఎలక' అనే పదం గ్రామ్య భాషలోనే ఉంటుంది. గ్రాంథిక భాషలో ఉండదు. ఉంటే అర్థ భేదము ''మూషికము''. ఎంకి పాటల్లో వెనకకు 'ఎలక' అనే ప్రయోగమున్నది.

''ఎలక జన్మములోన ఎవరమో నంటె
సిగ్గొచ్చి నవ్వింది సిలక నా యెంకి''

హల్లైన వకారము—ఉచ్చారణలో అచ్చుగా మారి నప్పుడు—అట్టి వానిలో కొన్నింటికి మాత్రమే గ్రాంథికతావస్థ గలిగింది. వానిని కవులు ప్రయోగించారు కూడా. తక్కినవి గ్రామ్యాలే.

ఎ ం ప ర

ఈ కోశంలోనే 31 వ పుటలో ''ఎంపర. ఉ. ఎంపరి—దీన్ని వెంపలి అని కూడా అంటారు'' అని యున్నది. 'వ' కారము క్రింద 'వెంపలి' లేదు. ఈ రెండింటికీ కవి ప్రయోగాలున్నవి. ఈ 'వెంపలి' చిన్న చెట్ల జాతిలో చేరినది. దీనిలో ''జిల్లేడు వెంపలి, జిడ్డు వెంపలి, ములు వెంపలి'' అని మూడు రకాలున్నవి. హంస. 4—10

వెలి వెంపలి, పెద్ద వెంపలి అని ఇంకా రెండు రకాలువ్నట్లు బ్రౌమ.

'ఎంపలి': ''ఏనుగు పల్లవంబిడిన యెంపలి చెట్టుకుం గట్టవచ్చునే'' పింహా, 2—26

ఏనుగుమోరపాక

''రెండు విట్రాళ్లమీద వేసిన పాక'' అని యున్నది. దీనికి చిత్రంలేదు. మోర అంటే, జంతువుల, పశ్వాదుల దీర్ఘముఖము—అని అర౦. ఏనుగు ముఖానికి, తక్కిన పోనివలెగాక, తొండము

భూమి వరకు వ్రేలాడియుంటుంది. కాబట్టి తొండ మును ఒక కాలుగా పరిగణిస్తారు. ఏను + కాల్ ఏనుకాళ్—ఏనుగఅయినది. ఐదు కాళ్ల జంతువు అని అర్థం. ప్రస్తుతం ఏనుగుమోరపాక అంటే ఏనుగుముఖంవలె, పాకకు రెండు నిట్రాళ్లపై యుండే భాగమేగాక, ముందుకు, ఒక నిట్రాడుపై ముందుకు వచ్చే భాగముంటుంది. అట్లు ముందుకు పొడుచుకొని వచ్చే పాకకు ''ఏనుగుమోరపాక'' అని పేరు.

కవరు

''క్రలకు చివర సహజంగా ఏర్పడే పొయ'' అని అర్థమున్నది. కాని సరికాదు.

'కవరు' అనగా 'పై కప్పు'. ఇంగ్లీషు 'కవరు' వేరు.

''గట్టి మ్రాకులు దెచ్చి కవరు లేర్పరచి
వాసంబు లెత్తి''వ. రా. అయో. పంక్తి 5672.

కొణతము

ఈ పదంలేదు. కొయ్య కొణతం—అని కళింగంలో వాడుక. కుక్కను కట్టే కొయ్య, మల్లు లుపయోగించే కొయ్యగదకు ఇది వర్తిస్తుంది.

''కొణతంబు విప్పిన - కుక్క''—వేణుగోపాల శతకము.

కొణిగె

ఈ పదం లేదు. ముంజూరు.

''కొణిగఁ బారావత కులము దనర''
పా 6—50.

కొడవలి

కుడగు (Coorg) దేశపు వంక కత్తి.

కొమ్మ

''చెక్కమీద చెక్కిన తీగె'' అర్థం. కాని కోట బురుజులకు కొమ్మ లంటారు.

''కుంకుమ ద్రవమున కొమ్మ దీర్చి''
భీమ. 5—101

కొలకొండ

ఈ పదం లేదు. భూమిని త్రవ్వినప్పుడు త్రవ్విన లోతు తెలియుటకు మధ్యను చిన్న పర్వతాకారమున నిలిపిన గుట్ట.

కుతలంబు నడుకొన కొలకొండగా నిల్పి
శరనిధి గ్రొచ్చిరి సగర సుతులు
కు. సం. 1—52

కొల్లారము

ఈ పదం లేదు. 'చ' (149 పుట) లో ''చుట్టు కొలారం గుండ్రటి పెంకు కప్పు''—అని అర్థమున్నది. కాని దీని స్వరూపం సరిగా వ్యక్తము కాలేదు.

కొల్లారము అనగా నడుమబయలుగా చుట్టును నాలుగు ప్రక్కలను కనబడు స్తంభములపై గుండ్రముగా నున్న యిల్లు. దీనినే చుట్టుకొల్లారమందురు.

''చూపుడు కంబంబు చుట్టు కొల్లారు''
శ. ర. సారం.

గోడిపీట

'కొయ్యల శోకముల్ గోడిపీట'
కు. సం. 4—83

కుమారసంభవమున—నీ పద్యమున రథ నిర్మాణమునకు కావలిసిన పరికరములన్నియు తెలుపబడినవి. అవి ప్రాయికముగా దేశిపదములు.

సాహిత్యంలో ప్రచారంలో ఉండి ఇందు విడిచిపెట్టిన కొన్ని పదాలు మాత్రమే.

కాలుకంబము

తలుపు అమర్చబడు ప్రక్క ద్వారబంధము:
It is the side post of a door. (బ్రౌ).
''మరుఁడు శృంగార వీథి వేర్పఱచి తనదు
పేర నొక పేటఁ గట్టి సంప్రీతి తోర
ణాల నుంచిన కాలుకంబాలనంగ
కలికి యూరులు చెలఁగు పై కాంచి మెఱయ'
బిల్హ. 2—154.

స్త్రీ ధరించిన వడ్డాణము తోరణమువలె నున్నదని ఆ తోరణము కట్టుటకు నిలిపిన రెండు కొయ్య స్తంభాలవలె కాలుకంబాలవలె, ఆమె తొడలున్నవని కవి చమత్కరించినాడు.

ఊరువులను స్తంభాలుగా కవులు వర్ణించడం పరిపాటి.

"స్మర మందిరమ్ము శోభా
కరముగ మెఱుగారు పసిడి కంబములనఁగా
కరభోరులు ఒలుచు
(కు. సం. 3.31)

గడ్డిగబావులు

ఏతాముగల నూతులు. చుట్టూ గట్టులేనివి.
"గడ్డిగ బావుల గని యుర్కు వారు"
బ. పు. 216.

గవను

బ. గవకులు. కోట ద్వారములు.
పవడంపు జివురుల గవకు లుత్పాదించి
తమ్మిరేకుల బోరు తలుపు లెత్తి
భీమ. 5—101


గాలిగోపురము

గాలిమంటపము; దేవాలయము ముందుద్వారముపై నుండు మంటపముపై గోపురము.

'గాలి మంటపము ప్రాకారంబు లోవలు'
హంస. 1—180

నిత్యవ్యవహారములో గాలిగోపురమే. మంటపమున్నగాని గోపురము కట్టుటకు వీలులేదు.

వసతిఇల్లుగాక — సర్వప్రజానీకానికి తెలిసిన కట్టడం దేవాలయం. కనుక వాస్తుశాస్త్రంలో దానికి చాలా ప్రాధాన్యతయున్నది. అయితే సామాన్య ప్రజలకేమి సంస్కారులకేమి ఆ దేవాలయ వాస్తువుకి సంబంధించిన పదాలు—కొన్ని మాత్రమే వాడుకలో నుండును. మన కావ్యాలలో దేవాలయ వాస్తువునకు సంబంధించిన వివరాలున్నవి.



హంసవింశతిలో దేవాలయవాస్తువునకు సంబంధించిన పై విషయాలు ఒక్క సీసపద్యంలో ఉన్నవి.

సీ. డంబైన గర్భగృహంబు తరాళికం
బును ముఖమంటపంబునుఁ జెలంగ
గాలిమంటపము ప్రాకారంబు లోవలు
బోదెలు చుట్టలు పొందు పడఁగ
గప్పట చప్పటల్ ఘనగోపురంబులు
జగతియుఁ జట్టముల్ సొగసు దనర
గచ్చుగోడలు రాతికంబము ల్వాలను
న్నము సువర్ణద్వార సమితి వెలయ
దృష్టిపాత్రపు బొమ్మలు తేజరిల్ల
నుఱుకుసింగంబు లరగూళ్లు మెఱుఁగు దోర
ణములు చిత్త్రర్వు క్రొంబనుల్ రమణ కెక్క
దేవళము మించె నత్యంత దివ్యమగుచు.

సుకనాసి, సొకనాసి

'సుక్కుచు షట్టగున సొకనాసి వెడలి—

సుకనాసి, సొకనాసి రెండు రూపాలు శాసనములలో ప్రయుక్తము.

పై పద్యములో కొన్ని పదము లీ కోశమున లేవు. వాని వివరణ కవకాశము లేదు.

తమగము

An Open Building. మంటపము.

తప్పు జల్లలు బెట్టి తమగంబు క్రింద
పాతర ద్రవ్వించి—పల. చ. ప్రౌ. 1253 పుట.

దాయి

ఇనుము సాగగొట్టుటకు క్రిందనుంచిన రాతిదిమ్మ.

"గరళపుముద్ద లోహ మవగాఢమహాశని
కోట్లు సమ్మెటల్
హరు నయనాగ్ని కొల్మి యరగాధిపు కోరలు
పట్టుకార్లు ది
క్కరటి శిరంబు దాయి'—భీమకవి చాటు ధార.

నడబావి

దిగుడు బావి. నడచిపోవుటకు మెట్లేర్పరచిన దారి.

"లోతుగా నడబావి లోన గట్టించి"
బ. 64 పు.

బాడిద

వడ్రంగి కఱ్ఱ చెక్కెడు సాధనము—నేటికి వ్యవహారములోఉన్న యీ పదం విడిచిపెట్టడం చిత్రం.

బాడిత—బాడిద—బాడిస అను రూపాంతరా లున్నవి.

"రెండు చేతులు గట్టి......
దాతిపై నిడి బాడితయు నెత్తివూచి
మది వ్రేయ దడవ మణికట్టులకు దెగి
మది మిట్టి పడియె—పండి. పురా. 103 పు.

బొడ్డనబావి

నడుమ పిల్లనుయ్యి గల బావి.

"కేళాకూళుల బొడ్డన బావుల"
ప్రభా. 1—121. శ. ర.

ముంగిసమాను

చేతితో నీరు తోడే ఏతాము. చేయేతము.

ముంగిసమాను దోనానియుండఁ
గుండ నిండారఁగాముంచి
హంస. 1—129

ముంగిసమాను అంటే ముంగిస రూపంగా ఉండే ఏతాము గడ. దీని స్వరూపం వివరంగా హంస వింశతిలోనున్నది.

ఈ ద్రానికి చివర వెదురునకు కుండ కట్టి యుంటుంది. ఆ వెదురునకు ఒక తోలుపటకా (వారు) క్రిందవఱకుఉండి ఒక దగ్గఱ మీటవలె అమర్చబడి ఉంటుంది. ఆ మీటా నొక్కగానే వారు క్రిందికి దిగి వెదురుకుండ భావిలో నీరునింపుకొని పైకి వస్తుంది. తోడ నవసరము లేనప్పుడు నారు మీటకు తగిల్చి ఉంటుంది.

ఒక నక్క యిది తెలియక ఆ నారు కుండలో నీరుంటుందని కొఱికింది. వెంటనే గెడ నూతిలోనికి కుండతోగూడా పడ్డది. నక్క ఆ కుండతో నీటిలో పడిపోయింది.

మెత్తు

ధాన్యమును గుమ్మలలో పోసి గడ్డి కప్పి దానిమీద పేడతో కలిపిన మట్టి మెత్తుట. ఆ మెత్తును ఎలుకలు కొట్టకుండ ముండ్లు గల రేగు కలపను పఱిచెదరు.

గుమ్మలలోనుండిధాన్యము తీయునపుడు దీనిని తీసివేయుదురు.

సీ. "మూసి ముల్లడచి గుమ్మలకొల్పు పైమెత్తు
లూడ్చుడు పసైన నుండుగాని"
పాండు. 4—149

మ్రేగుడు

ఇల్లలికి దానిపై పేడ మన్ను పూయుట. ఇచ్చట 'అలుకుట' అనగా నీరు చల్లుట, ఆపైన దానిపై పేడ, మన్నుతో పూతపెట్టుట. దీనికే 'మెఱుగు' పెట్టుట అని వ్యవహారం. "ఇల్లలికి మెఱుగుపెట్టావా" అని వాడుక—'మెఱుగు' మ్రేగుగా మాఱినది. (వర్ణ విప్లతి)

(ఎఱుక—ఱెక, అయినటు)

శ్రీనాథుడు కాశీఖండంలో దీనిని స్పష్ట పఱిచినాడు.

మృదుల మృత్పిండ ఖండంబు ప్రేగి ప్రేగి
కాశీ. 5—45

శివ దేవాలయ ప్రాంగణాల్లో పూర్వం— కస్తూరి అలికి మెఱుగు పెట్టేవారు. అది ఒకరి వృత్తి.

కస్తూరిప్రేంక యుద్ఘటయ్యియును.

ప్రేంగు కృదంతము ప్రేంక. కాంగు శబ్దము కాంక అయినట్లు.

ఈ వృత్తిని వాగులూటి శేషనాథుడు శ్రీపర్వతపురాణంలో కూడా సూచించాడు.


''మలహరు గుడి గోమయమున
నలికిన మర్త్యుండు నలుకునట కస్తూరీ
మలయజపంకము దివిష
జ్జలజాయతలోచనాకుచద్వయపీఠిన్. 4 ఆ.

మన కావ్య ప్రబంధాలు, ఏ రీతిగా వృత్తి పదకోశ నిర్మాణానికి తోడ్పడగలవో సూచించుటకే యీ విమర్శ. దిఙ్మాత్రము.

అకాడమీవారు పై శాస్త్ర గ్రంథములకు సాంఘిక శాస్త్ర కావ్యములకు పదకోశములు నిర్మించు ప్రణాళికను వెంటనే అమలు పఱచి, ''తెలుగులో శాస్త్రవాఙ్మయము లేదు'' అన్న అపవాదును తొలగింతురుగాక!

జ్ఞాపిక. వ్యాసములో ఉదాహరించిన కావ్యాలు ప్రసిద్ధమే కాబట్టి పూర్తి పేరీయలేదు.

[మాండలికవృత్తిపదకోశము — చతుర్థ సంపుటం; వాస్తుపదజాలం; సంకలనకర్త, సంపాదకుడు—శ్రీ బూదరాజు రాధాకృష్ణ; ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ; హైదరాబాదు-4 వెల: రు. 50—00 లు.]



వయొ నాయ్

శ్రీ వేగుంట మోహనప్రసాద్

నదీప్రవాహంలో కొట్టుకొని పోతున్నై
స్త్రీ పురుషులు లాగ
వయొలిన్ షహనాయ్‌లు
ఉద్వృత్త సంగీత తరంగాలలో.
నాకవి మహావిషాద ఛాయలు
విషాదంలో ఉన్న ఆనందాన్ని ఒకడూ వినడు!

జీవన స్రవంతిలో
విడిపోయిన ఆమె పొడుగాటి జడపాయ లేవీ
పురుష హస్తాలకి అందవు.
దుఃఖాన్ని చిమ్ముతున్న సంగీత స్రవంతిలో
ఆ వినీలకేశ తరంగాలు తేలిపోతూ ఉంటై.
షహనాయ్ అదృశ్య ప్రకంప హస్తాలు
ఆమె చేలాంచలాన్ని
ఎప్పటికీ అందుకోలేవు.

వయొలిన్
శూన్యంలో శూన్య నీల జలంలో
చీకటిలో చీకటి నీళ్ళల్లో
నల్లని ఆకాశం మీద
కమాన్‌తో గీస్తున్న వెలుగుగీత మెరపులో
ఇంకెక్కడా కూడ
పురుషుడామెను అందుకోలేడు.

అలా అలాగా కొట్టుకొని పోతూనే
ఎన్నో యుగాంతరాలు

ఆ నది అలా ప్రవహిస్తూనే
ఎన్నో దేశాంతరాలలో
కేవలం భావం ఒక్కటే మిగుల్తూ
ఆ చీకటే అప్పుడప్పుడు జాలిగా మెరుస్తూ
ఏక దేహమైన నదిమాత్రం మిగుల్తుంది.

షహనాయ్ ఎక్కువ విషాదం పల్కుతుంది,
లోక హృదయ దుఃఖ నాళాలలోకి రాగాలు సాగుతూ,
హృద్గగన సీమలలో ఉండుండి ఎర్రగా మెరుస్తూ.
వయొలిన్ విషాదం వ్యక్తిగతం.
తా నొక్కటే నదిలో కొట్టుకొని పోతూన్న దుఃఖం,
షహనాయ్‌కి విషాదం
గుండెల్లోంచీ ఊపిరి లోంచీ.
వయొలిన్‌కి ప్రకంపహస్తాలమీంచి.

ఆమె చివరకి నది అంచులమీద వొదిలిన వస్త్రాలని చూచిన
ఆపుకోలేని విషాదం
ఇక నా విషాదాన్ని నదిమీంచి సముద్రాలలోకి
అక్కడ్నించి ఆకాశం అంచులకి
బూరగ ఊదుతుంది.

షహనాయ్‌కి వెతుక్కుంటూన్న విషాదం.
ఆమె కోసం.
ఆమెకోసమని గాలిలోకి
ప్రాకి పోతుంది.
ఆవిరవుతుంది.
మెలి తిరుగుతూ
నేల రాలుతుంది,
సముద్రగర్భాన్ని చీల్చుకుని చివరకి.
విన్నెట్లా రక్షించేది
ఏగాలి మహాలల్లో ఉన్నావో

వ యా నా య్

నిన్నెట్లా పొదువుకోను
ఏమని నీకై వెతకను
ఏ నీటి బుడగల్లో ఉన్నావో నీవు
ఏగాలి మాలలు నీలో పగిలినవో
అని షహనాయ్‌కి వేదన.
వయొలిన్‌కి రక్షించమనే ఆవేదన.

సాగరంలో వయొలిన్ లీనమై పోతుంది.
ఇకనా ఒంటరి షహనాయ్
పహాడీ ధున్ రాగంలో
సముద్రం ఒడ్డున చతికిలపడి ఏడుస్తూ
తన దీనాలాపన
అలల నురగలలో కలుపుతుంది.
అలల బుడగలు పగిలిపోతయ్
గాలి అడుగులుపడి.

ఆ కరుణరసానందాన్ని భరించలేక
మనం బాసీ పెట్లేసుకు కూర్చుని
కన్నీళ్లతో తల లూపుతూ
తొడలమీద చేతులతో తాళం వేస్తుంటాం.

— — —



కాకతి రెండవ ప్రతాపరుద్రుని తల్లిదండ్రు లెవ్వరు?

శ్రీ సి. బి. వి. అప్పారావు

కాకతీయాంధ్రుల చరిత్రలో నిప్పటికిని పరిష్కారముకాని కొన్ని ముఖ్య సమస్యలు గలవు. అందులో 'కాకతీయ రెండవ ప్రతాపరుద్రుని తల్లి దండ్రు లెవ్వరు? ఏ వంశమునకు జెందినవారు? అనున దొకటి. కాకతీయాంధ్ర రాజులను గురించి తెల్పు శాసనము లెన్నియో బయల్పడినప్పటికిని యీ సమస్య క్రమ పద్ధతిలో పరిష్కరింపబడలేదు. అట్టి ప్రయత్నమే యీ వ్యాసోద్దేశ్యము.

కాకతీయాంధ్ర రాజుల పరిపాలన మొదటి బేతరాజుతో క్రీ. శ. 1000 సం. ప్రారంభమై క్రీ. శ. 1323 న రెండవ ప్రతాపరుద్ర చక్రవర్తితో అంతమయ్యెను. ఈ వంశములో గణపతి దేవ చక్రవర్తి ఎనిమిదవవాడు. ఈ రాజు క్రీ. శ. 1199 నుండి క్రీ. శ. 1261 వరకు సుదీర్ఘ కాలము పరిపాలించెను. అయితే గణపతి దేవునకు పురుష సంతానము లేదు. అందువలన కాకతీయ వంశ మంతటితో అంతమయ్యే పరిస్థితిని తప్పించుటకు తన జ్యేష్ఠ పుత్రికయగు రుద్రమదేవినే కుమారునిగా భావించుకొని రుద్రదేవుడను పురుష నామముతో పరిపాలనయందు తగిన శిక్షణ నిచ్చి తాను బ్రతికి యుండగానే ఆమెకు యువరాజ పట్టాభిషేకము గావించెను. అందువలన ఆమె అప్పుడప్పుడు పురుష వేషముతోనే కొల్వుకూటమున కేతెంచి, మంత్రులతో రాజ్యాంగ విషయములను ముచ్చటించుచుండెడిది.

అయితే, గణపతి దేవుడు తాను జీవించియుండగానే రుద్రాంబకు వివాహము జేసెను. ఆమె భర్త చాళుక్య వంశమునకు జెందిన ఇందుశేఖరుని పెద్ద కుమారుడగు వీరభద్రుడు.1 వీరి రాజధాని గోదావరి మండల మందలి తణుకు తాలూకాలోని నిరవద్య పురము. ఆ దంపతులకు గణపతిదేవుడు జీవించి యుండగానే ఉద్భవించిన కుమార్తెలలో పెద్ద కుమార్తె ముమ్మడాంబ. ఆమె కుమారుడే కాకతి (రెండవ) ప్రతాపరుద్ర చక్రవర్తి; రుద్రాంబతర్వాత కాకతీయ సామ్రాజ్యమును పరిపాలించినవాడు. ఈ మహారాజు తల్లి ముమ్మడాంబయని నిర్వివాదముగా నిశ్చయమైనను తండ్రి విషయములో ఏకాభిప్రాయము కుదరక విమర్శకులలో భేదాభిప్రాయము లేర్పడి తీవ్రమైన వాదోపవాదములకు దారితీసెను.

ఈ ప్రతాపరుద్రుడు కాకతీయ వంశమువాడని ఇతని తల్లిదండ్రడులు ముమ్మడాంబ మహాదేవరాజు లని ప్రతాపరుద్రీయమను అలంకార శాస్త్రమును రచించిన విద్యానాథు డా గ్రంథములో కంఠోక్తిగా జెప్పెను.

> కౌసల్యా సీ త్ప్రథమ జననీ
> దేవకీ చ ద్వితీయా
> విష్ణో ర్మాతా తదను మహితా
> ముమ్మడాంబా తృతీయా
> య స్త్రేతాయాం రఘుపతి ర
> భూ ద్ద్వాపరే శౌరి రాసీ
> ప్రాత్తుం క్షోణీం సా జయతి కలౌ
> వీరరుద్రావతారః2.

(శ్రీ విష్ణువునకు మొదట గౌసల్యయు, బిమ్మట దేవకియు, వెనుక ముమ్మడాంబయు తల్లులైరి.

ఆతడును త్రేతాయుగమున రాముడును, ద్వాపర యుగమున కృష్ణుడును, కలియుగమున వీర రుద్రుడుగను నవతరించెను.)

అని చెప్పుటలో విద్యానాథుడు ప్రతాపరుద్రుని తల్లి ముమ్మడాంబయని స్పష్టపరచెను. ఇక తండ్రి విషయములో

"మురారే ర్యః పూర్వం జలనిధి
సుతాయా ము దభవ
న్మహాదేవా జ్జాత స్స పున రవనీ
భృద్దుహితరి
వపుష్మాన్కామోయం జయతి
జగతీ భాగ్య విభవైః
ప్రతాప శ్రీ రుద్ర స్స్వయమితి
మనీషా మృగదృశాం"[3]

(పూర్వము మురారి యయిన శ్రీ విష్ణువునకు లక్ష్మీదేవియందు బుట్టిన మన్మథుడే నేడు మహాదేవునకు రాజపుత్రికకును జన్మించి ప్రతాపరుద్రుడనుపేరుతో సర్వ వైభవముల ననుభవించుచున్నాడు.)

అని అతని తండ్రి మహాదేవు డనునది గూడ స్పష్టపరచెను. అయితే యీ ముమ్మడాంబ భర్తయగు మహాదేవరా జెవరి కుమారుడనునది విద్యానాథుడు స్పష్టపరచక నిగూఢముగా వదలివేసెను. ఆ కారణముననే యీ మహాదేవరాజు వంశ విషయములో చారిత్రక విమర్శకులలో తీవ్రమైన భేదాభిప్రాయము లేర్పడి ఎన్నో వాదోపవాదములకు దారితీసి ఇప్పటికిని అపరిష్కారముగానే విడువబడెను

ఆ వాదములలో ముఖ్యమైనవి

1. 1935 లో ఆంధ్రేతిహాస మండలివారు ప్రచురించిన 'కాకతీయ సంచిక'లో దాని సంపాదకులు ప్రతాపరుద్రుని తల్లి దండ్రులను గూర్చి చర్చించు సందర్భములో విద్యానాథుని పై శ్లోకముల నాధారముగా తల్లి ముమ్మడాంబ యనియు, తండ్రి మహాదేవరాజని చెప్పి "ఈ మహాదేవరా జెవ్వరో నిర్ణయించుట కింతవరకు సరియైన యాధారములు గానరావు" అని వ్రాసి దక్షిణ హిందూదేశ శాసన సంపుటములలో ప్రచురించిన నిడుదవోలు పాలకులైన చాళుక్య వంశీయుల శాసనములను ప్రస్తావించి, వాటి ననుసరించి ప్రతాపరుద్రుని తండ్రి ఆ చాళుక్య వంశములో క్రీ. శ. 1218—1228 మధ్య రాజ్యమేలిన మహాదేవుడేయై యుండనోపు నను నూహను కలిగించి అట్లు నిర్ణయించుటలోనున్న ముఖ్య ప్రతిబంధకమును జూపి ఇదమిద్ధమని నిర్ణయింపక విడిచిపెట్టిరి. వారు అభ్యంతరముగా జూపిన కారణము చాళుక్యాన్వయుడైన వీరభద్రునికి (కాకతీయ రాజపుత్రికయగు) చాళుక్య రుద్రమదేవికిని కూతురగు ముమ్మడాంబ తానును చాళుక్యాన్వయుడగు మహాదేవరాజు నుద్వాహమగుట విహితముగ గన్పట్టుట లేదనుట.[4]

2. 1936 లో కాకతీయాంధ్ర రాజయుగ చరిత్రను వ్రాసిన చిలుకూరు వీరభద్రరావుగారు ప్రతాపరుద్రీయములో జెప్పిన విషయములను, కొలను గణపతి దేవుడు వ్రాసిన 'శివయోగసార' మను గ్రంథావతారికలో ముమ్మడాంబను గురించి చెప్పిన విషయములను సమన్వయ పరచు ప్రయత్నములో ప్రతాప రుద్రుని తండ్రియగు మహాదేవరాజు రుద్రమదేవి మరదియు, నిరవద్యపురాధీశ్వరుడును చాళుక్య విష్ణువర్ధన వంశీయుడును నగు మహాదేవుడై యుండునని దక్షిణహిందూదేశపు శాసన సంపుటములలో నిరవద్యపురాధీశ్వరులకు సంబంధించిన ఎనిమిది శాసనముల నాధారముగా విపుల చర్చలు జేసి నిడుదవోలు చాళుక్యరాజులలో లక్ష్మాంబ భర్త యగు మొదటి మహాదేవుని పెద్ద మనుమడైన వీరభద్రుడు రుద్రమదేవిభర్త యనియు, రెండవ కుమారుడు మహాదేవచక్రవర్తి రుద్రాంబ కూతురగు ముమ్మడాంబ భర్తయనియు వీరి పుత్రుడే కాకతి ప్రతాపరుద్రుడని తేల్చిరి. వీరి చర్చల ఫలితమీక్రింది విధముగా జూపవచ్చును.[5]

నిడుదవోలు చాళుక్యరాజులు

మహాదేవరాజు I (భార్య లక్కాంబ)
|
ఇందుశేఖర నరేంద్రుడు (భార్య ఉదయాంబ)
|
వీరభద్రుడు (భార్య రుద్రాంబ) — మహాదేవ చక్రవర్తి (భార్య ముమ్మడాంబ)
|
(కొడుకు) కాకతి ప్రతాపరుద్రుడు

చిలుకూరు వీరభద్రరావుగారు తేల్చిన నిర్ధారణలో రెండు అసంగతములు ప్రస్ఫుటముగా కాన్పించుచున్నవి. అవి:

(1) తల్లికూతుళ్లిద్దరు ఒకేవంశములోని ఏకోదరులైన అన్నదమ్ముల నుద్వాహ మాడుట మొదటిది. దీనిని వీరభద్రరావుగారు కొలను గణపతి దేవుడు రచించిన 'శివయోగ సారము'ను గ్రంథా గ్రంథావ తారికలో

చ. "అకుపిత రుద్రమాంబికకు
నాత్మజనా బొగడొందు ముమ్మడ
య్యకు మహదేవరాజునకు
నాత్మజుడైన ప్రతాపరుద్రు డా
సకల మహీభరంబును
వెసన్ దమయంత (వహించి) దాల్చె నా
యక మహిమంబులన్ దొరిగె
యన్నయ దేవుడు రుద్రదేవుడున్"[6]

అని ఇందులూరి అన్నయ మంత్రిని గురించి చెప్పు సందర్భములో వ్రాసిన పద్యము నాధారముగా ముమ్మడాంబ రుద్రాంబకు కన్నకూతురు కాదు గనుక అట్టి వివాహము ఆక్షేపణీయము కాదని సమర్థించిరి. కాని అది సరియైన నిర్ణయము గాదు. ముమ్మడాంబ రుద్రాంబకు కన్నకూతురని చాలినంత శాసన సాక్ష్యమున్నది.

(ఎ.) శ. స. 1214 నాటి(క్రీ.శ. 1292) రాజరుద్రుని గోరవెంకపల్లి దాన శాసనములో 8, 9, శ్లోకములలో[7] ప్రతాపరుద్రుడు రుద్రాంబ "తనూజా తనయః" అని చెప్పబడెను. శ. స. 1178 (క్రీ. శ. 1256) నాటి పానుగల్లు[8] శిలా శాసన మొకదానిలో రుద్రాంబకు ప్రతాపరుద్రుడు "తత్పుత్రీ తనయః" అని పేర్కొనబడెను. వీటి కన్నను బలవత్తరమైన సాక్ష్య మింకొకటి గలదు. ప్రతాపరుద్రుడు శ. స. 1216 (క్రీ. శ. 1294) నాడు తాను వ్రాయించిన 'అనంతపురం'[9] తామ్ర శాసనములో తన తల్లి "ఉమాంశ సంభవయగు ముమ్మడాంబ" యని చెప్పుకొనెను. కాన వీటన్నిటిని బట్టి ముమ్మడాంబ రుద్రాంబకు జన్మించిన కూతురేగాని శివయోగసారములో చెప్పినట్లు 'కూతురువంటి' దనుట ప్రమాదకరమైన విషయము.

(2) ప్రతాపరుద్రుని తల్లి దండ్రులు చాళుక్య వంశమునకు జెందినవారేయైన ప్రతాపరుద్రుడు గూడ చాళుక్య ప్రతాపరుద్రుడే కావలయును గాని కాకతి ప్రతాపరుద్రు డెన్నటికిని కాడు. కాజాలడు.

3. ఆంధ్ర రచయితల సంఘము 1960 లో ప్రచురించిన కాసె సర్వప్ప ప్రణీతమైన శ్రీ సిద్దేశ్వర చరిత్ర యను కాకతీయ రాజుల చరిత్రకు ఇంగ్లీషులో పీఠిక[10] వ్రాసిన ఖండవల్లి లక్ష్మీరంజనంగారు గూడా ప్రతాపరుద్రుని తల్లిదండ్రుల విషయమును చర్చించు సందర్భములో శ్రీ చిలుకూరు వీరభద్రరావుగారి అభిప్రాయమునే స్వీకరించి ముమ్మడాంబ భర్త చాళుక్య వంశమునకు జెందిన మహాదేవరాజేనని నిర్ధారించిరి.

పై విధముగా కాకతీయ రాజుల చరిత్రను తడివిన ప్రముఖ గ్రంథకర్తలు, విమర్శకులు కాక

తీయ రెండవ ప్రతాపరుద్రుని తండ్రి మహాదేవ రాజనియు, అతడు చాళుక్య వంశీయుడనియు నిర్ధారించిరి.

కాని యీ నిర్ణయ మెంతమాత్రము చారిత్రక సత్యము కాదని యీ క్రింది కారణములు నిరూపించును.

(1) కాకతీయ రెండవ ప్రతాపరుద్రుని తండ్రి నిజముగా చాళుక్య వంశీయుడే యైన కాకతీయ రాజ వంశము గణపతిదేవునితోనే అంతమై ఆతని తర్వాత చాళుక్యవంశమువారుకాకతీయరాజ్యపాలకులై యుండ వలసినది. కాని అట్లు జరిగినదని చారిత్రక సాక్ష్య మెక్కడను దొరకదు.

(2) ప్రతారుద్రుని పరిపాలన కాలములో ఆ రాజు, ఆయన సామంతులు, ెంకలు వేయించిన ప్రతిశాసనములోను ప్రతారుద్రుడు కాకతీయాన్వయుడనే చెప్పబడెను. ఏది ఏమైనను, ఒకని వంశము తండ్రినిబట్టి నిర్ధారించుట లోకప్రసిద్ధి కాబట్టి ఎన్ని విధముల జూచినను కాకతి ప్రతాప రుద్రుని తండ్రియగు మహాదేవరాజు కాకతీయ వంశమునకు జెందినవాడై యుండుట కెట్టి సందేహమును లేదు. అయితే ఆ మహాదేవరాజు కాకతీయ వంశములో ఎవరి కుదిటిలోని కుటుంబము వాడను నదే ఇప్పుడు తేల్చవలసిన విషయము.

కాకతీయ వంశములో క్రీ. శ. 1097—1158 వరకు వోరుగల్లు రాజ్యమును పరిపాలించిన రెండవ ప్రోలరాజుకు చరిత్ర కెక్కిన రుద్రరాజు, మహాదేవరాజుగాక ఇంకను కుమారులున్నట్లు కాకతి గణపతిదేవుని ఏకామ్రనాథ శాసనములో[11] చెప్పబడెను.

శ. స. 1085 (క్రీ. శ. 1163) నాటి ద్రాక్షారామ భీమేశ్వరాలయములోని కాకతి దుగ్గరాజు భార్య బొప్పాదేవి వేయించిన శాసనములో[12] తాను ప్రఖ్యాతానుమకొండ ప్రోలనృపతి పుత్రుడగు దుగ్గభూపాలుని భార్యనని చెప్పుకొనెను. శాసన కాలమునుబట్టి దానిలో చెప్పబడిన ప్రోలరాజు కాకతి రాజ్యమును క్రీ. శ. 1097—1158 మధ్య పాలించిన రెండవ ప్రోలరాజు. కర్నూలుజిల్లా త్రిపురాంతకములోని యొకానొక శాసనములో ఆ ప్రోలరాజుకు ఇంకను ఇద్దరు కుమారులు గలరని చెప్పబడెను[13]. పై మూడు శాసనములలో చెప్పబడిన ద్వితీయ ప్రోలరాజు కుమారుల నీ క్రిందివిధముగా జూపవచ్చును.

కాకతి రెండవ ప్రోలరాజు (క్రీ. శ. 1097 –1158)

రుద్రరాజు (క్రీ. శ. 1158-1195)	మహాదేవరాజు (క్రీ. శ. 1195–1199)	దుగ్గరాజు	హరిహర	గణపతి

వీరినేగాని,లేక వీరిసంతతివారినిగాని విద్యానాథుడు ప్రతాపరుద్రీయ ములో 'కాకతీయకుల వృద్ధు' లని యొకచోట తెల్పియున్నాడు. ప్రతాప, సిద్ధేశ్వర చరిత్రములలో రుద్రాంబ సవతి సోదరులుగ హరిహర, మురారి దేవులను వారు పేర్కొనబడిరి[14].

పై వారిలో మొదటివాడు రుద్రదేవుడు క్రీ. శ. 1158—1195 వరకును, రెండవ కుమారుడు మహాదేవరాజు క్రీ. శ. 1195—1199వరకు కాకతీయ సామ్రాజ్యమును పాలించినట్లు చరిత్ర తెల్పుచున్నది. మూడవవాడు దుగ్గరాజు. ఇతడు రేపల్లె ప్రాంత పాలకుడుగా నున్నట్లు ఆయన భార్య బొప్పాదేవి ద్రాక్షారామ భీమేశ్వరాలయ శాసనమును బట్టి తెలియుచున్నది. హరిహర, గణపతులు మిగిలిన ఇద్దరు కుమారులు. కాని వీ రే ప్రాంతమున కధిపతులో నిర్ధారించుట కింకను ఆధారములు దొరుకలేదు.

అయితే కాకతి ప్రతాపరుద్రుడు, తన తండ్రి యైన మహాదేవరాజు కాకతీయాన్వయుడనియు, వోరుగంటిపురనివాసియనియు శ. స. 1216 (క్రీ. శ 1294) విజయ సంవత్సర మాఘ కృష్ణ చతు

ర్ధశినాడు (ఇప్పటి మైసూరు రాష్ట్రములోని నెల మంగలము తాలూకాలోని) కకుద్గిరి క్షేత్రమునకు మహారాజ బిరుదులతోను నించుమించుగ చక్రవర్తి స్థాయిలోను మంత్రి పురోహితులతోను మహా వైభవముగా తీర్థయాత్రకు వెళ్లి అచ్చట నొక గ్రామమును ''అనంతపుర''మను నామముతో అగ్రహారముజేసి బ్రాహ్మణులకు దాన మిచ్చి వ్రాయించిన తామ్ర శాసనములో చెప్పుకొనెను. ఆ శాసనములో తన తల్లిదండ్రుల విషయములో ఇట్లు వ్రాయించెను:''ఆంధ్రదేశ ధరాపద్మ మధ్యస్థ కోశమువలె నున్నదియు, సౌధమాలా విరాజితమైనదియు,ఉద్యానవన శతములతో నొప్పినట్టిదియు నగు నోరుగంటిపురములో కాకతీయ వంశ దుగ్ధాబ్ధి చంద్రుడును సర్వగుణోపేతుడునునగు మహాదేవరాజు నివసించుచుండెను. అతనికి ఉమాంశ సంభవయగు ముమ్మడాంబయను భార్య యుండెను. ఆ దంపతులకు మహాదేవ ప్రతాపరుద్రుడు జనించెను''[15]. తర్వాత శ్లోకములలో అతని ప్రతాపాదులు, దిగ్విజయములు వర్ణింపబడెను.

కాబట్టి ఇప్పుడు నిస్సందేహముగా కాకతి రెండవ ప్రతాపరుద్రుని తండ్రి కాకతీయాన్వయుడేనను నిర్ధారణ కెట్టి ప్రతిబంధకము లేదని చెప్పవచ్చును. ప్రతాపరుద్రుడు తన తండ్రి వంశమును ''కాకతీయ వంశ''మని చెప్పుటకన్న ప్రత్యక్షసాక్ష్యమింకేమి కావలయును? అయితే యీ తామ్ర శాసనములో యీ మహాదేవరాజు తండ్రిపేరు మాత్రము చెప్పబడినట్లు లేదు.

వెనుకటి శతాబ్దములలో రాజులు గ్రామములను వారి కాపులైనవారి పుణ్యముకొరకు దానముజేయు సందర్భములలో ఆ గ్రామము స్థానికపుపేరును మార్చి ఎవరి పుణ్యమునకై ఆ దానము చేయబడుచున్నదో అతని పేరా గ్రామమునకు నిలుపుట ఒక పురాతన నాచారము. ఆ క్రమములో యీ 'అనంతపురము' ప్రతాపరుద్రుడు ఎవరిపేర దానముజేసెనో భావి పరిశోధనవలన నిర్ధారణ కావలసియున్నది.

సారాంశము

ఇప్పటివరకు చారిత్రకులు, విమర్శకులు నిర్ణయించినట్లు కాకతి రెండవ ప్రతాపరుద్రుని తండ్రియగు మహాదేవరాజు చాళుక్యవంశమునకు జెందిన ఇందుశేఖరుని ద్వితీయ పుత్రుడు కాదు. అతడు కాకతీయవంశమునకు జెందినవాడు. రెండవ ప్రోలరాజు సంతతిలోనివాడు కావచ్చును. ఏది ఏమైనను ప్రతాపరుద్రుని తండ్రి రుద్రాంబకు సవతి సోదరులలో నొకడై యుండక తప్పదు. అప్పుడు ముమ్మడాంబ (వేలువిడిచిన) మేనమామను వివాహమై ఆంధ్రుల సంప్రదాయమును పాటించుటముదాహము.

ఇప్పుడు కాకతీయుల చరిత్ర గణపతిదేవ చక్రవర్తినుండి యీ క్రింది విధముగా నుండును.

క్రీ. శ. 1199—1261 వరకు కాకతీయ సామ్రాజ్యము నేలిన గణపతిదేవునకు పుత్ర సంతానము లేదు. అందువలన తన తోడనే తన వంశ పాలన నిర్మూలము గాకుండనుండు తలంపుతో తన పెద్ద కుమార్తెయగు రుద్రాంబకు జన్మించిన కుమార్తెలలో పెద్దదగు ముమ్మడాంబను తన వంశములోనివాడును, తన పినతండ్రులైన రుద్ర, హరిహర, గణపతు లనువారి వంశములోని వ్యక్తియు, రుద్రాంబకు సోదరుని వరుసలోనివాడగు మహాదేవ రాజున కిచ్చి వివాహము గావించెను. ఆ దంపతులకు పుట్టినవాడే కాకతి రెండవ ప్రతాపరుద్రుడు. గణపతిదేవుని మరణ కాలమున కీతనికి 6 సం. వయస్సుండినట్లు చారిత్రకులు నిర్ధారించిరి. అందువల్లనే రుద్రాంబ (చాళుక్య వంశీయురాలైనను) తన తండ్రి తర్వాత తండ్రి రాజ్యమును పాలించు హక్కు తనకున్నను, తన దౌహిత్రుడు, కాకతీయ వంశమునకు

జెందినవాడునునగు ప్రతాపరుద్రుడు రాజ్యార్హత బొందు వయస్సు వచ్చువరకును అతనికి సంరక్షకు రాలు (Guardian) గానే కాకతీయ రాజ్యపాలకురా లయ్యెను. ఆవిధముగా తన తండ్రి మరణముతో అంతరించవలసిన కాకతీయ వంశమును అంతరించ కుండ కాపాడగల్గెను.

---

1. తెలంగాణా శాసనములు. సంపుటము I. కొలనుపాక శాసనము. పుట 80.
2. విద్యానాథుని ప్రతాపరుద్ర యశో భూషణము. 20 వ శ్లోకము.
3. ,, ,, 14 వ శ్లోకము.
4. కాకతీయ సంచిక. పుట 64. (సంపా దకుడు మారేమండ రామారావుగారు.)
5. కాకతీయాంధ్ర రాజయుగ చరిత్ర— 12వ ప్రకరణము.. పుటలు 482—490 (గ్రంథకర్త చిలుకూరు వీరభద్రరావుగారు.)
ద. హి. శా. సంపుటము—IV సంఖ్యలు—121, 122, 123, 124 125, 127, 128. ద. హి. శా. సం. X సంఖ్య 360.
6. కొలను గణపతిదేవుడు రచించిన శివ యోగసారము—అవతారిక 41వ పద్యము. ఈ గ్రంథమునకు ఒకటే తాటియాకుల ప్రతి శిథిలావస్థలో దొరికినదని వీరభద్ర రావుగారే తెల్పిరి. అందువల్ల యీ పద ములో 'నాత్మజేనా' యునునది లేఖక ప్రమా దమై యుండవచ్చును. 'నాత్మజ నా బదులు' 'నాత్మజ'యై యని యుండ నోపు. అప్పుడు మమ్మడాంబ రుద్రాంబకు కూతురే యగునుగాని కూతురువంటిదని తలంచ నక్కరలేదు
7. శ. స. 1214 నాటి రాజరుద్రుని గోరవెంకపల్లి దాన శాసనము.(వివరములకు శ్రీ కె. హెచ్. వి. శర్మగారు 1962 సెప్టెంబరు భారతిలో ప్రచురించిన వ్యాస మును చూడుడు.)
8. తెలంగాణా శాసనములు : సంపుటము No 34. పుట. 75.
9. 15 ఏపిగ్రాఫికా కర్నాటిక—సంపుటము XII సంఖ్య 14.పుట. 27–ములుకుంట శాసనము(ఈశాసన మూల మందుబాటులో లేనందున దానిలో చెప్పబడిన ప్రతాప రుద్రుని తల్లి దండ్రులను గురించిన శ్లోకములు నేను చూడలేదు. అయితే ఆ శాసనములోని విషయమును విపుల ముగా శ్రీ కే. ఎస్. కోదండరామయ్య గారు 1966 మార్చి, ఏప్రియల్ నెలల భారతిలో ప్రచురించిన "కకుద్గిరి క్షేత్రము—కాకతీయ ప్రతాపరుద్ర చక్ర వర్తి" అను వ్యాసములోని తెలుగు వచన రూపములోని భాగము నిందు పొందు పరచితిని. వారి వాక్యములు వాడుకొని నందుకు వారికి కృతజ్ఞుడను.) మార్చి66 భారతి, పుట 56.
10. Introduction to Siddheswara Charitra by Sri Khandavalli Lakshmi Ranjanam; pages IXIV-IXV.
11. ఏకామ్రనాథ శాసనము (Indiau Antiquary—1921. Page 200. 10, 11 శ్లోకములు. వివరములకు 1962 నవం బరు భారతిలో కే. హెచ్. వి. శర్మగారు ప్రచురించిన 'కాకతీయులు వెల్బు గొండవారు కారా?' యను వ్యాసమును చూడుడు.)
12. ద. హిం. శా. సంపుటము IV—No. 1071.
13. కర్నూలుజిల్లాలోని త్రిపురాంతక శాస నము. (వివరములకు శర్మగారి 1962 నవంబరు భారతిలోనివ్యాసమునే చూడుడు. (పుటలు—3 to 8)
14. కాసె సర్వప్ప ప్రణీతమైన శ్రీ సిద్ధేశ్వర చరిత్రము, పుట 132.

కనిపించని ద్వారం

శ్రీ "త్రిపుర"

మేడమెట్లు ఎక్కి హాల్‌లోకి అడుగుపెట్టేను. పదకొండు సంవత్సరాల నాలుగు నెలల పదిహేడురోజుల క్రితం చూసినప్పుడు ఎలా ఉందో అలాగే ఉన్నాయి హాలూ, హాల్‌లోని వస్తువులూ. బీరువాల్లో క్యూరియోలు. గోడ దగ్గర, కిటికీపక్కగా రేడియోగ్రామ్. కార్పెట్. సోఫాలు అప్పుడున్నట్లుగానే. సూట్‌కేసుల కూడా అవే. దగ్గరగావెళ్లివాటిమీది లేబుల్స్‌చూశాను. పి అండ్ ఒ స్టీమర్ కంపెనీవి, క్యాంటాన్‌వారివి, బి. ఒ. ఏ. సీ......రోమ్, లాగోస్, జకార్టా. చిన్నవి, పెద్దవి. రంగు రంగులవి. ఫ్రెంచ్, యిటాలియన్, ఇంగ్లిష్ భాషల్లో. అన్నీ పాతవే. ఒకటే కొత్తగా కనిపించింది. థాయ్ ఏర్‌వేస్‌ది.

ఫోర్ పోస్టర్ మంచం మాత్రంలేదు. ఎడమవేపు కిటికీ దగ్గరకువెళ్లి పైకి చూశాను. తోటలో, అవుట్‌హవుస్ దగ్గర కూచుని చిన్నయ్య ఎరువులు కలుపుతున్నాడు. బోగన్‌విలియా. గులాబీల వరస. సీజన్ పువ్వుల బెడ్స్. లాన్‌మోఅర్, కాంపౌండ్ గోడ దగ్గర. దూరంగా వెనకవేపు మూలని మామిడిచెట్టు. లేత ఆకుపచ్చ ఆకులు.

వెనక్కితిరిగి, గోడమీద తగిలించిన ఫోటోల దగ్గరికి నడిచాను. టెన్నిస్ టోర్నమెంట్‌లో గెలిచిన కప్పుపక్క నేను. నేను! ఒరియా జమీందారిణి లాగ అమ్మ. ఇంకా అయిదు ఫోటోలు. ఐదు దేశాల రాజధానుల్లో, ఐదు రకాల మనుషులమధ్య వాళ్లలో ముఖ్యుడిగా, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌కి సంబంధించిన లెప్రసీ ఎక్స్‌పర్ట్‌గా, అందంగా, నవ్వుతూ నాన్న.

టేబుల్‌మీద కొన్ని ఫోటోలు సిల్వర్ ఫ్రేముల్లో. ఒకదాన్లోనేను, పన్నెండేళ్ల వయసులో, చిన్నటేబుల్‌మీదఆ సంవత్సరం నాకు సెయింట్ ఎలోయిషియస్ స్కూలు యిచ్చిన ఆరు ప్రైజు పుస్తకాలతో సహా. ఇంకోదాన్లో ఎవరో నీగ్రో వనిత.

కుడివేపు కిటికీ దగ్గరకువెళ్లి తలుపులు తెరిచి చూశాను. దూరంగా సముద్రం, ఎండలో మెరుస్తూ. పక్కయింటి జడ్జిగారి యింటి కాంపౌండ్‌లోమోటార్ సైకిల్. అతనే ఉన్నాడా యింకా ఆ యింట్లో?

తివాసీ మధ్యకివచ్చి నిలబడి, కోటుజేబులోంచి సిగరెట్ పాకెట్‌తీసి, అందులోంచి ఒకటితీసి వెలిగించాను. మెల్లగా పడేశాను ఆరిపోయిన అగ్గిపుల్ల తివాసీమీద. తోటలో మైనాలు. తల కిందికివంచిచూస్తే తివాసీమీద ఒక పెద్ద మచ్చ. బొఖారా తివాసీమీద విస్కీరంగు మచ్చ. ఆ మచ్చ ఉన్నచోట తివాసీ పలచబడి, కాస్త చిరిగినట్లు కనిపించింది. ఇక్కడే కూచునేవాడినా అప్పుడు? తల పైకెత్తి, రోమ్‌లో తీసిన ఫొటోగ్రాఫ్‌వైపు సిగరెట్ పొగ వదిలాను. ఆ ఫొటోలో కాళ్లు క్రాస్ చేసుకుని చేతులు ఒడిలో పెట్టుకుని, తెలివైన కళ్లతో నవ్వుతూ, నాన్న— అమ్మని గొంతుకు నొక్కి చంపిన నాన్న.

పుస్తకాల షెల్ఫుల దగ్గరకి నడిచాను. లెప్రసీకి సంబంధించిన పుస్తకాలు, బరువుగా. జర్నల్స్. రీడర్స్ డైజెస్ట్ కాపీలు రెండు. రెండో అరలో స్విజర్లాండ్‌నుంచి యిరవయిఅయిదేళ్లక్రితం నాన్న తెచ్చిన బార్తొలోమ్యూస్ అట్లాస్. నూట తొంభయి పేజీలు. సోఫామీద కూచుని సిగార్ కాలుస్తూ నాన్న ఏదో వూరో, నదో, కొండో పేరు చెప్పి ఎక్కడుందో వెతికిచెప్పమని అడిగితే, తివాసీమీద అట్లాస్‌ముందు వేసుకుని బోర్లా పడుకుని కళ్లు చికిలించి వెతకడం. జయం, అపజయం. అప్పుడప్పుడు, ఏడిపించడానికని యిండెక్స్‌లో కూడా దొరకనివి, కల్పించబడినవి.

అట్లాస్ మొదటి పేజీమీద నా పేరు. పన్నెండేళ్ల వయస్సులో రాయబడే దస్తూరీ. కె. నారాయణ. కిందఅరలో చిన్నఅట్టపెట్టె. అందులో దేశదేశాల్నుంచీ వచ్చిన గ్రీటింగ్స్‌కార్డ్స్. కొన్ని ఫోటోలు, చిన్నవీ, పెద్దవీ, ఎందరివో? ఆల్బమ్స్ అన్నీ ఎక్కడున్నాయ్? రెండు పాత ఉత్తరాలు.

జోసెఫ్‌వచ్చి మెల్లగా చెప్పేడు. నాకోసం లాయర్ గారు వచ్చారు.

అట్లాస్ పేజీలు మెల్లగా అటూ యిటూ తిప్పి మూసి, "వస్తున్నారని చెప్పు" అన్నాను. జోసెఫ్ వెళ్లిపోయాడు. బుక్‌షెల్ఫ్ పక్క టేబుల్‌మీద స్విస్ కాటేజ్ బొమ్మ. కాటేజ్ చుట్టూ పాస్టొరల్ సీన్. చేతిలోకి తీసుకుని 'కీ' యిచ్చాను. ఆవుపక్కని కూచున్న స్త్రీ పాలు పితకడం మొదలు పెట్టింది. ఎద్దులూ, ఎద్దులవెనక హాలికుడూ. 'కీ' తో ప్రాణం వచ్చింది కాటేజ్‌లో జీవితానికి. వచ్చింది నాకు చిరునవ్వు.

మెట్లుదిగి, హాలుదాటి, కారిడార్‌లోంచి నడిచాను. కారిడార్‌లో గోడకి ఫ్రేమ్ చేసిన పీటర్ బ్రూజెల్ తైలవర్ణచిత్రం ఒకటి ఉంది. ఇంతకు ముందు లేదు. పన్నెండేళ్లక్రితంలేదు. 'ఛిల్డ్రన్ యిన్ గేమ్స్'. నాన్న టేస్ట్ అర్థం అవలేదు.

డ్రాయింగ్ రూమ్‌లో లక్ష్మీనారాయణగారు. పరామర్శ వాక్యాలు—నాన్న గొప్పతనం గురించి. జోసెఫ్ టీ సరంజామా, కేక్స్, సేన్విచెస్. లక్ష్మీనారాయణ గారు ఫోలియో బాగ్‌లోంచి కాగితాలు తీశారు. బరువుగా, విలువైనవిగా, స్టాంపులతో నిండిన కాగితాలు. జేబులోంచి కళ్లజోడు తీసి, కళ్లకి తగిలించుకుని, విచారంగా, అలవాటయిన విచారంతో మెల్లగా చదివారు.

ఆయన చదువుకుపోతూంటే, నేను వాచీచూసుకున్నాను. నవంబరు ఇరవయిఆరో తారీఖు. నాన్న 'పోయి' యిరవయిఎనిమిది రోజులయింది అని లెక్క కట్టేను. నేను యిక్కడికి నిన్ననే వచ్చినా చాలాకాలం అయినట్లు ఎందుకో అనిపించింది.

"దయచేసి సంతకాలూ అవీ......"

"దయచేసి టీ తీసుకోండి"

జోసెఫ్ కప్‌లో టీ తయారుచేసి యివ్వబోతే లక్ష్మీనారాయణగారికి— డయబెటిస్, షుగర్‌వద్దు— కేక్ మాత్రం ఒకటి—

యిరవయిఎనిమిది రోజులయింది. నా వయస్సు ముప్ఫయిఏడు సంవత్సరాలు. మూలనున్న కుక్కూ క్లాక్ అయిదు కూసింది. కిటికీలోంచి దూరంగా పొడుగ్గా వంకరగా వాలుతూ కొబ్బరి చెట్లు. టీ తాగి కేక్ తిన్న లక్ష్మీనారాయణగారికి మళ్లీ నా సంతకాలు కావాలి.

నేను మెల్లగా సిగరెట్టొకటి వెలిగించి— లక్ష్మీనారాయణగారు "థాంక్స్‌సార్, నా కలవాటు లేదు"— నేను నిన్న రాత్రినుంచి ఆలోచించి చెప్పదలచుకున్నదేదో చెప్పాను. 'పోకర్' ముఖంతోనే చెప్పాను. మెల్లగా, వ్యాకరణయుక్తంగా, తడబాటులేకుండా.

మా మిగతా సంభాషణ—నేను లాయరుగారితోనూ, ఆయన ఒక వింత కలలో కనిపించిన ఒక మతిచెడినవాడితో అన్నట్లున్నానూ. ఇంకా కూచుంటే, యిక్కడే కూచుని నా మాటలువింటే, ఆ కలలోని వింతగా మతిచెడినమనిషి, యీ సాయంత్రం సమయంలో, నిజంగానే, కలల్లోంచి.....లక్ష్మీనారాయణ గారు కాగితాలూ అవీ సద్దుకుని వెళ్లిపోయారు, పైన సూర్యుడూ, వెలుతురూ, మనుష్యులూ, నడవడానికి రోడ్లూ ఉన్న ప్రపంచంలోకి, సాయంత్రంలోకి.

కిటికీలోంచి నీరెండ. చెట్లల్లో ఉడతలు. లాన్ మీద చిన్నయ్య రబ్బర్ పైప్‌తో నీళ్ల జల్లు. బీచ్ వేపు మెల్ల మెల్లగా మనుష్యుల నడకలు. మగ, ఆడ జంటలు. చిన్న పిల్లలు. ట్రాన్సిస్టర్లతో కొందరు.

కారిడార్‌లో బ్రూజెల్‌ని మళ్లీ నిలబడి చూసి, మేడమీదికి వెళ్లేను. సోఫామీద కూచున్నాను. ఎదురుగా గోడమీద ఒరిస్సా జమీందారిణి—అమ్మ. పైన సాయంకాలపు వెలుతురు మెల్లగా కరిగిపోతూంది. పక్షులు ఎక్కడికో ఎగిరిపోతున్నాయి. చేతివేళ్లమధ్య సిగరెట్టు కాలిపోతూంది. దూరంగా సముద్రపు హోరు వినిపించీ వినిపించనట్లుగా.

......'ద్వేషం' దేనికి? అమ్మని చంపినందుకా? పొరకింద పొరకింద పొర మెల్లగా విప్పుతుంటే, కారణం అది కాదని తెలుస్తూంది నాకు. ఈ

పన్నెండేళ్లనుంచీ, నన్ను వెంటాడుతూ, నాకు తెలిపింప జేస్తూనేవుంది. పదకొండేళ్ల నాలుగు నెలల పధ్నాలుగో నాడు యీ యిల్లు మూడోసారిగా వదలిపెట్టి వెళ్లిపోయాను ద్వేషంతో.

తరవాత జీవితం?

సైన్యంలో;—మెసపటోమియా, బెంఘాజీ, ట్రిపోలీ, సింగపూర్, కొహిమా; తరవాత మళ్లీ చదువు యూనివర్సిటీలో. చదువు. చదువు! అక్కడ! ద్రోహం చెయ్యడం, చెయ్యబడ్డం; తరవాత 'గాలిపడగ'—పేవ్మెంట్లమీద, పార్కు బెంచీలమీద; కాశీలో—అక్కడ మిల్కుమెన్స్ యూనియన్‌లో జొరబడి వాళ్ల పాలలో విషం! స్నేహితులకి—భాస్కరం, పాండే—ద్రోహం; శివాజీ, గౌరి, మార్గరెట్—స్నేహితులకీ, ప్రేమించినవాళ్లకీ ద్రోహం. దేశానికి ద్రోహం. అందులోని అందం, ఆనందం. తరవాత మోల్మీన్, తరవాత కబాయే పగోడాలో "అభిధర్మ" చదువు, సాధన! మిజో కొండల్లో గన్‌రన్నింగ్. ఒకచోట 'రాజు'. ఇంకో చోట జూడాస్. అక్కడ బెగ్గర్ యిక్కడ బగ్గర్...

అమ్మని అలా దేవుడి పూజామందిరంలో చంపినందుకుకాదు ఆ ద్వేషం అని తెలుస్తూనే ఉందినాకు. నాన్న 'మంచి'గా మాట్లాడేమాటలు, అందరినీ సంతుష్టపరచడానికి ప్రయత్నంచేస్తూ మాట్లాడేమాటలు, 'తీపి' మాటలు, ఆయన పాప్యులారిటీ, హ్యూమర్, వైటాలిటీ....

యివా కారణాలు? నా ద్వేషానికి యివా కారణాలు?

కాదు, కాదు. కాదు.

తల రెండు చేతులతోనూ గట్టిగా పట్టుకుని నొక్కుకుంటూ, కళ్లు బాగా గట్టిగా నల్లగా మూసుకుని, కళ్లలోని నలుపులో, చీకటిలో అద్భుతమైన డిజైన్లు క్షణ క్షణానికీ మారుతూ, వెలుగుతూ, ఒకదానిలోంచి యింకోటి కరుగుతూ, కలిసిపోతూ, మళ్లీ మెరుస్తూ, రంగుల రంగులగా మారుతూవుంటే, కారణాలకోసం వెతుక్కోవడం, కారణాలు మెరుపులా నా మనస్సులో ఎక్కడో లోలోపల వెలుగుతాయనీ, వెలగాలనీ, గుండె పగిలేలా కోరుతూంటే, ఆశిస్తూంటే... అవి కళ్ల వెనక నలుపుల్లో, దగ్గరగా, దగ్గర దగ్గరగా వచ్చినట్లేవచ్చి, అందుకోకముందే అదృశ్యమయిపోతాయి; పోయాయి.

జోసెఫ్ వచ్చాడు. లైట్లు వెలిగించమన్నాను. టేబుల్ లైట్స్, పైవీ, మూల మూలల్ని ఉన్న దీపాలన్నీ వెలిగించాడు. ఒకటి తరువాత ఒకటి మెల్లగా. హాలంతా వెలుతురు. అంతా వెలుగు.

"యీ గది తయారు చెయ్యమన్నారా?" అన్నాడు జోసెఫ్.

మంచం తీసేశారు యీ గదిలోంచి. కాని బెడ్‌సైడ్ స్టూల్‌మాత్రం ఎవరూ కదపలేదు. దగ్గరగా నడిచి వెళ్లాను. స్టూల్‌మీద ఒక పుస్తకం. ఎత్తి చూశాను.'డిక్లైన్ అండ్ పాల్‌అఫ్ రోమన్‌ఎంపైర్.'

వెనక్కి తిరిగి, జోసెఫ్‌తో అన్నాను 'వద్దు'. ఏభయిఏళ్ల జోసెఫ్, రోమన్ కేథలిక్ జోసెఫ్, నేను ఎక్కడ పడుకుంటానో అడగడానికి భయపడి, ఒక నిముషం నిలబడి, ఆలోచించి, ఏదో అనబోయి, అనకుండా, కిందికిదిగి వెళ్లిపోయాడు.

రేడియోగ్రామ్ దగ్గరకి వెళ్లి కింద అరలో రికార్డులు ఒకటి తరువాత ఒకటి తీసిచూడడం మొదలుపెట్టాను...సైబీలియస్, హాండెల్, బెలా షాంటే—నాకు ఆశ్చర్యం—నర్సరీరైమ్స్, క్రిస్‌మస్ కేరల్స్...వయొలిన్ కన్సెర్టో. బి. మేజర్ బాక్, ట్రంపెట్ కన్సెర్టో హమ్మెల్....సింఫొనీ నంబర్ 6, డి. మైనర్ సైబీలియస్. ఈ. ఫ్లాట్ మేజర్ మోత్సార్ట్...ఇంకా. తిరిగీ అదే వరసలో జాగ్రత్తగా పెట్టేశాను.

కుడివేపు కిటికీ దగ్గరగా వెళ్లి మళ్లీచూశాను. సముద్రంలో స్టీమర్లు దూరంగా, అక్కడా అక్కడా. దీపాలు వెలుగుతున్నాయి వాటిల్లో. హారైజన్ దగ్గర నిలువుగీత. అస్పష్టంగా, కదలకుండా ఉన్న మేఘాలు, నలుపూ నీలి.

గదిలో దీపాల్ని ఒకటీ ఒకటీ ఆర్పడం మొదలుపెట్టాను. బెడ్‌సైడ్ స్టూల్ పక్కని మాత్రం దీపం ఉంది. దానిమీద పుస్తకం. అలాగే ఉంది. బరువుగా, చాలా రోజులనుంచీ మెల్ల మెల్లగా తెరివిగా చదవబడుతూ ఉన్నట్లు. ఆ స్టూల్ పక్కని యింకో చిన్న స్టూల్. దానిమీద ఒక బాక్స్ అఫ్ సిగార్స్. చేతిలోకి తీసుకున్నాను. హవానా మేకర్స్.

తేలికగా ఉంది పెట్టె. మెల్లిగా మూత పైకివెత్తాను. పలచటి నీలికాగితంకింద రెండు సిగార్స్‌మాత్రం ఉన్నాయి. ఒకటి దాని జాగాలో. రెండోది అడ్డంగా. అడ్డంగా ఉన్నదానికి సెల్లోఫేన్ కవర్‌లేదు.

అప్పుడూ,

తివాసీమీద నిలబడి, నేను వెక్కి వెక్కి ఏడ్చింది. ఎంతో గాఢమైన చీకటి లోతుల్లో, నాలో ఏదో తెగింది. దాక్షిణ్యం లేకుండా తెగింది, అప్పుడూ.

*   *   *

నారాయణ తలవంచి కిందికి చూశాడు. హారిస్ ట్వీడ్ (ఫేజర్స్ బూట్ లేసుల్ని కప్పుతూంది. పక్కకి తిరిగి నిలువుటద్దంలో చూసుకున్నాడు. దేహం చదునుగా, పొడుగ్గా. భుజాలు బలంగా, చాలా వెడల్పుగా. ట్వీల్‌షర్ట్ భుజాల లోపలి గట్టితనంమీద మెరుస్తూ, తెల్లగా నవ్వుతూ, దిగి, ఛాతీమీద గర్వంగా పరుచుకుంది.

సుఖం, సంతోషం నారాయణ గుండెల్లోంచి బుడగల్లాగ పైకి వస్తూవుంటే,

ఏదో లోపలి ఒక లోతులోంచి ఒక పాము బుస మెల్లగా వినిపిస్తూంది. నారాయణకి నిజంగా కోపం వచ్చింది.

"ఆ కళ్ళు నాకు తెలుసు. నేను స్వతహాగా 'మంచి' వాడినని చెబుతాయి. కాని, అలా చెబుతూనే చిన్న విషపు చిలుకు చిలుకుతాయి."

మెదడులో, ఉల్కల వేగంతో రూపం పొందుతుండే ఆలోచనల్ని మొదటినుంచి చివరదాకా అనుసరించగలదు. అతని మెదడులోనిదే యింకో భాగం. ఆ గాలి పడగలాగ ఎగుర్తూ, ఆ గొలుసులూ, ఆ 'పళ్లెం' ఎగిరిన పొరుదలా, ఆ 'అహం'.....తటస్థంగానే.....ప్రతి నిముషాన్ని నిలబెట్టి, కస్టమ్స్ చెక్ చేసినట్లు అటకాయించి, క్రూరంగా, నిర్దాక్షిణ్యంగా, అనుమానంతో పరీక్షచేసి, వాటి చీకట్లనీ, దాగుడుమూతల్నీ కనిపెట్టి, పైకి లాగగలవు అతని కళ్ళూ, ఆ కళ్లలోని నల్లటి వెలుగూ.

నారాయణ అద్దంలోని తన కళ్లనుంచి అద్దంలోని తన నుదురుమీదికి మరల్చాడు తన కళ్లని. కుడివేపుపాపిట దగ్గర గరుకుగా నల్లటి పుటుమచ్చ.

"అది నాది. నా పుట్టుమచ్చ అది. అంటే అది 'నేను'. నన్ను యీ ప్రపంచంలో 'యిది నువ్వు' అని చెప్పేది. అంటే?"

నారాయణ కుడికాలి వేళ్లమీద నిలబడి గిఱ్ఱున తిరిగాడు. తిరిగి, తిరిగి, తిరిగి అద్దానికి ముప్పయి డిగ్రీల కోణంలో తూలి తూలి తూలి మెల్లగా స్థిరబడ్డాడు. గోడలు తిరిగాయి. కళ్లల్లో—రోవ్స్, సిగార్స్, కిటికీలో స్టీమర్.....మంచంలేని ఖాళీజాగా... మదుటికి చమట. జుత్తులో ఒక భాగం నుదురుమీద పడింది మెత్తగా, చెమ్మగా. అద్దానికి దగ్గరగావెళ్లి కుడి బుగ్గ అద్దానికి ఆనించి, కళ్లు మూలకి—అద్దంవేపుగా—తిప్పి చూశాడు. ముక్కు 'వాలు' కనిపిస్తూంది, బుగ్గ పక్కగా, అద్దంలో.

"ఖద్దర్ టెక్శ్చర్ లాగుంది" అనుకున్నాడు.

"ముక్కు చివర మొనదేలి ప్రపంచాన్ని అన్వేషిస్తూంది. అది కూడా నేనే" అన్నాడు, మెల్లగా, స్వరాన్ని కీచుగా చేసి.

"అది కూడా నేనే."

దువ్వెన తీసి జుత్తునంతా కిందికి దువ్వేడు. తలమీద నల్లటి జలపాతం. నల్లటి నాలుక, పొమేడ్ మెరుపుతో. రెండు బుగ్గల్నీ పట్టుకుని పక్కకిగట్టిగా లాగేడు. పెదిమలు విడి ఎర్రబడ్డాయి. ముక్కు రూపాన్ని మార్చుకుంది. కళ్లు మాత్రం అలాగే; మార లేదు.

"రింగోస్టార్ లాగున్నావు"

"నాండర్థాల్ మనిషి లాగున్నావ్."

"ఇంకా?"

"అసలు 'నేను' ఎవరు?

"మిలియన్ బిలియన్ స్పెర్మాటోజోవాలో ఒకటి.....ఒకటి.....దానికి ఛాన్స్ వచ్చింది."

"అన్నదెవ్వరు అలా?"

"ఫస్ట్ పిలాసఫర్స్ సాంగ్"

"అది—నిన్ను......నిన్నూ"

"కాకపోతే, నువ్వెవరివి? నువ్వెవరివి?

"ఏ సిచేవో, ఏ వాల్మీకివో, ఏ హో ఛిన్ మిన్ వో...'

"—పెరూ అగ్ని పర్వతాల వాలుల్లో, వెర్కోయాన్స్కి మంచు చరియల్లో, గ్రెనడా వేడిలో"

"ఇంకా, యింకా, చెప్పు."

"—లాసా మొనాస్టరీలో,కార్థూసియన్ మాంక్ లాగ, నియోపాలిటన్ ఫిషర్‌మన్‌లాగ—"

"—కాస్టనెట్స్ వాయిస్తూ, ట్రోంబోన్ వూపుల్లో—"

"—కోరల్ ఐలండ్స్‌లో రీఫ్స్‌మీద—"

"ఇంకా యింకా."

నారాయణ కళ్ళు మూసుకుని గట్టిగా నల్లగా నూసుకుని, గబ గబ గబ జుత్తు పైకి దువ్వడం మొదలుపెట్టాడు.

"ఇంకా చెప్పు."

"—కింబర్లీ వజ్రపు గనుల్లో, బ్లాక్ ఫారెస్ట్ లో, లాషియోలో— లాషియోలో ఏమిటిచేస్తావ్? (లాషియోలో ఏమిటి చేశాను?)-లాషియోలో నల్ల మందు స్మగ్లింగ్. ఎలాగ? బర్మా జీపుల్లో, కాలికింద నల్లమందు పాకెట్లు. ఫ్రాంటీర్‌లో ఛేకింగ్....... టైర్లు విప్పి వెతికారు. నేను నవ్వు......నేను మాంగ్ టిన్ మాంగ్....యింకా యింకా-నా ఫ్రెండ్ చెప్పు.తైపో ఏంజీ, లోంజ్యీ, గాంగ్‌బాంగ్, చెప్పులు.

ఆ చెప్పులు? వెల్వెట్ పట్టాలవి. నా కళ్ళు? 'ఇలాగా'అని కళ్ళు చిన్నవిచేసి,చికిలించి, వోరియంటల్‌గా పెట్టాడు నారాయణ.

"కాని, ఆ బిలియన్ మిలియన్ స్పెర్మాటోజోవాలో నీకు వచ్చింది ఛాన్స్. నీకు" అనుకున్నాడు.

"చెప్పు, చెప్పు వేగంగా చెప్పు"

"ఇక్కడ" అని మెల్లగా అన్నాడు అద్దంలో తనతో.

"యిక్కడ....యీ వూళ్ళో....యిక్కడ కిటికీ లోంచి బంగాళాఖాతం. సముద్రంమీద ఎస్. ఎస్. టొట్టొరి మారూ......టోకియో, యోకొహెమా వెళ్లేది......"

"తగ్గు. తగ్గు తగ్గు. గుర్రం కట్టు. నువ్వు యిక్కడ. ఈ రోజు. ఈ గదిలో.ఇటుకలు. రాళ్ళు. సిమెంట్.గోడలకి నీలిరంగు సున్నం.లేత నీలి. చల్లగా. కొంచం చలిగా. టివాసీమీద యీ మచ్చ. విస్కీరంగు. నువ్వు"

"నా తండ్రెవరు?"

వద్దు వద్దు.

"నా తల్లెవరు?"

వద్దు. చెప్పకు.

"అక్కలున్నారా? అన్నలో? బంధువులు?"

వద్దు వద్దు. వద్దు చెప్పకు.

అనుమానంగా మళ్లీ అద్దంలోకి చూసి, యిలా అన్నాడు.

"వెనక్కివెళ్లి చెప్పు.చిన్నప్పుడు నాకు కావలిసినవి చెప్పు"

పదకొండో ఏడులో జూన్ నెలలో—చినుకులు—విశాలని సంపెంగ చెట్టుకింద ముద్దు పెట్టుకున్నావు. పదమూడో ఏడులో 'మోర్టల్ సిన్'. పదిహేనూ, పదిహేడులో నీకు స్పష్టంగా తెలియని కారణాల వలన గృహత్యాగం చేశావు. తిరిగి వచ్చావు. పంధొమ్మిది; నీ గదిలో పడుకుని షెర్లాక్‌హోమ్స్.: మార్క్ ఆఫ్ జారో......డోరియన్ గ్రే......ఆండ్రీ జీద్.... కలిపి కలిపి.....కార్టూన్ బొమ్మల సేకరింపు. మధ్యలో స్టాంపుల ఆల్బమ్, వందలు, వేలు, వేలకొలదీ స్టాంపులు. జోళ్లని పాలిష్ చేసి చేసి మెరిపించడం—వైల్డ్ వెస్ట్ హీరోలాగ నడవడం, మూడో అంతస్తు డాబామీద వెదుళ్లతో యుద్ధం...వళ్లు బిగించి వెదురుకత్తులు ఝళిపించి....బీచ్‌లో రక్తాలొచ్చేటట్లు కుస్తీలు, ఫుట్‌బాల్. రత్నప్రసాద్‌మీద వెండెట్టా.....

"ఇంకా". అన్నాడు నారాయణ కళ్లతో. అద్దంతో.

అలసిన రాత్రులలో నీ అమాయకపు నిద్రలు నీకు తెలియకుండానే మాయమయి పోయాయా? మెల్లగా నీ 'దేహాన్ని' నువ్వు తెలుసుకున్నావా? తెలుసుకుని 'సిగ్గు' పడ్డావా? భయపడ్డావా సిగ్గుపడి? బెదిరావా భయపడి? మాటల అర్థాల్నీ, పుస్తకాల్లో గీతల

మధ్య అర్థాల్ని వెతికావా? 'స్త్రీ' దేహాన్ని కొత్తగా చూడడం, బేధాన్ని తెలుసుకోవడం...కలిపి కలిపి......

కొన్ని చెట్లు ఆకులు రాల్చుకున్నాయి. కొన్ని రాళ్లు వర్షంలో అరిగిపోయాయి. నేల ఎండి బీటలు. గర్జించే సంద్రం రోడ్లను కబళించింది. కొన్నిగోడలు శిధిలం అయాయి. కొన్ని పరిస్థితులు జ్ఞాపకాల రూపంగా మాత్రమే మిగిలాయి.

నిన్ను 'నువ్వు'గా తెలుసుకున్నావు. తెలుసు కున్నవాడివి, నీ 'వారసత్వం' యిదీ అని తెలుసుకున్న వాడివి, దాని రూపాన్ని మార్చడం, దాన్ని ధ్వంసం చెయ్యడం పనిగా, ధ్యేయంగా పెట్టుకున్నావు. అమ్మలు, నాన్న, అక్కలు, బంధువులు.....ఎవరు వీరు? సంబంధం? వీళ్లా? యిదా? యిలా నేను వాళ్లతో ఉండాలా? అలా మాట్లాడాలా?వాట్నన్నిటినీ తెగ్గొట్టు. అవన్నీ అలాకాదు. అవన్నీ యిలా. దండంపెట్టి మొక్క వలసినవాడిని మక్కె లిరిగేటట్లు తన్ను. లాలించి బుజ్జగింపదగినవాడా వీడు? వాడి బుర్రని మెత్తగా ఒత్తేయ్. నమ్రతగా, బుద్ధిగా మాట్లాడాలా యీాయ వతో? టెంకిమీద జెల్లకొట్టు గాడ్దె కొడుక్కి.

"ఇంకా చెప్పు, నా 'చరిత్ర'". అద్దంలోని కనుపాపలతో నారాయణ.

"వద్దు. ఆ చరిత్ర మాసిపోనీ, మసి అవనీ". అన్నాడు, మళ్లీ నారాయణ, తీవ్రంగా, ఆతృతతో.

"ఈ రోజే ఎందుకు ఎన్నుకున్నావ్? అది చెప్పు"

ఉదయం నిద్రకళ్లు తెరవగానే తోటలో కొబ్బరి మట్టల గలగల.కొబ్బరి ఆకుల్లోంచి చురుగ్గా సూర్యుడు. చురుకులోని చిరుచలి. దూరంగా ఉరికే సముద్రపు టలలు. వాటిమీద కొంగలు, రెండు. దూరంగా, వీధిలో 'తోటకూర' కేక. ఆ క్షణంలోనే ఎన్నుకున్నావ్ యీా రోజుని.

"కాని, ఎందుకు?" నారాయణ జుత్తు మళ్లీ కిందికి గబగబ దువ్వేడు. చెవులు పట్టుకుని, రెండూ వక్కకి వంచాడు. "చెవల పిల్లి....నల్ల గుల్లలు" ముఖం యిసుక పరిచినట్లు గరుకుగా.

"ఎందుకు యీా రోజు ఎన్నిక?"

వీధిలోని తోటకూర కేక త్రాచుని సీ ంగా ఎన్నికవైపు దిగలాగింది, బరువుగా.

"ఇది నీ ద్రుఢ నిశ్చయమా, నారాయణా?" అద్దంలోని నారాయణ జుత్తు ఊగింది. 'అవును' అంటూ. నారాయణ నవ్వేడు అద్దంలో.

"పద పద పద" అన్నాడు, నారాయణ.

"జోళ్లు తొడుక్కో" అన్నాడు నారాయణ.

"స్టుపిడ్. జోళ్లు తొడుక్కునే ఉన్నాను."

"పాలిష్"

నారాయణ నవ్వి, "యివాళ జోళ్లకి పాలిష్ ఏమిటోయ్?" అన్నాడు.

కాదు. చెయ్యాలి పాలిష్.

దట్టంగా పట్టించాడు నల్లగా ముద్దలు ముద్దలుగా పాలిష్. బలంగా, గట్టిగా, బ్రష్ని పట్టు కున్నాడు నారాయణ.

జోళ్లు అద్దంలాగ, క్రిస్టల్ గ్లాస్లా మెరి శాయి.

"మేజోళ్లు?"

నైలాన్వి. నీలివి. తొడుగు.

టక టక. ట్విల్షర్ట్. హారిస్ ట్వీడ్ట్రౌజర్స్—జాన్ బ్రవున్ షూ. కాంతి జోళ్లమీాద.మెరుపు. ట్విల్ షర్ట్ తెల్లటి మీగడ తెలుపు మెరుపు.

సూర్యకిరణాల్లో దుమ్ము కణాల ఎగురుడు.

"పద, పద."రక్తంలో జోరు. ఆ జోరులోనే రక్తపు చల్లదనం. నరాలు వేడి. ఆ నరాల వేడిలోనే ఆ నరాల చల్లదనం.

తలుపు తెరిచి, మెల్లగా పైకి అడుగుటట్టాడు నారాయణ. లాన్ చుట్టూ తిరిగి, తోటదాటి, గేట్లు తీసుకుని పైకి వచ్చాడు.

తన యింటివేపు, వెనక్కి తిరిగి, తన మేన్షన్ వేపు చూశాడా నారాయణ?

లేదు. చూడలేదు. నడవడం మొదలుపెట్టాడు.

కంకర, తారురోడ్డు, బోగన్విరియా, సంపెం గ—ఎత్తుగా, పచ్చటి పువ్వులతో—డాబాల మీద తెల్లటి బట్టలు, ఆరవేసినవి.

మలుపు తిరుగు,

కంకర, తారురోడ్డు. తాటాకుల పాకలు. ఆవులు. కొళాయి. మ్యునిసిపల్ వారిది.

నవ్వులు, నవ్వే మనుషులు. కల్వర్ట్. వరండాల మీద కుర్చీలు, ఆకుపచ్చవి, బెత్తువి. ఇనపవి. నోట్లో చుట్టలు.

నడు, నడు.

నల్లగా, వేడిగా తెల్లటి బట్టలమీద యిస్త్రీ పెట్టెలు. మండే బొగ్గులు.

నడు.

మందులు. పెద్ద పెద్ద సీసాల్లో టాఫీలు.

ఇంకో మలుపు తిరుగు. నడు నడు.

వాలుగా, తారురోడ్డు. నడు నడు, దిగు. పద.

ఇంకో మలుపు.

హఠాత్తుగా సముద్రం. నీలిదీపం. కోస్టల్ బేటరీ. సెంట్రీలు.

దిగు. ఆగు. దిగు దిగు.

వాగుపాములాగ మెల్లగా దిగు.

నడు. టకటకా కాదు. మెత్తగా. కంకరమీద కరకర .....

చూడు. రోడ్డుని కబళించింది సముద్రం. ఏనుగుని మొసలి లాగినట్లు.

పద. నీలిదీపం. లాగిపడేసింది సిమెంటు బ్లాకుల్ని సముద్రం.

రాళ్లు. సిమెంట్ బ్లాక్స్. జాగ్రత్త.

జాగ్రత్త!

కుషన్‌లాగ యిసుక. ఇక్కడ దిగు. ఎన్ని మిలియన్ మిలియన్ బిలియన్ల రేణువులు యివి? 'అంటుకోకుండా'! దగ్గరగాఉన్నా, అంటుకోకుండా.

'పద, పదా.'

తడిగా, నీలి నలుపు యిసుక యిక్కడ. దగ్గరగా. అంటుకుంటూ. కెరటాల అంచుల పొంగులు యిక్కడ, తెల్లగా; మాసిన తెలుపు.

శంఖాలు, లింపెట్స్, మ్యూరెక్స్, పావులు, గుల్లలు, ముక్కలు ముక్కలుగా, విరిగిన గుల్లలు, మస్సెల్స్, కాకుల్స్, విరిగినగవ్వలు. మంచివి, ఫోలాస్... కెరటాలు విసిరి పారేసినవి. పోర్చుగీస్ మేన్ అఫ్ వార్, సీ కుకుంబర్.....పావులు. రంగులు, యింద్రధనుస్సు రంగులు. గీతలు. చారలు. ప్రకృతి చేసిన నగిషీలు, చమక్కులు. గుల్లల మెరుపులు. శంఖాల్లో రహస్యాలు...

మెత్తగా తడిగా నలుపూ, నీలీ, బంగారం రంగు యిసుక. పాదాల జాడలు. పెద్దవి, చిన్నవి. జోళ్లవి. గజిబిజిగా ఒకచోట. గజిబిజి పాదాల జాడల గుంపు లోంచి వేరుపడి ఒక జత పాదాలు దూరంగా పోతున్నాయి......

పీతలు, అడ్డంగా, భయంగా, వేగంగా కన్నాల్లోకి.

పీతల పరుగులు.

ఒక కన్నం దగ్గర నిలబడ్డాడు నారాయణ. కన్నం చీకట్లోంచి కాళ్లు సగంపైకిపెట్టిచూస్తూంది.

"నా చేతిలో నీ ప్రాణం ఉంది" అన్నాడు మెల్లగా, కన్నానికి దగ్గరగా వంగి నారాయణ పీతతో.

"నీ బాధలు నీవి" అన్నాడు, గట్టిగా.

పీత లోపలికి కాళ్లు లాక్కుంది.

పంపు తిరిగిన 'బే'. కొండ. డాల్ఫిన్స్‌నోస్.

కొన్ని జ్ఞాపకాలు గుంపుగా, గుంపులు గుంపులుగా ఏదో సువాసనతో ఒక్కసారిగా విజృంభించడం మొదలుపెట్టాయి.

"తెగ్గొట్టు. పక్కకి తోసెయ్. పద పద."

తీర్థపు రాళ్లు. నల్లగా, తడిగా. కిందని దగ్గరగా నాచు. పచ్చని దూదిలాగ ఊగుతూంది నాచు. చిన్న చిన్న పూల్స్. స్పష్టంగా, నిర్మలంగా నీళ్లు. అడుగున నాచు. సీ వీడ్స్. వేలకొలదీ గుల్లలు. చిన్నవి. చిన చిన్నవి.

"దేముడు!" అన్నాడు, ఆశ్చర్యంగా నారాయణ. నీళ్లలోకి చూస్తూ, అడుగునఉన్న గుల్లలవేపుచూస్తూ

ఉప్పెనలాగ వచ్చింది నవ్వు నారాయణకి.

"పద."

జాగ్రత్తగా రాళ్లు ఎక్కాడు.

"జారుతావు జాగ్రత!"

"ఏమిటీ తీర్థం? ఎలా, తయారయాయి యీ రాళ్లు? ఎప్పటివి?"

కోసుగా, ఎత్తుగా, అడ్డదిడ్డంగా యీ రాళ్లు. అక్కడక్కడ సూదిగా. అహంభావంతో 'నువ్వు నామీద కాలు పెట్టలేవు' అన్నట్లు.

"మెల్లగా ఎక్కు."

రెండు కాకులు చుట్టూ తిరిగాయి. చెత్త కోసం. చచ్చిపడిన చేపలకోసం.

జెల్లీఫిష్‌లకోసం.

కత్తెర కెరటాలు. నల్లగా దూరంగా లోలోపల ఎత్తు ఎత్తుగా తయారవుతూ, నిండు నిండుగా కదులుతూ కదిలి కదిలి వూపు వూపుగా వస్తూ, ఒక్కసారిగా, పగిలి పగిలి, పళ్లు యికిలించినట్లుగా, వెక్కిరించినట్లుగా నవ్వుతూ,

హోరు!...

గాలి. ఒకటే గాలి. చెమ్మగా. ప్రాణానికి హాయి గొలిపే వోజోన్.

షర్ట్ కాలర్ ఎగిరింది.

దూరంగా, చదునుగా నీలి నీళ్లు. సూర్య కాంతిలో నీలి అంచు ఎర్రటి మెరుపులు నీరూ ఆకాశం లేత నీలిగా. మేఘపు తునక ఎత్తుగా, ఏకాంతంగా, ఏ విలువా లేని దాని లాగ.

కెరటం ఉద్ధుతంగావచ్చి, తుప్పర. ఉప్పగా పెదవులమీద.

స్థిరంగా, విగ్రహంలాగ నిలబడ్డాడు నారాయణ. ఎత్తుగా, కోసుగా, నల్లటి తీర్థపురాయిమీద.చుట్టూ, నవ్వే కెరటాలు ప్రదక్షిణ చేస్తూంటే. కాకులు కెరటాల అంచుల్ని వెతుకుతున్నాయి. నల్లటి నూగు ముఖం పై కెత్తి, మెడ పక్కకివంచి చూసింది ఒక కాకి. తుప్పుపట్టిన యినప తలుపు తెరిచినట్లు అరిచింది రెండోకాకి. ఒకటి లేచింది.

ఫ్ల ఫ్ల ఫ్ల రెక్కల చప్పుడు.

దగ్గరగా వాలింది. నారాయణకు దగ్గరగా.

వాలి, కాళ్లు సద్దుకుంది తడిగా జారుగా ఉన్న రాయిమీద.

"ఎందుకు" అన్నాడు నారాయణ గాలిలోకి.

కెరటాల హోరులో, అపస్వరాల అలజడిలో, లోన, లోలోన నిశ్శబ్దం.

"ఎందుకు?" అని, ఊపిరిని ఆపి, మళ్లీ అడిగాడు, కళ్లు సగం మూసి,

కెరటాల నవ్వు వేపు చూస్తూ.

అప్పుడే విరిగి బద్దలయిన కెరటం, రాయి చుట్టూ. సుడి తిరిగింది రాయి చుట్టూ, ఆహ్వానిస్తూ, తెల్లటి 'కుచ్చిళ్లు' రాయిచుట్టూ, పరిచి.

"ఎందు...కూ?' అని, గట్టిగా అరిచాడు, చెవులు మూసుకుని. శబ్దం గొంతుకలోంచి, యూస్టేషియన్ నాళాల్లోంచి, చెవుల్లోకి, మూయబడిన చెవుల్లోకి వెళ్లి అక్కడ ప్రతి ధ్వనులు వెతుక్కుంది.

"తంతాను...షో" .అని, ఎడమకాలు ఎత్తి, విసురుగా ముందుకు విసిరి,

కుడికాలు,

గట్టిగా, రాయిమీద, అడ్డుగా,

తిప్పి,

అడ్డం తిరిగి,

బలంగా,

వూపిరిని బిగబెట్టి,

ఆకాశపు నీలిలో అకస్మాత్తుగా గీసిన చాపం లాగ

ఎగిరి, వెనక్కి తిరిగి ఎగిరి

గెంతేడు, నవ్వే, కెరటపు హోరులోకి.

నాగార్జునకొండ విజయసంవత్సర శాసనాలు

శ్రీ బి. విద్యాధరరావు

నాగార్జునకొండ త్రవ్వకాలలో దొరికిన శిలా శాసనాల్లో "సవభరం విజయం" అనిచెక్కబడ్డ రెండు ప్రాకృత శాసనాలు యిటీవల శాసన పరిశోధకుల మధ్య వాదోపవాదాలకు దారి తీశాయి. వీటిలో మొదటిదాన్ని శ్రీ ఒగెల్ మహాశయులు 1931 లో ప్రచురించారు.[1] ఆయనకి యిక్కడ నుంచి పంపబడ్డ ప్రతికృతి మాత్రమే ఆధారం కావడంచేత శాసనపాఠంలో పొరపాట్లు దొర్లాయి. "విజయం" అన్న పదాన్ని" ఆయన "వింశయం" అని చదవడం అతి ప్రాముఖ్యం వహించిన దోషం.

మూడు దశాబ్దాల తర్వాత శ్రీ దినేశచంద్ర సర్కార్ మహాశయులు యితర నాగార్జునకొండ శాసనాలతోబాటు దీన్ని పునఃపరిశీలించారు. శ్రీ ఒగెల్ శాసనపాఠంలో దోషాలు ఆయనకి స్పష్టంగా గోచరించాయి. ఈ శాసనాన్ని తన సంపాదకత్వంలో ఆయన తిరిగి ప్రచురించడం 1962 లో జరిగింది.[2] ఈసారి పఠనంలో దోషాలు రాకుండ జాగరూకత వహించి శాసనపాఠాన్ని నిర్దుష్టంగా వెలువరించారు.

ఇలాగే "విజయం" అన్నపదం ఆధారంగా కాల నిర్ణయం జరగవలసిన మరొక శాసనం కూడ చివరిసారిగా జరిగిన త్రవ్వకాలలో లభించింది. విజయం అన్నమాట బార్హస్పత్యవర్షచక్రంలో విజయగా ఆయన ఊహించారు. అయితే క్రీస్తుశకం 3 వ శతాబ్దికే ప్రభవతో ఆరంభమవౌతున్న 60 సంవత్సరాల బార్హస్పత్య చక్రం వాడుకలో ఉందనుకోడానికి చరిత్రలో ఆధారాలు ఎంతమాత్రమూ లేవు. ఇంతకు పూర్వం ఈ వర్షచక్రంలో సంవత్సరాన్ని ఉదాహరించిన అతి ప్రాచీన శాసనం క్రీ. శ. 7 వ శతాబ్దపు చాళుక్య ప్రభువు మంగళేశుడిది. ఇందులో చెప్పబడిన సిద్ధార్థ సంవత్సరము సగటుచిహ్నంగా సంప్రదాయాన్ననుసరించి క్రీ. శ. 602—03 కి సరిపోగలదు.[3] అంతకుముందు రమారమి 325 సంవత్సరాలకి పూర్వమె బార్హస్పత్య చక్రం దక్షిణదేశంలో వాడుకలో ఉందనడానికి ఈ రెండు శాసనాలూ ఆధారం కాగలవని శ్రీ సర్కార్ మహాశయులు భావించారు.

ఉత్తర భారతంలో బార్హస్పత్య చక్రపు వాడుక దక్షిణ సంప్రదాయానికి భిన్నమైనది. ప్రభవకు బదులు విజయ' సంవత్సరాన్ని ప్రథమసంవత్సరంగా భావించడమేగాక బృహస్పతిచలనా న్ననుసరించి సంవత్సర గణనం జరుగుతుంది ఈ సంప్రదాయంలో. దక్షిణదేశంలో బార్హస్పత్య చక్రంలో పేర్లనుమాత్రం ఉపయోగించుకుంటూ సౌరమానా న్ననుసరించి గణించడం వాడుకలో ఉంది.

విజయ సంవత్సరాన్ని రెండుసార్లు ఉపయోగించినట్లుగా భావించబడుతున్న ఇక్ష్వాకులు ఈ చక్రంలో మరొక సంవత్సరాన్ని దేన్నిగాని తమ శాసనాల్లో ఎక్కడా ఉదాహరించలేదు. విజయ సంవత్సరం కలియుగపు ప్రథమవర్షం అవడంవల్లనో, లేక అది ప్రథమవర్షమైన బార్హస్పత్య సంప్రదాయాన్ననుసరించడంవల్లనో విజయకు ప్రత్యేకత ఉందనీ, అందువల్ల విజయపురి రాజధానిఐన 'ఇక్ష్వాకులు దాన్నిమాత్రమే ఉపయోగించి ఉండవచ్చనీ శ్రీ సర్కార్ గారు భావించారు.

---

1. Ephigraphia Indica, Vol. XX.
2. Ibid, Vol. XXXV, PP., 1—7.
3. Ind. Ant., Vol. XIX, P. 7.

వీటిని బార్హస్పత్య విజయ సంవత్సరాలుగా గుర్తించడానికి ప్రసిద్ధ చరిత్రకారులు ఆచార్య మిరాషీ నిరాకరించారు.[4] సమకాలీన శాసనాల్లోనేకాక తరువాత మూడు శతాబ్దాల పైచిలుకు కాలంలోగల యే శాసనంలోనూ ఈ సంవత్సరనామాలు లేకపోవడమూ, మీదు మిక్కిలి నాగార్జునకొండలోనే లభ్యమైన యే యితర శాసనంలోనూ సంవత్సరనామం కనిపించకపోవడమూ, ఆయనకి తిరుగులేని ప్రతిబంధకాలుగా తోచాయి. కాగా "విజయం" అన్నపదం సాధారణ విజయకాంక్షను సూచించే ఆశీస్సుగా ఆయన భావించారు.

శ్రీ సర్కారుగారి వాదాన్ని సమర్థిస్తూ శ్రీ ఐ. కార్తికేయశర్మగారు ఓరియంటల్ యిన్‌స్టిట్యూట్ సంచికలో ఒక సుదీర్ఘవ్యాసం వ్రాశారు. ఈ సమర్థనకోసం ఆయన చాల పరిశోధించి కొత్త విషయాలు మరికొన్ని బయటపెట్టారు. శాసనపాఠంలోని పదాలకి ఎంతమాత్రమూ సమర్థనీయంకాని అర్థాలు కూడ ప్రతిపాదించారు !

వీటిని గురించి ఆ సంచికలోనే నేను మరొక అర్థాన్ని ప్రతిపాదిస్తూ వ్రాశాను.[6] ఎవరివాదాన్నీ సమర్థించడంతోగాని, ఖండించడంతోగాని ప్రమేయం లేకుండా "విజయం" అన్న పదానికి తార్కిక పరిశీలనతో "ప్రథమం" అని చెప్పడానికి అవకాశం ఉన్నదని నేను సూచించాను. ఈ సూచనని విపులీకరించే ముందు ఈ రెండుశాసనపాఠాలనీ పూర్తిగా చదువుకోడం అవసరం కనక అందుకుగాను వాటిని యివ్వడం జరిగింది. ఇవి 1962 లోనే ప్రచురింపబడ్డాయి గనక వాటి ప్రతికృతులు యివ్వలేదు.[7]

మొదటిది

1. సిధం మహారాజస అసమేధయాజిస అనేక హిరణ కోటి పదాయిస
2. సిరిచంతమూలస రాంణో మాఢరి పుతస ఇఖాకుస సిరి విరపురిస దతస
3. వససతాయ సవభరం విజయం వాసపఖం ప్రథమం। దివస బితియం సగ గతస
4. రాంణో అగిహోతాగిఠోమ వాజపేయాసమేధ యాజిస హిరంణకోటి గోసత సహస
5. హల సత సహస పదాయిస సవథేసు అపతిహత సంకపస వాసిఠీపుతస
6. ఇఖాకుస సామిసిరి చంతములస సహదరాహి మాతాహి మహాదేవిహి అనతసిరియ
7. ఖందసిరియ విఝుబోధి సిరియ మితసిరియ సముసిరియ నాగవసు సిరియ
8. మంగు సిరియ ఖందకోటి సిరియ మహిసర సిరియ కొండమతి సిరియ మూలసిరియ
9. అయకోటు సిరియ మదుని సిరియ నాగ సిరియ కామసిరియ గోల సిరియ
10. ఖలిసిరియ బోధిసిరియ ఖదసిరియ సతిల సిరియ పెరజతి సిరియ
11. పండిత సిరియ సివనాగ సిరియ సముద సిరియ బాపిసిరియ నది సిరియ
12. అయసిరియ కంన్హసిరియ సివనాగ సిరియ అ భ టరికా హిచ
13. సరసికాయ భూకుసుమ లతాయచ ఛాయా తభో॥

రెండవది

1. నమో భగవతె (తొ) సవలోక మహితస నోదగిసర సామిస మహారాజస అసమేధ యాజిస అనేక హిరణకోటి పదాయిస సిరిచతములస పుతస...
2. సిరివిరపురిస దతస పుతస రాంణో ఇఖాకుస సిరిఏహువల చతములస సవభరం విజ...మ్హాప దివ। రాంణో లేజయిక ఆయువధ నికచ అపన
3. సహమతిణసేయధ అతేపుర మహతరికాయ భగవతాయ సేఠి బాలికాయ రతవసాయ విదాయ...
4. భగవతో నోద సరసామిస దేవకుల థలచ కారితా అఖయ నీలిచ కటాణ :మసను మసికస వధిస:.. ధికసేనియ దీనారి...దినారి దస 10

---

4. Epigraphia Indica, Vol. XXXVII, pp. 70—73.
5. Journal of the Oriental Institute, Vol. XVIII, pp. 126—143.
6. Ibid, pp. 323—325.
7. Epigraphia Indica Vol. XXXV. p. 1—/

5. వనిక సేనియే దినారి దస 10 పులికసేనియే దినారిదస 10 ఇవం సేనిసు చతుసు ... దినారి సత......
6. .. సరఛాయ...సరపుత...మం...వకాయే సధ
7. ...ధిక...తరప వరడిక భగవుల సతప అసనాచ ఛితనం కతవం ఇవచ అకరంత సేతి సముఖ నిగవో కఠయంతి॥

ఇక్ష్వాకు శాసనాలన్నింటిలో రాజుల రాజ్య సంవత్సరాలే యివ్వబడ్డాయి. పైన ఉదాహరింపబడ్డ రెండు శాసనాల్లోమాత్రం అందుకు భిన్నంగా బార్హస్పత్య విజయతో దక్షిణ సంప్రదాయానుగుణంగా కాల నిర్ణయంచేస్తూ శ్రీ సర్కారుగారు వీటిలో మొదటి దాన్ని క్రీ. శ. 273 వ సంవత్సరం నాటిదనీ దానికి 60 చేర్చి రెండవది క్రీ. శ. 333 నాటి దని అభిప్రాయపడ్డారు. శ్రీ శర్మ ఉత్తర సంప్రదాయానుసారం పరిగణిస్తూ వీటికి సవరణని ప్రతిపాదించారు. ఇది సరికాదనుకుంటే క్రీ. శ. 220 నాటికి పూర్వమే వీరపురుష దత్తుడు రాజ్యం చేస్తున్నట్టు భావించవలసివచ్చింది. కాని శాతవాహనులలో చివరిరాజులపాలన క్రీ. శ. 3 వ శతాబ్దంలో 215—220 వరకు జరిగిందని నమ్మడానికి అవకాశం ఉండడంవల్ల క్రీ. శ. 279—80 నాటికి వీరపురుషదత్తుడు ఈ ఛాయాస్తమ్భాన్ని లేవదీసినట్లు ఆయన అనుమానించారు.

వీటిలో మొదటిది ఇక్ష్వాకుల మూల పురుషుడైన సిరిచాంతమూలుడి స్మారకస్తమ్భంమీది శాసనం. అతడు స్వర్గస్థుడయ్యాక అతడి సోదరీగణమూ, మాతృగణమూ, భామినీగణమూ, సంయుక్తంగా ఈ ఛాయాస్తమ్భాన్ని ఎత్తినట్లు శాసనం తెలియజేస్తున్నది. క్రీ. శ. 273 నాటికి శ్రీ చాంతమూలుడు మృతి జెంది చాల సంవత్సరాలు గడచి ఉండవచ్చునని వూహించిన సర్కారు మహాశయులు ఈ స్తమ్భాన్ని అతడి మృతికి తదుపరి అనేక సంవత్సరాల తర్వాతనే ఎత్తిఉండాలన్నారు. అయితే సర్వ సామాన్యంగా మృతికి వెంటనే ఎత్తబడే స్తమ్భాన్ని యీవిధంగా ఎందుకు ఆలస్యంగా ఎత్తివుంటారోమాత్రం ఆయన సూచించ లేదు. ఆయనని సమర్థింపబూనుకున్న శ్రీ కార్తికేయశర్మ మాత్రం వీరపురుషదత్తుడి రాజ్యంలో కల్లోలం చెలరేగిందనీ, అందువల్ల అతడికి స్తమ్భప్రతిష్ఠకు అవకాశం లేకపోయిందనీ చిత్రమైన కల్పన చేశారు. విజయ సంవత్సరంలో విజయపురిని రాజధానిగా వీరపురుషదత్తుడే నిర్ణయించి ఉండవచ్చని కూడ వ్రాశారు.

ఇందువల్ల వీరపురుషదత్తుని రాజ్యకాలం అనూహ్యంగా పెరిగిపోతున్నది. ఇంతవరకు లభ్యమైన యితర శాసనాల ప్రకారం యితడి రాజ్యం 20 సంవత్సరాలకి లోపుగానే కనిపిస్తున్నది. అంతే కాక స్మారక స్తమ్భం మృతి చెందిన వెంటనే లేవదియ్యడం సబబూ, సంప్రదాయమూను. అనేక సంవత్సరాలు వేచివుండి తరువాతనే ఈ ఛాయాస్తమ్భాన్ని ఎత్తించారనుకోడానికి తగ్గ కారణం యేదీ కనిపించదు. చాల యేళ్లతరువాత చాంతమూలుడి మాతృగణంలో ఎక్కువమంది మృతి చెందకుండా బతికి ఉన్నారనుకోడం యేంతమాత్రమూ హేతుబద్ధంకాదు. ఛాయాస్తమ్భ స్థాపనలో విలంబానికి తానూహించిన కారణాన్ని ఋజువైన సత్యంగా భావిస్తూ శ్రీ శర్మగారు మరికొన్ని సిద్ధాంతాలని కూడ ఉటంకించారు. వీరపురుషదత్తుని 6 వ రాజ్య సంవత్సరంలోనే రాజకాంతలు మహాస్తూపాన్ని పునరుద్ధరించి ఆయకస్తమ్భాలని ప్రతిష్ఠించ గలిగిననాడు మొదటి చాంతమూలుడి స్మారకస్తమ్భ స్థాపన అంతకు ముందే జరిగిఉండాలి. అందువల్ల శ్రీ సర్కారుగారు భావించినట్లు ఈ సంఘటన చాలయేండ్ల తర్వాత జరిగిందనుకోడం సరికాదు.

కలియుగానికీ, బార్హస్పత్య సంవత్సరావృత్తికీ విజయ ప్రథమ సంవత్సరంగా పరిగణింప బడితే అది ఇక్ష్వాకులకి అత్యంత గణనీయమైనదౌతుందనుకోడానికి ప్రబల కారణం యేదీ కనిపించదు. నాగార్జునకొండలో లభించిన విజయ శాతకర్ణి శాసనం వల్ల ఆ పట్టణం అతడి పేరిట విజయపురి ఐందనుకోడానికి అవకాశత యెక్కువ కలుగుతోంది.

ఇక్ష్వాకులకు పూర్వమే నాగార్జునకొండ ప్రాతినిధ్యం వహించిన బౌద్ధ కేంద్రమై ఉండాలని వూహించిన శ్రీ శర్మ, నాటికి ఈ కేంద్రానికి పేరేమిటో మాత్రం

8. I bid, Vol. XXXVI.

సూచించడానికి పూనుకోలేదు. విజయపురి అనేపేరు వీరపురుషదత్తుడి 7 వ రాజ్య సంవత్సరంతో ప్రారంభమైన దనుకోడానికి మాత్రం పై శాసనాల్లో మొదటిది ఆయనకి తిరుగులేని ఆధారంగా తోచింది.[9] పై శాసనాల్లో 'వససతాయ' అన్న ఆశీఃపూర్వక పదానికి యిందుకోసం 'వర్ష సప్తమః' అని సంస్కృతఛ్ఛాయని సూచించడానికి కూడ శ్రీ శర్మ వెనుకాడలేదు! శ్రీ మిరాషీ సోపపత్తికంగా ఈ వాదాన్ని ఖండిస్తూ సమగ్రమైన వ్యాసాన్ని ప్రచురించారు.[10]

ఈ శాసనాల్లో కాలాన్ని నిర్దేశిస్తున్న పదాలని పరిశీలిస్తే ఈ క్రింది విషయాలు వెంటనే స్ఫురిస్తాయి.

(1) రెండు శాసనాల్లోనూ పక్షసంఖ్య దినసంఖ్య కూడ యివ్వబడ్డాయి. సంవత్సరాన్ని మాత్రం విజయం అనడం జరిగింది.

(2) రెంటిలోనూ విజయ తరువాత అనుస్వారం తెలుస్తున్నది. విజయ అనే పేరుకు అనుస్వారం అనవసరంకదా! ప్రథమం, ద్వితీయంవలె సంఖ్యాసూచక పదాలకే అది పరిమితం కావలసినది.

(3) తండ్రి స్వర్గస్థుడైన తరువాత అతడి పేరిట స్మారక స్తంభం వెంటనే, అంటే కుమారుని ప్రథమరాజ్య సంవత్సరంలోనే ఎత్తడం జరుగుతుంది. "వససతాయ" అని తరువాతి ప్రభుడైన వీరపురుషదత్తుడిరాజ్యం నూరేళ్ళు వర్ధిల్లాలని ఆశీర్వచనం అందువల్ల సమర్థనీయమవౌతున్నది. మీదుమిక్కిలి శాసనకర్త లందరూ వీరపురుషదత్తుడికి పూజనీయులైన పెద్దలు కావడంవల్ల, అటువంటి ఆశీస్సు స్వాభావికం అనుకోడానికి ప్రతిబంధకంలేదు.

(4) రెండవ శాసనంలోకూడ ఆశీఃపూర్వకంగా లేజయిక ఆయువధ నికట అనే పదాలు ఉండడం గమనార్హం. అయితే యిది రెండవ చాంతమూలుడి గురుజనంవలన ప్రతిష్ఠితం కాలేదు. రాజ్యారంభాన్ని పురస్కరించుకొని, పురవర్తక ప్రముఖులు తమ నూతన ప్రభునకు విజయాన్ని, ఆయుర్వృద్ధినీ కాంక్షిస్తున్నారనుకోవచ్చును.

మధ్యయుగ కాలపు తెలుగు శాసనాల్లో ఈ విజయపదం లెక్కకు మిగిలి వాడుకోబడ్డది. రాజ్య సంవత్సరపు సంఖ్య చెప్పే ముందు "విజయ రాజ్య సంవత్సరంబులు"[11] అని ఉన్న శాసనాలు కోకొల్లలు. ఇక్కడ "విజయ" అంటే యేమిటి? నిరాటంకంగా రాజ్యం చేస్తున్న సంవత్సరాలు అనుకోవచ్చునుగద. ఇది మొదటి సంవత్సరమైనప్పుడు "విజయ రాజ్య రాజ్య సంవత్సరం ప్రథమం" అనడానికి ప్రత్యామ్నాయంగా 'సంవత్సరం విజయం' అనడానికి అవకాశం ఉందనుకోవచ్చును.

యుగయుగాలుగా భారతావనిలో ప్రతి మండలానికీ ప్రత్యేకత వహిస్తున్న సంప్రదాయాలు యెన్నో ఉన్నాయి. సంఖ్యలని వేరు పదాలతో సూచించడం అతి సామాన్యం. ఒకటిని, ఆది, శశి, ఇందు, క్షితి, ఊర్వరా, ధరా, పితామహ, రూప, రస్మి, తను, నాయక[12] మొదలైన పదాలతో సూచించిన సందర్భాలు శాసన పరిశోధకులు ఎరిగినున్నవే.

శూన్య, యేకపదాలు అమంగళకరములనేభావం ఈ నాటికీమనలోవున్నది. 'సున్న'ని పూజ్యం అని అనడమూ ఒకటిని శ్రీ అని అనడమూ, వాటిని మంగళకరమైన పదాలతో వ్యవహరించడంకోసమే ఆరంభమయ్యాయి. విజయ తరువాత అనుస్వారం చేర్చడంవల్ల దానితో ప్రథమాన్ని సూచించడమే ఉద్దేశ్యం కావచ్చు. మిగతా భాగంలో పక్ష దిన సంఖ్యలను ఇస్తూ సంవత్సర సంఖ్యని దాచుకుని విజయం అనడానికి ముఖ్యకారణం ఆ సంవత్సరం ప్రథమం కావడంవల్లనే కావచ్చును.

9. Journal of Oriental Institute, Vol. XVIII, p. 134.
10. Ibid. pp. 318—322.
11. South Indian Inscriptions (texts). Vol. VI. 129, 133, 134, 147, 163...etc.
12. Elements of South Indian Paloeography (A. C. Burnell), p. 77.

చెప్పుకోదగ్గ వేరొక సంఖ్య లేకపోవడంవల్లనే అలా జరిగిందనుకోవాలి. పిరివిరపురి సదతస....సవభరం, చతమ్ములన సవభరం అని స్పష్టంగా అవి రాజుల రాజ్య సంవత్సరాలుగా శాసనంలో యివ్వబడ్డవికాని బృహస్పతి చక్రంలోని విజయ అనుకోడానికి ఆస్కారం యేమాత్రమూ లేదు.

పోతే, ''విజయం'' అన్నమాటకి' 'ప్రథమం' అని అర్థం చెప్పుకోగల సందర్భంఉన్న శాసనమేదీ యింతకు పూర్వం తటస్థపడలేదు. అందువల్ల శాసన పరిశోధకులకు యిదొక అలంఘనీయమైన అవరోధం అనిపించవచ్చు. కాని యే ముఖ్యమైన సంఘటనకీ సరిగా అటువంటిదే సంఘటన అంతకు పూర్వమే జరిగి ఉదాహరణంగా లభించడం జరగదు. కొన్ని సంఘటనలకు ప్రాముఖ్యం యిందువల్లనే కలుగుతుంది. ప్రస్తుతపు సూచన అంగీకరింపబడితే ముందు ముందు లభ్యం కాగల శాసనాల నిర్ణయానికి ఉదాహరణ కావచ్చు.

శ్రీ శర్మగారి అభిప్రాయాలతో యేకీభవించలేకపోయినప్పటికి ఆయన వాదాన్ని ఖండించడం నా ప్రయత్నంకాదు. విజయం అన్న మాటను ఒక్కదాన్ని తీసుకొని అది బృహస్పతి సంవత్సర చక్రంలో విజయ అని సమర్థించడంమాత్రం తార్కిక పరిశీలనముందు నిలవదు. నా సూచనని నేను రుజావు చెయ్యలేదన్నదీ సత్యమే. అయితే ప్రస్తుతానికి లభ్యవౌతున్న శాసనాంశాలేవీ నా సూచనకు వ్యతిరేకములుకావు. దీన్ని పరిశోధక లోకపు దృష్టికి తేవడమే నా ధ్యేయం.



"నీ అడ్రసు దొరకడం లేదు"

శ్రీ జి. రామకృష్ణ రాయణం

నన్నయ్యగారి నట్టింట్లో
నడక నేర్చుకున్న చిన్నారివి,
శ్రీనాథుని చేతుల్లో
చిరునవ్వులు చిందించిన దానివి,
పోతన్నవెంట పొలంవెళ్లి
పూలు కోసుకున్న దానివి,
రాయలవారి నిండుకొలువులో
సోయగాలు వెదజల్లిన దానివి
రాళ్లను కరగించిన దానివి, పావు
రాళ్లను పలికించిన దానివి,
రసికతను పోషించిన దానివి,
తెలుగు జాతి జీవితానికి
వెలుగునిచ్చిన దీపానివి,
మా, కమ్మని కవితా కళామతల్లివి,

ఈ ఇరవయ్యో శతాబ్దంలో
ఎక్కడికి వెళ్లావమ్మా!
ఎవరు నిన్ను తరిమారమ్మా!

తాడు పొడుగు తక్కువైనదని
బావి పూడ్చుకొనే మా కొంపల్లో
భావి పూడ్చుకునే మా బుద్ధులతో
విసిగి వేసారి నీవే వెళ్లిపోయావా?
మా భావాల్లో బలంలేదు
మా ఊహల్లో ఊపులేదు
మా చేతల్లో చేవలేదు

మా మాటల్లో మమతలేదు.
అష్టదిగ్గజాలంటే
అర్థంకాదు మాకిప్పుడు.
నాలు గడుగుల గజాన్నికూడా
నమ్మకంగా చూడని మాకు
మూడడుగుల గజంకూడా
ముఖం ముడిచి మూటరైంది.
నా పేరు నాకే తెలియని నేను
నలుగురికీ నామం పెడుతున్నాను.
పెద్దబాలశిక్ష పేజీ తిప్పని నేను
పెలిన్ కరెస్పాండెంటుతో
పేచీ పెట్టుకుంటున్నాను.
దక్షిణం ఉత్తరం తెలియని నేను
దాక్షిణ్యంతో నీకు ఉత్తరం రాస్తున్నాను.

ఎక్కడికి వెళ్లావమ్మా!
ఏం చేస్తున్నావమ్మా!

రాజులు పోయారుగదా అని
రాజకీయాల్లో దిగావట!
పల్లెత్తకుండా ప్రసంగించే దానివి
బండబూతులు తిడుతున్నావట!
ప్రాణంలా కాపాడబడేదానివి
బజారుకెక్కి ఆడుతున్నావట!
గోకుడు పుడితేమాత్రం
గుడ్డ విప్పుకుంటారా?
సంఘం చెడితేమాత్రం!
చాకిరేవు పెడతారా?
స్ఫోటవాదాన్ని వల్లించిన నీ ముఖంమీద, ఈ
స్ఫోటకం మచ్చలేమిటి?
జలజాన్ని పట్టుకుంటేనే
చెమర్చే నీ చేతిలో ఈ

“ నీ అడ్రసు దొరకడం లేదు ”

జెండా కర్రలేమిటి?
సుకుమారమైన నీ గళంలోనుంచి, ఈ
స్లోగన్ల వాగన్లేమిటి?

ఎందుకు వచ్చింది నీకీ గ్రహచారం!
ఎవరు చేశారు నీకీ అపచారం!

పట్టు జలతారు వస్త్రాలు నీకు
కట్టబెట్టలేదనే కష్టంలేదు.
చేతిలో సంగీతం పలికే
సితారు లేదనే చింతలేదు. కాని
కనీసం కట్టుబట్టకూడా కరవై
కళ్ళముందు తిరుగుతున్న నిన్ను
నవసమాజ నిర్మాణమంటూ
నడిరోడ్డుమీద ఉపన్యాసాలుదంచే
నాయకమ్మన్యులు, నీ మొహంమీద
తారుబూసి నిన్ను తాటకిలా
తయారు చేస్తుంటే
తపించి పోతున్నాను నేను
నీ కిష్టులైన యీ ఇష్టులంతా
నిన్ను సజీవంగా, సహజంగా, కంపోజుచేసే — కాదు
కంపోస్టుచేసే 'యీ నీ కవి' మిత్రులంతా
ఈ పైగంబరులంతా
నిజంగా పాపిష్టుల లిస్టులో చేరకపోతే
రెండు డజన్ల ఇడ్లీలూ, పూరీలూ,
రెండు పూటలా తాము మెక్కి
ఆకలి, రక్తం, స్మశానం, కంకాళం, అని
అందరిలో నిన్ను అరిపించి
ఆత్మారాముణ్ణి శాంతి చేసుకుంటున్నారెందుకు?
నీవు తిట్టే తిట్టు తిట్టుకూ తామంతా
తలకొక మెట్టు మెట్టు పైకెక్కుతున్నారెందుకు?

కట్టు బట్ట విప్పి నిన్నాడించి
పొట్ట బోసుకుంటున్నారెందుకు?

లజ్జాశూన్యవైన నీకు
లావణ్యం ఎక్కడుంది?
దాస్యం చేస్తున్న నీకు
లాస్యమెలా కుదురుతుంది?
తెగదిట్టే నీ నాలుక
తేనె నెలా కురుస్తుంది!
కావు — నీవు నా కవితవు కావు.

తెలుగుసీమ కలకాలంగా
కష్టపడి సంపాదించుకున్న
మానానికి మర్యాదకు
సభ్యతకు సంస్కృతికి
ప్రతిభకు ప్రతిష్ఠకు
ప్రతీకగా ప్రకాశించిన
ప్రతినిధివి నీవు కానేకాదు.

నీవు నా కవితవు కావు
నా కవిత కిలాంటి మాటలురావు.

నా కవితా చానకి
ఎన్ని లక్షల అగ్నిపర్వతాలు
గుండెల్లో ప్రేలినా
బండబూతులు నడివీధుల్లో తిట్టదు.
నా కవితా ద్రౌపది
ఎన్నికోట్ల దుష్టదుశ్శాసనులు
చీరలు విప్ప యత్నించినా,
దిగంబరి కానేకాదు;
యమధర్మరాజే
స్వయంగావచ్చి
పాశంతో భర్త, పంచ

"నీ అడ్రసు దొరకడం లేదు"

జెండా కర్రలేమిటి?
సుకుమారమైన నీ గళంలోనుంచి, ఈ
స్లోగన్ల వాగన్లేమిటి?

ఎందుకు వచ్చింది నీకీ గ్రహచారం!
ఎవరు చేశారు నీకీ అపచారం!

పట్టుజలతారు వస్త్రాలు నీకు
కట్టబెట్టలేదనే కష్టంలేదు.
చేతిలో సంగీతం పలికే
సితారు లేదనే చింతలేదు. కాని
కనీసం కట్టుబట్టకూడా కరవై
కళ్లముందు తిరుగుతున్న నిన్ను
నవసమాజ నిర్మాణమంటూ
నడిరోడ్డుమీద ఉపన్యాసాలుదంచే
నాయకమ్మన్యులు, నీ మొహంమీద
తారుబూసి నిన్ను తాటకిలా
తయారు చేస్తుంటే
తపించి పోతున్నాను నేను
నీకిష్టులైన యూ ఇస్టులంతా
నిన్ను సజీవంగా, సహజంగా, కంపోజుచేసే—కాదు
'కంపోస్టుచేసే 'యూ నీ కవి' మిత్రులంతా
ఈ పైగంబరులంతా
నిజంగా పాపిష్టుల లిస్టులో చేరకపోతే
రెండు డజన్ల ఇడ్లీలూ, పూరీలూ,
రెండు పూటలా తాము మెక్కి
ఆకలి, రక్తం, స్మశానం, కంకాళం, అని
అందరిలో నిన్ను అరిపించి
ఆత్మారాముణ్ణి శాంతి చేసుకుంటున్నారెందుకు?
నీవు తిట్టే తిట్టు తిట్టుకూ తామంతా
తలకొక మెట్టు మెట్టు పైకెక్కుతున్నారెందుకు?

కట్టుబట్టవిప్పి నిన్నాడించి
పొట్టబోసుకుంటున్నారెందుకు?

లజ్జాశూన్యవైన నీకు
లావణ్యం ఎక్కడుంది?
దాస్యం చేస్తున్న నీకు
లాస్యమెలా కుదురుతుంది?
తెగదిట్టే నీ నాలుక
తేనె నెలా కురుస్తుంది!
కావు —నీవు నా కవితవు కావు.

తెలుగుసీమ కలకాలంగా
కష్టపడి సంపాదించుకున్న
మానానికి మర్యాదకు
సభ్యతకు సంస్కృతికి
ప్రతిభకు ప్రతిష్ఠకు
ప్రతీకగా ప్రకాశించిన
ప్రతినిధివి నీవు కానేకాదు.

నీవు నా కవితవు కావు
నా కవిత కిలాంటి మాటలురావు.

నా కవితా చానకి
ఎన్ని లక్షల అగ్నిపర్వతాలు
గుండెల్లో ప్రేలినా
బండబూతులు నడివీధుల్లో తిట్టదు.
నా కవితా ద్రౌపది
ఎన్నికోట్ల దుష్టదుశ్శాసనులు
చీరలు విప్ప యత్నించినా,
దిగంబరి కానేకాదు;
యమధర్మరాజే
స్వయంగావచ్చి
పాశంతో భర్త, పంచ

"నీ అడ్రసు దొరకడం లేదు"

ప్రాణాలులాగినా
నా కవితా సావిత్రికి
వైధవ్యంరాదు.
నీవు నా కవితవు కావు.
వెన్నుపోటు పొడిచి, జనం
కన్నుగప్పే మూడు ముక్కల పేకాటలో
కనిపించి మాయమయ్యే
కళావరు రాణీవి నువ్వు.
విలాసాల ముఖంతో
కాసె కొంగు బిగజుట్టి
కయ్యానికి కాలుదువ్వుతున్న
గజ్జెల గుర్రానివి నువ్వు.
అమాయకుల్ని రెచ్చగొట్టి
హారతి కర్పూరం చేసే
నారీ రూపం దాల్చిన
నకిలీ సైతానువు నువ్వు.
అందుకనే
ఎంత వెదికినా,
ఎక్కడ వెదికినా,
నీ అడ్రసు దొరకడం లేదు.



లుప్త విభక్తిక నామ్నీకరణం

శ్రీ చేకూరి రామారావు

తెలుగులో విభక్తుల సంఖ్య గురించి పండితులలో ఏకాభిప్రాయంలేదు. సాంప్రదాయిక వ్యాసకర్తలు ఏడు విభక్తులన్నారు. అందుకు కారణం సంస్కృత వ్యాకర్తలు సంస్కృత భాషకు ఆ సంఖ్యను నిర్ణయించటం. తెలుగువ్యాకర్తల సప్తసంఖ్యానిర్ణయానికి ఈ రెండు కారణాల్ని వూహించవచ్చు. 1. తెలుగ సంస్కృతజన్యమైనభాష. కాబట్టిసంస్కృతంలోఉన్నన్ని విభక్తులే తెలుగులోనూ ఉండాలి. 2. సంస్కృత వ్యాకర్తల నిర్ణయం సర్వభాషలకూ వర్తిస్తుంది. ఈ రెండిట్లో ప్రాచీనాంధ్రవ్యాకర్తలను ఏది ఎక్కువ ప్రభావితం చేసిందో చెప్పటం కష్టం. తరవాత వచ్చిన చారిత్రక వ్యాకర్తలు ప్రాచీనాంధ్ర వ్యాకర్తల సప్తసంఖ్యానిర్ణయాన్ని ఒప్పుకోలేదు. కొందరు మూడు విభక్తులే నన్నారు. మరికొందరు నాలుగు విభక్తులన్నారు. ఈ వివాదాలకు మూల కారణం భాషలో గుప్త (Deep) వ్యక్త (Surface) నిర్మాణాలని స్పష్టంగా గుర్తించకపోవటమే. ఈ భేదాన్ని సంస్కృత వ్యాకర్తలు గుర్తించారనటానికి ఆధారాలున్నై.

వాక్యాల్లో నామాలు, క్రియలూ ప్రధానమైన భాషా భాగాలు (Major Categories) నామాలకూ, క్రియలకూ ఉండే సంబంధాన్ని సంస్కృత వ్యాకర్తలు కారకాలన్నారు. ఈ కారకసంబంధాల్ని సంస్కృత వ్యాకర్తలు ఆరిటిని గుర్తించారు. అవి కర్తృ, కర్మ, కరణ, సంప్రదాన, అపాదాన, అధికరణ కారకాలు. ఈ కారకాలు భాషలో విభక్తుల ద్వారా వ్యక్తమవుతై. కొన్ని భాషల్లో విభక్తులుచేసే పనిని వాక్యంలో పదక్రమం (Word ordcr) నిర్వహించవచ్చు. కారకం విభక్తి అనేవి పర్యాయపదాలు కావు. అంటే కారకాలకీ విభక్తులకీ ఏకైక సంబంధం (Isomcrphism) లేదు. రెండు మూడు విభక్తులు వాక్య నిర్మాణ భేదాన్నిబట్టి ఒకే కారకాన్ని వ్యక్తం చెయ్యవచ్చు. 'సః కుంభాన్ కరోతి' "తేన కుంభాః క్రియంతే" "కుంభాః కృతా" "కుంభానాం కర్తా" అనే వాక్యాల్లో కుంభశబ్దం భిన్న విభక్తులతో వ్యక్తమయినా అవి బోధించే కారకం ఒకటే. అట్లాగే ఒకే విభక్తి భిన్న సందర్భాల్లో భిన్న కారకాల్ని బోధించవచ్చు. "రామేణ బాణేన హతో వాలీ' అనే వాక్యంలో తృతీయావిభక్తి రామశబ్దంతో ఉన్నప్పుడు కర్తృకారకాన్ని, బాణశబ్దంతో ఉన్నప్పుడు కరణ కారకాన్నీ బోధిస్తున్నది. పై ఉదాహరణలవల్ల అర్థానికి మూలమైన కారకం నిశ్చలమైందని వ్యక్తీకరణ భేదాలను అనుసరించి వచ్చే విభక్తి చలనశీలమైనదనీ తేలుతున్నది.

పూర్వ నామ్నీకరణ వ్యాసాల్లో ప్రవేశపెట్టబడిన పరిభాష ప్రకారం కారకం గుప్తనిర్మాణానికి సంబంధించిన పదమని, విభక్తి వ్యక్తనిర్మాణానికి చెందినపదమని ఇంతకుముందు వ్యాసాలతో పరిచయమున్నవారు ఈ పాటికి గుర్తించే ఉంటారు. భాషల మధ్య వ్యక్తనిర్మాణంలో కనిపించినంత భేదం గుప్తనిర్మాణంలో ఉండదు. అంతేకాక సర్వ భాషలకు ఒకే గుప్తనిర్మాణాన్ని ప్రతిపాదించవచ్చునని ఇటీవలి భాషా శాస్త్రవేత్తల విశ్వాసం. వాక్యాల అర్థనిర్ణయం గుప్తనిర్మాణంమీద ఆధారపడిఉంటుంది. అర్థానికి బాధ్యత వహించే గుప్త నిర్మాణం సర్వ భాషలకీ సామాన్యమని ఈ శాస్త్రవేత్తల అభిప్రాయం. ఇట్లాంటి అభిప్రాయమే సంస్కృత వ్యాకర్తలకీ ఉండి ఉంటుందని వూహించటం అసమంజసమేమీకాదు. గుప్త వ్యక్త నిర్మాణ భేదాల్ని సంస్కృత వ్యాకర్తలు గుర్తించారన్న, సంస్కృత భాషను ఆధునిక పద్ధత

లలో అధ్యయనం చేస్తున్న ఇటీవలి పాశ్చాత్య శాస్త్రజ్ఞులు కూడా గ్రహించారు. J. F. Stall (1967) "Word order in Sanskrit and Universal Grammar" అనే గ్రంథంలో ఇట్లా అంటారు.

"The Karaka theory can in fact be understood from the purely semantic interpretations of the deep structure. Alternatively and equivalently, it can be understood by studying the various sentences of the surface structure, in which identical grammatical relations of the deep structure are expressed." (Page 36)

సంస్కృత వ్యాకర్తలు పరిగణించిన ఆరు కారకాలు సర్వభాషలకు సామాన్యమని వారు ఉద్దేశించిఉంటారని అనుకున్నాం. ఇటీవలి పరిశోధనలవల్లకాని, ఇక ముందు పరిశోధనలవల్లకాని ఈ సంఖ్య పెరగవచ్చు. లేక తరగవచ్చు. అది ప్రధానంకాదు. భాషలో నామాలకి క్రియలకీ ఉండే సంబంధం స్థిరమనీ, ఆ సంబంధాల్ని పరిమిత సంఖ్యలో భాగాలుగా విభజించవచ్చుననీ, అవి సర్వభాషలకి సామాన్యమని, ఈ సంబంధాలు ఆ యా భాషల్లో విభక్త్యాదులవల్ల వ్యక్తమవుతయ్యని సంస్కృత వ్యాకర్తలు గుర్తించారన్నదే ఇక్కడ ప్రధాన విషయం.

ఈ విధమైన కారక—విభక్తి విభాగం పాశ్చాత్య వ్యాకర్తలు ఇటీవలివరకు గుర్తించినట్టు మన కాధారాల్లేవు. విభక్తి కారకాలు రెండింటికి వారు Case అనే మాటనే వాడారు. పరివర్తన సిద్ధాంతంతో ఒక భాగంగా ఇటీవలే (1967 లో) Charles Fillmore అనే ఆయన ప్రతిపాదించిన Case Grammar లో మొదటిసారిగా ఈ విభాగావశ్యకతను గుర్తించారు. సంస్కృత వ్యాకర్తల సంప్రదాయాన్ని ఆయన పరిశీలించినట్టు ఆయన వ్యాసంలో మనకు ఆధారాలు దొరకవు. అయినా సంస్కృత సంప్రదాయంతో పరిచయం లేకుండా విడిగానే ఒక అత్యాధునికుడైన శాస్త్రవేత్త ఇదే రకమైన నిర్ణయానికి వచ్చాడంటే కొన్నివేల ఏండ్ల కిందటే ఈ విభాగాన్ని ప్రతిపాదించిన సంస్కృత వ్యాకర్తల ప్రతిభా సంపన్నతకు ఆశ్చర్యపడకమానం. కారకం—విభక్తి అనే మాటల్లాగా Fillmore కి ఇంగ్లీషు భాషలో వేరు వేరు మాటలు దొరకలేదు. అందుకాయన Deep case, Surface case అనే మాటల్ని వాడారు. Deep case, కారకానికి, Surface case విభక్తికీ పర్యాయపదాలని వేరే చెప్పక్కర్లేదు. అందువల్ల ఈ వ్యాసంలో Fillmore వాడిన మాటలకు బదులు సంస్కృత వ్యాకర్తల సంప్రదాయాన్ననుసరించి కారకం—విభక్తి అనే పదాలే ఆ అర్థాల్లో ప్రయుక్తమవుతయి.

Fillmore కూడా ఆరు కారకాల్నే సూచించడం బహుశా యాదృచ్ఛికమైనా, గమనించదగిన విశేషం. అయితే సంస్కృత వ్యాకర్తల కారకాలకీ Fillmore కారకాలకీ వివరాల్లో తేడాలున్నై. వాటి నన్నిటినీ సమగ్రంగా చర్చించటాని కిది అనువైన సమయం కాకపోయినా, కొన్ని విశేషాంశాలను స్థూలంగా పరిశీలించటం అప్రస్తుతంకాదు.

Fillmore ప్రతిపాదించిన ఆరు కారకా లివి:

1. Agentive.
2. Dative.
3. Objective.
4. Factitive.
5. Instrumental,
6. Locative.

Agentive మన వ్యాకర్తల కర్తృకారకానికి సరిపోతుంది. క్రియావ్యాపారానికి ప్రధానాధారమైన ప్రాణివాచకమే Agentive. కర్తృ కారకమన్నా ఇదే. "స్వతంత్రః కర్తా" 'కర్తు రీప్సితతమం కర్మ'; 'కర్తుః క్రియయా వ్యాప్తు మిష్టతమం కారకం కర్మసంజ్ఞం స్యాత్' అనే సూత్రాల్లోనూ, వివరణలోనూ కర్త ప్రాణివాచకమనే సూచన[1] ఉంది. ఈప్సితమూ,

1. ఈ విషయాన్ని గమనించి నా దృష్టికి తెచ్చినవారు నా సహోపాధ్యాయులు డాక్టర్ హెచ్. ఎస్. అనంతనారాయణగారు. ఈ సందర్భంలో ఆయన రచించిన Karaka theory and case gramma అనే వ్యాసం చూడదగింది. అది ఇంకా అముద్రితం.

ఇష్టమూ ప్రాణులకు మాత్రమే కలిగే మనోవికారాలు కదా. వ్యాపారంవల్ల లాభనష్టాలు పొందిన దేహ మనః స్థితుల్లో మార్పు కలిగిన ప్రాణివాచకాన్ని సూచించేది Dative. ఇది సంస్కృతవ్యాకర్తల కర్తృ, కర్మ సంప్రదాన కారకాల్లో కొన్ని కొన్ని భాగాలతో సరిపోతుంది. వ్యాపారనిర్వహణలో ఎట్లాంటిపాత్రలేక 'న్యూట్రల్'గా ఉండే కారకాన్ని సూచించేది Objective. ఇది సంస్కృత వ్యాకర్తల కర్తృ, కర్మ కారకాల్లో కొంత కొంత భాగానికి సరిపోతుంది. వ్యాపారోద్భూతమైన పదార్థాన్ని సూచించే కారకం Factitive. ఇది సాధారణంగా సంస్కృత వ్యాకర్తల కర్మకారకంలో ఒక భాగానికి సరిపోతుంది. వ్యాపార సాధనకు ఉపయోగించే అప్రాణివాచకమైన ఉపకరణాన్ని సూచించేది Instrumental. "సాధకతమం కరణం" "క్రియా సిద్ధౌ ప్రకృష్టోపకారకం కరణ సంజ్ఞం స్యాత్" అనే సూత్రము వివరణా దాదాపు ఇదే ఆర్థాన్ని ఇస్తై. వ్యాపారం జరిగిన స్థానాన్ని సూచించేది Locative. ఇది సంస్కృత వ్యాకర్తల అధికరణ కారకం. Fillmore కాలాన్ని Locativeకారకం నుంచి వేరు చేశాడు. కాని వేరే కారకాన్ని కల్పించలేదు. అదీగాక పైన ఆరు కారకాలే కారక సర్వస్వం అని Fillmore భావించలేదు. ఇంక ఎక్కువ కారకాలు అవసరమని ఆయన గుర్తించకపోలేదు. అవి ఇకముందు పరిశోధనలో తేలవలసినవి. సంస్కృత వ్యాకర్తల అపాదానకారకానికి సరిపోయే కారకాన్ని Fillmore ఎక్కడా ప్రతిపాదించలేదు.

ఇక్కడ సంస్కృత వ్యాకర్తల అధికరణ కారకాన్ని గురించి కొంత చెప్పాల్సివుంది. ఇది Fillmore ప్రతిపాదించిన Locative case కి పూర్తిగా సమానం కాదు. దేశ కాలాల అవినాభావ సంబంధాన్ని సంస్కృత వ్యాకర్తలు గుర్తించారు. ఈ రెంటికీ చాలా భాషల్లో ఒకే రకమైన ప్రత్యయాన్ని ఉపయోగించటం మనం గమనించవచ్చు. అంతేకాక అధికరణ కారకంలో మూడు అంతర్విభాగాలున్నై, ఔపశ్లేషికం, అభివ్యాపకం, వైషయికం అని. ఆధారభూతమైన పదార్థంలో నిర్వచించదగిన వ్యాప్తిని సూచించేది ఔపశ్లేషికం. ఆధారాన్ని సర్వత్రా ఆశ్రయించి ఉండటాన్ని సూచించేది అభివ్యాపకం. ఇచ్ఛ, కోపం, కోరిక ఇత్యాది మనో వికారాల కాశ్రయమైన మూర్త అమూర్త పదార్థాలను సూచించేది వైషయికం. వైషయికాధారం కేవలం భావితం. సందర్శనీయంకాదు. ఈ మూడు ఆధారాలకూ తెలుగులోనూ, సంస్కృతంలోనూ, ఇంగ్లీషులోనూ ఒకే రకపు ప్రత్యయాల్ని (పూర్వ, పర విహిత విభేదాన్ని ఇక్కడ పరిగణించటంలేదు) ఉపయోగిస్తారు. అందుకు వేరే ఉదాహరణలు కూడా అవసరంలేదు. బహుశా చాలా భాషల్లో ఇట్లాగే ఉపయోగించవచ్చు. ఈ దృష్టితో చూస్తే సంస్కృత వ్యాకర్తల అధికరణ కారకం Fillmore ప్రతిపాదించిన Locative case కన్నా పటిష్ఠమైందని అంగీకరించక తప్పదు. సంస్కృతవ్యాకరణాల గనుల్లోనుంచిఆధునికులు గ్రహించాల్సిన వజ్రాలింకా చాలా ఉన్నాయ్యన్న మాట!

సంస్కృత కారకాలకీ Deep cases కీ ఉన్న సంబంధాల్ని గురించి అవి సర్వ భాషలకు సామాన్యంగా అనువర్తించే పద్ధతిని గురించి ఇంకా ఎంతో చెప్పదగింది ఉన్నప్పటికీ ఇది ఈ వ్యాసానికి ఆనుషంగికమే గనుక ఈ చర్చ ఇంతటితో ముగుస్తుంది. వేరే సందర్భం వచ్చినప్పుడు మరికొన్ని విశేషాలు ముచ్చటించుకోవచ్చు.

ఒక వాక్యాన్ని మరో వాక్యంలో నామంగా ప్రవర్తించేట్టు చెయ్యటానికి జరిగే వ్యాకరణ ప్రక్రియా విశేషాలను నామ్నీకరణాలని వ్యవహరిస్తున్నాను. అట్లాంటి పద్ధతుల్లో ఒకటి లుప్త విభక్తిక నామ్నీకరణం. ఈ పద్ధతిలో గర్భవాక్యం (మరో వాక్యంలో నామంగా ప్రవర్తించే వాక్యం)లో పదాల వరసలో మార్పు కలుగు తుంది. వాక్యంలో ఒకానొక నామం ఉద్దేశ్యం (Head) అయి, మిగతా వాక్యభాగం విధేయం (Attribute) అవుతుంది.[2]

---

2. ఉద్దేశ్యం=Head, విధేయం=Attribute అనే అర్థాల్లో డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తి గారు వాడుతున్నారు. పూర్వ వ్యాకరణాల్లో వీటిని వాక్యం వ్యక్తం చేసే విషయ (Information) భాగాలకు వాడారు. ఆ వాడుక ప్రస్తుత ప్రయోగానికి కొంత బాధకమే. చూ. ప్రౌఢ వ్యాకరణము, వాక్య పరిచ్ఛేదము, సూ. 6.

ఈ ప్రక్రియాగతిలో ఉద్దేశ్యంగా మారిన నామం అంతకు ముందున్న విభక్తిని కోల్పోతుంది. అందుకే దీన్ని లుప్త విభక్తిక నామ్నీకరణం అనటం. విభక్తి పోయినా కారకం నిలుస్తుంది. కాబట్టి దీన్ని కారక నామ్నీకరణం అన్నా అనవచ్చు. అందుకే యింతకు ముందటి పేరాల్లో కారకం నిశ్చలమైనదని, విభక్తి చలనశీలమైనదనీ అనటం. ఈ కింది ఉదాహరణను గమనిస్తే ఈ ప్రక్రియాగతిలో విశేషాలు తెలుస్తై.

(134) కిష్టప్ప కర్రతో కుక్కను కొట్టాడు
—కర్రతో కుక్కను కొట్టిన కిష్టప్ప
కిష్టప్ప కర్రతో కొట్టిన కుక్క
కిష్టప్ప కుక్కను కొట్టిన కర్ర

(134) లో ఒక వాక్యంనుంచి ఉద్దేశ్య మైన్నై. భేదాన్నిబట్టి మూడు నామబంధాలు నిష్పన్న మైన్నై. ఆ నామాలు మూలవాక్యం (kernel sentence) లోనూ, నిష్పన్ననామబంధాల్లోనూ క్రమంగా కర్తృ, కర్మ, కరణ కారకాల్ని బోధిస్తున్నై. ఈ నామాలు నిష్పన్న నామబంధాల్లో ఉద్దేశ్యాలయినప్పుడు మూలవాక్యంలోని విభక్తులకు లోపం జరిగింది. కర్తృ కారకాన్ని సూచించటానికి మూల వాక్యంలోను విభక్తి ప్రత్యయం లేదు. కర్మ కారకాన్ని బోధించే 'ను', కరణ కారకాన్ని బోధించే 'తో' విభక్తులకు లోపం జరిగింది. అయినా కారక సంబంధాలు నిల్చే ఉన్నై గనుక అర్థ బోధకే ఇబ్బందీ లేదు. ఈ నామ్నీకరణంలో మూల వాక్యంలోని సమాపక క్రియ నిష్పన్న నామబంధంలో క్రియాజన్య విశేషణంగా మారుతుంది.

నేటి తెలుగులో వ్యతిరేక క్రియకి ఒక క్రియాజన్య విశేషణం, అవ్యతిరేక క్రియకు కాల భేదాన్ని అనుసరించి మూడు క్రియాజన్య విశేషణాలు ఉంటయ్యని పూర్వనామ్నీకరణ వ్యాసాల్లో సూచించబడింది.

134 ని బట్టి మూలవాక్యంలో నామం మాత్రమే ఉద్దేశ్యం అవుతుందని, నామంతోపాటు ఉన్న విశేషణాలు అట్లాగే ఉండిపోతయ్యని అని పించవచ్చు. 135 ని పరిశీలిస్తే ఈ సందేహం తీరుతుంది.

(135) సరళ మద్రాసులో ఒక జరీ అంచు పచ్చ పట్టుచీర కొన్నది.
—సరళ మద్రాసులోకొన్న జరీ అంచు పచ్చ పట్టుచీర.

మూల వాక్యంలో నామం ఉద్దేశ్య స్థానానికి జరిగినప్పుడు అది తనతోపాటు తన వెనక ఉన్న విశేషణాలను కూడా వెంట తీసుకొని పోతుంది.

ఈ విధంగా నిష్పన్నమైన నామాలు సాధారణంగా భిన్నార్థ బోధకాలవుతై. (134)లో నిష్పన్నమైన నామబంధాలకు, (135) లో నిష్పన్నమైన నామబంధానికి—ఒక్కో దానికి రెండేసి అర్థాలున్నై. ఉదాహరణకు (134) లో చూపించిన 'కిష్టప్ప కుక్కను కొట్టిన కర్ర" అనే నామబంధాన్ని తీసుకుంటే రెండర్థాలు సాధించవచ్చు. ఒకటి: ఒక కర్ర ఉంది. ఆ కర్రతో కిష్టప్ప కుక్కను కొట్టాడు. రెండు: కొన్ని కర్రలున్నై. అందులో ఒక దానితో కిష్టప్ప కుక్కను కొట్టాడు. అట్లాగే (135)లో నిష్పన్నమైన నామబంధానికీ రెండర్థాలు చెప్పవచ్చు. ఒకటి: సరళ ఒక జరీ అంచు పచ్చ పట్టుచీరకొన్నది. అది కొన్నది మద్రాసులో. రెండు: సరళ కొన్ని జరీ అంచు పచ్చ పట్టు చీరలు కొన్నది. అందులో ఒకటి మద్రాసులో కొన్నది. ఈ రకమైన భిన్నార్థ బోధకత ఈ లుప్త విభక్తిక నామ్నీకరణం ద్వారా నిష్పన్నమైన నామబంధాలన్నిటికీ ఉన్నట్టుంది. దీనికి సరి అయిన కారణం చూపించాల్సిన బాధ్యత వ్యాకర్త మీద ఉన్నప్పటికీ, వీటిని గురించి ప్రస్తుతం మనకు తెలిసింది చాల తక్కువ. ఇంకా కొంత పరిశోధన జరిగితే తప్ప దీన్ని సాధించలేం.

పై వాక్యాల ఆధారంతో ఒక విషయం చెప్పవచ్చు. ఒక వాక్యంలో కర్తృ, కర్మ కారక బోధకే నామాల్లో ఏదైనా నిష్పన్న నామబంధాల్లో ఉద్దేశ్యంగా రాగలదు. కాని మిగతా విభక్తులు, కారకాలు అట్లా కాదు. వాటిల్లో గమనించాల్సిన విధి నిషేధాలు చాలా ఉన్నై. కొన్ని విభక్తులు, వాటి అర్థాలు, అవి లుప్తవిభక్తిక నామ్నీకరణంలో నిర్వహించే పాత్ర ఈ కింద చూపించబడుతుంది. తెలుగు 'తో', తృతీయా విభక్తి అంటారు, సాంప్రదాయిక

వ్యాకర్త్తలు. అంటే సంస్కృతంలో తృతీయావిభక్తి వ్యక్తం చేసే అర్థాల్లో చాలా వాటిని 'తో' వ్యక్తం చేస్తుందని. ఈ కింది వాక్యాలని పరిశీలించండి.

(136) అతను కలంతో పరీక్ష రాశాడు.
— అతను పరీక్ష రాసిన కలం

(137) అతను శ్రద్ధతో పరీక్ష రాశాడు
— *అతను పరీక్ష రాసిన శ్రద్ధ

(138) అతను జ్వరంతో పరీక్ష రాశాడు
— *అతను పరీక్ష రాసిన జ్వరం

పై మూడు ఉదాహరణల్లో మూలవాక్యాల (గీత గుర్తుకు ఎడం వైపున ఉన్న వాక్యాలు) వ్యక్త నిర్మాణాల్లో భేదం కనిపించదు. కాని గుప్త నిర్మాణాల్లో భేదం ఉంది. అదే నామ్నీకరణాల్లో వ్యక్తమైంది. (136) లో 'తో' కరణార్థకం. అందువల్ల నామ్నీకరణం సాధ్యమైంది. (137) లో శ్రద్ధతో అనేది పరీక్ష రాసిన పద్ధతి (manner) తెలియజేస్తుంది. ఈ అర్థంలో నామ్నీకరణం సాధ్యం కాదు. నామ్నీకరిస్తే వ్యాకరణ విరుద్ధమైన నామబంధం నిష్పన్నమయింది. (138) లో జ్వరం(తో) అనేది పరీక్ష రాయటానికి ఉపకరణమూ కాదు, రాసే పద్ధతీ కాదు. రాసినవాడి దేహ స్థితి. ఈ అర్థంలోనూ నామ్నీకరణం వ్యాకరణ విరుద్ధమయింది. (137) లో 'తో' స్థానంలో 'గా' ఆదేశం చెయ్యవచ్చు. (136) (138) లలో అది సాధ్యం కాదు.

విభక్తులకున్న భిన్నార్థాలవల్ల ఒక్కోసారి చమత్కారాన్ని పుట్టించ వచ్చు. రచయితలు వీటిని ఉపయోగించుకోటం గూడా మనం గమనించవచ్చు. ముళ్లపూడి వెంకట రమణ కూర్చిన 'నవ్వితే నవ్వండి' అనే పుస్తకంలో ఈ కింది జోక్ ఒకటుంది.

"అయితే ముద్దాయి నిన్ను విద్వేషోద్రేకాలతో కొట్టాడన్న మాట".

'క్రరతో గొట్టిండని చెబితే నీ గ్నాదయ్యా, ఆ మాయదారి మాటలు మనకొద్దు.'

పై ఉదాహరణలో న్యాయవాది సంభాషణలో 'తో' (137) లో ఉదాహృతమయిన వాక్యంలో 'తో' వంటిది. న్యాయస్థానంలో బోనులో నిలబడ్డ వాడి వాక్యంలో 'తో' (136) లో ఉదాహృతమైన వాక్యంలో 'తో' వంటిది.

'తో' సహార్థంలోనూ, వచ్యర్థ ధాతువుల అముఖ్య కర్మతోనూ ప్రయుక్త మవుతుంది. సహార్థంలో నామ్నీకరణం సాధ్యం కాదు.

(139) నేను సరళతో చెప్పాను
—నేను చెప్పిన సరళ

(140) నేను సరళతో వెళ్లాను
— నేను వెళ్లిన సరళ

'తో' ప్రయోగంలో ఇంకో చిన్న విశేషం ఉంది. ముందు ఈ కింది వాక్యాలను గమనించండి.

(141) సరళ సెనగ నూనెతో గారెలు వండింది.
—సరళ గారెలు వండిన సెనగనూనె.

(142) సరళ మినప్పప్పుతో గారెలు వండింది.
—సరళ గారెలువండిన మినప్పప్పు.

పైన ఉదాహరించిన వాక్యాలు, నిష్పన్నమైన నామాలు పైకి ఒకే రకంగా కనిపిస్తున్నప్పటికీ 'తో' ప్రయోగంలో భేదం ఉంది. నిష్పన్నమైన నామాలు ప్రయోగించిన ఈ వాక్యాలు గమనించండి.

(141) a సరళ గారెలు వండిన సెనగనూనె సూపర్ బజార్లో కొన్నది.
b సరళ గారెలు వండిన సెనగనూనె పారబోసింది.

(142) a సరళ గారెలు వండిన మినప్పప్పు సూపర్ బజార్లో కొన్నది.
*b సరళ గారెలు వండిన మినప్పప్పు పారబోసింది.

(141 a) (142 a)లో సెనగనూనె,మినప్పప్పు వంట అనే వ్యాపారంలో పాల్గొన్నవే కావచ్చు. లేకపోవచ్చు, అవే పదార్థాలు కావు. ఆ రకం పదార్థాలు' (Not the same, but the kind) అని ఉద్దేశించవచ్చు. b వాక్యాలలో 'రకం' అనే అర్థంరాదు. అదే పదార్థం అనే అర్థంలో 142 వ్యాకరణ

పువ్వు గుర్తున్న వాక్యాలుగాని, పద బంధాలు గాని' వ్యాకరణ నిష్పన్నాలు కావు.

నిష్పన్నం కాదు. గర్భ వాక్య గుప్త నిర్మాణాల్లో 'తో' ప్రయోగం పైవాక్యాల్లో భిన్న మన్న మాట. వంట అనే వ్యాపారంలో పాల్గొన్న మినప్పప్పుకి వ్యాపారానంతరం అస్తిత్వం లేదు. రూపాంతరం చెందింది. కాని సెనగనూనె వంట అయిం తర్వాత కూడా మిగుల్తుంది. అందువల్లనే పారబొయ్యటం సాధ్యమైంది.

తెలుగులో 'కు' విభక్తి షష్ఠి అన్నారు పూర్వులు. దాన్ని చతుర్థిగా భావించారుఆధునికులు. సప్త సంఖ్యా విభాగంలో దాని స్థానం ఏది అనే ప్రశ్న అప్రధానం. 'కు' తెలుగులో ఎన్నోఅర్థాల్లో ప్రయుక్తమవుతుంది. అందులో కొన్ని అర్థాల్లో నామ్నీకరణం సాధ్యమవుతుంది.

(143) వాళ్లు సినిమాకు వెళ్లారు

—వాళ్లు వెళ్లిన సినిమా.

పై వాక్యంలో 'కు' గమ్యాన్ని సూచిస్తుంది. ఈ అర్థంలో నామ్నీకరణం సాధ్యమైంది.

(144) పక్కింటామె పంచదారకు వచ్చింది.

—*పక్కింటామె వచ్చిన పంచదార.

(145) అత్తగారు మడి గట్టుకొని నీళ్లకువెళ్లింది.

— అత్తగారు మడిగట్టుకొని వెళ్లిన నీళ్లు

(146) అతను తెలుగు చదవటానికి అమెరికావెళ్లాడు

—*అతను అమెరికా వెళ్లిన తెలుగు చదవటం.

పై మూడు వాక్యాల్లో 'కు' ('కి', 'కు' కు రూపాంతరమే) వ్యాపార ప్రయోజనాన్ని సూచిస్తుంది. ఈ అర్థంలో నామ్నీకరణం సాధ్యంకాదు. పైవాక్యాల్లో 'కు' బదులు 'కోసం' కూడా ఉపయోగించవచ్చు. (146)లో 'కు' క్రియానిష్పన్నమైన వ్యాపారనామం తరవాత వచ్చింది. ఇట్లాంటి సందర్భాల్లో 'కు' సాధారణంగా వ్యాపార ప్రయోజనాన్ని సూచిస్తుంది.

దేశ కాలార్థాల్లో ప్రయోగించినప్పుడు 'కు' ప్రవర్తనలో గమనించాల్సిన విశేష మొకటుంది. ఈకింద వాక్యాల్ని పరిశీలిస్తే ఆ విశేషం తెలుస్తుంది.

(147) ప్రసాదు మద్రాసు(కు) వెళ్లాడు

—*ప్రసాదు వెళ్లిన మద్రాసు

ప్రసాదు వెళ్లిన ఊరు.

(148) ప్రసాదు పది గంటలకు కాలేజీకి వెళ్తాడు

—*ప్రసాదు కాలేజికివెళ్లే పది గంటలు

ప్రసాదు కాలేజి వెళ్లే టైం

(147) లో పువ్వు గుర్తున్న నామం ఇంకో మద్రాసు నగరం ఉంటే తప్ప వ్యాకరణ సమ్మతంకాదు. విశేషనామాల(proper nouns) కన్నిటికీ ఈ నియమం వర్తిస్తుంది. విశేషనామం బదులు సాధారణ నామం (common noun) ఉపయోగిస్తే వ్యాకరణ సమ్మతమే. (148) లో పువ్వు గుర్తున్న నామం విశేషనామం లాంటిదే. అంటే కాలంలో ప్రత్యేకమైన (specific) point ని సూచిస్తుంది గనుక వ్యాకరణ నిష్పన్నం కావటానికి వీల్లేదు. అదే మళ్లీ సాధారణ నామాన్ని ఉపయోగిస్తే వ్యాకరణ సమ్మతమైంది. General-Specific అనే విభాగా న్నాశ్రయించి ఇక్కడ నామ్నీకరణం సాధ్యం అయిందన్నమాట.

వాక్యంలో సమాపక క్రియ 'ఉండు' ధాతు నిష్పన్నమైనప్పుడు 'కు' స్వామ్యాద్యర్థాల్లో ప్రయుక్తమవుతుంది. ఈ అర్థాల్లో నామ్నీకరణం సర్వసాధారణంగా సాధ్యమవుతుంది. ఈ వాక్యాల్ని పరిశీలించండి.

(149)a. వాడికి డబ్బుంది

—డబ్బున్నవాడు
—డబ్బు గలవాడు

b. ఆయనకు ఇల్లుంది

—ఇల్లున్నవాడు
—ఇల్లు గలవాడు

c. వాళ్లకు పిల్లలున్నారు

—పిల్లలున్నవాళ్లు
—పిల్లలు గలవాళ్లు

d. ఆ అమ్మాయికి తెలివి ఉంది

—తెలివి ఉన్న అమ్మాయి
—తెలివి గల అమ్మాయి.

స్వామ్యాద్యర్థాలలో స్వామిబోధక నామం'కు'ను వదుల్చుకొని నిష్పన్ననామబంధానికి ఉద్దేశ్యమయింది ఈ అర్థంలో నిష్పన్నమయిన నామబంధంలో 'ఉన్న' శబ్దానికి వికల్పంగా 'గల' శబ్దం ఆదేశమవుతుంది. ప్రాచీన భాషలో అస్త్యర్థంలో స్వతంత్ర ప్రయో

గార్థమైన 'కల' (కలుగు) ధాతువు ఉంది. అది ఆధునిక భాషలో పై రకపు నామబంధాల్లో మిగిలిందన్న మాట.

గురించి "Concerning, because of, for the purpose of" అనే అర్థాల్లో ప్రయుక్తమవుతుంది. ఇది చారిత్రకంగా క్త్వార్థక రూపం కావచ్చు. 'గురించిన' అనే క్రియాజన్య విశేషణ రూపం కూడా ఆధునిక భాషలో క్వాచిత్కంగా కనిపిస్తుంది. ఇట్లాంటివే నేటి తెలుగులో 'సంబంధించి, సంబంధించిన'' అనే రూపాలు కూడా. వీటికి ''గురించు, సంబంధించు'' అనే మూలధాతువులు నిర్మించి క్త్వార్థక, క్రియాజన్య విశేషణ రూపాలను సాధించవచ్చు. అయితే ఈ మూల ధాతువుల ప్రయోజనం ఆ రూపాలను - (రెండేసి మాత్రమే) – సాధించటం వరకే పరిమితం. 'గురించి' రూప నిష్పాదన ప్రక్రియ ఏదైనా, దాని ప్రవర్తన మాత్రం ఆధునిక భాషలో విభక్తి ప్రత్యయం వంటిదే నని చెప్పకతప్పదు. 'బట్టి' అనేది నామాల తర్వాతనే కాక 'అన్నంత' క్రియమీద కూడా హేత్వర్థంలో వచ్చే ఒక విభక్తి ప్రత్యయం. దీన్ని కూడా పట్టు ధాతువుకు క్త్వార్థకరూపంగా నిరూపించవచ్చు. తెలుగు భాషలో వాక్య నిర్మాణానికవసరమైన, వ్యాకరణ ప్రవర్తనైక ప్రయోజనం కలిగిన శబ్దజాలం క్రియాపద నిష్పన్నమయ్యే ప్రక్రియాగతి ఒకటున్నట్టు తోస్తున్నది. నామీకరణకారకమైన 'అని' 'అను' ధాతు నిష్పన్నం. కష్టమైన, సులభమైన వంటి విశేషణాల్లో విశేషణత్వాన్ని సూచించే 'అయిన' 'అగు' ధాతు నిష్పన్నమయింది. కాని, కదా అనే రూపాలు అగు ధాతు వ్యతిరేక క్రియారూపంనుంచి నిష్పన్నమైనట్టు భావించవచ్చు. అందువల్ల గురించి ఒకవేళ ధాతు నిష్పన్నమైన రూపమైనా వ్యాకరణ ప్రవర్తన ననుసరించి దాన్ని విభక్తి ప్రత్యయంగా భావించటంలో వైరుధ్యమేమీలేదు.

గురించి—**Concerning**—అనే అర్థంలో ప్రయుక్తమైనప్పుడు మాత్రమే నామీకరణం సాధ్యమైనట్టు తోస్తున్నది.

(150) నేను సరళను గురించి చెప్పాను
నేను చెప్పిన సరళ

(151) నేను ఆయన్ని గురించి వచ్చాను—
* నేను వచ్చినాయన

(152) వాడు డబ్బు గురించి వచ్చాడు
—*వాడు వచ్చిన డబ్బు

పైన ఉదాహరించిన వాటిల్లో (151) (152) సంఖ్యల నామబంధాలు వ్యాకరణ నిష్పన్నాలుకావు. అక్కడ గురించి 'For the purpose of' అనే అర్థంలో ప్రయుక్తమైంది.

నుంచి దేశ కాలార్థాల్లో ప్రయోగించినప్పుడు వ్యాపారం మొదలైన చోటును, కాలాన్ని సూచిస్తుంది. ఈ అర్థాల్లో ఇది ప్రయోగించినప్పుడు క్రియ గమనార్థక ధాతుజన్యమై ఉండాలి. కాలార్థంలో బహు వచన నామం తరవాత ప్రయోగించినప్పుడు వ్యాపారోద్భవకాలాన్నేకాక కాలంలో వ్యాపార వ్యాప్తిని కూడా తెలియపరుస్తుంది. ఉదాహరణకు

(153) అతను పదేళ్లనుంచి మెడిసన్ చదువుతున్నాడు అనే వాక్యంలో 'నుంచి' చదువు అనే వ్యాపార వ్యాప్తిని తెలియపరుస్తుంది.

ప్రాచీన భాషలో—'కోలెన్' శబ్దానికి దాదాపు ఇవే అర్థాలున్నట్టు మనం గ్రహించవచ్చు.

ఈ అర్థాల్లో నామీకరణం సాధ్యంకాదు.

'నుంచిని' వల్ల, Because of అనే అర్థంలో కూడా ఉపయోగిస్తాం. ఉదాహరణకు

(154) నీ నుంచి మేం ఇన్ని కష్టాలు అనుభవిస్తున్నాం. ఈ అర్థంలోనూ నామీకరణం సాధ్యం కాదు. కాని Arden తన వ్యాకరణంలో

(155) నేను పువ్వులు కోసిన చెట్టు ఇదే

అనే వాక్యం (A progressive grammar of Telugu-2 nd edition P. 248) ఉదహరించాడు. ఈవాక్యంలో నామబంధం 'నేను (ఒక) చెట్టునుంచి పువ్వులు కోశాను' అనే వాక్యంనుంచే నిష్పన్నమయి ఉండాలి. ఈ నామబంధం వ్యాకరణ సమ్మతమయింనే. అట్లాంటిదే ఇంకోకటి చూడండి.

(156) అత్తగారు బావినుంచి నీళ్లు తెచ్చింది.
—అత్తగారు నీళ్లు తెచ్చిన బావి.

దీన్నిబట్టి 'నుంచి' అనే విభక్తి ఏకదేశ పృథక్కరణార్థంలో (Part from the whole) ప్రయోగించినప్పుడు నామ్నీకరణం సాధ్యమవుతుందని సూత్రీంచుకోవచ్చు. కాని ఈ కింది ఉదాహరణను గమనించండి.

(157) మా ఆవిడ మార్కెట్‌నుంచి కూరగాయలు తెచ్చింది.

—మా ఆవిడ కూరగాయలు తెచ్చిన మార్కెట్.

వ్యాకరణ సమ్మతమైన ఈ నిష్పన్న నామబంధంలో కూడా ఏకదేశ పృథక్కరణార్థం ఉన్నదా అనేది సమస్య.

(157) లో తెచ్చింది బదులు కొన్నది అనే క్రియ ఉపయోగిస్తే మార్కెట్‌నుంచి బదులు మార్కెట్–లో అని మార్చాలి. దీన్నిబట్టి ఇక్కడ ((157) లో) 'నుంచి'ని 'లో నుంచి' అని సంకీర్ణ విభక్తిగా భావించి 'లో'కు లోపం జరిగిందనవచ్చు. (156) లో కూడా ఇట్లాంటి వివరణ సరిపోతుంది. (155) లో 'నుంచి'ని 'మీదనుంచి' అని వివరించాలి. 'లో', మీద'—రెండూ స్థలనిర్దేశకాలయిన విభక్తి ప్రత్యయాలు. ఈ ప్రత్యయాలతో ఉన్న పదాలను ఉద్దేశ్యాలుగా చేసి నామబంధాలు నిష్పాదించవచ్చునని ముందు ముందు తెలుస్తుంది. పై వాక్యాలను లో—నుంచి అని, మీద–నుంచి అని వివరించటంవల్ల గుప్తనిర్మాణంలో ప్రదేశాన్ని సూచించే కారకమే ప్రధానమైనదనీ, 'నుంచి గమనార్థక క్రియ (Motion verb) వచ్చినప్పుడు వ్యక్త నిర్మాణంలో (అర్థ ప్రాధాన్యం లేకుండా వచ్చే) ప్రత్యయ విశేషమనీ చెప్పాల్సి ఉంటుంది. ఈ పై పద్ధతుల్లో దేన్ని ఎన్నుకోటానికైనా ప్రస్తుతమున్న ఆధారాలు చాలవు.

వ్యాపారోద్భూతమైన చోటు అనే అర్థంలో 'నుంచి' ని ప్రయోగించినప్పుడు నామ్నీకరణం సాధ్యంకాదని పైన చెప్పబడింది. ఈ సూత్రీకరణ ప్రకారం

(158) అతను వెళ్లిన ఊరు అనే నామబంధం "అతను ఊరినుంచి వెళ్లాడు' అనే అర్థంలో సాధ్యం కాదు. కాని ఈ సూత్రీకరణకు విరుద్ధమైన ప్రయోగాలు భాషలో కనిపిస్తున్నై. సి. విజయలక్ష్మి రాసిన 'కారు చీకటిలో కాంతిరేఖ' అనే కావ్యంలో "శవం వెళ్లిన ఇల్లులా" అనే ప్రయోగం ఉంది. దీనికి 'ఇంటినుంచి శవం వెళ్లింది' అనే అర్థం చెపితే పై సూత్రీకరణ తప్పుతుంది. ఇక్కడ కూడా (157) కి చెప్పినట్టుగా 'లోనుంచి' అనే వివరిస్తే సూత్రీకరణ నిలుస్తుంది.

ఒక తెలుగు సినిమాలో 'దిగి వచ్చిన దేవలోకానికే తిరిగి వెళ్లింది' అనే వాక్యం ఉంది. ఈ వాక్యంలో నామబంధానికి "దేవలోకంనుంచి దిగివచ్చింది" అని అర్థం. ఇక్కడ కూడా 'లోనుంచి' అనే అర్థం చెప్పవచ్చేమో. ఏదేమైనా ప్రస్తుతానికి వివరణ అసమగ్రంగానే చెయ్యక తప్పటంలేదు. ఇకముందు పరిశోధనలో ఈ సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారమార్గం దొరకవచ్చు.

'లో, మీద' అనే విభక్తులు తెలుగులో అధికరణ కారకాన్ని వ్యక్తంచేశాయి. ఔపశ్లేషికార్థంలో ఈ విభక్తు లుపయోగించినప్పుడు నామ్నీకరణం సాధ్యం అవుతుంది.

(159) డబ్బు పెట్టెలో పెట్టాను

—నేను డబ్బుపెట్టిన పెట్టె

(160) చెట్టుమీద చిలక ఉంది

—చిలక ఉన్న చెట్టు.

'లో' కాలార్థంలో కూడా ఉపయోగిస్తాం. అప్పుడు విశేషనామాని (Specific noun) కి సామాన్యనామం (General noun) ఆదేశంచేస్తే నామ్నీకరణం సాధ్యమవుతుంది.

(161) 1956 లో విశాలాంధ్ర ఏర్పడింది.

—*విశాలాంధ్ర ఏర్పడ్డ 1956

—విశాలాంధ్ర ఏర్పడ్డ సంవత్సరం

'లో, మీద' అనే విభక్తులు వైషయికార్థంలోనూ ప్రయుక్తమవుతై. ఆ అర్థంలోనూ నామ్నీకరణం సాధ్యమే.

(162) మంత్రిగారికి సాహిత్యంలో ప్రవేశం వుంది.

—మంత్రిగారికి ప్రవేశం ఉన్న సాహిత్యం.

(163) నేను పనిమీద వెళ్ళున్నాను

—నేను వెళ్ళున్న పని

పక్క, కింద, వైపు మొదలైన విభక్తులు కూడా స్థల సూచకాలయినా వీటితో నామ్నీకరణం సాధ్యం కాదు. 'లో. మీద' అనేవి సామాన్య ఔపశ్లేషి కార్థాన్ని సూచిస్తయ్. పక్క, కింద వంటివి ప్రత్యేక మైన Position ని సూచిస్తై.

ఈ లుప్తవిభక్తిక నామ్నీకరణంలో గమనిం చాల్సిన ఒక ముఖ్య విశేషముంది.

(164) నేను తిన్న అన్నం

అనే నామబంధంలో కర్తను లోపింపజేసి 'తిన్న అన్నం' అని అన్నా 'అన్నం' అనే నామానికి 'తిను' అనే క్రియతో ఉన్న సంబంధం మారదు. కాని అన్ని చోట్లా ఇట్లా మారకుండా ఉండటం సాధ్యంకాదు. కొన్ని నామాలకు కొన్ని క్రియలతో భిన్న వ్యాకరణ సంబంధా లుండవచ్చు. ఉదాహరణకు ఈ క్రింది నామ బంధాల్ని పోల్చి చూడండి.

(165) నేను చంపిన పులి

(166) చంపిన పులి

(165) లో పులి కర్మ, నేను కర్త.(166)లో పులి కర్తగా కనిపిస్తుంది. దీన్నిబట్టి ఒక సూత్రీ కరణ చెయ్యవచ్చు. ఒక నామం ఒక క్రియకు కర్త గానూ కర్మగానూ వ్యవహరించగలిగిన సామర్థ్యం ఉన్నప్పుడు, ఆ నామం లుప్త విభక్తిక నామ్నీకరణ పద్ధతిలో ఉద్దేశ్యమయితే, కర్తృపద సమర్థ పదేతరా భావంతో ఉద్దేశ్యనామమే కర్త అవుతుంది. అట్లాగే ఈ కింది నామబంధాల్ని పోల్చి చూడండి.

(167) నేను డబ్బు పెట్టిన పెట్టె

(168) నేను పెట్టిన పెట్టె

(167)లో పెట్టె అధికరణార్థంలోనూ (168) లో కర్మార్థంలోను ప్రయుక్తమయినై. ఈ భేదమూ పైనచెప్పిన దానిలాంటిదే. దీనికి కూడా పైలాగే సూత్రం చెప్పవచ్చు. ఒక నామబంధంలో ఉద్దేశ్యనామానికి క్రియతో కర్మార్థంలోనూ, అధిక రణార్థంలోనూ ప్రవర్తించగల సామర్థ్యం ఉన్నప్పుడు కర్మ పద సమర్థ పదేతరాభావంలో కర్మపదంగానే వ్యవహరిస్తుంది.

దీన్ని బట్టి కారక సంబంధాల్లో అంతరువులు (Hierarchy) ఉన్నయ్యని తెలుస్తుంది. ఈ అంతరువుల నిర్ణయానికి పై సూత్రాలు ఉదా హరణప్రాయాలు. ఈ మార్గంలో ఇంతకన్నా సమగ్రమైన వివరణ—అందుకు ఈ వ్యాసంలో ప్రయత్నించకపోయినా—ఇయ్యటం సాధ్యమే.

తెలుగులో లుప్త విభక్తిక నామ్నీకరణానికి తుల్యమైనది ఇంగ్లీషులో Relative clause నిర్మాణం. ఇంగ్లీషులో ఉద్దేశ్యం తరవాత విధేయం వస్తుంది. తెలుగులో ఉద్దేశ్యం విధేయం తరవాత వస్తుంది. ఈ లుప్త విభక్తిక నామ్నీకరణం కొన్ని వివరాల్లో తేడా ఉన్నా, తమిళాదిఇతర ద్రావిడ భాషల్లో కూడా ఇదే పద్ధతిఉంది. విధేయోద్దేశ్యాల వరస జాప నీస్‌లో కూడా ద్రావిడభాషల్లోలాగే ఉందని తెలు స్తున్నది. చూ. Ronald W. Langacker 'Mirror image rules.' Language Vol. 45. No. 3. 1969: 575—598) ద్రావిడ భాషల్లోలాగే జాపనీస్‌లో కూడా క్రియ వాక్యాంతంలో వస్తుంది. వాక్యంలో కర్త—కర్మ—క్రియలు వచ్చే వరసకీ ఈ రకపు నామ్నీకరణానికి ఏమైనా సంబంధం ఉందేమో తెలీదు. నామ్నీకరణ పద్ధతికీ భాషల్లో కర్త,- కర్మ— క్రియల వరసకీ ఉన్న సంబంధం ప్రత్యేకంగా పరిశో ధించవలసిన విషయం.

కారక సంబంధాల్లో అంతరువుల నిర్ణ యాన్ని గురించి పైన ఇచ్చిన వివరణ ఇతర ద్రావిడ భాషలకు కూడా వర్తిస్తుందని, ఈ వ్యాసకర్తవిశ్వాసం. ఆచార్య అగస్త్యలింగంగారు రచించిన వ్యాకరణంలో ఇందుకు వ్యతిరేకమైన సాక్ష్యం కనిపిస్తుంది. (చూ. S. Agesthialingom 'A Generative grammar Tamil' Annamalainagar. 1967).

లుప్త విభక్తిక నామ్నీకరణం

ఆయన ఉదాహరించిన (143 పేజీ) తమిళ **నామబంధాలు**, వాటికి సమానమైన తెలుగు నామ**బంధాలు** కింద ఇయ్యబడుతున్నై.

1. అటిచ్చె పయ్యన్ — కొట్టిన పిల్లాడు
2. వెట్టునె కత్తి — కోసిన కత్తి
3. వందె కాటు — వచ్చిన అడవి
4. విళుందె కూరె — కూలిన కప్పు
5. పొరందె నాటు — పుట్టిన దేశం

ఈ పై నామబంధాలన్నిటికీ రెండర్థాలున్నయంటా రాయన. కాని తెలుగులో అట్లా భిన్నార్థాలు కనిపించటంలేదు. 'కొట్టిన పిల్లాడు' అనే దానికి తెలుగులో దెబ్బలు కొట్టిన పిల్లాడు అనే అర్థమే కాని దెబ్బలు తిన్న పిల్లాడు అనే అర్థం రాదు. తమిళంలో ఆ రెండర్థాలూ వస్తయ్యట. 'కోసిన కత్తి' అనే బంధంలో కత్తి కర్త్రర్థకమూ, కర్మార్థకమూ. అని ఆయన వివరణ. ఆ భేదం ఆభాసమాత్రమే. కత్తి కోసింది అన్నా, కత్తితో కోశాం అన్నా కారకం ఒకటే. 'వచ్చిన అడవి' అనే బంధంలో అడవి ఎప్పుడూరాదు. దాని అర్థం మనమే అడవి దగ్గరికి వచ్చామని. ఈ రకంగాచూస్తే అగస్త్యలింగంగారు ఉదాహరించిన వాటిల్లో నిజంగా రెండర్థాలున్నట్టు కనిపించేది తమిళంలో అయినా మొదటి పదబంధంలోనే.

అగస్త్యలింగంగారు చెప్పినట్టు తమిళంలో లుప్తవిభక్తికనామాలకు ఈ రకమైన భిన్నకారక బోధకతే ఉన్నట్టయితే తమిళం ఈ విషయంలో తెలుగుకు భిన్నమన్నమాట. అతి ప్రధానమైన నామ్నీకరణ విధానంలో రెండు సజాతీయమైన భాషలు భేదించటం అసాధ్యంకాకపోయినా ఆశ్చర్యకరమే. ఇంకా ఈ భాషల్ని లోతుగా పరిశోధిస్తే ఈ భేదం అయథార్థం అని తేలినా తేలవచ్చు.



మోహనాంగి 'మారీచీపరిణయము'

శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు

సాహితీ సమరాంగణ సార్వభౌముడగు శ్రీకృష్ణ దేవరాయలకు మోహనాంగి యను నొక కూతురు గలదు. ఆమె మారీచీపరిణయమను నాల్గాశ్వాసముల కావ్యమును వ్రాసినది. ఆ కావ్యమునుబట్టి పెక్కు చారిత్రక విశేషములు పొడకట్టుచున్నవి. మొనమొన్నటి వఱకు కీ కావ్యమున్నట్లు తెలుగువారికి తెలిసినట్లేలేదు. శుక్లనామ సంవత్సరపు (1929—30) 'సమదర్శిని' ఉగాది సంచికలో శ్రీ సెట్టి లక్ష్మీనరసింహముగారు మోహనాంగిని, మారీచీపరణయమును పరిచయము చేసియున్నారు. అందాయన మారీచీపరిణయ కథా సంగ్రహమును, ప్రథమాశ్వాసములోని కథా ప్రారంభమువఱకు గల దాదాపు నూరు పద్యములను ప్రకటించియున్నారు. దానినిబట్టి రాయల దేవేరులలో తిరుమలదేవికి మోహనాంగియు, అన్నపూర్ణకు వేంగళాంబయు జన్మించినట్లు స్పష్టమగుచున్నది. మోహనాంగికి పెట్టుకున్న మొదటిపేరు తిరుమలదేవి యటు. అది కళత్ర నామధేయమయినందున, పిలువ పిలుగా రాయలవారామెను మోహనాంగియను ముద్దు పేరుతో బిలుచుకొనువారట. ఈ విషయములు దిగువ పద్యములనుబట్టి తెల్లమగుచున్నవి :

గీ. కనె సుతల 'మోహనాంగి'నైన నను దిరుమ
లాంబయందు నా చెల్లెలైనట్టి "వేంగ
ళాంబ" నన్నపూర్ణాంబికయందు; మాదు
జనకు డగు కృష్ణరాయ రాజన్యవరుళి.
—మారీచీ పరిణయము.

ఉ. తిర్మలదేవికే బొడమి
తిన్ గనుకన్ మును తిర్మలాంబయం
చర్మిలి పేరు నా కిడియు
నట్లుగఁ దాఁ బిలువంగ రామి, నన్
గూర్మిని మోహనాంగి యను
క్రొత్త సమాఖ్యను బిల్చు తండ్రికిన్
జర్మము గోసియిచ్చినను
జాలదు గాదె ఋణంబు దీర్పగన్"

మోహనాంగి ఆంధ్ర కవితా పితామహుడైన అల్లసాని పెద్దనవద్ద కావ్య నాటకాది సాహిత్య జ్ఞానమును బడిసినట్లు తెలియుచున్నది. దిగువ పద్యములో ఈమె యిట్లు గురుస్తుతి యొనర్చినది :

"పెద్దన విద్దెలందుఁ గడుఁ
బేర్వడ నీయన వేల్పు టొజ్జ పెం
పెద్దనఁ దక్కినట్టి కవి
యెట్టిఁడు నీతనితోడు బోల్ప గొ
ప్పెద్దన దెల్గు కైతకజుఁ
డే యగు నా యలసాని వంశపుం
బెద్దన మద్గురూత్తమునిఁ
బెద్దయు గౌరవ బుద్ధిఁ గొల్చెదన్."

మోహనాంగి తన గురుడగు నల్లసాని పెద్దననే కాక, తండ్రియగు కృష్ణరాయలను, భర్తయగు రామరాజును, ముక్కుతిమ్మనను, ధూర్జటిని, మాదయగారి మల్లనను, తిమ్మరుసును, భువన విజయ సభాంగణమును గూడ పేర్కొన్నది. తండ్రియగు కృష్ణరాయలను గూర్చి యిట్లన్నది :

"అకలుష మాధురీ కవిత
న య్యలసాని కవీశుబోలె న
ల్లిక బిగి, ముక్కు తిమ్మకవి
లీలను ముద్దుగుపల్కుఁ, బాండు రం
గ కవి గతిం బద్ధకమును
గల్గు కవిత్వముతోడ విష్ణు చి
త్తు కథ రచించు మజ్జనకుఁ
దోరపు బత్తి నుతించి మ్రొక్కెదన్."

కృష్ణరాయల కవిత్వమును పొగడుచున్న ఈ పద్యము దిగువ పద్యమును దలపించుచున్నది.

''అల్లసానివాని యల్లిక జిగి బిగి,
ముక్కుతిమ్మనార్య ముద్దు పలుకు,
పాండురంగ విభుని పదగుంభనంబును,
కాకమానిరాయ నీకె తగుర''..

మోహనాంగి పద్యమున కిది పుత్రికగా నున్నది కాక మాని మూర్తికవి రాయలకు పిమ్మటివాడు కదా! ఇట నొక సందేహము: పాండురంగ మాహాత్మ్యకర్త యగు తెనాలి రామకృష్ణుడు కృష్ణరాయలయాస్థానములో నున్నట్లు కొందఱు చరిత్రజ్ఞులు విశ్వసించుట లేదుకదా. ఆ పక్షమున రామకృష్ణుడు కృష్ణరాయలకు పిమ్మటివాడు కాగలడు. అట్టిచో ఆతని పదక్రమము (పదగుంభనము రాయల ఆముక్తమాల్యదలో నున్నదనుట యెట్లు పొసగును? లేదా, మోహనాంగి మారీచీపరిణయము రచించు నాటికి రామకృష్ణుని కట్టి ప్రసిద్ధి కలిగినదని యైనను సమాధానము చెప్పికొనవలయును. ఎట్లయినను ఈ యంశము చారిత్రక దృష్టితో సవిమర్శముగా పరిశీలింప దగినదై యున్నది. రాయల యాస్థానమున రామకృష్ణుడున్నాడనుటకు గూడ ఈ పద్యమొక సాధనము కావచ్చునుగదా!

మోహనాంగి తన భర్తను సంస్తుతించుచు చెప్పిన పద్యములు మిక్కిలి మనోహరములై యున్నవి.—

సీ. ''జిగిబిగి ప్రాయంపు వగలాండ్రు పొగడు సో
యగమందుఁ దొగఱేని యల్లుఁడగుచు,
భోగులన్ భోగులగాఁగఁ జేయఁ గలఁ ద
యాగుణంబున వార్ధి యల్లుఁ డగుచు.
విశ్వ విశ్వంభరా (గీశ్వరులున్ మెచ్చు
నైశ్వర్యమున గొండయల్లు డగుచు,
గవిసి 'ఖానుల' కవకవలాడజేయు నా
హవకేళి వసుధేవు నల్లుఁ డగుచు,
తే. ''గృష్ణరాయ 'వసుంధరాధీశునల్లుఁ
డౌట నల్లురఘుం దల్లుఁ డగుచు, నళియు
బిరుదు నరుదుగాఁ గొన్నట్టి బిరుదుమగని,
మగని మదిలోన నిల్పి నమస్కరింతు.

''నను దరియించు నట్లుగ నొ
నర్చెడి తారక మంత్రమయ్యు నే
ఘనుని సమాఖ్య నోటఁబలు
కంగను జెల్లదు గాన, నేను నె
మ్మనమున సంస్మరింతు నల
మద్విభు పద్మనజద్వయంబు, నే
గనులకు నద్దు కొందు నధి
కంబగు భక్తియు రక్తియుం దగన్.''

మోహనాంగి భర్త ఆరెవీటి రామరాజు. ఈయనను అళియ రామరాయలని కూడ వ్యవహరించుచుందురు. అళియ పదమునకు కన్నడమునం దల్లుడని యర్థము. భర్తపేరు భార్యగాని భార్యపేరు భర్తగాని చెప్పుట నిషిద్ధమని ఒక సంప్రదాయ మున్నది మనకు. ఆ సంప్రదాయమునుబట్టియే ఈమె దిగువరీతిని చమత్కారముగా రామరాజు పేరును తెలియ జేయుచున్నది.

'రాఘవా! మహీపుత్రికా రమణ! రావ
ణారి! జుహూరాణతనయావనా? యనఁ బ్రథ
మాక్షరావళి యేఘను నాఖ్య యవునొ
యట్టి మత్పతి దైవంబె యగౌనునాకు.

ఈ పద్యమున దిగువ గీటులుంచిన యక్షరములను వరుసగా చదివిన రామరాజు అగును. ఈపద ద్వయమును బట్టి మోహనాంగి పాతివ్రత్య ప్రభావము తెల్లమగు చున్నది. ఈమె సమస్యాపూరణములో అందెవేసిన చేయియట. ఎలప్పుడును సమస్యలను గూర్చి యాలోచించుట ఈమెకు పరిపాటి. ఒక్కసారి ''........కృష్ణరాయలు కొలువు విడిచి వచ్చి మెచ్చులం దెచ్చు నొక గదియందచ్చపుం జిత్తరువుంబోలె మెత్తని దిండునకొత్తుకొని చిత్తంబున మొత్తంబులై పుట్టు క్రొత్త యూహలకతంబున దన్నుంజూడని'' యామెను గాంచి యిట్లన్నాడట:——

''కన్ను బొమలు పైకెగసి యిటున్నవేల
చేతి యందిట్టు చెక్కిలి చేరెనేల?
చూపులిటు వట్టిబయలును చూచునేల?
పట్టి యెట్టి గట్టి సమస్య పట్టుకొంటి?
''అన నులికిపడుచుఁ గడుఁ జ
య్యన లేచి తదీయ మృదు పదాబ్జద్వయికిన్
వినతి యొనరించి నే దాఁ
పున నిలిచి మదింగల చనవున నిట్లంటిన్

''తండ్రి సమస్య పూర్తికి నె
దం దలపోయుటలేదు, మీరలే
మంత్రో మదీయ సాహసము
నారసి! కావ్య మొనర్పఁ బూనితిన్
'వీండ్రకుఁ బాకముండఁగఁ గ
విత్వపుఁ బాకమునేల? యంచు ని
ల్లాండ్రను గేలి సేయు జను
లందఱు మెచ్చెడు నట్టి శైలితో''

అందుకు రాయలవా రుప్పొంగి, ఆమె కావ్య నిర్మాణ సంకల్పమునకు సంతసించుచు ఇట్లన్నారు:

''చదువుల సరస్వతివి, నీ
మృదు కవితా శైలి స్త్రీలకే యననేలా!
తుదకుం గొమ్ములు తిరిగిన
మదవ త్కవిపుంగవులకు మహినిఁ గలుగునే!

''స్త్రీ లన్నంతనె చుల్క చేయుట కుమా
రీ! వరౌఢ్యమే సుమ్మి ! నా
రీ లోకంబున శేముషీయుతలు లే
రే పూర్వ, మింతేటికిన్
నాళీకాసను రాణి స్త్రీయెకద, యె
న్నం గోమలాంగి వచో
లాలిత్యం బది, మోటు పూరుషుల కే
లా యబ్బగా నేరుచున్?''

ఈ పద్య ద్వయమునుబట్టి మోహనాంగి చదువుల సరస్వతియనియు, ఆమె కవితా శైలి కొమ్ములు తిరిగిన కవీశ్వరులకు గూడ దుర్లభమనియు తెలియు చున్నది. అంతియే కాదు. స్త్రీలనుచుల్కనగా చూచుట వరౌఢ్యమనియు, స్త్రీలలో కూడ శేముషీ ధురీణలుందు రనియు, ఇందుకు నిదర్శనము చదువుల వేలుపైన సరస్వతియేయనియు ననుటచేత రాయలవారికి స్త్రీ జాతి యెడ గల సద్భావము కూడ వెల్లడియగు చున్నది. రాయలు తన కూతురు సత్కావ్య నిర్మాత్రి యగుచున్నదని సంతోషించి యూరకుండలేదు. ఆమె కావ్యమును తా నంకిత మందవలయునని కూడ ఉవ్విళ్లూరుచు ఇట్లనుచున్నాడు :

''కమ్మని తేనె లుట్టిపడఁ
గా నిపు డీ వొనరించు కబ్బమో
యమ్మరో! యుష దైవమున
కంకితముం జలుపంగ నీదు డెం
దమ్మున నీవు నిశ్చయ మొ
నర్చిన లెస్సయె! లేకయున్న, నా
కిమ్ము త్వదీయ కావ్య సుత
నే నెదఁ జేరిచి యాదరించెదన్''

ఈ సందర్భమున కావ్యకన్య నుద్వాహమాడఁగోరి రాయలు పలికిన పలుకులు చమత్కారావహములుగా నున్నందున, వాని నిట నుదాహరింప జాలకున్నాను.

కృష్ణరాయలకు మోహనాంగి కూతురు. ఆమె కృతి కూతురు రాయలకు మనుమరాలు. తా నా మనుమరాలిని బెండ్లాడవలయును. తా నా ముదుసలి; మనుమరాలా, లేబ్రాయపు జవరాలు. ఇద్దరికి పొందిక యెట్లు! ఇందుకు రాయల సమాధానము ''తక్కువ యీడు భార్యకు ఎక్కువ యీడు భర్తయే సుఖము గూర్చు''నని

''అవునవు ధాత్రిలో మనుమ
రాలిని బెండిలియాడవచ్చు నీ
నవనవ కావ్య కన్య యిది
నా యెడ వృద్ధ వరుండనౌట, మ
క్కువ పడదంచు మానుకొనఁ
గూడదు తక్కువ యీడు భార్య కె
క్కువయగు మక్కువన్ సుఖముఁ
గూరుచు నెక్కువయీడు భర్తయే!''

కృష్ణరాయలు మారీచిపరిణయమును గృతినందు నాటికి ఆయనకు మగ సంతులేదు. మోహనాంగికి గూడ సత్పుత్రులున్నట్లు తెలియుటలేదు. అందుకే ఆయన''దౌహిత్రు డుదయించినచో, వాడు రాజ్యాధిపతి కాగలడని యాశించినట్లును,ఆ భాగ్యములేకపోయినను, కావ్యకన్య యుదయించు టయినను పుణ్యమూ, పురుషా ర్థమేయని భావించినట్లీ'' దిగువ పద్యమువలన తేట తెల్లమగుచున్నది.

''పుత్రిక తొల్తఁ బుట్టఁ టతి
పుణ్యకరంబని నే నెరింగియుం
బుత్రుడు నా కొక్కఁడయినఁ
బుట్టమి, రాజ్యము నెల్లనేల దౌ
హిత్రుఁడె నాకుఁ దొల్త జని
యింపగ గోరెదగాన, గబ్బపుం
బుత్రిక నీవుగాంచునెడ
పుణ్యమునుం, బురుషార్థమున్ జని

"నగలిచ్చెద, నా సౌమము లె
చ్చుగ నిచ్చెదఁ గోరినట్టి సొమ్మిచ్చెద, నీ
సొగసుం గృతికన్యక ' కని
వగుచున్ నా మొగము చూచి నాయన పలుకన్.

మోహనాంగి యలరి తగిన రీతిగ నిట్లు చమత్కరించి పలికినది—

ముదిరిన కొలందిని రసము
గదిరెడు చెఱకట్టులు రసికత ముదిరిన నిన్
ముదుకడ వన వచ్చునె? యె
ట్లొదవును గన్యకల కిట్టి యొడయ డటన్నన్

కృష్ణరాయలు—

తియ్యని నుడువులును నడక
యొయ్యారము కలిగి భూషణోజ్వలయై నా
కెయ్యెడ రక్తి గొలిపి మృదు
శయ్యను నీ కృతిసుతపడ సమ్మతిసుమ్మీ

వ. ఇదె నిశ్చయ తాంబూలంబని నికటస్థిత కనక కలాచిక నుండి కర్పూర వీటికం దీసి నా చేతనునిచి మాటాడకుండ నాన లిడియె."

దీనింబట్టి చూడ కృష్ణరాయలకు తన కుమారి కృతిప్రణేత్రి కావలయునని యెంత సంబరమున్నదో తెలియుచున్నది. కనుకనే ఆ కావ్యమును తనకే యంకిత మీవలసినదనియు కోరి ఆనలుపెట్టినాడన్నమాట. తనవంటి సాహితీసార్వభౌముని కంకితమీవలసిన కావ్య మెంతగుణవంతముగా నుండవలయునో చూచుకొన వలసిన బాధ్యతసైతము మోహనాంగిపై రాయలు మోపినాడు. పితృభక్తి తత్పరయగు మోహనాంగి సైతము తండ్రి ఋణను తీర్చుకొనుటకే ఈ కావ్య నిర్మాణ కృషి సల్పినదని పాఠకులు తేలికగానే గ్రహింపవచ్చును. అందుకే పితృవంశాభివర్ణనమున నీమె యేఁబది పద్యములవరకు వ్రాసి చరితార్థయైనది. దీనితో కృతిపతి వంశాభివర్ణనము గూడ కలిసివచ్చినది.

"పసితనమందు నేను దన
ప్రక్కను జిందులు ద్రొక్కుచుండఁ గ్రొం
బసిఁడి పసందు టందియలు
బల్కెడి మువ్వల మ్రోత వింటకున్
వినువడు నాదు పద్దెములు
విద్దెల ముద్దియ పైఁడి యందెలం
దెసెగెడు మ్రోతలంచు విను
నిప్పుడు మజ్జనకుండు ప్రేమచే.

అంతియే కాదు. 'అమ్మా, నేను నీ కడుపున బుట్టుదును. నాకీ పేరే పెట్టవలసినది.' అని కూడ రాయలు మోహనాంగి నర్థించెడి వాడట. ఆయన పుత్రికా వాత్సల్య మెంతటిదో!

అమ్మా, నీ గర్భంబున
గ్రమ్మఱ జనియింతు సుమ్మ, కడుప్రేముడి నా
కమ్మోయి బెట్టుము, యీ నా
మమ్మే యను నాదు తండ్రి మక్కువయెంతో!

రాయల వారికి మోహనాంగి గారాబముల పట్టి. ఆమెతో ఆయన చదరంగ మాడును. ఆమె సమస్యాపూరణముల నాశించును. ఆమె వ్రాయు చిత్తరువులను మెచ్చుకొనును. ఆమె సంగీతమునకు కరగిపోవును. ఇంతటి చదువుల సరస్వతిని మెచ్చుకొని సహకరింపని తండ్రి యుండునా మఱి! ఉన్నచో ఆత డెంతటి విరసుడో చెప్పనయితిగాదు.

చతురంగ బలయుత సైన్యముల్ నడిపెడు
నతడు నాతో జతురంగమాడు,
గంగార్భటిని నాశుకవిత చెప్పునతండు
నా సమస్యా పూర్తి కాసచెందు,
దిక్కుడ్యములను సత్కీర్తి జిత్రించు నా
తండు నా వ్రాయు చిత్రములు మెచ్చు,
రాగసంభరితాంతరంగుఁడౌ నతఁడు నే
రాగ మాలాపింప రక్తిగాంచు,
నన్ను, మన్నాథు, నింట మన్ననలతోడ
గన్నులంగప్పుకొని ప్రోచెగాదె! యట్టి
పిత మహాకావ్యకర్త నన్ గృతిని గోరె
నాదు భాగ్యంబు వర్ణింపగాఁ దరంబె!

నాయన కిష్టవౌ కథయె
నాదు ప్రబంధముగా నొనర్తు, రా
మాయణ మన్న నాయనకు
మక్కువ మిక్కిలి యెక్కుడౌట, నే
నాయది కొంచు, కల్పితము
నందు నొకించుక చేర్చి కూర్చెదం
దోయజ సన్మరంద రస
తుందిల సుందర కందళోక్తులన్.

వ. అని నిశ్చయంబు సల్పి అనల్ప వైచిత్రితో నొక నవీన కథ కల్పించి, దానిని మారీచీ పరిణయం బను ప్రబంధంబుగా రచియింప నెంచి''నది మహాకవయిత్రి మోహనాంగి.

కథా సంగ్రహము

మోహనాంగి రామాయణ కథకు కొంత కల్పనము చేసి మారీచీపరిణయప్రబంధముగా సంతరించెదనని స్వయముగనే చెప్పినది. ఇట్లు చేయుటలో ఆమెకు రెండు ప్రయోజనములు సిద్ధించుచున్నవి. ఒకటి, తన పితృపాదుల కభిమానపాత్రమగు రామాయణమును చెప్పుట. రెండవది: ప్రబంధలక్షణోచితమగు నవ్యకథా కల్పనము. ఇద్దాని చేత తన కృతి కల్పనా విశేషావహ జాతిరత్నము గూడ నగు చున్నది.

''మారీచుడు విశ్వామిత్రయాగ సంరక్షణ సందర్భమున లక్ష్మణునిచే తూల గొట్టబడి దక్షిణ సముద్ర తీరమునం బడును. అక్కడ ఆతనికి పదునాలుగేండ్ల కన్య ఒక్కతె యగపడును. ఆ పిల్ల మారీచునకు శీతలోపచారములు చేసి వానిని తేర్చును. అప్రయత్న లబ్ధయగు నా కన్యను మారీచుడు అపత్య ప్రేమతో పెంచు చుండును. శరస్వతీ ప్రసాదమున ఆమెను విద్యావంతురాలి నొనర్చి దండకారణ్యములో— ఆశ్రమ నిర్మాణ మొనరించుకొని మారీచుడు నివసించు చుండును. మారీచునిచే సాకబడిన యా కన్య మారీచియను పేర బరగి, ఆతనికి పెంపుడు బిడ్డయైనది ఇంతటితో ప్రథమాశ్వాస కథ ముగియుచున్నది. మారీచి జన్మ ప్రకారాదుల ప్రశంస యిప్పటికి పాఠకులకు తెలియదు. వారీ కథ నెఱుంగ నుత్కంఠితులై యుందురు.

తరువాత మారీచుడు మారీచికి తన వృత్తాంతమును జెప్పబూనును. ఈ కథ సీతారామలక్ష్మణులు అరణ్యమున పర్ణశాలా నివాసము చేయువఱకు నడచును. సీతారాముల పర్ణశాల మారీచాశ్రమమునకు సమీపస్థమే. ఒకనాడు ఆశ్రమ సమీపమున గల పుష్పోద్యానములో మారీచీ లక్ష్మణులు పరస్పరసందర్శనము జరిగినది. వారి కన్యోన్యము ప్రణయబీజ మంకురించి ప్రవర్ధమానమగు చుండును. ఇంతలో, ఇదివఱకే లక్ష్మణునిచే దెబ్బతిన్న మారీచుడు అతనికి సమీపమున నుండుట క్షేమము గాదని తలంచి, తన నివాసమును లంక కివతలియొడ్డునకు మార్చుకొనును. అంత నొకనాడు మారీచి రావణుని కంటబడును. ఆత డామెను మోహించి దొంగిలించుకొని పోవ నుపాయ మాలోచించుచుండును. మారీచుడు బ్రతికి యున్నంతవఱకు మారీచి నపహరింప సాధ్యము కాదని రావణుడు తలంచి, యాతని చావునకు మార్గము నారయు చుండెను. దీనితో ద్వితీయాశ్వాస కథ ముగియును.

తృతీయాశ్వాసము శూర్పణఖా పరాభవముతో నారంభమగును. ఖర దూషణాదుల వధానంతరము శూర్పణఖ రావణునికి తన పరాభవ గాథను విన్నవించుట, ఆతడు క్రుద్ధుడై సీతాపహరణమునకు నిశ్చయించుకొనుట, అందుకు మారీచుని మాయలేడిగా ప్రయోగించుట— ఇత్యాదులు రామాయణకథాంశములు యథోచితముగా కొనసాగును. ఇప్పట్టున మారీచవధ జరుగుట, రావణుడు మారీచి నపహరించుటకుగూడ తోడ్పడుట కవయిత్రి కథా కల్పనా చాతుర్యమునకు నిదర్శనము. పిమ్మట రామా, రామాయని యేడ్చుచున్న సీతను, లక్ష్మణ, లక్ష్మణా, యని విలపించు చున్న మారీచిని రావణుడు లంక కెత్తుకొని పోయినాడు.

చతుర్థాశ్వాసమున, సీతాన్వేషణము, సుగ్రీవ సఖ్యము, సుందరకాండ కథ, సేతుబంధనము వర్ణింపబడును.

పంచమాశ్వాసమున రామాయణ యుద్ధకాండ కథ వర్ణితమైనది. అది లక్ష్మణ మూర్ఛ వరకు వచ్చును. రాముడు శోకాకుల చిత్తుడై నిరాశతో నున్నాడు. జాంబవంతు డప్పుడు పదునాలుగేండ్లు నిద్రాహారములు లేనివారు సంజీవి పోసిననే గాని లక్ష్మణుడు మూర్ఛనుండి తేరు కొనడని చెప్పినాడు. అట్టి కఠోరవ్రతు లెవరుందురని విచారించుచుండ, నారదు డేతెంచి మారీచి యను కన్య యట్టిదని చెప్పును. ఆమెను రప్పించి సంజీవి పోయించి లక్ష్మణుని బ్రతికించు కొందురు. పిమ్మట రామచంద్రుడు రావణుని గెలుచుట అసాధ్యమని తలంచి నిరాశతోనుండగా, నారదు డాతని నూరడించి రావణునికి బ్రహ్మవలన గలిగిన శాపమును వినిపించి, రావణునికి కాలము దాపురించిన దనియు, ఆతడు తప్పక మడియుననియు చెప్పి యుత్సాహమును గలిగించును. రావణుని శాప కథ యిది:—

రావణుడు బ్రహ్మదేవుని గూర్చి కఠోర తప మొనర్చి తనకు చావులేకుండునట్లు వరము గోరుకొనెను. బ్రహ్మ అట్టి వాంఛ ప్రకృతి విరుద్ధమనియు, పుట్టిన వారెల్ల గిట్టుట ప్రకృతి ధర్మమనియు తెల్పెను. అందుకు రావణు డపహసించుచు 'తాతా, కూతును కామించుట మాత్రము ప్రకృతి విరుద్ధము కాదా?'' అనెను. అందుకు బ్రహ్మదేవుడు కోపించి ''కూతును గామించినప్పుడే నీకు చావు కలుగును లే'' యనెను. అది వరముగాను, శాపముగాను గూడ పరిణమించినది. రావణునికి మారీచి కూతురు. ఆమె నీతడు వలచినాడు. కావున నితనికి బ్రహ్మ వాక్యముచే చావు తప్పదని నారదుడు మారీచి జన్మప్రకారము నిట్లు చెప్పినాడు.

నలకూబరుని కడకు పోవుచున్న రంభనొకసారి బలాత్కరించి రావణు డనుభవించినాడు. సద్యోగర్భమున మున అప్పు డామె కొక కూతురు పుట్టినది. రంభ ఆ శిశువు వచ్చుటనే వదలి తన దారిని పోయినది. పార్వతీ పరమేశ్వరు లా దారిని పోవుచు ఆ శిశువు వాక్రందనము విని వచ్చి, యా బిడ్డ నోదార్చి ఆ బాలిక నెవ్వరైనను దీసికొని పెంచువఱకు దాని కాకలి దప్పులుగాని, నిద్రగాని, ఎవ్వరివల్ల నే యపాయముగాని కలుగకుండునట్లు ఆశీర్వదించిపోయి వారు. ఆ బిడ్డ పదునాలుగేం డ్లచ్చట నట్లేయుండి తుదకు మారీచునకు దొరికినది. ఆతని పెంపుడువల్ల మారీచి యైనది. కనుక మారీచి రావణునికి ఔరస పుత్రికయే. అట్టి నిజకుమారిని వలచిన రావణుడు బ్రహ్మ శాపవశమున చావక తప్పదు.

ఈ కథ వెళంగించి నారదుడు రాముని మనశ్శల్యమును బెఱకివైచి యుద్ధ సన్నద్ధునొనర్చినాడు. మారీచి జన్మ వృత్తాంతమును ప్రథమద్వితీయాశ్వాసములలో ప్రస్తావింపకుండ, దాని నైదవ యాశ్వాసము వఱకును నిలిపి, లక్ష్మణ మూర్ఛావసరమున ప్రసక్తి కలిగించి తత్కథను జెప్పుటలో మోహనాంగి చూపిన కావ్య నిర్మాణ ప్రజ్ఞా విశేషము ప్రశంసనీయమైయున్నది. మారీచిని రావణతనయగా కల్పించుటలో నైతము కవయిత్రి ప్రతిభాశక్తి సువ్యక్తమగుచున్నది. దీనిచే ఆమె సుప్రసిద్ధమగు రామాయణ కథకు కల్పన యని చెప్ప వీలుగాని చక్కని కల్పన వెట్లు చేసి గెలుపొందినదియు స్పష్టము.

ఆఱవ యాశ్వాసమున రావణకథ, సీత అగ్ని ప్రవేశము, సీతా రామ లక్ష్మణులు అయోధ్యకు చేరుట, ఊర్మిళాదేవి నిద్ర, ఆమె పాలయల్క, మారీచీ లక్ష్మణుల పరిణయము—అను నంశములతో మారీచీ పరిణయము ఆరాశ్వాసముల రసవత్తర ప్రబంధమగుచున్నది.''

లోకోత్తర కవితా చాతుర్య సంపత్తి, కల్పనా పాటవముగల యీ కవయిత్రి కావ్యారంభముననే కావ్య కథా సూచనము గూడ చేసి అవుననిపించుకొన్నది. రాముడును, సీతయు కావ్యభర్తయగు శ్రీకృష్ణరాయని గాపాడవలయునని యీమె తొలి రెండు పద్యములలో గోరుచున్నది—

"శ్రీ మజ్జానకి లజ్జతో మెడను బు
స్తెం దాను గట్టించు కొం
చామై మంగళ సూత్ర మూర్మిళ గళం
బం దర్మిలింగట్టు శ్రీ
సౌమిత్రిం గన నట్టి నెత్తఁగఁ దదా
స్యం బాస్యమున్ వంచుచుం
క్షేమం జూచెడి రాముఁ డోముతఁ గ్రపన్
శ్రీకృష్ణరాయ ప్రభున్."

ఈ పద్యమున సీతారాముల కల్యాణముతో బాటే జరిగిన ఊర్మిళా లక్ష్మణుల కల్యాణము ప్రస్తావింపబడినది. ఇది భావిలో జరుగనున్న మారీచీ లక్ష్మణ పరిణయ కథను అలంతిగా సూచించుటయే. ఈ యంశము తరువాతి పద్యములో ఇంకను సుస్పష్టముగా దెలుపబడినది.

"వనముల బ్రహ్మచర్యమున
వర్తిలుచుండుటఁ జూచి కోరి వ
చ్చిన దనుజాంగనన్ మఱది
చేకొనఁ జీతని కొక్క యన్య క
న్యనుఁ జత గూర్పగావలయు
నం చెలనవ్వను బల్కు సీత తా
మనుచుత సజ్జనాగ్రణిని
మజ్జనకుండగు కృష్ణరాయనిన్''

ఈ పద్యములో లక్ష్మణుని కూర్మిళ ధర్మపత్నిగానున్నను, ఇంకొక ప్రియభార్యను గూర్పవలయునని సీతాదేవి మఱదిమీఁది నెనరున తలంచుట నిజము

గావే కావ్యములో నెరవేరినది కదా. ఇట్టి కావ్య శిల్ప వైదుష్యమున మోహనాంగి భాసనిపించుకొనుచున్నది.

కవిత్వ వైభవము

కావ్యములోని కృతిపతి వంశాభివర్ణనాదులను పరికించినచో, మోహనాంగి కవిత్వము గుణసంపన్నము భావభరితమునని ప్రతి పద్యమును చెప్పుచుండును. శ్రీకృష్ణదేవరాయలవంటి మహాకవిచక్రవర్తికి తనూజాతయైన యామె కవితా ప్రతిభ యం దెట్లు తీసిపోవును? ఈమె ఏబదియైదు పద్యములలో మారీచీపరిణయ కృతిభర్తయగు కృష్ణదేవరాయల వంశము నభివర్ణించినది. తన తండ్రి సాహసౌదార్య సౌజన్యాదులను స్వయముగా నెరింగినది కావున వానిని కనులకు గట్టినట్లామె వర్ణించినది. ఈ సందర్భమున కవయిత్రి తన గురుడగు అల్లసాని పెద్దనగారి మార్గమునే యనుసరించి, మను చరిత్రములో నాతడు రాయల వంశము నభివర్ణించిన త్రోవనే త్రొక్కినట్లు తోచును. తన తండ్రి విద్యా విశేషములను, ఆయన రాజధానియైన విద్యానగరమును గూర్చి యిట్లనుచున్నది—

"తాను గవీశ్వరుండట స
దా తనచుట్టును గూరుచుండి స
న్మానము లందువారు కవి
తల్లజులే యట! నైజ రాజధా
నీ నగరంబు కృష్ణధర—
ణీతలనేతకుఁ బేరుగిన్న వి
ద్యానగరంబుగాఁగఁ దన
రారుటలోన విచిత్రమున్నదే!"

ఈ పద్యమున "సన్మానము లందువారు కవితల్లజులేయట" అను పాదములోని ప్రౌఢయతి ఆరయదగినది. మోహనాంగికి తర్కశాస్త్ర ప్రవేశము గూడ నున్నదని దిగువ పద్యము చెప్పుచున్నది.

"అస్తోక ప్రతిభాపరామర గురుం
డౌ కృష్ణరాయండు శ
త్రుస్తోమా త్యపకీర్తిధూమతతి యెం
దుం బుట్టు, నందందుఁ దా
విస్తారోగ్ర నిజప్రతాప విపులా
గ్నిం గూర్చుచున్ "యత్ర ధూ
మ స్తత్రాగ్ని" యటన్న న్యాయము మదిం
బాటించుచు న్మాటికిన్."

కృష్ణరాయలు శత్రు స్తోమమను నపకీర్తి ధూమము పుట్టిన తావులందెల్ల నిజ ప్రతాపాగ్నిని విస్తరించుచున్నాడట. ఎంత సొగసైన భావము! ఇది "యత్ర యత్ర ధూమ స్తత్ర తత్రాగ్నిః" అన్న న్యాయము నూతగాగొని చేసిన మహావర్ణనము.

ఇట్టిదే మఱొక్కటి అద్భుతావహమైన వర్ణనము.

"నరసింహ ప్రభు కృష్ణరాయ రిపు తం
డంబుల్ విదారింప, భా
స్కర బింబంబున బుట్టు రంధ్ర మతి తే
జంబుంటచే నం దగో
చరమయ్యెం, బ్రతిబింబితంబగుచు మ
చ్చంబోలెఁ దోచున్ స్వకీ
య రుచుల్ లేక రవి ప్రభన్ వెలుఁగు నీ
హారాంశు బింబంబునన్."

"ద్వా వేతౌ పురుషౌ లోకే సూర్యమండల భేదినే
పరివ్రాట్ 'యోగయుక్తశ్చ రణే చాభిముఖే హతః'

యోగ మార్గమున శరీర త్యాగముచేసిన సన్న్యాసియు, యుద్ధమున పోరాడి హతుడయిన వీరశిఖామణియు సూర్యమండలమును భేదించుకొని యుత్తమగతికి పోదురని శాస్త్రము. ఈ శాస్త్రాంశము నాధారముగా దీసికొని ఈ భావము విస్తరింపబడినది. కృష్ణరాయలచే సమరనిహతులయిన శత్రువులు సూర్యమండలమును భేదించుకొనిపోగా, ఆ మండలమున రంధ్ర మేర్పడినది. సూర్యబింబము "జ్వాల మాలాకులము" గాన ఆ బెజ్జ మగ పడకున్నది. స్వయం ప్రకాశములేక సూర్యునిచే వెలుగు చంద్రబింబములో నీ సూర్యమండలము కలరూపు తోచి చంద్రునిలోని మచ్చగా దోచుచున్నదట! ఎంతటి గొప్ప యూహయో తిలకింపుడు. బీజపురము, గోల్కొండ సుల్తానులతో నెల్లప్పుడు రాయలవారికి స్మరములు సాగుచుండెడివికదా! యుద్ధములో మడిసిన తురుష్క వీరులు స్వర్గమునకు బోయి రంభాదులను రక్షింప మొదలిడినారు. ఆ రంభాదులు తమ విటుల వినోదముకోసము తమ వేసముల నిట్లు మార్చుకొన్నారట! ఈ పద్యము నవ్వు పుట్టించుచున్నది. చూడుడు.

సీ. పూర్వశి నెమ్మేని హొయలు చూపుటమాని
బురఖాను ధరియించి తిరుగసాగె
మేనక చీరలు మాని యిజారులుఁ
గుడితినీలున్ వేసికొనగ సాగె,
రవికల విడనాడి రంభ జుబ్బాలు, క
బ్బాలు బిబ్బిలట్లు వాడసాగె
లోచనంబులకు దిలోత్తమ కాటుక
మాని సూర్మా నిత్యమూనసాగె
తే. కృష్ణరాయ కరాసిచే ఢిల్లి గోల
కొండ, బీజపురంబులనుండి స్వర్గ
పట్టణంబున కరుదెంచినట్టి దొడ్డ
ఖాను బిడ్డల కుంపుడు కత్తె లగుచు"

ఇట్టి చమత్కారావహములగు పద్యము లీ కావ్యమున మరికొన్నియుం గలవు. మహానుభావుడగు రాయలను వర్ణించుటలో కవయిత్రి మిక్కిలి శ్రమించిన దనవచ్చును. రాయలవారు తెనుగునేలను పాలించి తెనుగురాజైన వీరభద్రపుత్రికను బెండ్లాడినాడట. అట్లే ఓఢ్రుడైన గజపతిత్వమునందిన ప్రతాపరుద్ర పుత్రికను బెండ్లియాడినాడట. అదేమోకాని, తురకరేడగు అశ్వపతి పుత్రినివరింపక పంక్తిలో పక్షపాతము చూపినాడట. ఎంత సుందరమైన భావమో చూడుడు! ఇది శత్రు పంక్తిలో ఆతడు చూపిన పక్షపాతము.

"తెనుగు నృపాలుడై నరప
తిత్వము కల్గిన వీరభద్ర పు
త్రిని, మరి యోఢ్రుడై గజప
తిత్వము కల్గు ప్రతాపరుద్ర పు
త్రిని వరియించియుం దురక
రే డగు నశ్వపతీశు పుత్రి గై
కొనక నృసింహ కృష్ణుఁ డొనఁ
గూర్చెను బంక్తిని బక్షపాతమున్"

విజయనగరసామ్రాజ్య కాలమున ముత్తెరంగుల రాజు లుండెడివారు. ఆంధ్ర రాజులు నరపతులు. ఓఢ్ర భూపాలురు గజ బలము విరివిగా గలవారగుట గజపతులు. తురుష్కులు అశ్వబల సంపన్నులైనందున అశ్వపతులు. నరపతులు, గజపతులు హిందువులైనందున వారి కూతుండ్రను రాయలు పెండ్లియాడెను. విమతులగు తురుష్కరాజన్యుల కుమారికలను రాయలుద్వాహ మాడలేదు. రాయలకు గల హిందూ మతాభిమాన మీ పద్యమున కడు చమత్కారముగ వర్ణితమైనది. ఒక్క సీసములో కృష్ణరాయల విష్ణుప్రియత్వము నెట్లు కొండాడుచున్నదో చూడుడు.

సీ. ఆముక్తమాల్యద నంకితంబందిన
యిలవేల్పు శ్రీ వేంకటేశ్వరుండు
తత్ప్రబంధంబునందలి కథా నాయకుం
డై యున్న శ్రీరంగ నాయకుండు
తనఁ దత్కృతి రచింపుమని కలం బ్రత్యక్ష
మైనట్టి శ్రీకాకుళాంధ్ర విష్ణు
వ్యాపబంధంబు వ్రాయకమున్న దా గొల్చి
నట్టి శ్రీ సింహాచలాధినేత
తే. సర్వగతుల రక్షింప, రాజపరమేశ
రాజ రాజాధిరాజ వీర ప్రతాప
మూరురాయరగండ ప్రముఖ బిరుద స
నాథుడై కృష్ణరాయ భూనాథు డలరు"

షష్ఠ్యంతములలోని యొక్క చక్కని పద్యమును మాత్ర మాకర్ణించి ప్రసంగాంతరమునకు బోదము.

"అమిత నిజాశ్రిత గృహ వ
ర్ధమాన బహువస్తు వాహ ధన కనకున్
విమతాళికనకు, ని
ర్మమతాగుణజనకునకును, మజ్జనకునకున్"

తన తండ్రి నిర్మమత్వ గుణ విషయమున జనక చక్రవర్తివంటి రాజర్షియని చెప్పి ఆయన యాధ్యాత్మిక జ్ఞాన సంపత్తిని వెల్లడించినది. కావ్య పీఠికనే ఇంత యుదాత్తముగా వ్రాసిన మహా కవయిత్రి కథ నింకనెంత చమత్కార భరితముగా కొనసాగించినదో చూడవలయునను తహ తహ సహృదయులకు సహజముగా నుండును.

కొన్ని చరిత్ర విశేషములు

మోహనాంగి మారీచీపరిణయ కావ్యమును తండ్రి కంకితమీయ నిశ్చయించి, మూడాశ్వాసములు రచించినది. ఇంతవఱకును మగ సంతానములేని కృష్ణరాయల కప్పటికి సదాశివుడను కుమారు డుదయించినాడట. ఆ విషయమున కుప్పొంగిపోయిన మోహనాంగి చతుర్థాశ్వాసమును దిగువ పద్యముతో నారంభించి యా విషయమును ప్రస్తావించుచున్నది—

"శ్రీ సుమశర సమరూప వి
లాస విభాసుర సుపుత్ర లాభప్రాప్తా!
శ్రీ సౌమ్య తిరుమలాంబా
వాస హృదయ కృష్ణరాయ వసుధాధ్యక్షా!

"వ. తండ్రీ! నా యొనర్చిన పుణ్యం బగణ్యం బనుట నిస్సంశయంబు. ప్రశంసా పూర్వకంబుగా మీర నా కరంబున నిశ్చయ తాంబూలంబు పెట్టినది యెట్టి శుభముహూర్తంబోకాని, మీరు పరిగ్రహించి ధన్యం జేయనెంచిన నా కావ్య కన్య కరచరణాద్యవయంబు లేర్పడి, మత్కవితా గర్భంబునుండి వెలువడకమున్న, వెలందులతలమిన్న మా యంబ తిరుమలాంబాదేవి గర్భంబు ఫలించి పాలకడలి సంతానంబు వడువున నామె చిరకాంక్షిత పుత్ర సంతానంబు పడసినది. సదాశివు సత్కృపంబొడమిన మా తమ్ముడు సదాశివుడు శుక్లపక్ష యామినీ ధవుండుం బోలె దినదిన ప్రవర్ధమానుండై సౌందర్యంబున గంధర్వ సమానుండై తల్లి దండ్రులరగు మీకు, నక్కలమగు మాకుఁదక్కుంగల యెల్లవారలకు నల్లారు ముద్దుగాఁ బెరుగుచున్నవాడు.

"మార్కండేయ చిరాయువున్ సకల సా
 మ్రాజ్యంబు, నా చంద్ర తా
రార్కం బైన యశంబునుం గలిగి యే
 యంశంబునన్ దోష సం
పర్కం బొందక, కోరుటే తడవుగా
 మా ముద్దు తమ్ముండు తా
గోర్కుల్ తీరి సదాశివుండగుచు నీ
 క్షోణిన్ మనుం గావుతన్.

వ. చిరకాల మనోభీష్టసిద్ధిచే సంతుష్టాంతరంగుఁడవై యున్న యో తండ్రీ! పరాకుమాని యవధరింపు మనంతర కథా విధానం బెట్టిదనిన."

ఈ కావ్యమును 'సమదర్శిని' సంచికలో ప్రచురించి కీ. శే. సెట్టి నరసింహముగారు ప్రథమాశ్వాసము కథా ప్రారంభమువఱకుగల పద్యములనుమాత్రమే ప్రకటించి, చారిత్రక విశేషమునందు కాబోలు, చతుర్థాశ్వాసాదియందలి కృతి నాయక సంబోధనాంతమువఱకుగల, పై పద్య గద్యములను గూడ ప్రకటించినారు. దీనింబట్టి శ్రీ కృష్ణదేవరాయలకు సదాశివుడను పుత్రుడున్నట్లు తెలియుచున్నది. ఈయంశము నింతవఱ కెవ్వరును తడవియుండలేదు.

తెలుగు విజ్ఞాన సర్వస్వములో శ్రీ నేలటూరు వెంకటరమణయ్యగారు కృష్ణరాయలకు తిరుమల దేవరాయలను కొమరుడుండినట్లును, అతనికి పట్టాభిషేక మొనర్చి తిమ్మరుసయ్య సాయముతో తానే రాజ్య కార్యములను రాయలు నిర్వహించుచున్నట్లును, ఆ బాలుని విష ప్రయోగముచేసి తిమ్మరుసు చంపినాడను ననుమానముచేత రాయ లాతని కన్ను లూడ బెరికించినట్లును (393 పుట) వ్రాసియున్నారు. ఇంకను (394 పుటలో) కృష్ణదేవరాయల మరణ కాలమున ఆతనికి తిరుమలాంబయను యౌవనవతియగు పుత్రికయు, పదునెనిమిది మాసముల ప్రాయపు చిన్న కొమారుడును కలరు. క్రీ. శ. 1515—1516 ప్రాంతమున తిరుమలాంబను ఆరెవీటి బుక్కరాజు మునిమనుమడగు రామరాజున కిచ్చి వివాహము గావించి సంస్థానమునం దతని కున్నతోద్యోగమునిచ్చి సామ్రాజ్యాధికారములందు చొరవ గల్గించెను" అని వ్రాసియున్నారు. మోహనాంగి మారీచీపరిణయమును బట్టి చూచినచో రాయల వారికి మొదటి బిడ్డడే సదాశివుడని తేలుచున్నది. మఱి తిరుమలదేవరాయ లెవరు? సదాశివునికి తిరుమల దేవరాయలని కూడ పర్యాయ నామమున్నదా? ఉండుట కాస్కారము లేకపోలేదు. మోహనాంగి మొదటి పేరు తిరుమలాంబ కదా! అట్టే సదాశివుని సైతము తిరుమల నామముచే గూడ పిలుచుకొన్నారేమో! ఇవి యన్నియు ఆలోచనీయములైన యంశములు.

మారీచీ పరిణయమున్నట్లుగాని దానిని మోహనాంగి వ్రాసినట్లుగాని 1929 సమదర్శినిలో శ్రీ నరసింహముగారు ప్రకటించువఱకు నెవ్వరికిని తెలిసినట్లేలేదు. తరువాతనైనను చరిత్ర నిర్మాత లావిషయమున శ్రద్ధ వహించినట్లూహింప రాకున్నది. ఆంధ్ర కవితరంగిణి వ్రాసిన శ్రీ చాగంటి శేషయ్యగారుగాని, ఆంధ్రచరిత్ర పరిశోధకులగు శ్రీ మల్లంపల్లివారుగాని విజయనగర రాజుల చరిత్రలో ప్రత్యేక కృషి చేసిన శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారుగాని యీమె కావ్యమునుగాని, ఈ చరిత్రాంశమును గాని తడవినట్లులేదు. మోహనాంగి కాని, ఆమె మారీచీ పరిణయముగాని లేదనుటకు వీలు లేదుకదా. ఎవడో

కవి యీ కావ్యమును సృష్టించి మోహనాంగి కంట గట్టినాడని చెప్పుటకైనను ముందుకు వచ్చినవా రెవరు?

మోహనాంగి మారీచిపరిణయమును గూర్చి శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు తమ "ఆంధ్ర కవయిత్రులు"లో "ఈమె రాయల తనయ యను టెంత నిశ్చయమో, ఈమె కావ్యము మాత్ర మంత యదృష్టము. సాహితీవేత్తలకును, చరిత్ర పరిశోధకులకును నశ్రుతపూర్వమైన యీమె కావ్యము" అన్నారు. దీనినిబట్టి సమదర్శినిలో ప్రకటితమైన కావ్య భాగమును ఈమె చూడలేదని స్పష్టమగుచున్నది. "ఆంధ్ర కవయిత్రులు" (ప్రకటన 1953).

శ్రీ చాగంటి శేషయ్యగారు ఆంధ్ర - కవి తరంగిణి 7 వ సంపుటిలో శ్రీకృష్ణదేవరాయల జీవిత విశేషములను గూర్చి విపులముగా పరిశీలన జరిపియున్నారు. అందు వారు రాయలకు తిరువలాంబయనియు కృష్ణాంబయనియు నిరువురు సుత లన్నారనియు "తిరుమలాంబ తల్లి పేరేదియో తెలియదు. తిరుమలదేవి యని యందురు. కృష్ణాంబ జనని యెవ్వరో యదియును యెఱుంగరాదు. వీరి జనన కాలములును దెలియవు" అని వ్రాసినారు. మారీచీ పరిణయమునందలి

"కనె సుతల మోహనాంగినైన నను......"
"తిర్మలదేవి కే పొడమితినన్ను కన్మును...."

అను పూర్వోదాహృత పద్యములనుబట్టి మోహనాంగి (తిరువలాంబ) తిరుమలదేవి కూతురనియు, వేంగళాంబ అన్నపూర్ణాదేవి కూతురనియు స్పష్టమగుచున్నది. శ్రీ చాగంటివారు రెండవ కూతురుపేరు కృష్ణాంబ యన్నారు. వేంగళాంబకు కృష్ణాంబ యని కూడ పేరున్నదేమో మరి! ఈ సందర్భమున మోహనాంగి, యను పేరు 'కులస్త్రీ సహజముగ లేదే' అని కూడ కొందఱు సందేహము వెలిపుచ్చవచ్చును. కృష్ణరాయలు తన్ను ముద్దుగా ఆ పేరితో పిల్చుకొను చున్నారనియు తాను పట్టమహిషియగు తిరుమలదేవి కూతురనియు గ్రంథకర్త్రియే స్వయముగా చెప్పుకొనుచుండగా, ఇట్టి సందేహమునకు తావెక్కడ? తన తల్లియు, అన్నపూర్ణాదేవియు రాయలకు దేవేరులేయని దిగువ పద్యములో ఆమె చెప్పుచున్నది. ఇది ఒక సీసగీతము—

"భూసతియు శ్రీసతియు నాగ వాసిగాంచి
యున్న యన్నపూర్ణాదేవియును దిరుమల
దేవియును బట్టపుందేవులై వెలసెను
గృష్ణరాయ ప్రభుండు శ్రీ విష్ణునిభుఁడు"

సెట్టి లక్ష్మీనరసింహముగారు మారీచీ పరిణయపు తక్కిన ఆశ్వాసములను తరువాత ఏ పత్రిక లోనూ ప్రకటించినట్లు లేదు. కారణము తెలియదు. వారియింట ఈ పుస్తకము ఉండవచ్చును గదా. వారి బంధుమిత్రు లెవరైనను ఈ కావ్యమును వెలుగులోనికి తెచ్చుటకు పూనినచో సాహిత్యమునకును, చరిత్రకును గొప్ప మేలు చేసినవారయ్యెదరు. ఇంకెవ్వరి వద్దనైనను ఈ కావ్యమున్నచో, వారైనను పత్రికా ముఖమున ఆ విషయమును తెల్పుదురని కోరుచున్నాను. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీవారికి పుస్తకము ఉనికి తెలిపిన, వారైనను దీనిని ప్రకటించుయత్నము చేయగలరు. అకాడెమీ వా రిట్టి అజ్ఞాత గ్రంథములను, ప్రస్తుత మలభ్యముగానున్న కావ్యములను గూడ ప్రకటించినచో ఉత్తమమగు సాహిత్యసేవ జరుగుననియు ఈ సందర్భమున మనవి చేయుచున్నాను. 'సాహిత్య గౌరవమేకాక, చరిత్రాంశ ప్రాధాన్యమును గల "ఆంధ్ర నాగరఖండము, ఆంధ్ర విశ్వకర్మ పురాణము, సుద్యుమ్నరాజ చరిత్రము"వంటి కావ్యములు సైతము పునర్ముద్రణము నపేక్షించుచున్నవి.

గ్రంథ విమర్శలు

మాతృమందిరము

(నవల. రచన : వేంకట పార్వతీశ్వర కవులు. ఎమెస్కో పోకెట్ సైజు. 256 పేజీలు. వెల రూ. 2. ఎమ్. శేషాచలం అండ్ కో, సికింద్రాబాదు.)

తిరుపతి వేంకట కవులవలె యుగళ కవులు వేంకట పార్వతీశ్వర కవులు. వీరు చాలా బెంగాలీ నవలలను తెనిగించారు. 'మాతృ మందిరము' అన్న ఈ నవల వీరి స్వతంత్ర రచన. ఇది 1918 సం లో మొదట ప్రచురితమై తర్వాత మరో మూడుసార్లు ప్రచురితమై ప్రస్తుతం ఐదవ పర్యాయం ఎమెస్కో వారిచే ప్రచురితమైంది. ఎమెస్కోవారు ఆధునిక సాహిత్యంలో అనర్ఘరత్నాలు అన్న శీర్షికన ప్రాత తరానికి చెందిన కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీ నరసింహం ప్రభృతుల రచనలు ప్రకటించారు. ఆ వరుసలోనే ఈ పుస్తకమూ ప్రకటితమైంది.

మాతృదేశమే మాతృమందిరం. సాంఘికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా ఘన దేశం సర్వతో ముఖంగా అభ్యుదయాన్ని పొందే మార్గాలను ఈ నవల వివరిస్తుంది. అసలు ఈ మార్గాలను నిర్దేశించడానికే ఈ నవల రచితమైందనిపిస్తుంది. బాల్య వివాహాలు, జాతి విభేదం, అస్పృశ్యత, పశుబలి, త్రాగుడు, వడుపు వృత్తి మొదలైన దేశనాశనకర దుర్గుణాలను ఖండిస్తూ; అహింస, సత్యనిష్ఠ, దేశభక్తి, సర్వ జన సౌభ్రాత్రము మున్నగు భారత పౌర ధర్మముల నుద్బోధిస్తూ ఈ రచన సాగింది. ఈ నవలలో మంచికీ, చెడుకీ సంఘర్షణ రావడం, మధ్యలో చెడు మంచిని అణచివేసినట్లు కనిపించడం, చివరకు మంచి జయించి "సత్యమేవజయతే' అన్న మన భారతీయ విశ్వాసం నిరూపితం కావడం ఉంది. దీనిలో స్త్రీ పాత్రలు దాన వినయ సౌశీల్యాది సద్గుణోపేతలై భారతీయ స్త్రీ గౌరవాన్ని ప్రదర్శిస్తున్నారు.

అభ్యుదయం పేర ఈ నవలలో ప్రాచీనత యావత్తూ తిరస్కరింపబడలేదు. హైందవధర్మాన్ని పురస్కరించుకొని ఒక బాల వింతంతువు పునర్వివాహాన్ని నిరాకరిస్తుంది. బాల వితంతువులకీ పునర్వివాహాలకి అవినాభావ సంబంధం ఉండే అభ్యుదయ రచనలకి అలవాటుపడిన పఠితలకు ఈ సన్నివేశం విలక్షణంగా తోచవచ్చును. కాని ఆ రోజుల్లో ఇటువంటి స్త్రీలు ఎక్కువగా ఉండేవారనీ, వివాహాన్ని ఐహిక బంధంగా మాత్రమేకాక పారమార్థిక ధర్మంగా పరిగణించేవారనీ తెలుసుకొన్నవారికి సంఘటనలో గాంభీర్యం సహజత్వం అర్థంకాకపోవు. "మే మిఱువురము ధర్మము కొరకు దంపతులమైతిమిగాని, భవనముల కొఱకును బట్టణముల కొఱకును గాదుగద!" అంటుం దీ కథలో ఒక స్త్రీ పాత్ర. ప్రాచీన సంప్రదాయాల్లో కాలూని అభ్యుదయపథంవైపు దృష్టి సారిస్తుంది ఈ నవల.

కొన్ని నిర్దిష్టాభిప్రాయాలతో, ప్రధానంగా ప్రబోధాత్మకంగా నడిచిన ఈ నవలలో ఔత్సుక్యాన్ని ప్రేరించే గంభీరమైన కథ కొరవడడంలో ఆశ్చర్యం లేదు."ఈ స్త్రీ మూర్తి మధుమతి ననుసరించి వచ్చినదా? సత్యవతిని దీసికొనిపోవుటకై వచ్చినదా? ఈ రమణీమూర్తి ఎవ్వరు?" అంటూ ఈవిధంగా మధ్య మధ్య కథలో మనకు ఔత్సుక్యాన్ని పుట్టించడానికి రచయితలు బలవంతంగా ప్రయత్నించినా, కథలో పటుత్వం లేకపోవడంవలన ఆసక్తి అంతగా ప్రేరితంకాదు.

ప్రియునికోసం పరితపించి అతణ్ణి అన్వేషించిన వెలయాలు ఈ నవలలో ప్రత్యేకతగల పాత్ర. అయినా తక్కిన పాత్రలవలె ఈ పాత్రలోనూ బహిరంగ చిత్రణేతప్ప అంతరంగాన్ని ఈనవల పట్టి ఇవ్వడంలేదు. ఇట్లా అన్వేషించడానికి ఆమెకి అతనికీ ఏర్పడిన మానసికానుబంధం ఎట్టిదో ఈ కథలో చిత్రితం కాలేదు. పాత్రలు అభిప్రాయాల, ఊహల మూర్తులుగా కనిపించుతారు తప్ప నిసర్గంగా కనిపించరు.

వర్ణనలకి ఈ నవల ఆలవాలం. భాష గ్రాంథికమైనా ప్రసన్నంగా ఉంటుంది. వర్ణనలలో ఈషత్ ప్రౌఢంగా కూడా ఉంటుంది. ఆ కాలంలో భాషా విన్యాసం, నవలా రచనా పద్ధతీ ఎలా ఉండేవో తెలుసుకొందుకి ఈ నవల చదవ దగినది.

హాస్య సంజీవని

(నాటకముల సంపుటి. రచయిత: కందుకూరి వీరేశలింగము. ఎమెస్కో పాకెట్ సైజు. 216 పేజీలు. ధర—రూ. 2. ఎమ్. శేషాచలం అండ్ కో, సికింద్రాబాదు.)

నీతి చంద్రికలోని విగ్రహమునూ సంధినీ రచించిన 'పెమ్మట ఆ రచనలోని భాషా ప్రౌఢత్వాన్నిబట్టి అది సర్వజన సుబోధ్యం కాదని తలచి సాధారణ భాషలో వీరేశలింగం పంతులుగారు కొన్ని రచనలు చేశారు. వీటిలో 'బ్రాహ్మ వివాహము' అను నాటకం మొదటిది. ఈ ప్రహసనాన్ని 'పెద్దయ్యగారి పెండ్లి పుస్తక'మని జనులు విశేషంగా ఆదరించారు. తర్వాత వీరేశలింగంగారు అటువంటివి ఇంకా కొన్ని రచనలు చేశారు. వాటిలో 'బ్రాహ్మ వివాహము', 'వ్యవహార ధర్మ బోధిని' 'అపూర్వ బ్రహ్మ చర్య ప్రహసనము', 'మహారణ్య పురాధిపత్యము' అను నాలుగు ప్రహసనములూ ఈ పుస్తకంలో సంపుటీకరింపబడినాయి. వీటిలో మొదటి రెండూ స్వతంత్ర రచనలు. మూడవది ఒక ఆంగ్ల నాటికకు లనుసరణ, నాలుగవది నీతి చంద్రికలోని ఒక కథ ననుసరించి రచించినది.

ఈ ప్రహసనాలలో ఆ కాలంలో కొంతహెచ్చుగా ఉన్న బాల వృద్ధ వివాహాలు, కన్యాశుల్కం, భోగం మేళాలు, ఆడంబరాలు, న్యాయవాదుల అక్రమాలు— ఇవన్నీ ప్రదర్శితములై నిశితంగా ఆక్షిప్తములయినాయి. రైతుల, పేదల, దీన పరిస్థితి చూపబడింది. చివరి నాటకంలో నక్క జిత్తులు చివరికి ఎట్లా తెలిసిపోయి దానికి ముప్పు తెచ్చాయో చూపి తద్వారా తాదృశ శీలురను రచయిత ఆక్షేపించారు.

వీరేశలింగంగారు ప్రధానతః సంఘ సంస్కర్త. రచయితగా ఆయన ఆ హద్దులను అతిశయించరు. ఈ ప్రహసనాలు పూర్తిగా సంఘసంస్కరణకొరకు వ్రాసినవి. ప్రతిదృశ్యంలో, ప్రతి సంభాషణలో ఏదో ఒక సంఘ దురాచారం ఖండింపబడుతూనే ఉంటుంది. దీనికొరకు సంభాషణను కొంత చుట్టూ త్రిప్పించడానికి కూడా రచయిత వెనుదియ్యరు. ఉదాహరణకు "కలెక్టరు-మనము పడవమీద వచ్చినప్పటికీ, ఆ చార్జి వెయ్యక క్రమప్రకారం మఖ్యలేజీన్నీ భత్యమునూవేసి బిల్లు తయారుచేసి సొమ్ము వేగిరం డ్రా చెయ్యవయ్యా'' అని పలికిస్తారు.

కందుకూరి, చిలకమర్తి, గురజాడ, పానుగంటి ప్రభృతులు దాదాపు ఒకే సంఘ సంస్కరణాభిప్రాయాలతో సాహిత్య రచన చేశారు. వీరి రచనలలో సాహిత్యాత్మకమైన విలువలలో హెచ్చు తగ్గులున్నా, అభిప్రాయాలు ఒకే తీరువి. వీరందరూ వారికి పరిచితమైన ఒకే విధమైన జీవితాలను రచనా వస్తువులుగా తీసుకొన్నారు. వీరి రచనలలో వాస్తవికతతోబాటు అంతకు హెచ్చుగా అతిశయోక్తి కూడా కనిపిస్తుంది. 'వ్యవహార ధర్మబోధిని' పై ప్రకటించిన తన అభిప్రాయంలో వీరేశలింగంగారికి సమకాలికులైన వల్లూరి జగన్నాథరావుపంతులుగారు ఇదే వ్రాశారు— "Harsh expositions will sometimes do more harm than good, while they lower the whole community in the estimation of foreign nations....If you will pardon me, I will point out that some of the passages in your 'వ్యవహార ధర్మబోధిని' are too sweeping and condemnatory. You have overdrawn the picture altogether." అని. కాని వీరేశలింగంగారు వీరి అభిప్రాయాన్ని అంగికరించలేదు. "పుండు పుట్టినప్పుడు దానిని కోసి చికిత్సచేసి మాన్పింపక పుండే లేనట్లు నటించుటలో, లోపల కుళ్ళుచుండగా పైపై నిరామయ స్థితిలో నున్నట్లు పొగడుచుండుటవలన లాభ మెప్పుడును గలుగనేరదని నా యభిప్రాయము. కాబట్టి నేను వారి శ్రేయస్సునుగోరియే మనవారిలోగల దుర్నీతి రుజలను జూపి, ఇటువంటి యప్రియ గ్రౌంధౌషధ ప్రయోగమువలన బాగు చేయ జూచితినిగాని, వారి యందలి ద్వేషభావము చేతకాదు......'' అన్నారాయన.

వీరేశలింగంగారి ఉద్దేశం మంచిదే. కాని జగన్నాథరావుగారి అభిప్రాయంలోనూ నిజం లేకపోలేదు. ఈ రచన విదేశీయులకు మన సమాజంపై దురుద్దేశం కలిగిస్తుందని వారు శంకించారు. సుమారు నూరు సంవత్సరాల పిమ్మట, ఆనాటి ప్రజా జీవితంతో పరిచయంలేని మనకు కూడా ఈ పుస్తకాల

ద్వారా వారిపై మనకు దురుద్దేశమే కలుగుతోంది. కందుకూరి, గురజాడ ప్రభృతుల నాలుగు రచనలు చదువుతే నాలిగిటిలోనూ పదేళ్లలోపు ఆడపిల్లని డబ్బుకి ఆశపడి అరవై ఏళ్లు దాటిన వాడికిచ్చి పెళ్లి చెయ్యడం, వెంటనే వాడు చావడం కనిపించగానే, ఆనాటి సమాజంలో అన్ని పెళ్లిళ్లు ఇలాగే ఉండేవన్న భ్రమ మనకి కలుగుతోంది. కాని ఆనాటివారుమాత్రం మనవంటి మనుష్యులు కారా? చూస్తూ చూస్తూ పసిపిల్లను పండు ముసలి కెవరిస్తారు? ఆ రోజులలో చిన్న పిల్లలకి పెళ్లి చేసేవారు, వధూవరులిద్దరూ చిన్నపిల్లలై ఉండేవారు. వధువు బాలికా వరుడు మధ్య వయస్కుడూ కావడం కూడా అక్కడక్కడ ఉండి ఉండవచ్చును. వరుడు ముదుసలి కావడం ఎక్కడైనా సకృత్తుగా ఉండి ఉండవచ్చును. కన్యాశుల్క నాటకం పీఠికలో ఇచ్చిన వివరాలనుబట్టి ఇవి బహుశః కొంత గణనీయంగానే ఉండి ఉండవచ్చును. అంత మాత్రాన ఈ రచనల ద్వారా ఆనాటి ప్రజలు హెచ్చుమంది చాలా మూఢంగా, అమానుషంగా, నీతి బాహ్యులై జీవించారని మనం వూహించడం పొరపాటు. 'వ్యవహార ధర్మ బోధిని' అన్న నాటకంలో దొరయ్య అన్న కాపువానికి వీరన్న అన్న తన సోదరుడితో వ్యాజ్యం వస్తుంది. న్యాయాధికారుల అక్రమాలూ, తప్పుడు సాక్ష్యాలూ ఈ నాటకంలో విమర్శింపబడినాయి. వీరన్న దొరయ్యకు సోదరుడు కాడని సాక్ష్యం పుట్టించడానికి "సాక్షులు మీ వూళ్లో వాళ్లయితే బాగుండును' అని ప్లీడరు అనగా, దొరయ్య "మా వూళ్లో వాళ్లు లక్ష వరాలిచ్చినా, మే మిద్దరమూ అన్నదమ్ములు కామని పలుకరు" అంటాడు. గ్రంథకర్త అనుద్దిష్టంగా ఈ వాక్యంలో నాటి సమాజంలో ప్రాయశః నెలకొనిఉన్న న్యాయబద్ధ ధార్మిక దృష్టిని చెబుతున్నారు. ఇంతటి 'మంచి' సంఘంలో ఉన్నా దానిని వదిలి సంఘ సంస్కరణ దీక్షతో రచయిత ప్రయత్న పూర్వకంగా 'చెడు'నే తీసుకొని ఈ రచనలు చేశారని మనం ఇక్కడ గమనించాలి.

వీరేశలింగంగారి సంఘసంస్కరణ దృఢనిశ్చయాలు వారి సాహిత్యాన్ని మెళుసు చేశాయి. గురజాడవారి వలె "బాగా ఆలోచిస్తే యిస్పెంటు మేరేజి కూడా మనే తోస్తూంది." అని సంఘాన్ని చూసి నవ్వగలిగే హాస్య శీలంగాని;సాంఘికప్రయోజనం మాట అటుంచి, కళాత్మకమైన కల్పనతో గిరీశంవంటి పాత్రను కల్పించగలిగే కళాహృదయంగాని వీరికి లేవు. సంఘంలోవి దురాచారాలనేకాదు, తనకు వచ్చని అలవాట్ల నన్నిటిని ఈ ప్రహసనాలలో దుయ్యబట్టారు. పెళ్లిలో వసంతాలు జల్లడం, అప్పగింతలప్పుడు కన్నతల్లి దుఃఖించడం కూడా వీరి సంఘ సంస్కరణ ధాటికు లోనయినాయి. తల్లి దుఃఖం కల్లబొల్లి ఏడుపంటా రీయన.

'అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనము' ఒక ఆంగ్ల రచనకు అనుసరణ. ఈ రచనలో వైదేశికత బాగా కనిపిస్తోంది.

సంఘ సంస్కరణకి ఉద్దేశింపబడిన ఈ రచనలలో సాహిత్యపు విలువ పరిమితం. సంఘం మారినది. ప్రస్తుతం ఈ రచనల ఆవశ్యకత సందేహాస్పదం.

సత్యరాజా పూర్వదేశయాత్రలు

(నవల. రచయిత: కందుకూరి వీరేశలింగము. క్రౌనుసైజు. 156 పేజీలు. వెల: రూ. 2—50 ఎమ్. శేషాచలం అండ్ కో, సికింద్రాబాదు.)

ఆంగ్ల సాహిత్యంచే ప్రభావితులై ఆధునికాంధ్ర సాహిత్యంలో అనేక సాహిత్య ప్రక్రియలకు ఒరవడిపెట్టి తెనుగు వాఙ్మయానికి ఎనలేని సేవ చేసిన మహనీయులు కందుకూరి వీరేశలింగంపంతులుగారు. "తెనుగులో మొదటి వచన ప్రబంధమును నేనే చేసితిని. మొదటి నాటకమును నేనే తెనిగించితిని. మొదటి ప్రకృతి శాస్త్రమును నేనే రచించితిని. మొదటి ప్రహసనమును నేనే వ్రాసితిని. మొదటి చరిత్రమును నేనే విరచించితిని. స్త్రీలకై మొదటి వచన పుస్తకమును నేనే కావించితిని" అని వారు స్వీయ చరిత్రలో వ్రాశారు.

ఆంగ్లంలో జొనెథన్ స్విఫ్ట్ రచించినప్రఖ్యాత నవల గలివర్స్ ట్రావెల్స్ ఆనాటి సమాజంలో రాజకీయవేత్తల నధిక్షేపించే వ్యంగ్య రచన. దాని ననుకరించి వీరేశలింగంగారు ఈ నవల రచించారు. ఇది రెండు భాగాలు. మొదటిది ఆడు మళయాళము, రెండవది లంకాయాత్ర.

సత్యరాజాచార్యులు అనే ఒక మధ్వ బ్రాహ్మణుడు స్త్రీల ఆధిపత్యంలో నడుస్తున్న ఒక దేశానికి

వెళ్లి అక్కడి పరిస్థితులన్నీ చూసి చేసిన కథనం 'ఆడు మళయాళము' అన్న మొదటిభాగం. స్త్రీల పెత్తనంలో పురుషుల హీనస్థితిని వర్ణించే ఈ రచన, రచయితనాటి సమాజంలో స్త్రీలపై సర్వాధికారాలూ చెలాయిస్తున్న పురుషులపై నిశిత వ్యంగ్యం.

"లంకా యాత్ర"అన్న రెండవభాగం జ్యోతిషం మీద మితిమీరిన మూఢనమ్మకాలను విమర్శించే వ్యంగ్య రచన. "మన మనస్సు వచ్చినప్పుడు కన్నబిడ్డకు పేరు పెట్టుకొనుటకును, క్రొత్త తల గుడ్డ ధరించుటకును, క్రొత్త నగ పెట్టుకొనుటకును, పొలము దున్నుకొనుటకును, విత్తనములు చల్లుకొనుటకును, పండిన పంట కోసి కొనుటకును, గుఱ్ఱమునో, గోవునో కొనుటకును, మందు పుచ్చుకొనుటకును, ప్రభు దర్శనము చేయుటకును, విజ్ఞాపన పత్రికను పంపుకొనుటకును, ఇటువంటి మఱి యే యల్ప కార్యమును చేయుటకును కూడ స్వతంత్రులముకాక మనము సమస్తమునకును మింటనుండు గోళాకారముగల నోరులేని జడ పదార్థములు చెప్పునట్లే నడుచుకోవలసిన యెడల లోకములో వింతకంటె బానిసతనము మరియేముండును' అన్నది ఈ రచన మన కిచ్చే సందేశం.

సందేశంతో చమత్కారాన్ని జోడించి చేసిన ఈ రచన పఠితలకు మంచి కాలక్షేపాన్ని కలిగిస్తుంది.

భూమిలోని సమస్తజీవులమీదా, వారి స్వభావాలమీదా గ్రహాల ప్రభావం ఉంటుందని ఇటీవల శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. మనిషి జనన సమయానికీ అతని రక్త గుణానికీ సంబంధం ఉంటుందనీ, పంటలమీద తిథుల ప్రభావం ఉంటుందని నేటి శాస్త్రజ్ఞులు అంటున్నారు. కనుక మన పూర్వులకు జ్యోతిశ్శాస్త్రంమీద ఉండిన నమ్మకం ఈ నవలలో వీరేశలింగంగారు ఆక్షేపించినంతటి పనికిమాలిన నమ్మకం కాకపోవచ్చును. ఒకప్పుడు హేతుబద్ధమైన అభిప్రాయాల్లో రాను రాను మితిమీరి, ఉపపత్తిని కోలుపోయి మూఢ విశ్వాసాలుగా పరిణమించి ఉండవచ్చును.

—'పావని'

మోహనదాసు

(రచన: శ్రీ కొత్త సత్యనారాయణచౌదరి. మూల్యము: రు. 2—50. ప్రతులకు: రచయిత, లెక్చరర్, పి. బి. యన్. కాలేజి, నిడుబ్రోలు, గుంటూరు జిల్లా.)

గాంధిజీ శతజయంతి మహోత్సవ సందర్భముగా ప్రచురింపబడిన గ్రంథమిది. ఇది గాంధిగారి జీవిత చరిత్రమువలె లేదు. ఇందు 1. భారతావని 2. ఉత్తమమూర్తి 3. పంపిణి 4. ఘోరకలి 5. మహాపథము అను ఐదు దుపశీర్షికలున్నవి. ఒక్కొక్కదానిలో 68, 57, 52, 30 168 చొప్పున మొత్తము 375 పద్యములున్నవి. చివరి మహాపథమింతకుమునుపు చిన్న పుస్తకముగా ప్రచురింపబడినది. మిగిలిన విప్పుడు క్రొత్తగా వ్రాయబడినవి.

గాంధిమహాత్ముడు రాజకీయరంగమున ప్రవేశించుటకు పూర్వమున భారతదేశము స్థితిగతులను వర్ణించిన శీర్షిక మొదటిది. గాంధి మహాత్ముని వ్యక్తిత్వమును రేఖామాత్రముగా చిత్రించినది రెండవశీర్షిక. స్వతంత్రమగునాటికి భారతదేశమున కొంతభాగము చీలి మరొకదేశముగా పాకిస్థాన మేర్పడుటనెంచి ఆర్తిచెందుటను రూపొందించినది మూడవ శీర్షిక. ఘోరకలి బాపూ మరణ విషయము. తరువాతి మహాపథముగూడ దీనియొక్క పొడిగింపు.

శ్రీ సత్యనారాయణచౌదరిగారు మంచి వ్యుత్పన్నులైన కవులు. గాంధియందు భక్తి విశ్వాసములు

గలవారు కూడ. గాంధిగారి మరణము దేశీయులనంద రును కదలించినది. విదేశీయులనే కదలించినది. ఆయన సహజముగా చనిపోయియున్నచో అది యింత భావోద్వేగమునకు భాజనమయ్యేడిదికాదు. అందుకనియే కావచ్చును, మహానుభావు లట్టి దుర్మరణము పాలగు చుండుట చరిత్రలో కనిపించుట. ఆ మహనీయుని దుర్మరణశ్రవణమునకు కంపించిపోయి కవితాగానము చేసిన చాలమంది కవులలో శ్రీ సత్యనారాయణచౌదరి గారును ఒక్కరు. సర్వమును కాలముయొక్క నిడివి మీద విస్మృతి పాలగుచుండును. అట్లే గాంధిగారును ఆయన సాధించిన ఘనకార్యములును క్రమముగా విస్మృతిపాలగుచున్నవి. దానిని సహింపలేక శ్రీ చౌదరి గారు తన సోదర మానవులను తమ ఈ కవితారీతిచేత హెచ్చరించుచున్నారు. ఈచిన్ని కావ్యమున కదియే ప్రయోజనము. మరియొక విశేషమేమనగా నిది శ్రీ లాల్ బహదూర్ శాస్త్రికి అంకితమీయబడినది.

శ్రీ సత్యనారాయణచౌదరిగారు మంచి ప్రౌఢ మైన సాహిత్య వ్యుత్పత్తి కలిగి రచన చేయుచున్న వారు. సాహిత్య సంప్రదాయమంతయు వారికి కరతలా మలకము. చక్కని పద్య రచన చేయగల కొద్దిమంది తెలుగు కవులలో శ్రీ చౌదరిగారొకరు. కవితావస్తువు ఈ జాతికి జాతికి ఉత్తేజమును కల్పింపదగినది. ఒక ప్పుడు కల్పించినది.

ఒక్క కుటుంబమందుఁ గల
  సోదరులే మతరీతి జీలి యా
ప్రక్కకుజేరి యందు బల
  వంతులుగా గనిపించి సామ్య న
మ్యక్కృతి నొందజాలిరిది
  యంతయు జూచియు జూడనట్టులా
క్కొక్కడు సంచరించి తుది
  కూపిరి తీసిరి జన్మభూమికిన్

ఇది పంపిణిలోని పద్యము. శ్రీ చౌదరిగారి పద్యము లన్నియు నింత సూటిగాను, స్పష్టముగాను మరియు నింత తీవ్రముగాను నుండును. కవిత్వమునకు కావల సిన ప్రధాన సద్గుణము లధికముగాగల లఘు కావ్య మిది.

సాహితీ సుగతుని స్వగతం

(రచన: శ్రీ తిరుమల రామచంద్ర. ప్రచురణ విశాలాంధ్ర పబ్లిషింగ్‌హవుస్, విజయవాడ. వెల: మేలు ప్రతి : ఎనిమిది రూపాయలు. సాదాప్రతి: ఏడు రూపా యలు. పుటలు: క్రౌన్ సైజు 366)

ఆధునికాంధ్ర సాహిత్యకులలో మంచి సంప్ర దాయపుష్టి, అభ్యుదయదృష్టి గల రచయిత శ్రీ రామ చంద్ర. ఆయన అనేక పత్రికలలో అప్పుడప్పుడు వ్రాసి ప్రచురించిన వ్యాసములలో కొన్ని ఈ సంపుట మున సంగ్రహింపబడినవి. ఆయనవే స్వయముగా చెప్పుకొన్నట్లుగా ఇందలి కొన్ని వ్యాసములు వశాలిక పరిశోధన మనస్కాలు. మరికొన్ని విషయ నివేదన మాత్ర పరాయణాలు. ఇంకను కొన్ని ఊహోన్మేషవిలసి తాలు. ఈ విధముగానున్న ఈ వ్యాసములన్నింటి లోను రచయిత చేసిన పరిశ్రమ మరియు రచయిత ప్రదర్శించిన సత్య సన్నిహితదృష్టి స్పష్టముగా నున్నవి. ఇంత పరిశ్రమ చేయుటకు, ఇంత సత్య సన్నిహితదృష్టి నలవరచుకొనుటకు శ్రీ రామచంద్రగారికున్న వెసులు బాటు మిగిలిన తెలుగు సమకాలీన సాహిత్యకులలో చాల మందికిలేదు. తెలుగు—సంస్కృతం, హిందీ, ప్రాకృత భాషలు, కన్నడం, తమిళం—ఇంగ్లీషు ఇన్ని భాషా సాహిత్యాలతో ఆయనకు సన్నిహిత పరిచయమున్నది. ఇంత విశాలమైన భాషాప్రపంచముల సొగసులు తెలిసిన వాడగుటయే ఆయనకున్న వెసులుబాటు. ఇంత సంప్ర దాయబలముండుటతోపాటు ఆయనకు సోషలిస్టు సాహి త్య దృక్పథము నం దాదరము కలిగినది. ఇదంతయు శ్రీరామచంద్ర ఎంత ఎత్తైనవాడో చెప్పు ప్రయత్నము. ఈ వ్యాసాలలో శ్రీ రామచంద్రగారి బహుముఖమైన ప్రతిభా వ్యుత్పత్తులను దర్శింపవచ్చును.

ఇక ఈ వ్యాసములను సంపుటీకరించుటలో రచయితగాని ప్రచురణకర్తలుగాని ఆధునికమైన శ్రద్ధను కనబరచలేదు. ఇందులో మొత్తము 32 వ్యాసము లున్నవి. అనుక్రమణికలో ఈ వ్యాసముల ప్రచురణకాలము సూచింపబడియున్నది. ఈ వ్యాసము లను కాలాను క్రమణముగా సవరించి సంపుటీకరించి యుండవచ్చును. అది రచయిత బుద్ధి వైభవము యొక్క పెరుగుదలవంటి విలక్షణ విషయాలను విచారించుట కెంతయో ఉపయోగపడెడిది. మరియు రచయిత ఇందులో కొన్ని వశాలిక పరిశోధనలని, మరికొన్ని విషయ నివేదన మాత్రములని, ఇంకా కొన్ని ఊహాబలముతో తర్కించినవని చెప్పుకొని నాడు. ఆ యా విశిష్ట వ్యాసముల నా మూడు భాగ

ములక్రింద విడదీసి అచ్చువేసి యుండవచ్చును. అది రచయితకు పెద్ద శ్రమ కాదు. ఆమాత్రపు పని ఈ వ్యాసములను అధ్యయనము చేయువారి కెంతయో శ్రమను తప్పించి యుండెడిది. ఇప్పుడీ ముప్పదిరెండు వ్యాసములలో ఏవి వరౌలిక పరిశోధనలో, ఏవి ఇతర ములో పాఠకులు ముందు నిర్ణయించుకొని వాటి బాగోగులు చూచుకొనవలయును. రచయిత తాను సునాయాసముగా చెప్పగలిగి పాఠకుల కుపకారము చేయగల పనిని చేయకుండుట ఒక్కటే ఈ గ్రంథ మునగల లోపము. ఇక మిగిలినవన్నియు గుణములే— "ఇంతటి విషయ వైవిధ్యంగల వ్యాసాలు రచించడానికి రచయితకు కేవలం శ్రమపడి చాలదు. అతనికి భాషలోని లోతుపాతులు తెలియాలి. శబ్దంమీద అధికారం ఉండాలి. ఇరుగు పొరుగుభాషల, ఒకే కుటుంబంలోని భాషలలో గాఢ పరిచయం ఉండాలి. అన్నిటి కన్నా మథించి తెచ్చిన అమృతాన్ని అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు పాఠకులచే ఆస్వాదింపచేయగల నేర్పుండాలి. పైగా లోక చరిత్ర, వృత్తాంతము, ఆచార వ్యవహారాలు గురించి తెలిసి ఉండాలి. వీటన్నిటిని మించి గాఢ పరిశ్రమ, దానికి తగిన చిత్తశుద్ధి ఉండాలి. ఇన్నింటిని పుణికిపుచ్చుకొన్న భాషా సంపన్నుడు శ్రీ తిరుమల రామచంద్ర."

ఇందులోని ప్రతి వ్యాసమును పేర్కొని ఏదో ఒక మంచి మాటను చెప్పవలయుననియే అనిపించుచున్నది. ఈ వ్యాసములంత నిశిత పరిశీలనా మహితములై సత్య లక్షణ సహితములై పరమాశ్చర్య కరముగా నున్నవి. ఆధునిక విద్వాంసులలో వేదము వేంకటరాయశాస్త్రిగారు మహా విద్వాంసులు. ఆయన నైషధ వ్యాఖ్యానమునపడిన ఒక పొరపాటును శ్రీ రామచంద్రగారు ఎంత మర్యాదగా సవరించి చూపినారో "నువ్వులు కొట్టిన ఇడి నూటిడి" వ్యాసములో చూడవచ్చును. శ్రీ రామచంద్రగారి కర్ణాట కాంధ్ర భాషా పాండిత్యము, పరిశోధనము రెండింటికి భాషాభూషణ వ్యాకరణముమీది వ్యాసము నిదర్శనము. నోయుని సుబ్బారావుగారి సౌభద్రుని ప్రణయ యాత్ర కావ్యమును విమర్శించిన వ్యాసము, నవ కవులలో పాశ్చాత్యుల భావ చిత్రణ అన్న వ్యాసము, నేటి తెలుగు కవితలో కల్పనాకామనీయకమున్నది శ్రీ రామచంద్రగారి ఆధునికాంధ్ర సాహిత్యముయొక్క సంపూర్ణమైన సద్వగాహనను పుక్కిలించుచున్నవి. మరియు అలంకార శాస్త్రమునాయన జీర్ణించుకొన్న రీతికి నిదర్శనములుగా నున్నవి. సమాజ శ్రేయస్సు—తృతీయ పురుషార్థం—ప్రాచ్య పాశ్చాత్య తత్త్వ విచారణ దృక్పథమున సమీక్షింపబడిన స్త్రీ పురుష లైంగిక సంబంధ విషయముగల వ్యాసము. శ్రీ రామచంద్రగారి ప్రతిభా వ్యుత్పత్తుల మేలు కలయికగల ఉత్తమ వ్యాసములలో నిది యొకటి. ఈవిధముగా చెప్పుట ఈ వ్యాస సంపుటము గౌరవమును తగ్గించుటకు దోహదము చేయవచ్చును. అన్ని వ్యాసములును హృద్యములు. అపూర్వ విషయాత్మకములు.

—క్షేమేంద్ర.

పసిడిబొమ్మ

(కథలు – గల్పికల సంపుటి)

(రచయిత: శ్రీ నెల్లూరి కేశవస్వామి. ప్రచురణ: ప్రత్యూష ప్రచురణ. ప్రతులకు: పోతుకూచి ఏజన్సీస్, 208 న్యూ బోయిగూడ, సికింద్రాబాద్, వెల: రూ. 2 పేజీలు: 123.)

కొందరు ఎందుకు రచన ప్రారంభిస్తారో వారికే తెలియదు. దేశంలో పదిమంది వ్రాస్తున్నారని వ్రాయటమేతప్ప ఎలా వ్రాయాలనేది ఆలోచింపరు. కథ—గల్పిక అని పేరుపెట్టి తమ ఆత్మక్షోభ అంతా ఏకరువు పెడతారు. క్షోభను ఏకరువు పెట్టాలంటే కథను—గల్పికను మాత్రమే ఆధారం చేసికొన నక్కరలేదు. వీనికన్న సులభంగా వ్యాసాల రూపంలో విషయాన్ని వివరంగా చెప్పవచ్చును. ఆధునిక కాలంలో వచ్చిన ప్రహసనాలు సమాజాన్ని అపహాస్యం చేసి తమ బాధ, వ్యథ అందులో చెప్పుకొన్నారు. అట్టి ప్రహసనరీతి ననుసరించినట్లయితే కథలు—గల్పికలుగా వివరించే అవసరం ఉండదు. నాడు వారు రచించినను నేటికిని వాటియొక్క ప్రభావం యింకా మాసిపోలేదు. 'నేటి రచయితలు సంఘాన్ని 'సెటైర్, చేయాలంటే కందుకూరి, పానుగంటి, చిలకమర్తి వారి రచనలు చదివి అర్థం చేసికొనవచ్చును.

శ్రీ నెల్లూరి కేశవస్వామి 'పసిడిబొమ్మ' అనే కథాసంపుటిని ప్రచురించారు. ఇందులో మొత్తం 14 రచన లున్నాయి. వీటిలో కొన్నికథలు గల్పికలు. ఇన్నివ్రాసి నప్పటికీ ఏ ఒక్కటి హృదయంపై చెరగని ముద్ర

వేయలేదు. కథ అంటే ఉపన్యాసంకాదు. వాక్చిత్రం కాదు. నిరంతరం మానవ జీవితం సమస్యలతో సంఘర్షణపడి పరిష్కారమార్గంకోసం అన్వేషించి ఒక ప్రయోజనం కలిగించటమే కథ. ఈ లక్షణం వీరి కథలలో కన్పించదు. పసిడిబొమ్మను చిత్రించుటలో కథకులు తప్పు త్రోవ పట్టారు. కథకు కావలసిన ఘటన అనుకూలంగా ఉన్నా దానిని ఒక కథగా తీర్చలేక 'పసిడిబొమ్మ'ను బయటకు పంపారు. ఒక మిత్రుడు తన మిత్రుని భార్యను కాపాడ లేక అశక్తుడై అర్థం గాకుండ బయట ప్రపంచానికి మార్గం చూపి తీరా అంతా జరిగిన తరువాత విచారించాడు. ఒక మిత్రుడు భార్యగా గ్రహిస్తానని ఒక బొమ్మను యింటికి తెచ్చాడు. కాని ఆ మిత్రుడు పరిస్థితుల ప్రభావానికి తట్టుకోలేక వదలిపెట్టి పోతాడు. పోయినా ఈ బొమ్మను కాపాడటానికి ఒక మిత్రుడున్నాడులే అని మనసులో వూహించుకోవటమే గాక లిఖిత పూర్వకంగా ఆ విషయాన్ని స్పష్టం చేసాడు. తలనొప్పిపుట్టే చిత్రణ యిది. ఈ కథను గోపీచంద్, కొడవటిగంటి—బుచ్చిబాబు అయితే ఎంతో అందంగా ఈ పసిడిబొమ్మను తయారుచేసియుండే వారు. అయినా ఒకరి ప్రియురాలిని మరొకరికి అప్ప చెప్పటం అన్యాయంగా ఉంది.

ఈ కథలో కర్తయొక్క ఉద్దేశం వారికే తెలియక ఎలాగో ప్రారంభించి కథ ముగించారు.

'చోటా లీడర్' ఒక గల్పిక. మంత్రిసత్తముల పైన పదునైన సెటైర్. కొంతమంది గాంధిటోపి తమకు ఆత్మరక్షగా ఉపయోగించుకొని చేయరాని పనులు చేస్తున్నారు. ఈ గల్పిక ఆ మహానుభావుల కొక చురకలా ఉన్నది.

ఉత్తరాలతో 'అక్కయ్యపెళ్లి' చేసారు. ఉత్తరాలతో పెళ్లి చేయటం ఎలా అని ప్రశ్నింపక నేడు జరుగుతున్న పెళ్లిళ్ల తంతు చూడండి. ఈ ఉత్తరాలే ప్రాముఖ్యం వహిస్తాయి. కథమాత్రం చిరాకు కలిగిస్తుంది. ఉత్తరాలు ఎక్కువ అయ్యేసరికి విసుగు పుడుతుంది. ఉత్తరాలు ఎక్కువ అయ్యేసరికి విసుగు పుట్టిస్తుంది కూడ.

ఇందులో ఏదీ అంతగా పేర్కొనదగిన రచన లేదు. సహజత్వం రచనలో సరిగా ప్రతిబింబింప చేయలేకపోయారు. అందం ఔచిత్యం ఎక్కువగా కన్పించవు.

ధరమాత్రం చాల తక్కువ. గెటప్ బాగా ఉన్నది. ఎమెస్కో పాకెట్ పుస్తకాలకన్న సైజుపెద్దది. ముద్రణలో దోషాలేవీలేవు. ఉన్నను అవి పేర్కొన దగినంతగాలేవని చెప్పవచ్చును.

ప్రేమించు ప్రేమకై

(న వ ల)

(రచయిత్రి: కె.రామలక్ష్మి. ప్రచురణ: యం. శేషాచలం అండ్ కో; మద్రాసు, మచిలీపట్నం, సికింద్రాబాద్. పాకెట్‌సైజు. వెల: రూ: 2; పేజీలు: 120)

శ్రీమతి రామలక్ష్మిగారు ఇంతకుముందు నవలలు, కథలు వ్రాశారు. ఎమెస్కోవారు వీరివి ఇదివరలో ప్రచురించారు. అనువాదాలు కూడ నవలలతోపాటు వచ్చాయి. ఇన్ని రచనలు చేసినా రచయిత్రి తమ రచనచే పాఠకుల హృదయాలపై బలమైన ముద్ర వేయలేకపోయారు. రచన చేయటం కష్టమే అయినా, ఆ రచన పాఠకులను రంజించాలంటే రచయిత్రి రచనలో పెరగాలి. ఈ విషయాన్ని రచయిత్రి గమనిస్తే చాల సంతోషం.

నేడు నవలలు రచించుటలో రచయిత్రులకే ప్రథమస్థానం లభిస్తున్నది. నవలా రచనలో రచయిత్రులు ప్రగతి పథాన్ని సాధిస్తున్నా కొందరు ఆ ప్రగతిని దర్శింపలేకపోవటం శోచనీయంగా ఉన్నది. ఇలాంటివారు నవలలో కథ కల్పిస్తున్నప్పుడు దానిలో ఎంత సహజత్వమున్నది? పాఠకులను ఇవి ఆకర్షింపగలవా? యను ప్రశ్న వేసికొని సంఘటనలు కల్పించిన రచన బాగా ఉండవచ్చు. ఏమీ ఆలోచన చేయక అస్తవ్యస్తంగా రచన చేసినట్లయితే దానికి పురిటిలోనే సంధి కొడుతుంది.

'ప్రేమించు ప్రేమకై' నవలను రచయిత్రి సమాజంలో తాను ఒక వ్యక్తినన్న మాట మరచిపోయి అవాస్తవిక పరిస్థితులలో వ్రాసారు. కథ అంటే కల్పనే అయినా వాస్తవికతకు స్థానం లేకపోతే దానికి ప్రాముఖ్యంలేదు. ఏమైనా నవల పూర్తిగా చదివి పూర్వాపరాలు పరిశీలిస్తే ఇది యొక సఫలయని చెప్పటం కష్టం. కథకు కావలసిన

గుణాలేవీ యిందులో కన్పడవు. రచయిత్రి కలలో కాంచిన కథలా తయారుచేసి నవలగా లోకానికిచ్చారు. కాశీమజిలీ కథల కీనాటికైనా సాహిత్యంలో స్థానముంటుందిగాని ఇట్టి నవలా సాహిత్యానికి కాస్తచోటైనా లభించదు. కష్టపడి వ్రాసినా రచయిత్రికి సరియైన ఫలితం దక్కలేదు. ఇది తెలుగు నవల అనేదానికన్న నవలఅంటే కొంతవరకు సమర్థించుకోవచ్చును. పేరు, వూరు, కట్టు, బొట్టు మార్చినంతమాత్రాన అది అచ్చమైన తెలుగు నవలయని రచయిత్రే అంగీకరింపనప్పుడు తక్కిన వారేవిధంగా సమాధానం పడగలరు?

లలితఅనే అమ్మాయికి ఒక అత్తయ్య ఉన్నది. ఆ అత్తయ్య ఆలనపాలనలోనే లలిత పెరిగింది. ఈ లలితకు మోహన్ అనే యువకునితో పరిచయమైంది. ఆ పరిచయాన్ని రచయిత్రి సహజంగా చిత్రింపలేక కృత్రిమంగా చిత్రించి నడివీధిలో వదలిపెట్టారు. లలిత—మోహనుల మధ్య ప్రేమభావాన్ని పెంపొందింపచేయటానికి అత్తయ్యను దూరంగా పంపించి రచయిత్రి వారిద్దరిమధ్య ప్రేమ భావాన్ని సృష్టించారు. కాని ఈ ప్రేయసీ ప్రియులమధ్య అంతస్థులు తలపుకు వచ్చాయి. ఒకొరి కొకరు అర్థం చేసికొనలేక వేరైపోయారు. లలితనుండి మోహన్ వేరైనా దేవదాసుగా మారలేదు. పోనీ లలితయినా 'పారు'గా మారలేదు. వారి ప్రేమ బీచి ఒడ్డునే ఉండిపోయింది. సరే ఈలోపల అత్తయ్యసంగతి ఏమయ్యిందని పాఠకులు అడుగుతారేమోనని రచయిత్రి అత్తయ్యను చంపివేసి ఒక టెలిగ్రాం లలితకు అందునట్లుగా చేసి వెంకట్రామయ్యర్ అనే లాయరు దగ్గరకు లలితను పంపారు. లలిత ముక్కుకు తాడుపోసి లాగి రచయిత్రి యిష్టమొచ్చినట్లు చేసి ముక్కూ మొహం తెలియని బలరామశాస్త్రి దగ్గరకు లాక్కొచ్చారు. లలితకు గార్డెన్‌గా బలరామశాస్త్రిని రచయిత్రే నియమించారు. రచయిత్రి పాత్రలను జీవమున్న వ్యక్తులుగాగాక మట్టిబొమ్మలుగా చేశారు. కథను యింకా పెంచాలని సరళను—సరస్వతిని కథలో యిరికించారు. లలిత తన అత్తయ్య ఆస్తికి వారసురాలయింది. బలరాంకు లలితను వివాహం చేసికొనాలని కుతూహలం లోపల ఉన్నదికాని పైకి చెప్పడు. నవలనుబట్టి కథ సుఖాంతమవుతుందని నిర్ణయించుకోవచ్చును.

నవల ఒక ప్రేమ కథ ఆధారం చేసికొని రచింపబడినది. లలితకు తెలియకుండ అత్త ఆస్తిని గురించి వెంకట్రామయ్యర్‌తో చర్చించటం, ఈ లాయర్ లలితను బలరాం దగ్గరకు పంపించటం మొదలగు విషయాలు చాల విచిత్రంగా ఉన్నాయి. ఇది నవలకు తగిన కథకాదు. అభూతకల్పనలతో రచింపబడిన రచన యిది. సంఘటనలు దొడ్డిదారిపట్టాయి.

ముఖం కడుక్కొని లాయరుగారికి ఫోన్ చేసింది లలిత. అత్తయ్య వస్తుందన్న ఆశవల్ల కాబోలు అప్పటిదాకా ఇల్లు బోసిపోలేదు. ఇంకారాదని తెలిసిన తరువాత ఇంటిలో నిశ్శబ్దం ఆవరించింది లలితకి. ఇకమీద ఎలా జరుగుతుందో అన్న బెంగ ఒక ప్రక్క కుంగతీస్తూంది!! ముఖం కడుక్కొనకుండా లాయరుగారికి లలిత ఫోను చేయకూడదా ? అవునులే ముఖం కడుక్కొని ఫోన్‌చేస్తే వదనం ఫ్రెష్‌గా ఉంటుందని గాబోలు 'ముఖం కడుక్కొని' అని ప్రత్యేకంగా చెప్పారు. అత్తయ్య యింటినుండి వెళ్ళిపోయినప్పుడు ఇల్లు బోసిపోయింది. అది ముందుగా చెప్పక రచయిత్రి తరువాత చెప్పారు. అవక తవకమైన సంభాషణలు కావాలంటే చాల చూపించవచ్చును.

రచయిత్రి మద్రాసులో ఉండి ఆంధ్రదేశ వాతావరణాన్ని ఊహించారు. ఆ ఊహలో అసహజమగు ఘటనలు వచ్చాయి. నవలగా తీర్చారు. ఈ నవల తెలుగు సమాజానికి ప్రతిబింబమని పొరపాటున కూడ చెప్పలేము. ఒక ప్రయోజనము, నైతికశక్తి వ్యక్తం చేయలేని నవలలు వ్రాసినందువలన ప్రయోజనం ఏమిటి!

ఒకే పాటకు రెండు రాగాలు

(నవల)

(రచన: కొమ్మూరి వేణుగోపాలరావు. ప్రచురణ యం. శేషాచలం అండ్ కో; మద్రాసు, మచిలీపట్నం: సికింద్రాబాద్ వెల: రెండు రూపాయలు.)

శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు 'పెంకుటిల్లు' నవల వ్రాసిన తరువాత ఆంధ్రుల హృదయాలలో ఒక స్థానం సంపాదించుకొన్నారు. ఆనవల తరువాత

ఆత్మజ్యోతి, జాబిలేని జాబిలి, గోరింటాకు, శారద, మేడలోని నీడలు, విష వలయం, వ్యక్తిత్వంలేని మనిషి మొదలగు నవలలు రచించారు. ఎమెస్కోవారు వీరివి హవున్ సర్జన్, హారతి ప్రచురించారు. వాటితరువాత 'ఒకే పాటకు రెండు రాగాలు' అనే నవలను ప్రచురించారు.

'పెంకుటిల్లు', 'వ్యక్తిత్వంలేని మనిషి' 'హవున్ సర్జన్' ఈ మూడు రచనలు నవలా సాహిత్యంలో ఒక స్థిరమైన పరిధిలో ఉండిపోయాయి. వ్యక్తిత్వంలేనిమనిషిలో విచిత్రమైన మనస్తత్వాలు వ్యక్తమవుతాయి. హవుస్‌సర్జన్‌లో డాక్టరు అనుభవాలు తొంగిచూస్తాయి, కన్పిస్తాయి ఈ రెండు నవలల్లో కథకన్న రచయితయొక్కభావాలకుప్రాముఖ్యం కల్గింది. 'వ్యక్తిత్వంలేని మనిషి' కథ మొదట ఏదో చెప్పుకొని పోతున్నను కొంతవరకు కథ జరిగిన తరువాత కథలో నిమగ్నమవుతాం. వారు వ్రాసిన 'హారతి' పైవాని కన్న భిన్నరీతిలో ఉంటుంది అందులో కథ చాల శోచనీయంగా ఉంది. సంఘటనలు కల్పనలు ఆంధ్ర సామాజికవ్యవస్థకు అనుగుణముగా వుండవు. రచయిత ఈ వాతావరణంలో జీవిస్తూ దీనికన్న భిన్న వాతావరణాన్ని ఉహిస్తూ హారతిని చిత్రించారు. చేయి తిరిగిన రచయితే ఈ విధముగు రచనలు చేయుటం ప్రారంభిస్తే, తక్కినవారి సంగతి ఆలోచింపనక్కరలేదు.

సాహిత్యమునం దభినివేశము కలిగినవారు మంచి నవలలు వ్రాయకపోయినా, సాహిత్యాన్ని ఒక హాబీగా భావించేవారు మాత్రం నవలలు వ్రాసి పాఠకుల ఆదరణ అంతో ఇంతో పొందుతున్నారు. వేణుగోపాలరావుగారి వృత్తి వైద్యమయినా సాహిత్యమే తమ వృత్తిగా తలచి మంచి నవలలు వ్రాయటానికి ముందుకు వస్తున్నారు. కేవలము రచించుటయే గాక ఒక్కొక్క దానియందు ఒక్కొక్క ప్రయోగం చేసి చూపిస్తున్నారు. మానవు మానసిక స్థితిగతులపై సూక్ష్మపరిశీలన చేయుటం వీరికి ధ్యేయంగా ఉన్నది. భువి మీద పుట్టిన ప్రతి జీవితత్వం ఒకే మాదిరిగా వుండదు. రకరకాల మనస్తత్వాలు ఉంటాయి. ఈ తత్వాలు సమైక్యమయితే వారి జీవితం ఏవిధంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. దీనికి వ్యతిరేకంగా ఉండే జీవితాన్ని కూడ ఇలాగే ఉహించి నిర్ణయించుకోవచ్చు.

దంపతులు ఒకరినొకరు అర్థంచేసికొంటూంటే సంసారాన్ని సుఖమయంగా నడిపించుకొనవచ్చును. కొందరు విపరీతాలకు పోయి అంతస్థులు లెక్కించుకొని అంతఃకరణను గమనించలేక తమ్ము తాము నాశనం చేసికొనుటకు ప్రయత్నిస్తారు. ఒకస్త్రీ — పురుషుడు దంపతులు అయిన తరువాత రకరకాలైన భావాలు అప్పటికప్పుడు పుట్టుకొని వస్తాయి. వాటి ఫలితాన్ని యిరువురూ అనుభవించుటకు ముందుకు రావాలి. అయితే అందలి అనుభూతిని గ్రహింప లేక ఎవరైనా వెనుకకు అడుగువేస్తే వారి జీవితంలో ఆనందం కన్న విషాదం అధికమవుతుంది. విషాదం గదా అని దుఃఖిస్తూ కూర్చుంటే తరువాత దాని పర్యవసానం ఎలా ఉంటుందో చెప్పటం కష్టమే అవుతుంది. ఈ విపరీత మనస్తత్వం, ప్రవర్తన చదువుకొన్నవారి యందెక్కువగా కన్పిస్తున్నది. అవును చదువులో అన్నీ ఉన్నాయి. అది ఎక్కువయితే వక్రించి మనసుకు పిచ్చి పడుతుంది, ఈ రకపు జీవితాల చరిత్ర విచిత్రంగా ఉంటుంది. అయితే జీవితాలకు పట్టిన దౌర్భాగ్యాన్ని సన్నిహితులైన వారు తెలిసికొని దానికి వెంటనే ప్రతిక్రియ చేసి జీవితాన్ని ఆనందమయంగా తీర్చుటకు వీలున్నది. కాని ప్రతిక్రియ చేయగల వారున్నపుడు సామాన్యంగా దాంపత్యంలో ప్రతిబంధకాలు సంభవించినపుడు వాటిని సులభంగా పరిష్కారం చేసికొనవచ్చును.

''ప్రేమించుకొని పెళ్లి చేసుకొన్న వారి చరిత్రలన్నీ ఒక్కసాదిరిగా వుండవు. ప్రేమించుకోకుండా పెళ్లి చేసుకొన్న వారిలో ఎన్నిరకాలున్నాయో, ప్రేమించుకొని పెళ్లి చేసుకొన్నవారిలో కూడ అంతకు తక్కువేమీ లేవు తేడా అల్లా బయటపడటం, గుంభనంగా వుండటంలో వుంది.'' నిజంగా కమల—శివరాం జీవితాల్లో యిలాగే జరిగింది. ఉద్యోగం కోసం శివరాం ఇందుపల్లి నుంచి విజయవాడలో వున్న రమాపతిరావు గారింటి కొచ్చాడు. ఉద్యోగం కోసం వచ్చిన ఈ యువకుడు ఆడవారంటే ఆమడ దూరంలో ఉంటాడు. అలాంటి వాడిని, మగవాళ్లంటే తలవంచుకొనే స్వభావంలేని కమల మోహించింది. యవ్వనంలో ఉండే నిషా వారిని సన్నిహితం చేసింది. అందుచేతనే క్రొత్తలోనే

వారికి తెలియకుండ శరీరంలో పులకలు వచ్చాయి. శివరాం ఉద్యోగం సంపాదింపలేకపోయినా కమల మనసును సాధించాడు. కమల శివరాంను చూడ లేకుండా ఉండలేదు. ఈమెకు తోడు కల్యాణి చేరింది. వీరిరువురూ శివరాం మనస్సును బొంగరంలా త్రిప్పారు. పాపం శివరాం పూర్వాపరాలు లెక్కించకుండా కమల తనది గదాయని ఆనందించాడు. ఆమెపై నున్న వలపుతో తల్లిదండ్రుల మాట కూడ లెక్క చేయలేదు. కమల శివరాంను వివాహానికై వత్తిడి చేసింది. ఎవ్వరికీ యిష్టం లేకపోయినా కమలా శివరాంలు దంపతులయ్యారు. ఉన్న వారవటంచేత రమాపతిరావు కమలను—శివరాంను హనీమూన్‌కు పంపాడు. విలాసయాత్రలో శివరాం కమల కానందం కల్పిద్దామని ప్రయత్నించాడు కాని సాధ్యం కాలేదు. ఒకరు సరసంగా ఉంటే మరొకరు విరసంగా ఉన్నారు. కమల దృష్టిలో శివరాం దానవుడిగా కాన్పించాడు. శివరాం దృష్టిలో కమల ఒక భార్యగానే కాన్పించింది. యాత్ర అయిపోయింది. కల్యాణి వీరి జీవితాలను పర్యావలోకనం చేయటం మొదలుపెట్టింది. ఆమె ముందనుకున్నట్లుగానే జరిగింది. కల్యాణి కమలకు స్నేహితురాలయినా ఆ దంపతుల మధ్య అడ్డోలా పని చేసింది. కమల—కల్యాణి మధ్య తెలియ జెప్పరాని ఘటనలు జరిగాయి. కమల—కల్యాణి ఒకే మంచం పైన ప్రక్కప్రక్క నిద్రపోయారు. కాని కమల ప్రక్కకు శివరాం వస్తే భర్త అనే గౌరవం అభిమానం లేకుండా తిరస్కరించింది. శివరాం స్థితిని తల్లిదండ్రులు గమనించినా ఏమి చేయలేని అసమర్థులయ్యారు. చివరకు రమాపతి రావు కూడ అశక్తుడయ్యాడు. కమల—శివరాం దంపతులు గావటానికి ఉపకరించిన కల్యాణియే కమల కళ్ళు తెరపించి దాంపత్యాన్ని సుఖవంతం చేసికొని హాయిగా ఉండమని చెప్పి దానిని ఎంతవరకు కమల ఆచరించిందో యన్నీ ప్రత్యక్షంగా చూచి సంతోషం పట్టలేకపోయింది.

నవలలో కల్యాణి పాత్ర తక్కిన పాత్రల కన్న మించింది. కమల కేమీ తెలియదు. యవ్వనం ముందు బానిసై వినయంగా నిలబడింది కాని అనుభూతికి తట్టుకోలేకపోయింది. శివరాం అందించే అనుభూతి కన్న కల్యాణి అందించిన అనుభూతి పైన కమలకు మక్కువయ్యింది. కల్యాణి వలపు ముందు శివరాం వలపు పనికి రాకుండా పోయింది. శివరాం ప్రేమను చూచి కమల భయపడింది. ఆమె అలా భయపడి పిరికిపందలా వెనుతిరిగింది. దాంపత్యంలో ఈ విధమైన తిరోగమనం యిరువురి జీవితాలపై బలమైన ముద్ర వేసింది. కమల ప్రవృత్తి కర్కశం, శివరాం ప్రవృత్తి నవనీతం. విరుద్ధమైన స్వభావులు వారు. అయినను శివరాం కమలను వదలి ఒక్కక్షణం కూడ ఉండలేని వాడు. శివరాం బిచ్చమెత్తుకొన్నను కమల చూడకుండా దూరంగా వెళ్ళిపోయింది. వీరి జీవితాల మధ్య తీరని వ్యథ కల్పించిన కల్యాణి ఏదో చేయాలని ముందుకు వచ్చింది. కాని యదార్థం గ్రహింపలేక తనకు తాను సమాధానం చెప్పుకొనలేని అబల అయ్యింది. అట్టి స్థితిలో కల్యాణిని శివరాం మేల్కొల్పాడు. ఇంత శక్తి ఉన్నవాడు కమలను శివరాం స్పందింప లేకపోయాడంటే అది రచయిత దోషం కాని శివరాం దోషం కాదు. ఈ విషయాన్ని రచయిత గమనించారో లేదో!

శివరాం కమల వెంటబడ్డాడు కల్యాణి కళ్ళు తెరపించినంత సులభంగా కమలకు పట్టిన పిశాచాన్ని త్వరగా వదలింపలేకపోయాడు. అయినా అప్పుడే వదిలిస్తే కథ ముగుస్తుంది గదా యని రచయిత కమల—శివరాంలను బజారు పట్టించారు. తను చేసిన తప్పు కల్యాణి కమలకు ఎదురుగా వెళ్ళి చెప్పలేకపోయింది. కనీసం తల్లితండ్రులతో కూడ రహస్యంగా అయినా వివరించలేదు. ఆమె వీరి జీవితాలను నాశనం చేసింది. ఆ నాశనంలో తనేమి చేస్తున్నదనే విషయాన్ని గురించి క్షణమైనా ఆలోచింపలేకపోయింది. మహాదారుణం జరిగిపోతున్నను కండ్లు అప్పగించి చూచింది కాని గట్టిగా వారించలేకపోయింది. కమల తన ప్రక్కన ఉంటేనే కల్యాణి ఈ లోకంలో ఉండలేక బాహిర స్థితినే మరచిపోయేది. తనకు తెలియని భావం కమలను బంధించునట్లు చేసింది. ఆ బంధాలే అనుభూతి అనే పంజరంలో కమలను—కల్యాణిని బంధించాయి. ఆ పంజరంలో చిక్కుకున్నది గనుకనే కమల శివరాం పంజరానికి రావటానికి యిష్టపడలేదు.

మొదటి నుండి కల్యాణి వలపులో మైమరచిన కమల శివరాంను చేసికొనుటకు ముందు తన దాంపత్య జీవితాన్ని గురించి ఊహించుకొన్నట్లయితే యిలా జరగటానికి వీల్లేదు. కమల చదువుకొన్నది. ఎంత సంస్కారం లేకపోయినా అనుభూతి విషయం గ్రహింప లేకుండా ఉండలేదు. కల్యాణి అనుభూతితో మునిగి శివరాం అనుభూతిని అనుభవింపక ముందే అతన్ని తిరస్కరించటం హాస్యాస్పదంగా ఉన్నది. ధనవంతులైతే మాత్రం కుమార్తెను అదుపులో పెట్టలేక విశృంఖలమైన స్వేచ్ఛనిచ్చుట కంగికరింపరు. కమల ఇంత స్వేచ్ఛ ఎలా పొందింది?

తండ్రి ముందు శివరాంను కమల దూషించటం, అచ్చట నున్న వారు చెవులు అప్పగించి వినటం, కనీసం అల్లుడనే మాట గ్రహింపకుండ రమాపతిరావు మెదలకుండ ఉండటం విపరీతంగా ఉన్నను, దానికి బలమైన కారణం స్పష్టంగా లేదు.

కమల—శివరాం సంగతి తెలిసినా కల్యాణి సంగతి తెలియదు. ఇంతకూ ఆమె ఎవరో మీరే నిర్ణయించుకొనండని రచయిత వ్యంగంగా చెప్పటంలో ఉద్దేశమేమిటి?

కథ ముగింపుకు వచ్చే సందర్భంలో డాక్టరుగారు కమల—శివరాం జీవితాలను ఐదు సంవత్సరాలకు ముందుకు నడిపించారు. నడిపించటమే కాదు. వారికిద్దరు పిల్లలు కలిగినట్లుగా కల్పన చేసారు. కథను ముందు నెమ్మదిగా తీసికొనివచ్చిన వారు హఠాత్తుగా ముగింపులో ఈ రకంగా ఉండటం విపరీతంగా కాన్పిస్తున్నది.

ఏ భర్త అయినా కట్టుకొన్న భార్యను మరొకరి చేత శీలాన్ని భంగం చేయించటానికి ఒప్పుకోడు. ఇందులో కమలను మానభంగం చేయమని శివరాం ఒక త్రాగుబోతును ప్రోత్సహించి రంగానికి పంపాడు. ఇది చాలా అసహజంగా ఉన్నది. రచయిత ఇది పరికింపకుండ ఈ సన్నివేశాన్ని సృష్టించారు. సమాజానికి ఒక ధర్మం ఉన్నది. ఆ ధర్మాన్ని చూడకుండగనే యిది చిత్రించటం కథకు మాయని మచ్చగా ఉన్నది. ఈ చిత్రణలో పాత్రలకు తగిన న్యాయం చేకూర్చలేకపోయారు. కథను సుఖాంతం గాకుండ విషాదాంతం చేసినట్లయితే కథ పాఠకుని మనస్సులో నున్న ఒక శక్తిని ప్రేరేపించేది. ఇట్టి శక్తి ప్రేరణ కలిగించటం రచయితకు అనుకూలమైన అభిప్రాయమున్నట్లు గోచరింపదు.

శరత్ ప్రభావంలో గోపాలరావుగారు మునిగిపోవటం చేత మంచి చెడూ వివక్షింప లేకపోయారు. శరత్ నవలల్లో వాయకుల కన్న వాయికలే ముందుంటారు. అతడు కూర్చిన కథ హుందాగా ఉంటుంది. అట్టి హుందాతనం శరత్‌ను అనుకరించిన వారిలో ఎక్కడా కాన్పించటం లేదని చెప్పటం మహాబాధగా ఉన్నది. కమలను ఉన్నతంగా తీర్చాలని భావించిన, శివరాంను అసమర్థునిగా చిత్రింపనవసరం లేదు. కాలపరిణామాన్ని గుర్తించి సామాజిక వాతావరణంతో సంబంధాల్ని సన్నిహితం చేసికొని కథను కల్పిస్తే సిద్ధాంతాలు, రాద్ధాంతాలు రావు.

రచయిత నవలలో ఆంగ్ల పదాలు చాల ఉపయోగించారు. వాటిలో కొన్నింటికి తెలుగు పదాలు చెప్పుకోవచ్చును. అయినా ఆ విషయాన్ని పట్టించుకొనక ఏమిటిలేఅన్నట్లుగా ఆయా పదాలు ఉపయోగించారు. అలా అటూ ఉపయోగింపకుండా ఉంటే బాగా ఉండేది.

—రామమోహన్.

మల్లిపాటలు

(రచన: చౌడూరి గోపాలరావు. ప్రతులకు: జ్యోతిర్మయి, సాహిత్య సాంస్కృతిక సమితి, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా. వెల రు. 2—00.)

సాహిత్యంలో పాటకున్న స్థానం వేరు. పాట చేరినంత తొందరగా, చురుకుగా, సూటిగా, హృదయాన్ని పద్యంగాని, మరే సాహిత్య ప్రక్రియగాని చేరదు. సూటిగా ఎదదలోపలి పొరలను పాట మీటగలదు. పండిత, పామర హృదయాలను కూడా ఇట్టే పట్టి నిలవేసి, రసానందం, తన్మయత నింపగలదు. అందునా పల్లెపాటలకున్న సొరు, సౌరభం వేరు. పల్లెపట్టుల నెలకొన్న సౌందర్యం వాటి సొత్తు. పల్లెవాసుల నిరాడంబరత, సౌమ్యం, ముగ్ధత్వం, అమాయకత, తృప్తి, శాంతి అంతా వీటిల్లో తొణికిసలాడుతుంది. ఓ రకమైన Rustic Beauty వాటిసొత్తు. అందుకే, నాట్లప్పుడుగాని, కోతలప్పుడుగాని, మార్పిళ

ప్పుడుగాని అలా పొలంకేసివెడితే గాలి అలల్లో తేలి మన గుండెలకు చక్కిలిగింత లిడగల జానపదుల పాటలు తేనెల మూటలు. వారి ప్రణయ గాథలు, ప్రేయసీ ప్రియుల ప్రేమ, ఎడబాటు, అలకలు, దైనందిన కార్యక్రమాలు, పాటల్లోపొంగి ఎడద కొండలగుండా పారి ప్రవహిస్తాయి ఈ నాటికి గూడా!

పాటగాని, పద్యంగాని ఏదైనాగాని, అనుభూతిలోగాని, అనుభవంలోగాని కాగి, కాగి బయటికి వస్తే దానికొక అంతస్సౌందర్యం, లోతు, బరువు నిండుదనం సమకూరుతాయి. అలాకానిపక్షంలో అది మరలా, మరలా జ్ఞప్తికిరాదు. నెమరు వేసుకోవటానికి ఏమీ మిగలదు. గుండెలోతుల్లోంచి వచ్చిందేదైనా గుండె లోతుల్లోకే వెళ్లగలదు. రసభావం (Emotion) ఆలోచన (Thought) భాషారీతి (Form) భావన (Imagination) ఇవి నాల్గు సమగ్రగంగా పొదిగితే ఉదాత్త సాహిత్యం వెలువడుతుంది. ఇది ఏ సాహిత్య ప్రక్రియకైనా ఒకటే!

ఈవిధంగా సమ్మేళనమై కొన్ని పాటలు మినహాయించి రూపు దిద్దుకుని మన హృదయ వేదికపై నాట్యమాడుతాయి 'ఎంకిపాటలు';—'బంగారిమామ పాటలు'.

"గుండె గొంతుకలోన కొట్లాడుతాది
కూకుండ నీదురా కూసింత సేపు'

అదొక నిర్విరామ తపస్సు, ఆతపన, అనూహ్యమైన వేదనకి వ్యక్తీకరణ.

సతతం 'ఎదలోపలి ఎదలో' మెలికలు తిరుగుతూ, అపుడపుడూ పొంగిన పొంగులు ఎంకిపాటలు.

అదే కోవలో మరికొన్ని పాటలు వెలువడినప్పుడు అప్రయత్నంగానే దృష్టి పోల్చిచూడటం మీదికి దూకుతుంది. ఎంకి, బంగారిమామ పాటల తర్వాత ఈనాడు చౌడూరివారి మల్లిపాటలు: వీటికి బీజం, శ్రావ్యమైన కంఠంతో ఎవరో మిత్రులు ఎంకి పాటలు పాడి విన్పించింతర్వాతనే జరిగిందని చౌడూరి వారే చెప్పారు. పాటలో కూడా కవి సత్తా కనిపిస్తుంది. జీవితాంతం ఉపాసించి, ఆరాధించి వెలికి తెచ్చింది, నండూరివారు, 'ఎంకిపాటలు' మాత్రమే! అంటే ఆయన వాటిని ఇలా ఊహించి, అలా గీకి పారేయలేదని బోధపడుతుంది. పల్లెవాతావరణాన్ని అంత రమణీయంగా చిత్రించగలిగారంటే, ముందు వంట పట్టించుకుని తర్వాత పలికారు గాబట్టే; ఇన్నేళ్ల తర్వాతయినా, వాటి కోవలో 'మల్లి పాటలు' రావటం సంతోషించదగ్గ విషయం! కాని వాటి సరిబంతిని ఇవి నిలబడగలవా? చౌడూరివారు సంతృప్తిని సేవించి 'నండూరివారి ఊహాచిత్రాలను తాకే శక్తి నాలోలేదు' అని, సమాధాన పర్చుకోవచ్చు.

ఒక ప్రక్రియలో పరిశ్రమ చేసేటప్పుడు అందులో జీవించి వేదన ననుభవించి, తపించి, మణిక్యాలను వెలార్చితే ఎలా ఉంటుందన్న పేరాశ కలగకపోదు!

ఏదో రాశాం, చేశాం అనేకన్నా, మరికొన్నేళ్లు మల్లిని ధ్యానించి వ్యథలో ఈ పాటలు పలికితే ఎంత సుందరంగా ఉండును అన్నది తలంపుకు రాకమానదు. ప్రతిభా, వ్యుత్పత్తి, వ్యూహబలం ఉండిన చౌడూరివారు కదలించలేకపోయారు— మంచి జవ్వని నడకలాంటి నడక ఈ పాటల్లో సర్వత్రా కానవస్తుంది. కుంటుపడటం, తడబడటంలేదు. మనసులో చెరగని ముద్ర వేయలేక పోతున్నాయి! ఎంకి నాయుడుబావల అనుభూతుల్లాగా, మల్లి రాయుడుబావల అనుభూతులు, అనుభవాలు, మనల్ని తట్టి లేపలేకపోతున్నాయి. హృదయాన్ని మీటలేకపోతున్నాయి.

ఎంకి, బంగారిమామ పాటలను మనసులో పెట్టుకున్నా ఫర్వాలేదు, కాని మల్లి పాటలు చదువుతుంటే, ఎంకిపాటలు గుర్తుకు రావటం, 'కాపీట్యూన్' అనిపించటం బాధాకరం. 'బంగారిమామ' పాటలు చదువుతుంటే ఎంకిపాటలు మనోపథంలోనైనా మెరవవు. కారణం? వాటి వ్యక్తిత్వం వాటికున్నదన్న మాటే. ఈ మల్లిపాటలను మరికొంత వ్యవధి తీసుకుని, వేదనలో, వారిదైన ఒకపద్ధతిలో పలికితే, ఎంత రమ్యంగా ఉండేది! మక్కీకి మక్కీ అనుకరణ అనిగాదు! Parallels సమానాంతరాలు దొరుకుతాయి చాలా!

ఎంకివంటి పిల్ల లేదోయ్
ఎంకి నా వంకింక రాదోయి } 'ఎంకిపాటలు'

'మల్లిపాటలు' { నాతోని మాట్లాడ నామల్లిరాదోయి
నాలోని కతలన్ని ఆపిల్ల వినదోయి

ఎనక జన్మములోన
ఎవరమోనంటె
సిగ్గొచ్చి నవ్వింది
పిలక నా ఎంకి } 'ఎంకిపాటలు'

మల్లిపాట : { ఆనాటి నామాట చెప్పుకోమంటె
సిగ్గుతో నవ్వింది సిన్నారి మల్లి

యెంకితో తీర్తాని కెల్లాలి
....
తీర్తాని కెళ్లాలి } ఎంకిపాటలు :

మల్లిపాటలు : { సంక నెక్కిన పిల్లతోని
సరసాలు పలుకుకుని
తీర్తాని కెలదామా!
తిరునాల సూతామా!

ఇలా!

దీన్ని సమర్థిస్తూ 'శ్రీపాద'వారు "పల్లెపట్టుల ప్రేయసుల సరళ భావాలు" నండూరి ఊహించినా, చౌడూరి ఊహించినా తేడాలుంటాయా" అన్నారు. అవును, ఆ సరళ భావాలేకద 'కొనకళ్ల' వారికీ ఆధారం – మరి బంగారిమామపాటలు చదివేటప్పుడు, ఎంకి పాటలు గుర్తుకు రావేం? ముడి సరుకు ఒకటే అయినా కవియొక్క వ్యక్తిత్వపు స్పర్శతో అది అతనిదై పోవాలి.

ఎంకి పాటల్లో లేని ప్రాస క్రీడలు, చుక్కల్లా అంత్యప్రాసలు మల్లిపాటల్లో ఉన్నా, మల్లిపాటలు చదివిన తర్వాత నెమరు వేసుకునే అనుభూతి మిగలటం లేదు. మనసు లోయల్లో గింగుర్లు తిరిగే భావాలు వృగ్యం.

నేటి నవ నాగరికతని, మల్లిచేత అపహాస్యం ఇలా చేయించారు.

దాచుకో వలసినవి
దారికి వదిలేస్తె
నలుగురన్నల సూపు
నమిలిమింగేస్తుంటే—
సిగ్గు నిలువని సీమ
పేర రాదంటారు
హద్దులున్నా సోట
ఆనందమన్నారు"—

ఆకారంకన్నా, ఆంతర్యానికి ప్రాధాన్యతనిస్తూ వ్యక్తీకరించిన భావం—

"రంగులో ఏమున్నదే
మాట
పొంగులో ఏమున్నదే
వల్ల నేరేడిపండు
నొక్క రుసులుండు
ఎర్ర మేడిపండు
యిప్పితే పురుగులుండు" అని
సోకుకంటే మనసు
సొగసైనదే మల్లి
ఆ మనసె నీలోన
అతికున్నదే మల్లి — అని హాయిగా అన్నారు.

ఇలా అందంగా, హాయిగాఉన్న పదాలున్నాయి. ఎంకిపాటల్లోలేని సారళ్యం, కుంటుపడని నడకఉన్నాయి. మల్లెపూవుల్లాగానే ఈపాటలు సుకుమారంగాఉన్నాయి. జీవితంలో లోతుపాతులు, కనపడవు.

కొన్నిచోట్ల – సి. నా. రె.గారు అన్నట్లు 'దూసిన మల్లియతే దూయవలసి వచ్చింది, తీసిన గంధాలే తీయ వలసి వచ్చింది'. పునరుక్తి కన్పిస్తుంది.

ఏమైనా ఎంకి పాటల తర్వాత ఆ కోవలో వచ్చినయి అన్నదే తప్ప—ఈ మళ్లా మళ్లా చదివించే గుణం కనిపించటంలేదు—

—కె. శివారెడ్డి.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7, Thambu chetty Street Madras-1. Editer : S. Sambhu Prasad.